Estd 1938
ఆంధ్రప్రభ
www.prabhanews.com
Journalism first!

ముహూర్తం

శ్రీ హేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, తిథి: శుద్ధ ద్వాదశి మ. 12.50 వరకు, అనంతరం త్రయోదశి; నక్షత్రం: పుష్యమి రా. 2.40 వరకు, ఆశ్లేష; అమృతకాలం: ఉ.8.40 నుండి 10.10 వరకు; వర్జ్యం: ఉ. 11.42 నుండి 1.12 వరకు; దుర్ముహూర్తం: ఉ. 8.24 నుండి 9.12 వరకు, రా. 10.48 నుండి 11.36 వరకు; రాహుకాలం: మ. 3.00 నుండి 4.30 వరకు; యమగండం: ఉ. 9.00 నుండి 10.30 వరకు;



సంపుటి:56 • సంచిక:317 • మంగళవారం 27 ఫిబ్రవరి 2018 • హైదరాబాద్ • పేజీలు:12+4 • వెల: 5.00 • Published from: Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad

శ్రీదేవి మృతి వెనుక మలుపులెన్నో...



ప్రమాదమేనా? మిస్టరీయా?!



- కార్డియాక్ అరెస్టు కాదు • రక్తపరీక్షల్లో మద్యం ఆనవాళ్లు
- రిసెప్షన్ తర్వాత భారత్‌కు బోనీకపూర్ • ఒకరోజు తర్వాత మళ్లీ దుబాయ్‌కి • కపూర్‌పై దుబాయ్ పోలీస్ కన్ను
- సుదీర్ఘంగా విచారణ • పాస్‌పోర్ట్ సీజ్ • కాల్ డాటా పరిశీలన
- దుబాయ్ వీడొద్దని ఆదేశాలు • ముంబైలో అంత్యక్రియలు రేపే?

సినీ నటి శ్రీదేవి మృతికేసు కొత్త మలుపు తీసుకుంది. దుబాయ్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రంగంలోకి దిగారు. ఫోరెన్సిక్ నివేదికలో ప్రమాదవశాత్తు అని ఎలా నిర్ధారిస్తారంటూ అభ్యంతరాలు వ్యక్తం చేసింది దుబాయ్ పబ్లిక్ ప్రాసిక్యూషన్. కేసు రీఇన్వెస్టిగేషన్ చేయాలని నిర్ణయించింది. కేసు విచారణ పూర్తయ్యేంత వరకు బోనీకపూర్ దుబాయ్‌లోనే ఉండాలని పేర్కొన్న పబ్లిక్ ప్రాసిక్యూషన్ ఆయన పాస్‌పోర్టును సీజ్ చేసింది. హోటల్ సిబ్బంది, బోనీకపూర్ ప్రస్తుతం దుబాయ్ పోలీసుల అదుపులో ఉన్నారు. శ్రీదేవి, బోనీకపూర్ కాల్ డేటాను దుబాయ్ పోలీసులు పరిశీలిస్తున్నారు. దీంతో శ్రీదేవి మృతిపై క్షణక్షణం అనుమానాలు పెరుగుతున్నాయి.

- గుండెపోటుతో కుప్పకూలింది • బాత్‌టబ్‌లో పడి స్పృహ తప్పింది • ఊపిరాడక చనిపోయింది



- ప్రమాదవశాత్తే మృతి చెందింది
- పోస్ట్‌మార్టమ్ నివేదిక వెల్లడి

వివరాలు - 2, 3, 11, షో పేజీల్లో

• రైతులకు కేసీఆర్ కానుక.. రూ.5 లక్షల బీమా...



9 లో

కరీంనగర్: రైతు సమన్వయ సమితి భవనానికి అవసరమైన స్థలం కోసం సీఎం కేసీఆర్‌కు భూవిరాళ దస్త్రం అందజేస్తున్న రైతు

ఆస్ట్రేలియా, సింగపూర్‌లకు ధీటుగా

తెలంగాణలో సంపద పంపిణీ

- రైతు కార్పొరేషన్ ఏర్పాటు • రూ.5 లక్షల బీమా • పెట్టుబడి మద్దతు పథకం
- గొర్రెలు, బర్రెల పంపిణీ పథకాలతో లబ్దిదారులకు నేరుగా ఆర్థిక చేయూత
- సరికొత్త సంస్కరణలతో దేశానికే ఆదర్శంగా కేసీఆర్ సర్కార్

(హైదరాబాద్, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)

ప్రపంచ వ్యాప్తంగా ప్రభుత్వాల తీరులో మార్పు వస్తోంది. పెరిగిన సంపదను అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు మాత్రమే పరిమితం చేయకుండా ప్రజలకు ప్రత్యక్షంగా మేలు చేకూర్చే విధానంలో సంపద పంపిణీకి దారులు వెదుకుతున్నాయి. తాజాగా సింగపూర్ ప్రభుత్వం కొత్త బడ్జెట్ ప్రతిపాదన సందర్భంగా చేసిన ప్రకటన ప్రపంచ వ్యాప్తంగా పలు ప్రభుత్వాలకు మార్గదర్శకంగా

➪ 9వ పేజీలో...



హైదరాబాద్: ఈ-గవర్నెన్స్ సదస్సులో ఎగ్జిబిషన్ తిలకిస్తున్న కేంద్రమంత్రి సి.ఆర్. చౌదరి, రాష్ట్ర ఐటీ మంత్రి కేటీఆర్

టి-యాప్ పోలియో @180 సేవలు

- ఈ-గవర్నెన్స్‌కు ప్రథమ ప్రాధాన్యత
- టీ-వ్యాలెట్ సరళపద్ధతిలో లావాదేవీలు
- సామాన్యులకు అందితేనే టెక్నాలజీకి సార్థకత
- బీసీల ద్వారా రోజుకు లక్షన్నర లావాదేవీలు
- యూఎస్‌లో సర్కార్ వద్దకు పోకుండా పౌరసేవలు
- ఈ-గవర్నెన్స్ సదస్సులో మంత్రి కేటీఆర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్ర ప్రభుత్వం అందించే 180 సర్వీసులను ఒకే ప్లాట్‌ఫాంకు తెచ్చేందుకు టి-యాప్ పోలియోను ఆవిష్కరిస్తున్నట్లు ఐటిశాఖ మంత్రి కేటీ రామారావు తెలిపారు. అమెరికాలో ప్రజలు ప్రభుత్వం వద్దకు పోకుండానే వారికి అవసర మైన సేవలు విస్తృత స్థాయిలో అందుతాయ న్నారు. తాను 8 ఏళ్ళపాటు ఆ దేశంలో ఉంటే కేవలం ఒకే ఒక్కసారి డ్రైవింగ్ లైసెన్స్ కోసం మాత్రమే ప్రభుత్వ కార్యాలయానికి వెళ్ళానని ఆయన చెప్పారు. హెచ్ఐసిసిలో ఇ-గవర్నెన్స్ పై జరుగుతున్న 21వ

➪ 7వ పేజీలో...

కాంగ్రెస్‌దే అధికారం

- టీఆర్ఎస్ పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గరలోనే..
- సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యం
- బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలి
- గద్దెనెక్కిన వెంటనే కాళేశ్వరం ప్రాజెక్టు రీడిజైన్ చేస్తాం
- ప్రాణహిత-చేవెళ్ల ద్వారా రంగారెడ్డి జిల్లాకు తాగునీరు
- ప్రజాచైతన్య యాత్రలో పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి
- రైతులకు రుణమాఫీ, నిరుద్యోగ భృతి చెల్లిస్తామని హామీలు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తున్న టీఆర్ఎస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని టీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి హెచ్చరించారు. తెలంగాణలో దోపిడి రాజ్యం నడుస్తోందని మండిపడ్డారు. బంగారు తెలంగాణ పాలన బదులు బంగారు కుంటుంబ పాలనే సాగుతోందని ఉత్తమ్ దుయ్యబట్టారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. టీ పీసీసీ ఆధ్వర్యంలో ఉత్తమ్ చేపట్టిన ప్రజా చైతన్య బస్సుయాత్రలో భాగంగా మొదటి రోజు రంగారెడ్డి జిల్లాలోని చేవెళ్ల, వికారాబాద్‌లో జరిగిన సభలో కాంగ్రెస్ నేతలు మాట్లాడారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ మార్చి ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంతానికి సాగు నీరు తెస్తామని ఆయన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు చేపట్టిన ప్రాజెక్టులను రీడిజైన్లతో పేర్లు మార్చి కమీషన్ల దోపిడికి టీఆర్ఎస్ ప్రభుత్వం పాల్పడుతోందని విమర్శించారు. గత ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామిని అమలు చేయని ఈ ప్రభుత్వంపై ప్రజలు ఆగ్రహంగా ఉన్నారని ఆయన హెచ్చరించారు. దళిత సీఎం, మూడు ఎకరాల భూమి, ఎస్టీ, ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్లు ఇస్తామని ఆశపెట్టి ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చారని, నాలుగేళ్లయినా ఎందుకు అమలు చేయడంలేదో చెప్పాలని ఉత్తమ్ డిమాండ్ చేశారు. రెండు పడుక గదులు ఎంతమందికి

➪ 10వ పేజీలో...



ప్రజా చైతన్య బస్సుయాత్రలో భాగంగా తొలి రోజుచేవెళ్ల బహిరంగ సభలో ఐక్యతా రాగం వినిపిస్తున్న కాంగ్రెస్ నేతలు..



ముంబయ్.. ప్రభుత్వోద్యోగుల జాయ్!

- అత్యధిక ఆదాయం లభిస్తున్న నగరంగా గుర్తింపు • హెచ్ఎస్‌బీసీ బ్యాంకు తాజా సర్వేలో వెల్లడి • వెనుకబడిన పాశ్చాత్య దేశాల నగరాలు

(న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)

ముంబై.. దేశంలోనే అత్యంత జనాభా కలిగిన నగరం. ప్రపంచంలోనే అతిపెద్ద మురికివాడ ధారవి ఉన్న ప్రాంతం. నిత్యం 60 లక్షల మందికి పైగా ఇతర ప్రాంతాల నుంచి ఈ నగరానికి వ్యాపార, ఉపాధి అవకాశాల కోసం రాకపోకలు సాగిస్తూనే ఉంటారు. ఏ మూల చూసినా జనసంచారం. ఎక్కడా పరిశుభ్రత అనేదే కనిపించదు. భారత్‌లోని పేదరికానికి ఈ నగరాన్నే ప్రతీకగా ప్రపంచం భావించేది. స్లమ్‌డాగ్ మిలీనియర్ పేరిట హాలివుడ్ నిర్మాతలు ముంబై నగరంలోని మురికివాడల జీవితాన్ని ప్రపంచం ముందెట్టి ఈ నగరాన్ని నవ్వులపాల్జేశారు. అలాంటి ముంబైలోని ఉన్నతోద్యోగుల ఆదాయం ఇప్పుడు ప్రపంచంలోని ఇతర మహా నగరాల్లోని ఉద్యోగుల కంటే కూడా దాదాపు రెట్టింపుకు పైగా లభిస్తోంది. కేవలం కొన్ని సంవత్సరాల్లోనే ముంబైలోని అత్యున్నత వ్యాపార కార్యనిర్వాహక వర్గాలు ఈ స్థాయికి చేరుకున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రధాన నగరాల్లో ఉన్నత స్థానాల్లోని అధికారులు, సీఈఓల సగటు వార్షికాదయం 99,903 అమెరికన్ డాలర్లుంటే ముంబై నగరంలోని


➪ 9వ పేజీలో...



ప్రజా విశ్వాసమే శ్వాసగా...

నారా పాలిటిక్స్ @ 40 ఏళ్లు!

- నూతన ఆవిష్కరణలు, నిరంతర శ్రమే విజయానికి మెట్లు
- పాలనాదక్షుడిగా జాతీయ గుర్తింపు
- నదుల అనుసంధానంలో ఆరాధ్యుడు
- సుదీర్ఘకాలం సీఎంగా గుర్తింపు
- చంద్రబాబు 4 దశాబ్దాల ప్రస్థానం



10 లో



బరువైన పాత్రలు



అందానికి పరిపూర్ణ నిర్వచనం శ్రీదేవి. అతిలోకసుందరిగా ప్రేక్షకుల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న ఆమె లేరనే వార్త అభిమానులను కలచివేస్తోంది. బాలనటి నుండి హీరోయిన్ స్థాయికి ఎదిగి, తొలి లేడీ సూపర్‌స్టార్‌గా కీర్తిగడించింది.

శ్రీదేవికి నటనతప్ప మరేది తెలియదు. ధరించిన ప్రతిపాత్రకు పూర్తిన్యాయం చేసింది. స్టార్‌డమ్ వచ్చాక కూడా నటన పట్ల అంకితభావం తగ్గలేదు. అందుకే ఆమె నటించిన సినిమాలు చూస్తుంటే శ్రీదేవి బాగా నటించింది. బాగా డాన్స్ చేసింది అనుకోకుండా ఉండలేం.

సినిమారంగంలో పోటీ ఎక్కువ. నిత్యం కొత్తతారలు వస్తూనే ఉంటారు. అప్పటికే ఉన్నవారు సక్సెస్‌లతో ముందుకు దూసుకు వస్తారు. ఇలాంటి పోటీ ఉన్న ఫీల్డ్‌లో శ్రీదేవి తన స్టార్‌డమ్ కాపాడుకుంది. స్టార్స్ సైతం ఆమె కాంబినేషన్‌లో నటించడానికి ఆసక్తి చూపేవారు. కేవలం తెలుగుకే కాకుండా తమిళ, మలయాళ, కన్నడ, హిందీ చిత్రాల్లో నటించింది. ఆయా భాషల్లోని స్టార్స్‌తో కలిసి నటించింది.

శ్రీదేవి పాత్రలో పరకాయ ప్రవేశం చేస్తుందని ఆమెతో పనిచేసిన తారలు, సాంకేతిక నిపుణులు అంటుంటారు. శ్రీదేవి ధరించేకాస్ట్యూమ్స్ ప్రత్యేక ఆకర్షణగా ఉంటాయి. సన్నివేశానికి లేదా పాటలకు తగినట్టుగా ఎంపికచేసుకుంటారు. ఏ మాత్రం కాంప్రమైజ్ అవరు. రూప్‌కి రాణి చోరోంకా రాజా చిత్రంలో ఓ పాటలో ఆమె ధరించిన దుస్తుల బరువు పాతిక కిలోలు. ఇంత బరువైనవి ధరించినా, చాలా ఈజీగా నటించింది. తమిళ సినిమా పులి కోసం కూడా ఆమె ధరించిన ఆభరణాల బరువు కూడా చాలా ఎక్కువ. సుమారు 20 కిలోలు ఉంటుందని అంటారు. శ్రీదేవి నట జీవితం గురించి ఇలాంటి ఉదహారణలు ఎన్నో ఉన్నాయి.

బాలనటిగా, హీరోయిన్‌గా...

◆ నాటి మనవరాలే... ప్రియురాలు ◆ సీనియర్ హీరోలతో ఔరా అనిపించింది



అందాల శ్రీదేవి అరుదైన రికార్డ్ ఆమె సొంతం. తన నాలుగవ ఏట బాలనటిగా వెండితెరకు పరిచయమైంది. యాభైయేళ్ల నటజీవితం ఆమెది. ఇంతటి సుదీర్ఘమైన కెరీర్ మరే హీరోయిన్‌కు లేదు. శ్రీదేవికి మాత్రమే సొంతమైన క్రెడిట్ ఉంది. బాలనటిగా తను కలిసి నటించిన సీనియర్ హీరోలతోనే ఆ తర్వాత హీరోయిన్‌గా నటించింది. ఇది అరుదైన రికార్డ్‌గా పేర్కొవచ్చు.

మనవరాలిగా నటించి.. ప్రియురాలిగా మెప్పించి

బూచాడమ్మ... బూచాడు అంటూ మనవరాలిగా బడిపంతులు చిత్రంలో ఎన్టీఆర్‌తో నటించింది. కొద్ది సంవత్సరాల తర్వాత అంటే తన 14వ ఏట అదే ఎన్టీఆర్‌తో జంటగా నటించింది. సినిమా పేరు వేటగాడు. ఐదు పదుల వయసుదాటిన ఎన్టీఆర్‌తో పసిపిల్ల జంటగా నటించడమేమిటీ? అనే విమర్శలు వినిపించాయి. ఇవి కె.రాఘవేంద్రరావు, ఎన్టీఆర్ చెవిలో పడ్డాయి. అయినప్పటికీ వెనుకాడలేదు. దాంతో చిత్ర నిర్మాణం సమయంలో సర్వత్రా ఆసక్తి ఏర్పడింది.



ఎన్టీఆర్, శ్రీదేవి జంట ఎలా ఉండబోతోంది అని ప్రేక్షకాభిమానులు ఎదురుచూశారు. వేటగాడు (1979)లో రిలీజ్ అయ్యాక చూడముచ్చటైన జంట అంటూ తేల్చేశారు. ఎన్టీఆర్ తొలిసారి పాటలకు హుషారైన డాన్స్‌లు చేసింది ఈ సినిమాలోనే. వేటగాడు ఘన విజయం సాధించింది. ఈ సినిమా ఇచ్చిన ఉత్సాహం వల్లే ఆ తర్వాత అక్కినేని, కృష్ణ, శోభన్‌బాబు వంటి హీరోలు శ్రీదేవితో నటించారు. వీరితో బాలనటిగా నటించింది శ్రీదేవి.

ఎన్టీఆర్, శ్రీదేవి జంటగా మరికొన్ని సినిమాలు చేశారు. వాటిలో కొండ వీటి సింహం, జస్టిస్ చౌదరి, ఆటగాడు, రౌడి రాముడు - కొంటే కృష్ణుడు, అనురాగదేవత, బొబ్బిలిపులి, సర్దార్ పాపారాయుడు వంటి చిత్రా లున్నాయి. ఇవన్నీ కమర్షియల్‌గా ఘన విజయాన్ని నమోదు చేశారు. వీటిలో ఎక్కువ చిత్రాలకు కె.రాఘవేంద్రరావు దర్శకత్వం వహించారు.

ఎన్టీఆర్ రాజకీయ ప్రవేశానికి ప్రేరణ కలిగించిన చిత్రాలు సర్దార్ పాపారాయుడు, బొబ్బిలిపులి. ఈ రెండు చిత్రాల్లో శ్రీదేవి నాయికగా నటించింది.


ఎవర్‌గ్రీన్ హీరోతో...

అక్కినేని నాగేశ్వరరావుతో బాలనటిగా పలు చిత్రాల్లో నటించిన శ్రీదేవి ఆ తర్వాత హీరోయిన్‌గా నటించింది. ఎన్టీఆర్‌తో నటించిన వేటగాడు సినిమా విడుదలైన సంవత్సరమే అక్కినేని, శ్రీదేవి కాంబినేషన్‌లో వచ్చిన ముద్దుల కొడుకు రిలీజైంది. జగపతి సంస్థ నిర్మించిన చిత్రమిది. వాణిజ్యపరంగా ఆశించిన విజయం సాధించనప్పటికీ, అక్కినేని, శ్రీదేవి జంటను ప్రేక్షకులు ఆమోదించారు. ఆ తర్వాత వీరికాంబినేషన్‌లో వచ్చిన సినిమా ప్రేమాభిషేకం (1981). అక్కినేని కెరీర్‌లోనే బిగ్గెస్ట్ హిట్ సినిమా ఇది. ఆ తర్వాత బంగారుకానుక, ముద్దుల మొగుడు సినిమాల్లో నటించారు. ఎస్.పి.భయంకర్ అనే చిత్రంలో అక్కినేనితో ఒక పాటలో మాత్రమే శ్రీదేవి నటించింది.



తండ్రితో కొడుకుతో.....

తండ్రితో కొడుకుతో జంటగా నటించిన ఘన త శ్రీదేవికి చెందుతుంది. అక్కినేని నాగేశ్వరరా వుతో నటించిన శ్రీదేవి ఆయన వారసుడిగా వచ్చి న నాగార్జునతో సైతం నటించింది. వీరి కాంబినేషన్‌లో వచ్చిన చిత్రం ఆఖరిపోరాటం (1988). ఇది సంచలన కాంబినేషన్. తండ్రితో నటించి కొడుకుతో ఏమిటనే విమర్శలు వచ్చినా వాటిని లెక్క చేయలేదు. ఇది కేవలం నటనే అంటూ కొట్టిపారేసింది శ్రీదేవి. ఈ చిత్రానికి కూడా కె.రాఘవేంద్రరావు దర్శకుడు కావడం విశేషం. ఆ తర్వాత రామ్‌గోపాల్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కిన గోవింద గోవింద చిత్రంలో కూడా నాగార్జున, శ్రీదేవి కలిసి నటించారు.



ఆరడుగుల అందగాడి దేవత




నటభూషణ శోభన్‌బాబుతో హిట్ చిత్రాల్లో నటించింది శ్రీదేవి. మోసగాడుతో వీరి కాంబినేషన్ ప్రారంభమైంది. ఇందులో రెండు పాత్రల్లో నటించింది. నెగిటివ్ షేడ్స్ ఉన్న పాత్రని పోషించింది శ్రీదేవి. పాత్ర తీరుతెన్నులు తెలిసినప్పటికీ కావాలని నటించిందని అంటారు. నెగిటివ్ పాత్ర చేయాలనేది తన కోరికని చెప్పింది. ఆ తర్వాత ఇల్లాలు, దేవత ఘరానా గంగులు వంటి చిత్రాలు వీరి కలయికలో వచ్చాయి. డా.డి.రామానాయుడు నిర్మించిన దేవత చిత్రం సంచలన విజయం సాధించింది. శ్రీదేవికి నటిగా మంచి పేరు తెచ్చిపెట్టింది. ఇదే చిత్రాన్ని హిందీలో తోఫా పేరుతో రీమేక్ చేయగా, అందులో కూడా నటించింది.



తొలి సినిమా హీరోతో..

సూపర్‌స్టార్ కృష్ణతో శ్రీదేవి దాదాపు 35 చిత్రాల్లో నటించింది. శ్రీదేవి బాలనటిగా తెలుగులో అరంగేట్రం చేసింది కృష్ణ నటించిన మా నాన్న నిర్దోషి సినిమాతోనే కావడం విశేషం. హీరోయిన్ అయ్యాక అన్నదమ్ముల సవాల్, బంగారు కొడుకు, కృష్ణావతారం, బంగారు భూమి, ముందడుగు, మకుటంలేని మహారాజు, వజ్రాయుధం, చుట్టాలున్నారు జాగ్రత్త, గడసరి అత్తా సొగసరి కోడలు చిత్రాల్లో కృష్ణతో కలిసి శ్రీదేవి నటించింది. శ్రీదేవి హిందీతో సహా దక్షిణాది భాషలన్నింటిలో నటించింది. ఒకే హీరోతో ఎక్కువ సినిమాల్లో నటించింది మాత్రం కృష్ణతోనే కావడం విశేషం.



పులిబిడ్డతో త్రిశూలం

రెబల్‌స్టార్ కృష్ణంరాజుతో పులిబిడ్డ, త్రిశూలం చిత్రాల్లో నటించింది. త్రిశూలంలో అభినయానికి అవకాశం ఉన్న పాత్రని చేసింది. నటిగా ఆమెకు మంచి మార్కులు తెచ్చిన చిత్రాల్లో త్రిశూలం కూడా ఉంది.

సీనియర్ హీరోలతో నటించిన శ్రీదేవికి స్టార్‌డమ్ వచ్చింది. అదే సమయంలో ఎదుగుతూ మెగాస్టార్ రేంజ్‌కు చేరుకున్న హీరో చిరంజీవి, వీరి కాంబినేషన్ సినిమా ఎప్పుడానికి ప్రేక్షకులు ఎదురుచూశారు. హిందీ చిత్రాల్లో బిజీగా ఉన్న శ్రీదేవి అప్పట్లో తెలుగు సినిమాలకు డేట్స్ సర్దుబాటు చేయడం కష్టమయ్యేది. అయినప్పటికీ చిరంజీవి, శ్రీదేవి కాంబినేషన్‌కు ప్రయత్నించి సఫలికృతులయ్యారు కె.రాఘవేంద్రరావు. హీరోయిన్‌గా తెలుగులో, హిందీలో తనకు అనేక హిట్స్ ఇవ్వడమే కాదు ప్రమోట్ చేసిన కె.రాఘవేంద్రరావు అంటే ఆమెకు అమిత గౌరవం. పైగా యంగ్ డైనమిక్ చిరంజీవితో సినిమా కావడంతో శ్రీదేవి సైతం అంగీకరించింది. సినిమా పేరు జగదేక వీరుడు - అతిలోక సుందరి. బాక్సాఫీస్ బద్దలు కొట్టిన ఈ సినిమా తర్వాత శ్రీదేవిని అతిలోకసుందరి అని సంబోధించేవారు.



అతిలోకసుందరి తన కెరీర్ ప్రారంభంలో నటించిన సినిమాలు ఆమె కెరీర్ పరుగెత్తడానికి దోహదం చేశాయి. అరుదైన పాత్రలు ఆమెను వరించాయి. నటిగా నిలబెట్టాయి. కేవలం గ్లామర్ పాత్రలే కాదు అభినయానికి అవకాశం ఉన్న పాత్రలు చేయగలను అని తొలినాళ్ళలోనే నిరూపించుకుంది. నాలుగేళ్ళ వయసులోనే బాలనటిగా తునైవన్ (1969) తమిళ సినిమా ద్వారా పరిచయమైంది శ్రీదేవి. తెలుగు, తమిళంలో అనేక చిత్రాల్లో నటించింది. బాలభారతం చిత్రంలో నటించి మెప్పించింది. సహజంగా బాలతారలకు వయసురీత్యా నటనకు కొంత విరామం వస్తుంది. పదేళ్ళ తర్వాత వయసుకు తగిన పాత్రలు సినిమాల్లో ఎక్కువగా ఉండవు. కానీ శ్రీదేవి కేవలం ఏడాది మాత్రమే విరామం వచ్చిందంటారు. 27 సినిమాల్లో బాలతారగా నటించింది. అప్పుడే దర్శకుడు భారతీరాజా శ్రీదేవి ప్రధాన పాత్రగా తమిళంలో 16 వయతినిలే (1977) చిత్రాన్ని తెరకెక్కించారు.

ఆరంభమే అదిరింది

అప్పుడు శ్రీదేవికి 13 ఏళ్ళ వయసు. ఇందులో మానసికంగా ఎదగని పనివాడిగా కమల్ హాసన్, విలన్‌గా రజనీకాంత్ నటించారు. తమిళంలో ఈ చిత్రం అనూహ్య విజయం సాధించింది. మంచి గుర్తింపు తెచ్చిపెట్టింది. మరికొన్ని చిత్రాల్లో హీరోయిన్‌గా నటించింది. ఇదే చిత్రాన్ని తెలుగులో కె.రాఘవేంద్రరావు పదహారేళ్ళ వయసు పేరుతో రీమేక్ చేస్తూ, శ్రీదేవినే హీరోయిన్‌గా తీసుకున్నారు. ఈ చిత్రం తెలుగులో భారీ విజయం సాధించింది. ఆ తర్వాత ఎన్టీఆర్‌తో నాయికగా నటించడానికి కారణమైంది.

పదహారేళ్ళ వయసు చిత్రం శ్రీదేవి నటజీవితానికి గట్టిపునాది వేసిందని చెప్పవచ్చు. పదహారేళ్ళ వయసు హిందీలో కూడా రీమేక్ చేశారు. కానీ అక్కడ సక్సెస్ కాలేదు. దాంతో శ్రీదేవి బాలీవుడ్ ఎంట్రీకి బ్రేక్ పడింది. శ్రీదేవిలోని నటికి పరీక్ష పెట్టిన సినిమా వసంతకోకిల (1982). తమిళంలో ఈ సినిమాను తీశారు. ఛాయాగ్రహకుడు బాలూమహేంద్ర దర్శకుడు. తలపై అయిన గాయం కారణంగా చిన్నపిల్లగా ప్రవర్తించే పాత్రని శ్రీదేవి పోషించింది. కమల్ హాసన్ హీరోగా నటించాడు. వంసతకోకిల చిత్రం నటిగా ఆమెను ఉన్నత స్థాయికి తీసుకెళ్ళింది. అవార్డులు తెచ్చిపెట్టింది.






ఎన్నెన్నో అనుమానాలు!

ప్రమాదమేనా? ...మిస్టరీయా?!

ఆమె మరణించి రెండు రోజులవుతున్నా కారణాలేమిటన్నది ఇప్పటికీ స్పష్టంగా తెలటం లేదు. కార్డియాక్ అరెస్టు అని తొలుత బంధువులు తెలిపినప్పటికీ అదేం కాదని శవ పరీక్ష అనంతరం వైద్యులు తేల్చారు. నీటిలో మునిగిపోవడంతో ఊపిరి ఆడక మృతి చెందిందని నివేదిక పేర్కొంది. మేనల్లుడు వివాహానికి వెళ్ళిన శ్రీదేవి బంధువులంతా ముంబైకి తిరిగి వచ్చినా అక్కడే ఎందుకు ఉంది. రెండు రోజులుగా హోటల్ గదిలో నుంచి బయటకు రాకుండా ఏం చేసింది. బోనీకపూర్ ముంబై నుంచి వెళ్ళిన గంటలోపే ఎందుకు కన్నుమూసింది, కారణాలేమిటన్న అంశంపై అనేక ప్రశ్నలు ఇటు అభిమానులను, అటు దుబాయ్ పోలీసులను తొలుస్తున్నాయి. బోనీ కపూర్‌ను దాదాపు మూడున్నర గంటల పాటు విచారించిన అక్కడి పోలీసులు వాగ్మూలం రికార్డు చేశారు.


Monday, February 26, 2018

To whom it may concern

This is to inform that

Name: SREEDEVI BONEY KAPOOR AYYAPPAN

Gender: FEMALE

Nationality: INDIA

Passport No: IND- Z 4231524

Died on: 24 / 2 / 2018

Due to: ACCIDENTAL DRAWNING

For / 26/2/2018

Director of Preventive Medicine Dubai

(దుబాయ్-న్యూఢిల్లీ)

శ్రీదేవి మృతిలో మరో ట్విస్ట్ వచ్చింది. ఆమె గుండెపోటుతో మరణించలేదని, ప్రమాదవశాత్తు మరణించినట్లు ఫోరెన్సిక్ నివేదికలో తేలింది. ఇందుకు సంబంధించిన నివేదికను దుబాయ్ అధికారులు ఫోరెన్సిక్ నివేదికను విడుదల చేశారు. శ్రీదేవి మృతి వెనుక ఎలాంటి కుట్ర లేదని తేల్చి చెప్పారు. అయితే ఆమె రక్త నమూనాలో ఆల్కహాల్ ఆనవాళ్ళు ఉన్నట్లు గుర్తించారు. ప్రమాదవశాత్తు ఆమె బాత్‌టబ్‌లోని నీళ్ళలో మునిగి చనిపోయిందని డెత్ సర్టిఫికెట్‌లో వెల్లడించారు. ఫోరెన్సిక్ నివేదిక రావడంతో ఇక ఆమె మృత దేహాన్ని అప్పగించే ప్రక్రియ వేగవంతం కానుంది. ఆమె పాస్‌పోర్టును రద్దు చేయడం, డెత్ సర్టిఫికెట్ ఇవ్వడం లాంటివి ఉన్నాయి. ఈ డాక్యుమెంట్లన్నీ అందుకున్న తర్వాత మృతదేహాన్ని అప్పగించనున్నారు.

పబ్లిక్ ప్రాసిక్యూషన్‌కు శ్రీదేవి కేసు బదిలీ

సినీ నటి శ్రీదేవి మృతదేహం భారత్ చేరుకునేందుకు మరింత సమయం పట్టనుంది. ఈ కేసును దుబాయ్ పోలీసులు లోతుగా దర్యాప్తు చేయనున్నట్లు తెలిసింది. పోస్టు మార్టం ఆలస్యం, ఫోరెన్సిక్ రిపోర్టుపై పలు అనుమానాలు తలెత్తిన నేపథ్యంలో దుబాయ్ పోలీసులు ఈ నిర్ణయం తీసుకున్నారు. శ్రీదేవి మృతి కేసును దుబాయ్ పోలీసులు ఆ దేశ పబ్లిక్ ప్రాసిక్యూషన్‌కు బదిలీ చేశారు. సోమవారం శ్రీదేవికి నిర్వహించిన ఫోరెన్సిక్ నివేదికను విడుదల చేశారు. ఈ రిపోర్ట్‌లో ఆమె ప్రమాదవశాత్తు మరణించినట్లు తేల్చారు. శ్రీదేవి రక్తనమూనాలో ఆల్కాహాల్ ఉన్నట్లు డాక్టర్లు నిర్ధారించారు. కానీ శరీరం తూలి టబ్‌లో జారి పడినట్లు అనుమానిస్తున్నారు. పోస్టుమార్టం పూర్తవడంతో శరీరాన్ని ఎంబాంబింగ్‌కు పంపించారు. పోలీసు నివేదిక దుబాయ్ పబ్లిక్ ప్రాసిక్యూషన్‌కు చేరుకున్న తర్వాత ఈ కేసులో న్యాయప్రక్రియను పూర్తి చేయనున్నారు. దుబాయ్ పబ్లిక్ ప్రాసిక్యూషన్ ఓ వ్యక్తి న్యాయపరమైన హక్కులను కాపాడుతుంది. ఏదైనా కేసు విచారణలో ఉన్న పారదర్శకతను అది విశ్వసిస్తుంది.

అబద్దాలు చెప్పాల్సిన అవసరం ఏమిటి?

కోట్లాది మంది అభిమానులు, యావత్ సినీ ప్రపంచాన్ని విషాదంలోకి నెట్టేసి అతిలోక సుందరి శ్రీదేవి అనంత లోకాలకు చేరుకున్న సంగతి తెలిసిందే. ఆమె గుండెపోటుతో మరణించినట్లు సంజయ్ కపూర్ మీడియాకు తెలియజేశారు. శ్రీదేవి బంధువులే ఈ విషయం చెప్పినప్పటికీ నటీనటులకు, వీరాభిమానులకు, ఆప్తులకు ఇప్పటికీ సందేహాలు మాత్రం నివృత్తి కాలేదు. అంతేకాదు తాజాగా దుబాయ్ ఫోరెన్సిక్ నివేదికలో సంచలన విషయాలు బయటపడ్డాయి. ప్రమాదవశాత్తు బాత్‌టబ్‌లోని నీటిలో పడిపోవడం వల్ల శ్రీదేవి చనిపోయిందని రిపోర్టులో తేలింది. అయితే గుండెపోటుతో మరణించినట్లు రిపోర్టులో ఎక్కడా వైద్యులు, అధికారులు ప్రస్తావించలేదు. మరణానికి ముందు శ్రీదేవి మద్యం మత్తులో ఉన్నట్లు తేలింది. కాగా విచారణ ఇంక కొనసాగుతుందని దుబాయ్ పోలీసులు చెప్పారు. ఈనేపథ్యంలో ఆమె ఎలా మృతి చెందిందన్న అంశం ఇంకా అనుమానాస్పదంగానే ఉందన్నది స్పష్టమవుతుంది.

వెంటాడుతున్న ప్రశ్నలివే

శ్రీదేవి మరణానికి గల కారణాలేంటి? దుబాయ్ హోటల్‌లో అసలేం జరిగింది? బయట ఏం చెప్పారు? మత్తులో శ్రీదేవి తనంతట తానే టబ్‌లో పడిపోయారా? వేరే ఎవరైన తోసేసారా? ముందు కార్డియాక్ అరెస్ట్ అని శ్రీదేవి బంధువులు ఎందుకు చెప్పారు? మృతికి గల కారణాలపై అబద్దాలు చెప్పాల్సిన అవసరం ఏమిటి? అసలు ఆమెది ఆత్మహత్యా? లేక హత్యా? నిజంగా శ్రీదేవి ప్రమాదవశాత్తే చనిపోయారా? అనే ప్రశ్నలు అనేక మంది మనసులను తొలుస్తున్న ప్రశ్నలు.

రీ ఇన్వెస్టిగేషన్

ఇప్పటికే శ్రీదేవి భర్త బోనీకపూర్‌ను మూడున్నర గంటల పాటు సుదీర్ఘంగా విచారించిన పోలీసులు సంచలన నిజాలను సేకరించినట్లు తెలుస్తోంది. మరోవైపు బోనీకపూర్, శ్రీదేవి కాల్‌డేటాను కూడా పరిశీలించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. మరో వైపు పబ్లిక్ ప్రాసిక్యూషన్ రంగంలోకి దింపి కేసును రీ ఇన్వెస్టిగేషన్ చేస్తున్నారు.

శ్రీదేవి మరణంలో ట్విస్ట్‌లివే

ఫిబ్రవరి 20 వ తేదీన భర్త బోనీకపూర్‌తో కలిసి దుబాయ్‌లోని రస్ అల్‌ఖైమాలో జరుగనున్న మేనల్లుడు మోహిత్ మర్వా వివాహానికి శ్రీదేవి కుటుంబసభ్యులు హాజరయ్యారు. 23 వ తేదీన జరిగిన రిసెప్షన్‌లో శ్రీదేవి డాన్స్ చేసి సందడి చేశారు. పెళ్ళి తతంగం ముగిసిన అనంతరం కపూర్ కుటుంబసభ్యులు తిరుగు పయనమయ్యారు. బోనీ కుటుంబం మాత్రం అక్కడి నుంచి దుబాయ్‌కి వచ్చి షాపింగ్ నిమిత్తం జుమేరియాలోని ఎమిరేట్స్ టవర్స్‌లో బస చేసింది. ముంబైలో తన మిత్రుడి కూతురు పుట్టిన రోజు వేడుక ఉండటంతో బోనీ 22 వ తేదీన ఇండియాకు చేరుకుని శనివారం మళ్ళీ దుబాయ్‌కి వెళ్ళాడు. ఫిబ్రవరి 20 వ తేదీ వివాహానంతరం 21, 22 తేదీలలో శ్రీదేవి హోటల్ బయటకు రాలేదు. అయితే బోనీకపూర్ వచ్చిన తర్వాత డిన్నర్‌కు బయటకు వెళ్ళేందుకు తయారవుతున్న నేపథ్యంలో వాష్‌రూంకు వెళ్ళి అక్కడి టబ్‌లో పడి మరణించింది. బోనీకపూర్ తదితరులు శ్రీదేవిని అక్కడే వదిలేసి బోనీకపూర్ ముంబై ఎందుకు వెళ్ళాడు. తిరిగి ఒకరోజులోనే ఎందుకు తిరిగి వచ్చాడు. వచ్చినపుడు శ్రీదేవి ఆల్కాహాల్ తీసుకుని ఉందా? లేక బోనీకపూర్‌తో కలిసి మద్యం సేవించిందా? 21, 22 తేదీలలో ఏం జరిగింది అన్న అంశాలపై స్పష్టత కోసం దుబాయ్ పోలీసులు ప్రయత్నాలను ముమ్మరం చేశారు.





అతిలోకసుందరి శ్రీదేవి.....దుబాయ్‌లో మరణించారు. కోట్లాది మంది అభిమానులను శోకసంద్రంలో నింపారు. ఆమె పార్థివ దేహం ఎప్పుడెప్పుడు వస్తుందా ? అని ఎదురు చూస్తున్న భారత ప్రజానీకం, ఆమె కుటుంబసభ్యులు, బంధువులకు నిరాశే కలుగుతోంది. ఇప్పుడు... అప్పుడు ఆమె భౌతిక కాయం ముంబై చేరుకుంటుందనే వార్తలు వస్తున్నప్పటికీ దుబాయ్‌లోని చట్టాలు, నిబంధనలు ఆమె భౌతికకాయం అప్పగింతలో ఆలస్యం కావడానికి కారణమవుతున్నాయి. దుబాయ్‌లోని చట్టాలు, విదేశీ ఎంబసీలు, ప్రభుత్వాల జోక్యంతో పని చేయవు. నిబంధనల ప్రకారమే పని చేస్తాయి. సామాన్యులు, అసామాన్యులు, సెలబ్రిటీలు ఎవరైనా సరే నిబంధనల ప్రకారమే పని చేస్తాయి. శ్రీదేవి విషయంలో కూడా ఇదే విషయం రుజువైంది. భారత విదేశీ వ్యవహారాల శాఖ భౌతికకాయం వెంటనే అప్పగించాలని చేసిన విజ్ఞప్తులు ఫలించడం లేదు.. నిబంధనలు పూర్తయ్యాకే అప్పగిస్తామని అక్కడి అధికారులు తేల్చి చెప్పారు. దుబాయ్ నుంచి తెలుగు రాష్ట్రాలకు తరలించే మృతదేహాలను అల్ ఖుసేసులోని పోలీస్ మార్చురీలోనే భద్రపరుస్తారు. శ్రీదేవి భౌతిక కాయాన్ని కూడా అక్కడే భద్రపర్చారు. ఫోరెన్సిక్ పరీక్షలు పూర్తయ్యాకే ఆమె పార్థివ దేహాన్ని అప్పగిస్తామని పోలీసులు చెప్పారు. పోస్టుమార్టం, ఇతర వైద్య పరీక్షలు పూర్తయ్యేసరికి కార్యాలయాల పని వేళలు ముగిశాయి. అంతేగాక పరీక్షల నివేదికలను పూర్తిగా అధ్యయనం చేశాకే తుది నివేదికను ఇవ్వగలమని ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ ఖాలీద్ అల్ అబురైఖీ చెప్పారు. డాక్టర్ల నివేదిక రానిదే తాము మృతదేహం అప్పగించలేమని పోలీసులు స్పష్టం చేశారు.వైద్య నివేదికలు అందిన తర్వాత మరణ ధృవీకరణ పత్రాన్ని జారీ చేస్తారు. ఆ తర్వాత పోలీస్ క్లియరెన్స్ లభిస్తుంది. అనంతరం దుబాయ్‌లోని భారతీయ కాన్సులేట్ కార్యాలయం శ్రీదేవి పాస్‌పోర్టు రద్దు చేసి డెత్ సర్టిఫికెట్ జారీ చేస్తుంది. అంతేగాక భారత దేశానికి మృత దేహాన్ని తీసుకురావడానికి ఎన్‌వోసీ జారీ చేస్తుంది.

విధి విధానాలు కఠినంగా ఉంటాయి. మరణం ఎలా సంభవించినప్పటికీ (సహజ, ప్రమాదం, అనుమానాస్పదం) పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలి. ఆస్పత్రులు కాకుండా బయట చనిపోతే వెంటనే 999 నంబర్‌కు ఫోన్ చేసి చెప్పాలి. పోలీసులు వచ్చి బలాఖ్ అల్ వఫాత్ (మరణ సమాచారాన్ని) నమోదు చేస్తారు. మృతదేహాన్ని అల్ రాషేద్ ఆస్పత్రి లేదా ఖుసేస్ మార్చురీకి తరలిస్తారు. చికిత్స పొందుతూ మరణిస్తే ఆస్పత్రిలోనే భద్రపరుస్తారు. ఫోరెన్సిక్ ఇతర నిపుణులు మృతదేహానికి పరీక్షలు చేస్తారు. అవసరమైతే పోస్టు మార్టం చేస్తారు. పోస్టు మార్టంతర్వాత మరణానికి కారణాలను విశ్లేశిస్తూ నివేదికను తయారు చేస్తారు. మృతులకు సంబంధించిన పాస్‌పోర్టు, వీసా పరిశీలించి పలానా వ్యక్తి అని పోలీసులు ధృవీకరిస్తారు. నాలుగు పత్రాలు ఆస్పత్రి, ఎయిర్ లైన్స్, ఎంబాలింగ్ చేసే విభాగం, విమానాశ్రయం లేదా శ్మశానవాటికకు జారీ చేస్తారు. మరణ ధృవీకరణ పత్రాలు అరబ్బీ భాషలోనే ఉంటాయి. దాన్ని వీసా కార్యాలయంలో అందిస్తే వీసా రద్దు చేస్తారు. అరబ్బీ భాషలో ఉంటే ఆ పత్రాలను ఆంగ్లంలోకి అనువదించి భారతీయ కాన్సులేట్ అధికారులకు అప్పగిస్తారు. మొత్తం డాక్యుమెంట్లను సమర్పిస్తే కాన్సులేట్ కార్యాలయం మృతదేహం తీసుకు వెళ్లేందుకు నిరభ్యంతర పత్రం (ఎన్ఓసి)జారీ చేస్తుంది. అందుకు కుటుంబ సభ్యులు స్టాంప్ పేపర్‌పై అఫిడవిట్ సమర్పించాల్సి ఉంటుంది. మార్చురీలో చట్టబద్ధ వీసా ఉన్న వాళ్లు సాక్షి సంతకం చేస్తే మృతదేహాన్ని అల్‌మోహైసనాకు తరలిస్తారు. ప్యాకింగ్ తర్వాత 210 దిర్హాం (రూ.3700)చెల్లిస్తే అద్దె వాహనంలో దుబాయి విమానాశ్రయంలోని కార్గో విభాగానికి మృతదేహాన్ని తరలిస్తారు. అక్కడ కొన్ని గంటలు పెట్టిన తర్వాత విమానంలో తరలిస్తారు. ఇక్కడొక విషయం గమనించాలి. మృతులకు అంటువ్యాధులు ఉన్నాయని తెలితే ఎన్ఓసి జారీ చేయడంలో ఇబ్బందులు ఎదురవుతాయి.

సర్జరీలు కారణం కాదు... మండిపడ్డ నిర్మాత

కొన్ని కోట్లమంది అభిమానుల హృదయాలను దోచుకున్న లెజెండరీ యాక్టర్ శ్రీదేవి మరణంతో యావత్ సినీలోకం తీవ్ర విషాదంలో మునిగింది. అయితే ఫోరెన్సిక్ నివేదికలో ఆమెది సహజ మరణమేనని...గుండెపోటు కారణంగానే ఆమె మరణించిందని తేలింది. అయితే ఆమెకు గుండెపోటు రావడానికి అసలు కారణం ఆమె చేయించుకున్న సర్జరీలే.. అంటూ సోషల్ మీడియాలో పుకార్లు వస్తున్నాయి.. ఈ ఉదంతంపై బుల్లితెర నిర్మాత ఏక్తా కపూర్ స్పందిస్తూ నెటిజన్ల పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.సర్జరీలు చేయించుకోవటం వల్లే గుండెపోటు వచ్చిందనడం సరికాదు. ఎలాంటి గుండె సమస్యలు లేకున్నా కొన్ని సందర్భాల్లో గుండెపోటు రావచ్చు. దయచేసి రాక్షసుల్లా మాట్లాడకండి.అని నెటిజన్లపై మండిపడింది.

నాడు చెప్పని నిజం..



ఎంత ఎత్తుకు ఎదిగినా, ఎంత గొప్ప నటిగా ఉన్నా శ్రీదేవి మాత్రం తన సహజత్వాన్ని ఎన్నడూ కోల్పోలేదు. అన్నిసార్లు, అన్ని వేళలా ఆమె ఒక మామూలు మనిషిగానే ఉన్నారు. బాధ వస్తే చిన్నపిల్లలా ఏడ్చేయడం, సంతోషం వస్తే ఎగిరిగంతేసినంత పని చేయడం ఆమె చేసేవారు. అందుకే, ఆమె సున్నిత మనస్తత్వాన్ని సున్నిత మనస్తత్వాన్ని యశ్‌చోప్రా కూడా ఓ కీలకసందర్భంలో నిజం చెప్పే ధైర్యం చేయలేకపోయారంట. ఆయన బతికున్న రోజుల్లో ఈ విషయాన్ని ప్రముఖ దర్శకుడు కరణ్ జోహార్ చేసిన ఇంటర్వ్యూలో పంచుకున్నారు. శ్రీదేవి అకాల మరణంతో ఇప్పుడు ఆ విషయం వైరల్ అవుతోంది. ఇంతకీ యశ్ చోప్రా చెప్పలేకపోయిన ఆ విషయం ఏమిటంటే ఆమె తండ్రి మరణ వార్త. లంహే అనే చిత్రం షూటింగ్ చేస్తున్నప్పుడు వారంతా మాంచెస్టర్‌లో ఉన్నారట. ఆ సమయంలో అనుకోకుండా శ్రీదేవి తండ్రి అయ్యప్పన్ యంగర్ చనిపోయినట్లు కబురు వచ్చింది. దీంతో ఆ వార్తను యశ్‌చోప్రా ఆమెకు చెప్పే ధైర్యం చేయలేకపోయారు. దాంతో ఆమెను దగ్గరకు పిలుచుకొని, తండ్రిగారి ఆరోగ్యం బాగాలేదంటా వెళ్లి చూసి, ఎన్ని రోజులు కావాలంటే అన్ని రోజులు ఉండి మెల్లగానే సినిమా షూటింగ్‌కు వచ్చేయ్ అని చెప్పారట. దాంతో శ్రీదేవి ఇంటికి వెళ్లి చూసే వరకు కూడా ఆమె తన తండ్రిని కోల్పోయిందనే విషయం తెలుసుకోలేకపోయారట. తండ్రి అంత్యక్రియలు పూర్తి చేసుకొని 16 రోజుల తర్వాత ఆమె తిరిగి షూటింగ్‌కు వచ్చినట్లు యశ్‌చోప్రా చెప్పారు.

అత్తయ్య మరణంపై మేనల్లుడు ఏమన్నాడంటే..



తన అత్తయ్య శ్రీదేవి మృతి పట్ల మేనల్లుడు మోహిత్ మర్వా స్పందించాడు. తన పెళ్లికి హాజరైన ఆమె అర్ధంతరంగా తనువు చాలించడంపై ఆవేదన వ్యక్తం చేశాడు. 'శ్రీదేవి లెజెండ్ కన్నా ఎక్కువే. ఆమె లేని లోటు ఎప్పటికీ మిగిలిపోతుంది' అంటూ మోహిత్ ఆవేదనగా పోస్టు పెట్టాడు.

మరోసారి అమ్మను కోల్పోయా..

శ్రీదేవి హఠాత్మరణం పట్ల పాకిస్థానీ నటి సజల్ అలీ తీవ్ర ఆవేదన వ్యక్తంచేసింది.. 'నేను మరోసారి అమ్మను కోల్పోయాను' అంటూ నివాళులర్పించారు. శ్రీదేవి తాజాగా వెండితెరపై కనిపించిన సినిమా 'మామ్'. ఈ సినిమాలో శ్రీదేవి కూతురిగా సజల్ అలీ నటించింది.. దురదృష్టవశాత్తు, సజల్ అలీ 'మామ్' చిత్రం షూటింగ్ సమయంలో తన తల్లిని కోల్పోయింది. ఆ సమయంలో సజల్‌ను దగ్గరకు తీసుకొని ఒక తల్లిగా శ్రీదేవి ఓదార్చింది. ఆ విషాదసమయంలో తనను అక్కున చేర్చుకుంది.'సజల్ తన తల్లిని ఎంతగానో ప్రేమించేది. ఆమె దూరమవ్వడంతో ఆ అమ్మాయి గుండెపగిలింది. ఆ సమయంలో సజల్‌ను దగ్గరకు తీసుకొని.. ఒక తల్లిగా శ్రీదేవి ఓదార్చింది. ఈ విషాదం తర్వాత ఓసారి సజల్ పాక్‌లోని తన స్వస్థలం నుంచి శ్రీదేవికి ఫోన్ చేసి మాట్లాడింది. తన విషాదాన్ని ఆమెతో పంచుకుంది. శ్రీదేవి ఎంతో ఓపికతో తనను ఓదార్చింది. మామూలుగా శ్రీదేవి సెట్స్‌లో ప్రొఫెషనల్‌గా ఉంటారు. సహ సిబ్బందితో అంతగా కలిసిపోరు. కానీ సజల్ విషయంలో మాత్రం శ్రీదేవి భిన్నంగా స్పందించారు' అని సన్నిహిత వర్గాలు మీడియాకు తెలిపాయి.సినిమా విడుదల సమయంలో శ్రీదేవి సజల్ గురించి మాట్లాడుతూ భావోద్వేగానికి లోనయ్యారు. 'సజల్ కూడా నా బిడ్డనే. తనను ఎంతో ప్రేమిస్తున్నా. తన గురించి ఎందుకింత భావోద్వేగానికి లోనవుతున్నానో నాకు తెలియదు. తనను మిస్ అవుతున్నాను. తను సినిమాలో అద్భుతంగా నటించింది. ఇది మాకు స్పెషల్ మూమెంట్' అంటూ శ్రీదేవి పేర్కొన్నారు.



శ్రీదేవి మృతి వార్త చెప్పిందీయనే..

శ్రీదేవీ మరణించిన కొద్దిసేపటికే సంజయ్ కపూర్.. దుబాయ్‌లోని ప్రఖ్యాత 'ఖలీజ్ టైమ్స్'తో మాట్లాడారు. శ్రీదేవి హఠాన్మరణంతో తమ కుటుంబం మొత్తం షాక్‌కు గురైందని, ఆమెకు ఎలాంటి గుండె జబ్బులూ లేవని చెప్పారు. హోటల్ గదిలో ఉన్నప్పుడే నొప్పితో ఆమె కుప్పకూలిపోయారని వివరించారు. వివాహకార్యక్రమంలో పాల్గొనేందుకు సంజయ్ శనివారం ఉదయమే దుబాయ్‌కి వెళ్లారు. శ్రీదేవి దంపతులతోపాటే వేడుకలో పాల్గొన్నారు.

ఆమె చివరి సినిమాలో నటించడం నా అదృష్టం

అందాల తార శ్రీదేవిని భారత్‌లో ఎంతగా ఇష్టపడుతారో.. పాకిస్థాన్‌లో అంతే ఇష్టపడుతారని పాక్ నటుడు అద్నాన్ సిద్ధిఖీ తెలిపారు.శ్రీదేవి మృతి దిగ్భ్రాంతికి గురి చేసింది. ఆమె ఇకలేరు అనే మాట నన్ను చాలా బాధిస్తోంది. దేశం మొత్తం చాలా బాధలో ఉంది. అమెరికా, పాకిస్థాన్, యూకే తదితర దేశాల నుంచి కూడా నివాళులు అర్పిస్తూ సందేశాలు పంపుతున్నారు' అని అన్నారు. అతిలోక సుందరి చివరి చిత్రం 'మామ్'లో ఆమెతో కలిసి నటించడం తనకు దక్కిన గొప్ప గౌరవం, అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. శ్రీదేవి హఠాన్మరణంతో ఆమె భర్త బోనీ కపూర్ చిన్నపిల్లాడిలా ఏడుస్తున్నారని సిద్ధిఖీ తెలిపారు. శ్రీదేవి కుటుంబం ఆహ్వానం మేరకు దుబాయ్‌లో జరిగిన పెళ్లికి సిద్ధిఖీ కూడా హాజరయ్యారు.శ్రీదేవి కన్నుమూసిన తర్వాత దుబాయ్‌లో ఆమె భర్త బోనీని కలిసినట్లు సిద్ధిఖీ తెలిపారు.




అంత్యక్రియలు రేపే?



ప్రముఖ నటి శ్రీదేవి అంత్యక్రియలు మరింత అలస్యమయ్యేలా కనిపిస్తోంది. పోస్టుమార్టం జరిగినప్పటికి మరిన్ని ప్రక్రియలు జరగనుండగా, మంగళవారం రాత్రికి కాని పార్థివదేహం ముంబైకి చేరుకునేలా కన్పించడంలేదు. ఆమె పార్థివ దేహం ముంబయి చేరుకున్న తర్వాత కడసారి చూసేందుకు తరలి వచ్చిన ప్రముఖులు, అశేష అభిమానుల కోసం శ్రీదేవికి ఇష్టమైన భాగ్య బంగ్లాలో ఆమె భౌతిక కాయాన్ని ఉంచు తారు. ఇమ్మిగ్రేషన్‌కు సంబంధించిన వ్యవహారా లు పూర్తి చేసిన తర్వాతా దుబాయి అధికారులు పార్థివదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగిస్తారు. దుబాయ్‌లో శ్రీదేవి బసచేసిన జుమేరా ఎమిరేట్స్ టవర్ హోటల్‌లోని గదిని దుబాయ్ పోలీసులు సీజ్ చేశారని, ఆ సూట్ మొత్తాన్నీ 'క్రూషియల్ స్పాట్'గా గుర్తించారని సమాచారం. అయితే దీనిపై స్పందించేందుకు హోటల్ యాజనమాన్యం నిరాకరించింది. సాధారణ ప్రక్రియలో భాగంగానే గదిని పోలీసులు పరిశీలించినట్లు తెలిసింది.

ఖలీజ్ టైమ్స్ మరో కథనం

శ్రీదేవి శనివారం రాత్రి 11.30 గంటలకు చనిపోలేదని అంతకు ముందే చనిపోయిందని దుబాయ్ పత్రిక ఖలీజ్ టైమ్స్ కథనం. అయితే దుబాయ్‌కి శ్రీదేవితో వెళ్లిన బోనీ కపూర్ తిరిగి ముంబైకి ఎందుకు వచ్చారు. శనివారం దుబాయ్ తిరిగి ఎందుకు వెళ్లారు. వెళితే ఆ సాయంత్రం శ్రీదేవితో గడిపారా.. లేక మధ్యలో హోటల్ నుంచి బయటకు వచ్చారా.. శ్రీదేవి మృతి గురించి ఆయన ఆలస్యంగా చెప్పారనే సందేహాలు చుట్టు ముడుతున్నాయి.శ్రీదేవి మృతిపై బోనీ కుటుంబంలోని సభ్యులు ఎవరూ ఇప్పటి వరకు నోరు మెదపలేదు.



ఇద్దరు భార్యల కోరిక తీరలేదు..

బోనీకపూర్ తొలి భార్య మోనా షౌరీ కపూర్ లాగే రెండో భార్య శ్రీదేవి సైతం ఓ పెద్ద కోరికను తీర్చుకోకుండానే కన్నుమూశారని ఇండస్ట్రీ వర్గాలు ఆవేదన చెందుతున్నాయి.

మోనా షౌరీ కపూర్ తమ కుమారుడు, బాలీవుడ్ నటుడు అర్జున్ కపూర్ ఫస్ట్ సినిమా రిలీజ్‌కి కొన్ని నెలలముందు మరణించారు. 13 ఏళ్ల వివాహబంధం తర్వాత 1996లో భర్త బోనీ నుంచి మోనా కపూర్ విడాకులు తీసుకున్నారు. మోనా కపూర్, బోనీల కుమారుడు అర్జున్ కపూర్ నటించిన తొలిచిత్రం ఇషక్‌జాదే. 2012 మేలో కుమారుడి తొలి మూవీ విడుదల కావల్సి ఉండగా.. అదే ఏడాది మార్చి 25న మోనా కపూర్ మృతిచెందారు. దీంతో హీరోగా కుమారుడి సిల్వర్ స్క్రీన్ మీద చూసుకోవాలన్న మోనా కోరిక తీరలేదు.



మోనాతో విడాకులు తీసుకున్న ఏడాదే నిర్మాత బోనీకపూర్ స్టార్ హీరోయిన్ శ్రీదేవిని వివాహం చేసుకున్నారు. శ్రీదేవికి తన పెద్ద కుమార్తె జాన్వీకపూర్ ను వెండితెర మీద చూసుకోవాలని ఎంతో తాపత్రయపడ్డారు. కానీ కూతురు జాన్వీ నటించిన ఫస్ట్ సినిమా దడక్ రిలీజ్‌కు కొన్ని నెలల ముందు శ్రీదేవి ఆకస్మికంగా మృతిచెందారు. జాన్వీ తొలి మూవీ ఈ ఏడాది జూలై 20న విడుదల కానుండగా.. ఈలోపే మహానటి తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయింది.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

మంగళవారం 27 ఫిబ్రవరి 2018

అతిధులంతా సమానమే కదా!

రెండేళ్ళ క్రితం ప్రధాని నరేంద్రమోడీ కెనడాలో పర్యటించినప్పుడు ఆయనకు ఘన స్వాగతం లభించింది.గత వారంమనదేశంలో పర్యటించిన కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడోని ప్రభుత్వంలో ఉన్నత స్థానాలలోని వారెవరూ పట్టించుకోలేదు.ఇది ఉద్దేశపూర్వకంగా జరిగింది కాకపోవచ్చు కాని, కెనడా ప్రజలు నొచ్చుకోవడానికి మన ప్రభుత్వం అవకాశం ఇచ్చినట్టయింది.విదేశీ అతిధులకు స్వాగతం చెప్పేందుకు ప్రధాని మోడీ ప్రొటోకాల్ పక్కన పెట్టి విమానాశ్రయానికి వెళ్ళిన సందర్భాలు ఉన్నాయి. గత నెల14న ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహూ ఢిల్లీ వచ్చినప్పుడు ఆయనకు స్వాగతం చెప్పేందుకు మోడీ ప్రొటోకాల్‌ని పక్కన పెట్టారు. దశాబ్దాల తర్వాత మన దేశానికి ఇజ్రాయెల్ ప్రధాని వచ్చారు కనుక, అతిధి దేవోభవ అనే ఆర్యోక్తిని పాటించి మోడీ ఆ విధంగా ప్రొటోకాల్‌కి భిన్నంగా వ్యవహరించారనుకుందాం. కెనడా ప్రధానికి స్వాగతం చెప్పడంలో సమున్నతమైన గౌరవాన్ని పాటించి ఉంటే సమస్య ఉండేది కాదు. మోడీకి తీరిక లేదని అనుకుందాం. మరి ఆయన పార్టీకే చెందిన గుజరాత్, ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రుల సంగతేమిటి? ఈ రెండు రాష్ట్రాల్లో ట్రూడో పర్యటించినప్పుడు ముఖ్యమంత్రులు ముఖం చాటేశారు. ఢిల్లీలో ట్రూడోకి గజేంద్ర సింగ్ అనే కేంద్రమంత్రి స్వాగతం చెపడాన్ని కెనడా ప్రజలు తప్పుపడితే ఖండించలేం. జస్టిన్ తనకు సరైన స్థాయిలో స్వాగతం లభించలేదని పైకి అనకపోవచ్చు. ఒక దేశాధినేతగా ఆయన అవమానంగా భావించవచ్చు. అది పైకి కనిపించకుండా, ఎక్కడికి వెళ్తే అక్కడి ప్రజలతో ఆయన కలిసిపోయారు. క్రికెట్ క్రీడను వీక్షించారు. ఒక దేశాధినేతకు ఉద్దేశపూర్వకంగా కాకపోయినా సముచితమైన గౌరవం లభించలేదనే అభిప్రాయం ప్రజల్లో ఏర్పడుతుంది. ప్రధానమంత్రి ఇతర దేశాల అధినేతలకు ట్విట్టర్ ద్వారా శుభాకాంక్షలు తెలుపుతూ ఉంటారు. కెనడా ప్రధాని మన దేశాన్ని సందర్శించినప్పుడు కనీసం ట్విట్టర్ ద్వారానైనా స్వాగతంపలికి ఉండాల్సింది. దశాబ్దాల క్రితమే పంజాబ్, గుజరాత్ నుంచి కెనడా వెళ్ళి స్థిరపడిన భారతీయులు వ్యాపారాల్లో రాణిస్తున్నారు. అదే సందర్భంలో ఖలిస్తాన్ ఉద్యమకారులకు కెనడా ఆశ్రయం ఇస్తోందన్న కథనాలు ఇరుదేశాల మధ్య దూరాన్ని పెంచాయి. దానికి తోడు కనిష్క విమాన ప్రమాదం సూత్రధారులైన ఖలిస్తాన్ కమెండోలు కెనడాలో ఆశ్రయం పొందుతున్నారన్న వార్తలు ఇరుదేశాల మధ్య సంబంధాల్లో ఉద్రిక్తతలను ఏర్పరిచాయి. ఇందిరాగాంధీ హయాంలో తొలిసారి అణుపరీక్షల తర్వాత కెనడా కొంతకాలం దూరంగా ఉంది. ఆ తర్వాత ఐకె గుజ్రాల్ దౌత్యంతో ఇరుదేశాల మధ్య సంబంధాలు మెరుగయ్యాయి. మొదట్లో పరిస్థితి సజావుగా ఉండేది. భారత్‌కి స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ హయాంలో ఇరుదేశాల మధ్య సంబంధాలు మెరుగుగా ఉండేవి. ఐక్యరాజ్య సమితిలోనూ, కామన్వెల్త్‌లోనూ కెనడా భారత్‌కి అండగా ఉండేది..దౌత్య, వాణిజ్య సంబంధాలు ఉభయ తారకమైనవన్న కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో వ్యాఖ్యల్లో అతిశయోక్తి లేదు. ఎనిమిదేళ్ళ క్రితమే ఇరుదేశాల మధ్య వాణిజ్యం 3.21 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ట్రూడో ముంబాయి పర్యటన సందర్భంగా బిలియన్ డాలర్ల వాణిజ్య ఒప్పందంపై సంతకాలు జరిగాయి. కెనడాలో భారత్ ఎఫ్‌డిఐలు 2016 నాటికి 2093.53 మిలియన్ డాలర్లు ఉండగా, భారత్‌లో కెనడా ఎఫ్‌డిఐలు 901.17 మిలియన్ డాలర్లు ఉన్నాయి. స్వేచ్ఛా వాణిజ్యం అనేది ఉభయ తారకం అయినప్పుడే దేశాల మధ్య సంబంధాలు సజావుగా కొనసాగుతాయి. ట్రూడో పర్యటన ముగించుకుని వెళ్ళే ముందు ఆయనను మోడీ కలుసుకున్నారు. భారత ఇంధన భద్రతకు కూడా కెనడా అధిక ప్రాధాన్యం ఇస్తోంది. పట్టణాభివృద్ధి, ప్రజా రవాణా మెరుగుదలకు కూడా కెనడా మనకు తోడ్పడేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. ఏ దేశంతోనైనా దౌత్య,వాణిజ్య సంబంధాలు ఉభయ తారకం అయినపుడే న్యాయం జరిగినట్టు అవుతుంది. అంతర్జాతీయంగా అన్ని దేశాలతో మైత్రిని పెంచుకుని వాణిజ్య, దౌత్య సంబంధాలను మెరుగు పర్చుకోవడానికి మోడీ కృషి చేస్తున్నారు.

ఈక్రమంలోనే ఆయన కెనడా సందర్శించి మేక్ ఇన్ ఇండియా కార్యక్రమానికి సాయపడాల్సిందిగా కోరారు. సాంకేతిక పరిజ్ఞానం బదిలీ, అణు శక్తి రంగంలో సహకారం మొదలైన అంశాల్లో సాయపడేందుకు కెనడా సంసిద్ధత వ్యక్తం చేసింది. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక,వాణిజ్య విధానాలు తమకు ఎంతోఅనుకూలంగా ఉన్నాయని ట్రూడో అన్నారు. కెనడాలో భారత సాఫ్ట్‌వేర్ కంపెనీలు భారీగా పెట్టుబడులుపెట్టాయి. వస్తువులు, సేవల ఎగుమతులకు అనుకూల వాతావరణం గతంలో కన్నా ఇప్పుడు ఎక్కువగా ఉన్నందున భారత్ కంపెనీలకు కెనడా ఎర్రతివాచీ స్వాగతం పలుకుతున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న తొలి ప్రాధాన్యం అమెరికా విధానం వల్ల కెనడా పౌరులు కూడా ఉద్యోగావకాశాలు కోల్పోయారు. దీంతో కెనడా వాణిజ్య ,దౌత్య సంబంధాల విస్తృతి కోసం కృషి చేస్తోంది. ఆ క్రమంలోనే ట్రూడో మన దేశంలో పర్యటనకు వచ్చారు. ఖలిస్తాన్ వాదులకు ప్రాధాన్యం ఇస్తున్నందుకే ట్రూడో పట్ల ప్రధాని అలా వ్యవహరించారా అన్న మానం కలుగుతోంది. సిక్కు జనాభా ఎక్కువగా ఉన్నందువల్ల కెనడాలో ఖలిస్తాన్ వాదులు తిష్ఠ వేసినమాట నిజమే కానీ, ఖలిస్తాన్ వాదులకు ఆశ్రయం ఇవ్వొద్దని కెనడా ప్రభుత్వాధినేతకు నచ్చజెప్పేందుకు ప్రధానమంత్రి మోడీ మరో పద్ధతిని అనుసరించి ఉండాల్సింది.

మంచి మాట

ప్రతి (యువ) రాజులోనూ సకల సద్గుణాలు ఉండాల్సిన అవసరం లేదు కానీ అవి ఉన్నట్లు అభినయించడం మాత్రం అవసరమే. -మాకియవెల్లి

రైతులకు సబ్సిడీలో దేశానికే ఆదర్శం



కెసిఆర్ అంటే ఒక వివాదం. కెసిఆర్‌అంటే ఒక నినాదం. ముఖ్యమంత్రి కేసిఆర్‘ఆకుపచ్చనితెలంగాణ’ను కలగన్నారు. దానికనుగుణంగానే ఆయన అడుగులు పడ్డాయి. కోటిఎకరాల మాగాణం స్వప్న సాకారం దిశగా ఆయన రచిస్తున్న ప్రణాళికలు, ప్రవేశపెడుతున్న పథకాలు అన్ని రాష్ట్రాలను ఆకర్షిస్తున్నాయి. ఢిల్లీని కూడా ప్రభావితం చేస్తున్నాయి. దేశంలో రోజూ ఏదో ఒక మూలన నిరాశ, నిట్టూర్పుతో నిస్సహాయంగా జీవితం మీద చివరి సంతకం చేసి వెళ్ళిపోతున్న రైతుల కోసం దూరదృష్టితో కెసిఆర్ ద్విముఖ వ్యూహంతో కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. దీర్ఘకాలికప్రయోజనాలు కలిగించే సాగునీటి ప్రాజెక్టులు నిర్మించి రైతులకు అంకితం చేయడం, ఎరువులు విత్తనాలు వంటి అవసరాలకోసం అప్పుల పాలు కాకుండా పెట్టుబడిని అందించడం అనే రెండు వ్యూహాలు జాతీయ స్థాయిలో చర్చకు దారి తీస్తున్నాయి. ఎకరానికి 4 వేల రూపాయల చొప్పునఏటా రెండుసార్లు నేరుగా రైతులకుపెట్టుబడి సాయం చేయాలన్న కేసీయార్ ఆలోచన ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులనూ ఆకర్షించింది. కేంద్ర ప్రభుత్వం కూడా దీనిపై ఆసక్తి చూపిస్తోంది. పొరుగున ఉన్న కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తమ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల వాకిట ‘రైతబెలకు’ పథకాన్ని ఇటీవల బడ్జెట్ లో ప్రకటించారు. రైతబెలకు అంటే ‘‘రైతు భవిష్యత్తు ‘‘ అని నిర్వచించుకోవచ్చు. రాష్ట్రంలోరైతులందరికీ పంట పెట్టుబడిగా ఎకరానికి 4,000 రూపాయలచొప్పున అందించాలనేతెలంగాణా ప్రభుత్వం ఆలోచన అమలుచేయక మునుపే కేంద్రంతో సహా ఇరుగుపొరుగు రాష్ట్రాలు ఈ పథకంపై ఆసక్తి చూపుతుండటం, ఆ పథకం విశిష్టతనుతెలియజేస్తోంది. తెలంగాణా ప్రభుత్వం త్వరలో పంట పెట్టుబడి పథకాన్ని అమలుచేయడానికి సిద్ధమవుతుండటంతో ఆ పథకానికి సంబందించిన పూర్తి వివరాలు తెలుసుకొనేందుకు కర్ణాటక ఈ-గవర్నెన్స్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజీవ్ చావ్లా హైదరాబాద్ వచ్చారు. కర్ణాటక శాసనసభకు ఏప్రిల్-మే నెలలో ఎన్నికలు జరుగబోతున్నాయి. ఎన్నికల ముంగిట రైతులను కట్టిపడవేసే ఈ పథకాన్ని సిద్దరామయ్య ఎందుకు ప్రకటించారో అర్థం చేసుకోవడం కష్టం కాదు.

మహారాష్ట్ర, కర్నాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు,రాష్ట్రం ఏదైనా రైతు దీనగాథఒక్కటే. ప్రపంచానికి తిండిపెట్టే రైతు అనాధలా మారిపోరాన్నది కెసిఆర్ పంతం. ఏ దేశంలోనూ రైతన్నకు ఇంత అగౌరవం ఉండదు. ఏ సమాజంలోనూ రైతంటే ఇంత చిన్న చూపుండదు. మన దేశంలో మాత్రం రైతంటే ఎవరికీ పట్టని, ఏ ప్రభుత్వానికీ అవసరం లేని వాడు. కార్పొరేట్ కంపెనీలకు లక్షల కోట్ల పన్నురాయితీలు, తక్కువ రేట్లకే వందల ఎకరాలను ప్రభుత్వాలు ఇస్తున్నాయి. దేశానికి తిండిపెట్టే రైతన్న బాగుకోసం రూపాయి ఖర్చు పెట్టడమంటే గింజుకుంటున్నాయి. సంక్షోభంలో కూరుకుపోతున్న వ్యవసాయరంగాన్ని బతికించడానికి నాలుగేళ్ల పసి రాష్ట్రం తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ నీతిఆయోగ్ కు సమర్పించిన నివేదిక దిక్సూచిగా మారుతోంది. దేశంలోనిసాగుభూములన్నింటినీ పంటల విభాగాలుగా మార్చాలని, వ్యవసాయ రంగంలో పరిశోధనలకు ఊతంఇస్తూ అనుబంధ పరిశ్రమలకు మద్దతు ఇవ్వాలని మొత్తం8 ప్రతిపాదనలను కెసీఆర్ నీతిఆయోగ్‌కు సమర్పించారు. రైతుల ఆదాయాన్ని ఐదేళ్లలో రెండింతలు చేయడం ముఖ్యమంత్రి కెసిఆర్‌అష్ట సూత్రాల లక్ష్యం. తెలంగాణలో 17వేలకోట్ల రుణాలను నాలుగు విడతల్లో మాఫీ చేయటం ద్వారా 35 లక్షల మంది రైతులకు మేలు జరిగింది. ఎకరానికి నాలుగు వేల రూపాయల పెట్టుబడి అందించే పథకం అమలుకు సిద్ధంగా ఉన్నది. ఈ నిర్ణయం వల్ల ఒకటిన్నర కోట్ల ఎకరాల్లో సాగు చేస్తున్న 55 లక్షల మంది రైతులకు మేలు కలగనున్నది. రాష్ట్రప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్యలకు కేంద్ర ప్రభుత్వం కూడా తోడ్పాటు అందజేయాలన్నది కెసిఆర్ ప్రతిపాదన. దేశంలోని మొత్తం వ్యవసాయ భూములను వ్యవసాయవాతావరణ పరిస్థితుల ఆధారంగా పంటల విభాగాలుగా విభజించాలని కెసిఆర్ కోరుతున్నారు.తద్వారా అవసరానికి మించి పంటలు పండకుండా చర్యలు తీసుకోవటంతోపాటు రైతులకు కనీస మద్దతు ధర చెల్లించేందుకు వీలు కలుగుతుందని ఆయన అంటున్నారు. దేశంలో వ్యవసాయ ఉత్పత్తులు పెరిగినా పంటల దిగుబడి మాత్రం పెరగలేదన్నారు. దిగుబడి పెంచేందుకు పరిశోధన పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని సి.ఎం.కెసిఆర్ కోరారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగం పరిశోధనకు ఆర్థిక మద్దతు ఇవ్వాలనికోరారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టులను వీలున్నంత త్వరగా పూర్తి చేయదానికి కేంద్ర ప్రభుత్వం సహకరించాలని కెసిఆర్ కోరారు. వ్యవసాయ రంగానికి తక్కువ ధరకు విద్యుత్తును సరఫరా చేయాలని, పంటల బీమా పథకంలోని లోపాలను తొలగించి సంస్కరించాలని కేంద్రాన్ని కోరారు.

తెలంగాణ రాష్ట్ర సమితి ప్రభుత్వ తొలి టర్మ్ లో మరో కొత్త అధ్యాయం ప్రారంభమైంది.రైతు సమన్వయ సమితుల కోలాహలం ప్రారంభమైంది. ప్రధాన ప్రతిపక్షం గొంతులో ఈ వ్యవహారం హాలాహలం కానుందేమోచూడవలసి ఉన్నది. ’’అటుకులు బుక్కో.. అన్నం తినో.. ఉపాసంఉండో.. నీళ్లు తాగో.. ఈ బక్కపేదటీఆర్ఎస్ కార్యకర్తలే తెలంగాణ తెచ్చిన్రు. 14 సంవత్సరాలు కొట్లాడి. ఇవాళ తెలంగాణ పునర్నిర్మాణానికి కూడా గా కార్యకర్తలే పనిచేస్తరు. వాళ్లే రైతు సమన్వయ సమితుల్లో ఉంటరు. నేను అధికారికంగా చెప్తున్నా. మేం చేసేదితప్పయితే ప్రజా కోర్టులో మాకు శిక్ష తప్పదు. మేం చేసేదిఒప్పయితే ప్రజా కోర్టులో మళ్లా మేమే నెగ్గొస్తాం. ఇది మా కమిట్‌మెంట్. నేను వంద శాతం స్పష్టం చేస్తున్నా. టీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సభ్యత్వం 56 లక్షలు. అంటే టీఆర్ఎస్ సభ్యత్వం తీసుకోంగనే ఈ 56 లక్షల మంది అనర్హులైపోతరా? ఇక పనికిరారా? ఇదేం అన్యాయం? వాళ్లలో రైతులు లేరా? లోకానికి వచ్చినట్లు వాళ్లకి రావా? అదేమన్నా అన్యాయమా?’’ తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ 2017 నవంబర్‌లో శాసన సభలో చేసిన ప్రకటన ఇది. రాష్ట్ర స్థాయి రైతు సమన్వయ సమితుల ప్రాంతీయ సామావేశం ప్రారంభిస్తూ కెసిఆర్ ఇలా అన్నారు. ’’గత ప్రభుత్వాల తీరుతో రైతు పరిస్థితి ఘోరంగా మారింది. ఒకప్పుడు కరువు వస్తే ఆ ఏడాదిని గుర్తుపెట్టుకునే వాళ్లం. వాతావరణ సమతౌల్యం దెబ్బతినడం వల్లనే అతివృష్టి, అనావృష్టి. సమైక్య రాష్ట్రంలో నీళ్లివ్వలేదు. ఉమ్మడి రాష్ట్రంలో ఎన్ని అవస్థలు పడ్డమో వర్ణనాతీతం. రైతుల కోసం మంచి కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నం. దశాబ్దాల తరబడి వేదనకు గురై.. ఈ సంకల్పానికి శ్రీకారం చుట్టినం. వ్యవసాయానికి రైతే రాజు. గ్రామాల్లో రైతుల ఆవేదన నా చెవులారావిన్న. జరగాల్సింది ఇంకా ఎంతో ఉంది. వ్యవసాయం వాణిజ్యం కాదు.. అదొక జీవన విధానం. రైతు సమన్వయ సభ్యుల బాధ్యత చాలా పెద్దది. గ్రామాల సమన్వయ సమితి ఆ గ్రామానికి కథా నాయకులు కావాలి. రైతు పండించేరాశి చుట్టే కుల వృత్తులు ఆధారపడి ఉంటాయి. సభ్యులను దఫదఫాలుగా ఇజ్రాయెల్ పంపిస్తాం. రైతులకు ప్రిపెయిడ్ కార్డులు ఇవ్వాలని నిర్ణయించినం. ప్రిపెయిడ్ కార్డుల్లో ఎప్పటికప్పుడు నగదు క్రెడిట్ అవుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు పూర్తి చేస్తున్నం. కోటి ఎకరాలు ప్రాజెక్టుల ద్వారానే పారే విధంగా అహోరాత్రులు శ్రమిస్తున్నం’’. మాటలమాంత్రికుడనే బిరుదు కెసిఆర్ కు చాలా కాలం క్రితమేఉన్నది.’’వ్యవసాయం ఒక జీవన విధానం‘‘ గా నిర్వచించడం కెసిఆర్ కేసాధ్యమైంది.

ఇక తెలంగాణ కాంగ్రెస్ నాయకులు రెండు లక్షల రూపాయల రుణమాఫీపైనే ఎక్కువ నమ్మకం పెట్టుకున్నారు. పిసిసి అధ్యక్షుడుఉత్తం కుమార్ రెడ్డి ఈ హామీని పదే,పదే చెబుతున్నారు. 2019లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో అధికారంలోకి వస్తే తాము రైతులకు ఒకేసారి రెండు లక్షల రూపాయల రుణాలను మాఫీ చేస్తామని ఆయన చెబుతున్నారు. పక్కనే ఉన్న కర్నాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ పథకాలనుకాపీ కొట్టడం తెలంగాణ కాంగ్రెస్ నాయకులకు మింగుడు పడని పరిస్థితి. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో కల్వకుర్తి,బీమా,నెట్టెం పాడు, కోయిల్ సాగర్ ప్రాజెక్టులు పూర్తి కాకుండా పెండింగులో ఎందుకు ఉన్నవి?కాంగ్రెస్ తెలంగాణ నాయకులు నిజాయితీగా ఇందుకు బాధ్యత వహించగలరా?కల్వకుర్తి90 శాతంపూర్తి చేశామని, మిగతా10 శాతం పూర్తి చేయడం లేదంటూ ప్రకటనలుగుప్పిస్తున్నారు.’’అదేనిజమైతేదాదాపు 4 లక్షల ఎకరాల నిర్దేశిత ఆయకట్టు ఉన్న కల్వకుర్తి నుంచి 2014 వరకు కేవలం 13 వేల ఎకరాలకే సాగునీరు ఎందుకుఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర సమితి ప్రభుత్వం మూడేళ్ళలోనే 1000 కోట్లు ఖర్చు పెట్టి పెండింగ్ పనులు పూర్తి చేసిఉండకపోతే ఈ యాసంగిలోనూ 2 లక్షల ఎకరాలకు సాగునీరేలా ఇస్తాం.’’అని ఇరిగేషన్ మంత్రి హరీష్ రావు సవాలు విసిరారు.హరీష్ రావు ప్రశ్నకు కాంగ్రెస్ పార్టీ తెలంగాణ నాయకుల దగ్గర జవాబు ఉన్నదా? కనుక ప్రజలు గమనిస్తున్నారనే విషయాన్ని రాజకీయపక్షా లు మరచిపోతేవాటి అవివేకానికి ఎవరూ బాధ్యులు కారు.

ఎస్.కె.జకీర్.

సామాజిక న్యాయ ‘యోధుడు’ శివశంకర్



నేడు ప్రథమ వర్ధంతి

మాజీ కేంద్ర మంత్రి, మాజీ గవర్నర్ పుంజాల శివశంకర్ 1929 ఆగస్టు 10వ తేదీన హైదరాబాద్ జిల్లా మామిడిపల్లిలో ఒక పేద కుటుంబంలో జన్మించారు. 11 మంది సంతానంలో శివశంకర్ రెండోవారు. మెట్రిక్యులేషన్ వరకు హైదరాబాద్‌లో చదివి ఆ తర్వాత ఇబ్బందుల కారణంగా తన సోదరునితో కలిసి ఉపాధి వేటలో పంజాబ్ వెళ్ళారు. కొంతకాలం శ్రామికునిగా పనిచేశారు. తానెంతో గౌరవించి, ప్రేమించిన అన్నగారు మరణించినా కుంగి పోకుండా, ఆయన ఆశయాన్ని సాధించేందుకు కష్టాలు పడుతూ ఎల్ఎల్‌బి పూర్తి చేశారు. న్యాయశాస్త్రాన్ని లోతుగా అధ్యయనం చేసి న్యాయకోవిదునిగా, రాజ్యాంగ నిపుణునిగా పేరొందారు. ఆంగ్ల భాషలో మంచి పట్టుగల శివశంకర్ హైదరాబాద్‌లో న్యాయవాదిగా ప్రాక్టీసుని ప్రారంభించి పేదల బడుగు బలహీన వర్గాలకు న్యాయ సహాయం అందించేవారు. సమర్థుడైన న్యాయవాదిగా పేరు తెచ్చుకున్నారు. సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ కార్యదర్శిగా పనిచేశారు. 1956లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడిగా వ్యవహరించారు. 1974నాటికి చిన్న వయసులోనే ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జిస్థాయికి ఎదిగిన ఆయన పేదలకి బడుగు బలహీన వర్గాలకి న్యాయంచేయడం కోసం ఉద్యోగానికి రాజీనామా చేశారు. సమాజం కోసం హైకోర్టు జడ్జి స్థాయి ఉద్యోగాన్ని వదులుకున్నారు. ఇది ఆయనలోని సామాజిక స్పృహకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తుంది. సుప్రీం కోర్టులల్లో న్యాయవాదిగా ప్రాక్టీసు చేస్తూ అన్ని వర్గాలకి సామాజిక న్యాయం కోసం కృషి చేశారు. ప్రతిభావంతుడైన న్యాయవాదిగా ఎదిగిన శివశంకర్ ని మాజీ ప్రధాని ఇందిరాగాంధి ఎమర్జెన్సీ సమయములో తన కేసుల వాదనకు ప్రత్యేక న్యాయవాదిగా నియమించుకున్నారు. ఆ కేసుల్లో ఆయన సమర్థంగా వాదించారు. సికింద్రాబాద్ లోక్‌సభ ఉప ఎన్నికల్లో శివశంకర్ కాంగ్రెస్ తరపున పోటీ చేసి గెలవడం అప్పట్లో రాజకీయ సంచలనం సృష్టించింది. తిరిగి 1980లో అదే స్థానం నుండి గెలిచిన శివశంకర్ ఇందిరాగాంధీ ప్రభుత్వంలో న్యాయశాఖ మంత్రిగా పనిచేశారు. న్యాయవ్యవస్థలో విప్లత్మకమైన మార్పులు తీసుకొచ్చారు. న్యాయమూర్తులను బదిలీ చేయడం వంటి సంకుచిత ధోరణులకు అతీతంగా న్యాయవ్యవస్థ పనిచేస్తుందని ఓ సర్క్యులర్‌లో పేర్కొన్నారు. న్యాయవ్యవస్థలో వారి ఏకస్వామ్యాన్ని బద్దలుకొట్టి వెనుకబడిన తరగతులైన ఓబీసీలు, ఎస్సీ ఎస్టీలు అడ్వకేటు నుండి బెంచ్ స్థాయికి ఎదగాలని అభిలషించారు. . 1998 సాధారణ ఎన్నికలలో, పి. శివశంకర్ ఆంధ్రప్రదేశ్‌లోని తెనాలి నియోజకవర్గం నుండి ఎన్నికలలో పోటీ చేశారు. తెలుగుదేశం అభ్యర్థి, సినీ నటి శారదాపై గెలిచి లోకసభకు ఎన్నికయ్యారు. శివశంకర్ కుటుంబ సభ్యులు కూడా వివిధ రంగాల్లో ప్రతిభావంతులైనప్పటికీ, ఆడంబరం లేకుండా నిగర్వంగా ఉంటారు. శివశంకర్ దీర్ఘ కాలం రాజకీయాల్లో కొనసాగినా, తన కుటుంబానికి విలువలే తప్ప ఆస్తిని ఇవ్వలేకపోయారు. ఆయన చిన్న కుమారుడు పి.సుధీర్ కుమార్ మలక్‌పేట్ నుండి 1994 లో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు . రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షునిగా కూడా పనిచేశారు. అప్పటి రాష్ట్ర రాజకీయాల్లో డైనమిక్ లీడర్ అతను దురదృష్టవశాత్తూ అకాల మరణం చెందారు. ఆయన పెద్దకుమారుడు డాక్టర్ పి. వినయ్ కుమార్ ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్. సామాజిక ఉద్యమ నాయకుడు. శివ శంకర్ పెద్ద కోడలు అలేఖ్య పుంజాల దేశంలోనే సుప్రసిద్ధ కూచిపూడి నృత్యకారిణి. రాష్ట్రపతి అవార్డును కూడా పొందారు. శివశంకర్ అనేక మందిని రాజకీయ ంగా ప్రోత్సహించారు. శివశంకర్ 1994 నుండి 1995 వరకు సిక్కిం రాష్ట్రానికీ, 1995 నుంచి 1996 వరకు కేరళ రాష్ట్రానికీ గవర్నర్‌గా వ్యవహరించారు. 2008లో ఆయన చలన చిత్ర నటుడు చిరంజీవికి అండగా ఉండి ప్రజారాజ్యం పార్టీ ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. ఆగస్టు 2011లో ఆ పార్టీ కాంగ్రెస్ లో విలీనమైంది. కిందటేడాది ఫిబ్రవరి 27న కన్నుమూశారు. గొప్ప దార్శనికత కలిగిన మేధావి పుంజాల శివశంకర్ జీవితాంతం అత్యున్నత విలువలు పాటించారు.

-ఇట్యాల వెంకట కిషన్

నాగభూమిలో ఎన్నికల భూమిక ఎంత?

ఎన్‌పిఎఫ్-కమలకూటమి పోటాపోటీ

నాగాలాండ్‌లోని 60 శాసనసభ స్థానాలకు ఫిబ్రవరి 27న జరుగనున్న ఎన్నికలలో అధికార నాగా పీపుల్స్ ఫ్రంట్ (ఎన్‌పిఎఫ్) కమలనాథులు తమ రాజకీయ ప్రయోజనాలకై కొత్తగా కూర్చిన నేషనల్ డెమోక్రాటిక్ పీపుల్స్ పార్టీ కూటమి హోరాహోరీగా తలపడుతున్నాయి. ఒక దశలో నాగా సమస్యకు ఆమోదయోగ్యమైన రాజకీయ పరిష్కారం కుదిరే వరకు ఎన్నికలలో పాల్గొనబోమని ప్రకటించిన ఎన్‌పిఎఫ్, బిజెపి, కాంగ్రెస్‌లు ఆ తర్వాత ప్లేటు ఫిరాయించి తమ అభ్యర్థులను పోటీలోకి దింపాయి. ఎన్నికలను బహిష్కరిస్తామనే ప్రకటన చేసిన ఇద్దరు నాగా నేతలను బిజెపి అధిష్టానం సస్పెండ్ చేసింది. తామెవరికీ అలాంటి అధికారమివ్వలేదని బిజెపి స్పష్టం చేసింది. ఈశాన్య భారతంలో ఇప్పటికే అస్సాం, మణిపూర్‌లలో సంకీర్ణ ప్రభుత్వాలను ఏర్పాటు చేసిన బిజెపి ఇప్పుడు తాజాగా నాగాలాండ్‌లో రాజకీయ ప్రాబల్య సాధనకు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. సొంతబలం అంతగా లేనందున పార్టీ ఫిరాయింపుల పైనే కమలనాథులు అధికంగా ఆధారపడ్డారు. అందులో భాగంగా బిజెపి యేతర పార్టీల నేతలను, శాసనసభ్యులను ప్రలోభపెట్టి కమలతీర్థ మిచ్చి బరిలో నిలిపారు. అధికార నాగా పీపుల్స్ ఫ్రంట్‌లో అసమ్మతిని రెచ్చగొట్టి లోక్‌సభ సభ్యుడు, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నిఫియు రియో నేతృత్వంలో కొత్తగా నేషనలిస్టు డెమోక్రాటిక్ ప్రోగ్రెసివ్ (ఎన్‌డిపిపి) పార్టీని ఏర్పాటు చేయించి, ఆ పార్టీతో ఎన్నికల పొత్తు పెట్టుకుని బిజెపి 20 అసెంబ్లీ స్థానాలకు పోటీ చేస్తోంది. మిగతా 40 స్థానాలకు ఎన్‌డిపిపి పోటీ చేస్తోంది. ఎన్‌పిఎఫ్ నేత, నాగాలాండ్ ప్రస్తుత ముఖ్యమంత్రి టిఆర్ జెలియాంగ్ బిజెపితో ఎన్నికల పొత్తుకు, నిఫియురిమో అసెంబ్లీకి పోటీ చేయడానికి సమ్మతించనందున బిజెపి - ఎన్‌డిపిపి. వేరు కుంపటి పెట్టాయి. నిఫియురియో ఇప్పటికే కోహిమా ప్రాంతం నుండి ఏకగ్రీవంగా నాగా శాసనసభకు ఎన్నికయ్యారు. రియో లోక్‌సభకు ఎన్నిక కావడానికి ముందు జెలియాంగ్‌ను నాగా సిఎం గా నిలిపారు. ఆ తర్వాత క్రమంగా బలపడి రియో, బిజెపిల మాట ఖాతరు చేయకుండా అన్ని స్థానాలకు ఎన్‌పిఎఫ్ అభ్యర్థులను బరిలోకి దింపారు.

క్రైస్తవులు, వివిధ నాగ జాతుల ప్రాబల్యం అధికంగా ఉన్న నాగభూమిలో ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వంలోని బిజెపితో ఎక్కువగా మమేకమైతే జనాగ్రహానికి గురికావలసి వస్తుందనే భీతితో నాగా పీపుల్స్ ఫ్రంట్ బిజెపికి ఎక్కువ సీట్లివ్వడానికి అంగీకరించలేదు. నాగాలాండ్‌లో రాజకీయ ప్రాబల్యం పెంచుకుని ఈశాన్యంలో బలీయ శక్తిగా ఎదగాలనుకుంటున్న కమలం పార్టీకి ఎన్‌పిఎఫ్ వైఖరి మింగుడు పడక ఇతర పార్టీల వారిని చేర్చుకుని, ఎన్‌డిపిపిని ఏర్పరచి సొంత సత్తా చాటడానికి యత్నిస్తోంది. ప్రధాని నరేంద్రమోడీ, ఇతర కేంద్ర మంత్రులు ఎన్‌డిపిపి - బిజెపి కూటమి తరపున ప్రచార సభల్లో ప్రసంగించారు. నాగాలాండ్‌లో కోల్పోయిన తన పూర్వప్రాభవాన్ని పునరుద్ధరించుకునే ప్రయత్నాలలో భాగంగా కాంగ్రెస్ 23 స్థానాల్లో అభ్యర్థులను నిలిపింది. ఏ పార్టీకి మెజారిటీ రాని పరిస్థితి ఏర్పడితే తదుపరి ముఖ్యమంత్రిని నిర్ణయించడంలో కీలకపాత్ర వహించవచ్చని ఆశిస్తోంది. 2013 శాసనసభ ఎన్నికల్లో ఎన్‌పిఎఫ్-38, కాంగ్రెస్ 8, ఎన్‌సిపి 4, బిజెపి, జెడియు చెరోస్థానం గెలవగా, 8 మంది స్వతంత్రులు గెలిచారు. ప్రస్తుత ఎన్నికల్లో, ఎన్‌పిఎఫ్‌కు - ఎన్‌డిపిపి - బిజెపి కూటమి మధ్య అధికారం కోసం హోరాహోరీ పోరు జరుగుతోంది. అయినా ఎన్‌పిఎఫ్ ఇప్పటికీ కేంద్రంలో బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఏ కూటమిలో, ఈశాన్య ప్రజాస్వామ్య సంఘటనల్లో భాగస్వామిగా కొనసాగుతోంది.

వివిధ నాగాబృందాలు, నాగాలాండ్ బాప్టిస్టు చర్చి మండలి ఏ మతతత్వ పార్టీకి కూటమికి ఓటేయ రాదనీ, అభివృద్ధి, సుపరిపాలన నినాదాల ముసుగులో స్థానిక జాతుల ప్రాబల్యాన్ని కబళించే మోసపూరిత శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని నాగా ఓటర్లకు పిలుపివ్వడం విశేషం. 1998లో సైతం ఎన్నికలు బహిష్కరించాలనే వివిధ నాగా జాతుల మండలి (హోహో) కొన్ని ప్రభుత్వేతర సంస్థలిచ్చిన పిలుపు మేరకు నాగాలాండ్ పీపుల్స్ కౌన్సిల్ (ఎన్‌పిసి) ఎన్నికలను బహిష్కరించగా, కాంగ్రెస్ 53 స్థానాలు గెలిచింది. ఎన్నికల సంఘం ఆ తర్వాత నాగాలాండ్ పీపుల్స్ కౌన్సిల్ గుర్తింపును రద్దుచేసి, ఆ పార్టీ ఎన్నికల చిహ్నాన్నీ స్తంభింప జేసింది. ఆ తర్వాత 2002 అక్టోబర్ 2న కోహిమాలో పార్టీ 9వ జనరల్ కౌన్సిల్ సమావేశంలో



ఎన్‌పిసి తన పేరును నాగా పీపుల్స్ ఫ్రంట్‌గా మార్చుకుని నాగాలాండ్‌లో ఇరుగు పొరుగు రాష్ట్రాల్లో అదే పేరుతో పోటీచేస్తూ వస్తోంది. కేంద్ర ప్రభుత్వం నాగాలిమ్ జాతీయ సోషలిస్టు మండలి (అంజాన్ - మూనివా)లో 1997లో కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకున్నాక నాగా తిరుగుబాటు దార్లతో 80 దఫాలు చర్చించాక నాగా సమస్య పరిష్కార చట్టం ఒప్పందాన్ని కుదుర్చుకుంది. పొరుగుదేశం బర్మా, మణిపూర్, అస్సాం, అరుణాచల్ ప్రదేశ్‌లలోని నాగాలు అధికంగా ఉండే ప్రాంతాలతో స్వయం ప్రతిపత్తిగల విశాల నాగభూమి (నాగాలిమ్)ని ఏర్పాటు చేయాలని ఎన్‌ఎస్‌సిఎన్ (ఐఎం) కోరుతోంది. నాగా పరిష్కార చట్రంలోని ముఖ్యాంశాలేమిటో కేంద్రం గానీ, తిరుగుబాటు వర్గాలు గానీ వెల్లడించడం లేదు. కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక దూత ఆర్.ఎన్. రవి నాగా సోషలిస్టు మండలిలో ఇతర నాగా తిరుగుబాటు దార్లతో, మణిపూర్ తదితర రాష్ట్రా లలోని నాగా వర్గాలతో ఆయుధాల అప్పగింత, పునరావాసం తదితర అంశాలపై వివరంగా చర్చించారు.

నాగాసాయుధ వేర్పాటు వాదులలోని ప్రధానమైన ఎన్‌ఎస్‌సిఎన్ ఖప్లాంగ్ వర్గం ఇప్పటికీ తన వైఖరి మార్చుకోలేదు. దాడులు ఆపలేదు. సాయుధ దళాలతో దండిస్తూనే బర్మాతో దౌత్యమార్గాలు, నాగా వీర బృందాల సహకారంతో ఖప్లాంగ్ వర్గం సాయుధ పోరును విరమించి పరిష్కార చట్రానికి అంగీకరింపజేయడానికి కేంద్ర దూత రవి చేస్తున్న ప్రయత్నాలు ఫలించలేదు. ఒకే దేశం ఒక ప్రజ నినాదమిస్తూ, గొడ్డు మాంసం తినవద్దంటూ తమ ఆహార అలవాట్లను కట్టడి చేయడానికి కమలనాథులు చేస్తున్న ప్రయత్నాలు నాగాలకు నచ్చడంలేదు. అందువల్ల క్రైస్తవ చర్చి కొన్ని తిరుగుబాటు నాగా వర్గాల సహకారంతో గెలుస్తామని నాగా పీపుల్స్ ఫ్రంట్ నమ్మకంతో ఉంది.

ఎన్‌డిపిపి సహకారంతో అధికార కూటమిని ఏర్పరచాలని కమలం తహతహలాడుతోంది. 2013 ఎన్నికల్లో ఎన్‌పిఎఫ్‌కు 47 శాతం, కాంగ్రెస్‌కు దాదాపు 25 శాతం, ఎన్‌సిపికి 6 శాతం ఓట్లు రాగా బిజెపికి కేవలం 1.75 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి. జెడి(యు)కు 1.65 శాతం ఓట్లు రాగా స్వతంత్రులకు దాదాపు 18 శాతం ఓట్లు రావడం గమనార్హం.

అంతర్గత కుమ్ములాటలు, అసమ్మతి కారణంగా గత ఐదేళ్ళలో 2 సార్లు నాగాలాండ్‌లో కొత్త సిఎంలు వచ్చారు. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ తదితర నేతలు నాగాలాండ్‌లో ప్రచారం చేస్తూ బిజెపి, నరేంద్రమోడీ ప్రభుత్వాలు జన విభజన, మతతత్వ విధానాలను అనుసరిస్తున్నాయని, క్రైస్తవులను నిరాదరణ చేస్తున్నాయని, ఆ పార్టీ కూటమికి ఓటేయొద్దని కోరారు. నాగా ప్రజలపై రుద్దిన ఈ ఎన్నికలను ప్రజలు అంగీకరించబోరని, నాగాల చారిత్రక, రాజకీయ హక్కుల కోసం, గౌరవ ప్రదమైన రాజకీయ పరిష్కారం కోసం చట్రం పరిధిలో చర్చలు కొనసాగిస్తామని నాగా సోషలిస్టు కౌన్సిల్ (అంజాన్‌లు మూనివా) స్పష్టం చేసింది. నాగాల విశిష్ట సంస్కృతి చరిత్ర, గుర్తింపు కోసం పోరాటం కొనసాగిస్తామనీ, ఇతరులపై ఆధారపడే ఎన్నికలకన్నా స్వావలంబన సాధన సాధనే లక్ష్యమని స్పష్టం చేసింది.కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి జాతీయ వాద పార్టీ అని చెబుతూ దేశ ప్రయోజనాలు, సమగ్రత పరిరక్షణ ధ్యేయమంటోంది. మణిపూర్, అరుణాచల్ ప్రదేశ్, అస్సాంలలోని నాగాలు అధికంగా ఉండే ప్రాంతాలను నాగాలాండ్‌కు ఇచ్చే విశాల నాగాలాండ్ ఏర్పాటు ప్రతిపాదనలను ఆ రాష్ట్రా లు వ్యతిరేకిస్తున్నాయి. ఒప్పంద చట్రం లోని అంశాలేవో వెల్లడించకుండా దేశ సమైక్యతకు ముప్పు తెచ్చేలా బిజెపి వ్యవహరిస్తోందనే విమర్శలనేపథ్యంలో కేంద్రం దూత సహజంగా కేంద్ర పాలకపార్టీ ప్రయోజనాల పరిరక్షణే లక్ష్యంగా చర్చలు సాగిస్తారనడంలో సందేహం లేదు. నాగాల విశిష్ట సంస్కృతి, మత ఆచార సాంప్రదాయాలు, ఆహార అలవాట్లను అంగీకరిస్తూ, భారత్‌లో గౌరవప్రద పౌరులుగా వివక్షలేని విధంగా జీవించగలరనే విశ్వాసాన్ని కల్పించడం అంత సులువేమీ కాదు. ఈ ఎన్నికల్లో స్పష్టమైన మెజారిటీ వస్తే ఏర్పడే అధికార పార్టీ, కూటమి కేంద్ర ప్రభుత్వంతో కలిసి నాగాల విశ్వాస సాధనకు, ఐక్యతకు కృషిచేస్తే అదే ఉభయతారకం.

-పతకమూరు దామోదర్‌ప్రసాద్
9440990381

మూసివేతకు సిద్ధమైన 11 ఇంజనీరింగ్ కాలేజీలు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: రాష్ట్రంలోని 11 ఇంజనీరింగ్ కాలేజీలు మూసివేతకు దరఖాస్తు చేసుకున్నాయి. ఆయా కాలేజీలు తాము కాలేజీలను కొనసాగించలేము తమ కాలేజీల మూసివేతకు అనుమతి ఇవ్వాలంటూ జెఎన్‌టియుకు దరఖాస్తు చేసుకున్నాయి. అనుబంధ గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకోవడానికి మంగళవారం తుది గడువు. అనుబంధ గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకున్న కాలేజీల్లో 11 కాలేజీలు తాము కాలేజీలను మూసివేస్తామని అందుకు అనుమతించాలని కోరినట్టు తెలిసింది. మూసివేతకు అనుమతి కోరిన కాలేజీల్లో సుమారు 5వేల వరకు సీట్లు ఉన్నాయి. ఇవి కాకుండా మరో 8 ఇంజనీరింగ్ కాలేజీలు తమ కాలేజీలో కొన్ని కోర్సులను కొనసాగించలేమని వాటి క్లోజర్‌కు అనుమతి ఇవ్వాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నాయి. ఇవి సుమారు 1000 వరకు సీట్లు ఉన్నట్టు తెలుస్తోంది. మొత్తంగా వచ్చే ఏడాదిలో 11 ఇంజనీరింగ్ కాలేజీలు మూతపడనుండగా, మరో 8 కాలేజీల్లో 11 కోర్సులు క్లోజర్ కానున్నాయి. ఇవి కాకుండా 3 ఎంసీఏ కాలేజీలు, ఒక ఎంబీఏ కాలేజీలు కూడా మూసివేతకు దరఖాస్తు చేసుకున్నట్టు సమాచారం. రాష్ట్రంలో ఎంటెక్ కోర్సులను 98 ఇంజనీరింగ్ కాలేజీలు అందిస్తున్నాయి. వాటిలో కూడా దాదాపు సగం కాలేజీలు ఇంజనీరింగ్ పీజీ కోర్సును వదులుకునే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. ఏమైనా వచ్చే ఏడాది ఇంజనీరింగ్ సీట్లతోపాటు, ఎంబీఏ, ఎంసీఏ సీట్లు, పీజీ ఇంజనీరింగ్ సీట్లు కూడా తగ్గే అవకాశాలు ఉన్నాయి.

ఏఎంసీ చైర్మన్ల జీతాలు భారీగా పెంపు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ల(ఏఎంసీ) జీతాలను ప్రభుత్వం భారీగా పెంచింది. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు సోమవారం రాష్ట్ర వ్యవసాయ సహకార శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు సెలక్షన్ గ్రేడ్ ఏఎంసీ చైర్మన్ల గౌరవ వేతనం రూ.2వేలు మాత్రమే ఉండగా ఆ మొత్తాన్ని రూ.25వేలకు పెంచేశారు. అలాగే స్పెషల్ గ్రేడ్ ఏఎంసీ చైర్మన్ల గౌరవ వేతనం రూ.1500 నుంచి రూ.20వేలకు, గ్రేడ్-1 ఏఎంసీ చైర్మన్ల గౌరవ వేతనం రూ.1000 నుంచి రూ.15000కు పెంచారు. గ్రేడ్-2, గ్రేడ్-3 కేటగిరీకి చెందిన మార్కెట్ కమిటీ చైర్మన్ల వేతనం రూ.500 మాత్రమే ఉండగా, ఆ మొత్తాన్ని ప్రస్తుతం రూ.15వేలకు పెంచారు. దాదాపు 16 సంవత్సరాల తర్వాత తెలంగాణ ప్రభుత్వం ఏఎంసీ చైర్మన్లకు ఊరట కలిగించే విధంగా వేతనాలు పెంచుతూ నిర్ణయం తీసుకుంది.

భారత్-బంగ్లా బంధం బలీయం

- బంగ్లాదేశ్ హై కమిషనర్ సయ్యద్ మౌజాం అలీ

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : భారత, బంగ్లాదేశ్‌ల మధ్య సుదీర్ఘ కాలం నుంచి సుస్థిర, లోతైన ద్వైపాక్షిక సంబంధాలు ఉన్నాయని బంగ్లాదేశ్ హై కమిషనర్ సయ్యద్ మౌజాం అలీ అన్నారు. అడ్మిన్‌స్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఆస్కి) లో బంగ్లాదేశ్ సివిల్ సర్వెంట్లకు నిర్వహిస్తున్న 10 రోజుల శిక్షణ శిబిరాన్ని ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మౌజాం అలీ మాట్లాడారు. 2015 జూన్‌లో ప్రధాన మంత్రి నరేంద్రమోడీ తమ దేశాన్ని సందర్శించిన సందర్భంగా ఇరు దేశాల మధ్య పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం జరిగిందన్నారు. మోడీ పర్యటన చరిత్రలో నిలిచిపోతుందన్నారు. చర్చలు, సంప్రదింపులు ద్వారా ఎంతటి సమస్యకైనా పరిష్కారం దొరుకుతుందని చెప్పారని గుర్తు చేశారు. 1974 నాటి భూ సరిహద్దు ఒప్పందానికి పరిష్కారం లభించిందని మౌజాం అలీ ప్రశంసించారు. బంగ్లాదేశ్ విదేశీ కార్యదర్శి అలీ మాట్లాడుతూ, భారత, బంగ్లా మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం ఉందన్నారు. ఆస్కి చైర్మన్ , కేంద్ర హోంశాఖ మాజీ కార్యదర్శి , కె పద్మనాభయ్య మాట్లాడుతూ, బంగ్లాదేశ్ సివిల్ సర్వెంట్లకు ఇస్తున్న శిక్షణను గూర్చి వివరించారు.ఈ కార్యక్రమంలో డీన్ ప్రొఫెసర్ నిర్మాల్య బాగ్చి, డాక్టర్ హుమేర అంజుమ్, ప్రొఫెసర్ వల్లి మనిక్కం తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ భవనానికి రూ.5కోట్లు మంజూరు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలోని ముదిరాజ్ కులస్తులకు ముదిరాజ్ భవన్ నిర్మాణం కోసం కోకా పేటలో 5 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అదే స్థలంలో ముదిరాజ్ భవన్ నిర్మాణానికి రూ. 5 కోట్లను మంజూరు చేస్తూ బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బి వెంకటేశం సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

హరీష్ ఆకస్మిక తనిఖీలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: కాళేశ్వరం ప్రాజెక్టు పనులలో మరింత వేగం పెంచడానికి రాష్ట్ర నీటిపారుదల శాఖా మంత్రి హరీష్‌రావు సోమవారం ఆకస్మిక తనిఖీచేశారు. రాష్ట్ర రైతుసమన్వయసమితి సదస్సులో పాల్గొన్న మంత్రి కరీంనగర్ జిల్లాలోని కాళేశ్వరం పనులను పరిశీలించారు. అధికారులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సమాచారం ఇవ్వకుండా హుటాహుటిన ప్యాకేజీ 8కి చేరుకోవడంతో ఒక్కసారిగా అక్కడ పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది అవాక్కయ్యారు. ప్యాకేజీ 8ని సందర్శించి, గ్రావిటీ కెనాల్‌పై నిర్మిస్తున్న పది స్ట్రక్చర్స్ పనులను పరిశీలించారు. పనులు ఇంకా వేగవంతం చేయాలని ఆదేశించారు. కెనాల్ లైనింగ్ త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఏజెన్సీలను ఆదేశించారు.

ఉనికి కోసమే బస్సుయాత్ర



తాండూరు రూరల్, ప్రభన్యూస్ : కాంగ్రెస్ పార్టీ ఉనికి కాపాడుకునేందుకే చేవేళ్ల నుంచి బస్సు యాత్ర ప్రారంభిస్తుందని.. ఏం ముఖం పెట్టుకుని ప్రజల్లోకి వెళతారని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం తాండూ రు మండలంలో జరిగిన పలు అభివృద్ధి కార్య క్రమాల శంకుస్థాపన, ప్రారంభోత్సవాలతో పాటు గొర్రెల పంపిణీ, డ్వాక్రా సంఘాలకు రుణాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మహేందర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నేతలు ఏం ముఖం పెట్టుకుని ప్రజల్లోకి బస్సుయాత్ర ద్వారా చేవేళ్ల నుంచి తాండూరు వెళుతున్నారని ప్రశ్నించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసిఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలు దేశంలోనే ఏముఖ్యమంత్రి చేయని అభివృద్ధి చేసి చూపారని అన్నారు.

కాంగ్రెస్‌కు ఇది అంతిమయాత్రే..



హైదరాబాద్, ఆంధ్రప్రభ: కాంగ్రెస్ నిజస్వరూపం ప్రజలకు అర్థమైందని.. ప్రస్తుతం వారు నిర్వహిస్తున్నది బస్సుయాత్ర కాదని, కాంగ్రెస్ అంతిమయాత్ర అంటూ రాష్ట్ర విద్యుత్‌శాఖా మంత్రి జగదీష్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సోమవారం టిఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో ఎమ్మెల్యేలు కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, పైళ్ల శేఖరరెడ్డి, ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్ధనరెడ్డిలతో కలిసి నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లా డుతూ బస్సు యాత్ర అంటూ పిట్టలదొర వాగ్దానాలు చేస్తున్న కాంగ్రెస్ నేతలను నిలదీయాలన్నారు. కాంగ్రెస్ నాయకులు యాత్ర చేసేది ప్రజల కోసమా.. పదవుల కోసమా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేత జైరాంరమేష్ తెలంగాణ ద్రోహి అన్నారు.

పాలమూరు అభివృద్ధికి కాంగ్రెస్సే అడ్డంకి: వైద్యమంత్రి లక్ష్మారెడ్డి

పాలమూరును వలసలజిల్లాగా మార్చిన ఘనత కాంగ్రెస్‌దేనని, కోర్టు కేసులతో పాలమూరు ప్రాజెక్టులకు అడుగడుగునా అడ్డుతగులుతోందని రాష్ట్ర వైద్ ఆరోగ్యశాఖా మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి మండిపడ్డారు. అబద్ధప్రేలాపనలతో కాంగ్రెస్ నేతలు ప్రజలను అయోమయానికి గురిచేయాలని చూస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారని, మంత్రి హరీష్ అహర్నిశలు కష్టపడి ప్రాజెక్టులు పూర్తిచేస్తున్నారన్నారు.

మార్చి 4నుంచి ఎంసెట్ దరఖాస్తుల స్వీకరణ



- రేపు నోటిఫికేషన్ ● ఏప్రిల్ 4వరకు దరఖాస్తుల స్వీకరణ ● మే 2నుంచి 7 వరకు పరీక్షలు ● ఆన్‌లైన్‌లో పరీక్షలు
- షెడ్యూల్డ్ తెగలకు రూ. 400లు.. ఇతరులకు రూ. 800 పరీక్షా ఫీజు
- ఉన్నత విద్యామండలి చైర్మన్ పాపిరెడ్డి

హైదరాబాద్,ఆంధ్రప్రభ: ఇంజనీరింగ్, అగ్రికల్చర్ బీఎస్సీ, ఫార్మా, బీఎస్సీ ఫారెస్ట్రీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎంసెట్-2018 దరఖాస్తులను మార్చి 4 నుంచి స్వీకరించనున్నారు. రేపు ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ జారీ కానుంది. మే 2 నుంచి 7 వరకు సెషన్ల వారీగా ఎంసెట్-18 పరీక్షలను నిర్వహించనున్నట్టు తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య తుమ్మల పాపిరెడ్డి తెలిపారు. నోటిఫికేషన్‌కు సంబంధించిన షెడ్యూల్ వివరాలను జెఎన్‌టియు వీసీ ప్రొఫెసర్ వేణుగోపాల్ రెడ్డి, ఎంసెట్-18 కన్వీనర్ ప్రొఫెసర్ యాదయ్య, ఈ సెట్-18 కన్వీనర్ ప్రొఫెసర్ గోవర్దన్, పీజీ ఈ సెట్-18 కన్వీనర్ ప్రొఫెసర్ రమేష్‌బాబుతో కలిసి సోమవారం జెఎన్‌టియులో మీడియాకు తెలిపారు. సోమవారం జెఎన్‌టియులో ఎంసెట్, ఈ సెట్, పీజీ ఈసెట్ కమిటీల సమావేశాలు జరిగాయి. అనంతరం ఆయా ప్రవేశ పరీక్షలకు సంబంధించిన వివరాలను మీడియాకు వివరించారు.

ఈ ఏడాది మొదట అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలను ముందుగా నిర్వహిస్తున్నారు. మే 2, 3 తేదిల్లో ఈ పరీక్షలు ఉంటాయి. మే 6న నీట్ పరీక్ష ఉన్నందున ఈ ఏడాది ముందుగానే అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షను నిర్వహిసున్నారు. ఇంజనీరింగ్ పరీక్షలు మే 4, 5, 7 తేదిల్లో నిర్వహించనున్నారు. పరీక్షలను ప్రతి రోజు రెండు సెషన్లలో నిర్వహిస్తారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మధ్యాహ్నం పరీక్ష సాయంత్రం 3 గంటల నుంచి 6 గంటల వరకు నిర్వహిస్తారు. ఈ ఏడాది ఎంసెట్ పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నందున ప్రతి సెషన్‌లో 25వేల మందికి పరీక్షను నిర్వహిస్తారు. సుమారు 30వేల పైచిలుకు ప్రశ్నల నిధిని తయా రు చేయనున్నారు. ఆన్‌లైన్ పరీక్షకావడంతో ఫీజును కూడా పెంచారు.

ఫీజు వివరాలు...

గత ఏడాది ఎస్సీ, ఎస్టీలకు రూ. 250 ఉండగా ఈ ఏడాది రూ. 400కు పెంచారు. గత ఏడాది ఇతరులకు ఫీజు రూ. 500 ఉండగా ఈ ఏడాది రూ. 800 గా నిర్ణయించారు. పరీక్షలను హైదరాబాద్‌లో 5 జోన్లుగా విభజించి నిర్వహిస్తుండగా... కరీంనగర్, ఖమ్మం, నల్గొండ, నిజామాబాద్, వరంగల్ జిల్లాల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఏపిలో 4 నగరాల్లో పరీక్షలను నిర్వహించనున్నారు. తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, కర్నూల్ నగరాల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇంజనీరింగ్‌కు 1.50 లక్షల మంది హాజరవుతారని అంచనా వేస్తున్నట్టు చెప్పారు. అగ్రికల్చర్, ఫార్మసీకి 70వేల కంటే ఎక్కువ మంది హాజరవుతారని ఆశిస్తున్నామన్నారు. ఆన్‌లైన్ పరీక్ష ఉర్దూలో కూడా ఉంటుందని పాపిరెడ్డి తెలిపారు. సీఎం ఆదేశాల మేరకు ఇంజనీరింగ్, అగ్రికల్చర్ ప్రశ్నాపత్రాన్ని ఉర్దూలో కూడా ఇవ్వాలని సూచించిన నేపథ్యంలో ఉర్దూలో కూడా ప్రశ్నలను రూపొందిస్తున్నట్టు చెప్పారు. అయితే తెలుగు, ఉర్దూలకు ప్రామాణికం మాత్రం ఇంగ్లీష్‌లోని ప్రశ్నలేనని స్పష్టం చేశారు.

పరీక్షకు హాజరైన ప్రతి విద్యార్థి తప్పనిసరిగా ఈమెయిల్ ఐడీని ఇవ్వాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. పరీక్ష ముగిసిన తరువాత రెండు రోజుల్లో అంటే 9న విద్యార్థి ఈ మెయిల్‌కు ప్రశ్నాపత్రంతోపాటు సరైన సమాధానం, విద్యార్థి టిక్ చేసిన సమాధానంతో కూడిన రెస్పాండ్ షీట్‌ను పిడిఎఫ్‌లో పంపిస్తామని చెప్పారు. ప్రాథమిక కీపై అభ్యంతరాలను 9 నుంచి 12 వరకు స్వీకరిస్తారు. పరీక్ష ముగిసిన తరువాత వారం నుంచి 10 రోజుల లోపు ఫలితాలను వెల్లడిస్తామని పాపిరెడ్డి, యాదయ్య స్పష్టం చేశారు.

ప్రారంభమైన తనిఖీలు : వీసీ వేణుగోపాల్‌రెడ్డి

వచ్చే ఏడాది రాష్ట్రంలోని ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో ఎటువంటి కొత్త కోర్సులకు అనుమతి ఇవ్వడం లేదని జెఎన్‌టియు వీసీ ఆచార్య వేణుగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇప్పటికే ఉన్న కోర్సులకు అదనపు సీట్లను కూడా అనుమతించడం లేదన్నారు. అనుబంధ గుర్తింపుకు సంబంధించి కాలేజీల యాజమాన్యాలు దరఖాస్తు చేసుకోవడానికి మంగళవారంతో గడువు ముగుస్తుందన్నారు. అనుబంధ గుర్తింపుకు దరఖాస్తు చేసుకున్న కాలేజీల తనిఖీలను సోమవారం నుంచి ప్రారంభించారు. అనుబంధ గుర్తింపు ప్రక్రియను మే మొదటి వారంలోగా పూర్తి చేస్తామని వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా జెఎన్‌టియు పరిధిలోని కాలేజీల్లో 87000 సీట్లకు అనుమతి ఇచ్చినట్టు తెలిపారు. వచ్చే ఏడాది ఏఐసీటీఈ ఏదైనా కాలేజీకి అదనపు సీట్లకు అనుమతి ఇచ్చినా తాము కొనసాగింపును ఇవ్వబోమని స్పష్టం చేశారు. పరీక్షలను హైదరాబాద్‌లో 5 జోన్లుగా విభజించి నిర్వహి స్తుండగా... కరీంనగర్, ఖమ్మం, నల్గొండ, నిజామాబాద్, వరంగల్ జిల్లాల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఏపిలో 4 నగరాల్లో పరీక్షలను నిర్వహించనున్నారు. తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, కర్నూల్ నగరాల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు.ఆబ్జెక్టివ్ టైప్‌లో పరీక్ష ఉంటుంది. 120 ప్రశ్నలు ఉంటాయి. 2 గంటల సమయం ఉంటుంది. ఫలితాలను జూన్ 15న విడుదల చేస్తారు. పరీక్షలో 50 శాతం మార్కులు సాధిస్తే అర్హత సాధిస్తారు. రిజర్వేషన్లు పొందే అభ్యర్థులకు 45 శాతం మార్కులు సాధించాలి. కటాఫ్ మార్కులు 30గా నిర్ణయించారు. ఎస్సీ, ఎస్టీలకు కటాఫ్ వర్తించదు.

నేడు నోటిఫికేషన్‌పై ప్రకటన..రేపు నోటిఫికేషన్ జారీ

- మార్చి 4 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- అపరాధ రుసుం లేకుండా దరఖాస్తుల స్వీకరణకు ఏప్రిల్ 4 తుది గడువు
- దరఖాస్తులో తప్పుల సవరణకు ఏప్రిల్ 6 నుంచి 9 వరకు అవకాశం
- అపరాధ రుసుం రూ. 500 తో ఏప్రిల్ 11 వరకు గడువు
- అపరాధ రుసుం రూ. 1000 తో ఏప్రిల్ 18 వరకు గడువు
- అపరాధ రుసుం రూ. 5000 తో ఏప్రిల్ 24 వరకు గడువు
- అపరాధ రుసుం రూ. 10000 తో ఏప్రిల్ 28 వరకు గడువు
- ఏప్రిల్ 20 నుంచి మే 1 వరకు హాల్‌టికెట్ల డౌన్‌లోడ్
- మే 2, 3 తేదిల్లో అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్ష
- మే 4,5,7 తేదిల్లో ఇంజనీరింగ్ పరీక్ష
- ఉదయం సెషన్... 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు..
- మధ్యాహ్నం సెషన్.. సాయంత్రం 3 గంటల నుంచి 6 గంటల వరకు కొత్త కోర్సులకు అనుమతి లేదు
- అనుబంధ గుర్తింపు ప్రక్రియ మే మొదటి వారంలో పూర్తి
- అనుబంధ గుర్తింపు దరఖాస్తుకు నేడు తుది గడువు

ఈ సెట్-18కు సంబంధించిన షెడ్యూల్ వివరాలు


- మార్చి 2న నోటిఫికేషన్ జారీ
- మార్చి 5 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- అపరాధ రుసుం లేకుండా దరఖాస్తుల స్వీకరణకు ఏప్రిల్ 6 తుది గడువు
- దరఖాస్తులో తప్పుల సవరణకు ఏప్రిల్ 9 నుంచి 16 వరకు అవకాశం
- అపరాధ రుసుం రూ. 500 తో ఏప్రిల్ 13 వరకు గడువు
- అపరాధ రుసుం రూ. 1000 తో ఏప్రిల్ 20 వరకు గడువు
- అపరాధ రుసుం రూ. 5000 తో ఏప్రిల్ 27 వరకు గడువు
- అపరాధ రుసుం రూ. 10000 తో మే 3 వరకు గడువు
- మే 2 నుంచి మే 7 వరకు హాల్‌టికెట్ల డౌన్‌లోడ్
- మే 9న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు పరీక్ష

ఫీజు వివరాలు...

- ఎస్సీ, ఎస్టీలకు రూ. 400 ఇతరులకు రూ. 800 గా నిర్ణయించారు.
- పీజీ ఈసెట్-18కు సంబంధించిన షెడ్యూల్ వివరాలు...
- మార్చి 12న నోటిఫికేషన్ జారీ
- మార్చి 15 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- అపరాధ రుసుం లేకుండా దరఖాస్తుల స్వీకరణకు మే 1 తుది గడువు
- అపరాధ రుసుం రూ. 500 తో మే 7 వరకు గడువు
- అపరాధ రుసుం రూ. 2000 తో మే 14 వరకు గడువు
- అపరాధ రుసుం రూ. 5000 తో మే 21 వరకు గడువు
- అపరాధ రుసుం రూ. 10000 తో మే 26 వరకు గడువు
- మే 22 నుంచి మే 27 వరకు హాల్‌టికెట్ల డౌన్‌లోడ్
- మే 28 నుంచి 31 వరకు పరీక్షలు
- ఉదయం సెషన్... 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు..
- మధ్యాహ్నం సెషన్.. సాయంత్రం 2 గంటల నుంచి 4 గంటల వరకు
- హైదరాబాద్, వరంగల్‌లో పరీక్షా కేంద్రాలు... ఆన్‌లైన్‌లోనే పరీక్షలు
- పరీక్ష ఫీజు ఎస్సీ, ఎస్టీలకు రూ. 500 ఇతరులకు రూ. 1000

అర్హులందరికీ ఆహార భద్రత

- కేంద్రమంత్రి సిహెచ్ చౌదరి




హై దరాబాద్, ఆంధ్రప్రభ : అర్హులైన పేదలందరికి జాతీయ ఆహార భద్రత పథకం కింద రేషన్ బియ్యం అందిస్తున్నామని కేంద్ర మంత్రి సిహెచ్. చౌదరి స్పష్టం చేశారు. ఇందుకోసం అనేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సోమవారం నాంపల్లిలోని భాజపా రాష్ట్ర కార్యాలయానికి వచ్చిన సందర్భంగా ఆయన మీడియాతో కొద్దిసేపు మాట్లాడారు. రేషన్ షాపుల ద్వారా సరఫరా చేస్తున్న బియ్యం పక్కదారి పట్టకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీని కోసం అనేక సంస్కరణలను తీసుకవచ్చామన్నారు. దేశంలో రెండు బై మూడవ వంతు ప్రజలు సబ్సిడీ బియ్యాన్ని తీసుకుంటున్నారన్నారు. రెండు రూపాయలు, మూడు రూపాయల (తెల్ల, పింక్ కార్డులపై) కిలో బియ్యం చొప్పున నాణ్యమైన బియ్యాన్ని అందిస్తున్నామన్నారు. రెండు రూపాయలకు అందిస్తున్న బియ్యం.... బయటమార్కెట్లో అదే నాణ్యత బియ్యం 20 రూపాయల చొప్పున ధర పలుకుతోందన్నారు. దీనిని బట్టి కేంద్రం ఎలాంటి బియ్యం పేదలకు అందిస్తున్నదో అర్థం చేసుకోవాల్నారు. పేదవాడికి కడుపునిండా తిండి లభించాలన్నదే ప్రధాని నరేంద్రమోదీ లక్ష్యమన్నారు. అందుకే మధ్య దళారుల సమస్య లేకుండా ఈ-పాస్, బయోమెట్రిక్ విధానాలను ప్రవేశ పెట్టామన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రా ల్లో ఈ విధానాన్ని పూర్తిగా అవలు చేస్తున్నాయని తెలిపారు. ఇలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం వల్ల బియ్యం పక్కదారి పట్టకుండా పూర్తిగా నియంత్రించగలుగుతున్నామన్నారు.

కాంగ్రెస్ క్షమాపణలు చెప్పాలి: నిరంజన్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: పాలమూరు ప్రాజెక్టులపై కేసులువేసి పనుల జాప్యానికి కారణమైన కాంగ్రెస్ పార్టీ బస్సుయాత్ర సందర్భంగా ప్రజలకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని రాష్ట్ర ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణభవన్‌లో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు ప్రాజెక్టులకు అడ్డుపడి కేసులు వేసిన ఫలితంగా ఏడాదిన్నర కాలం పనుల్లో జాప్యం జరిగిందన్నారు. తప్పులు చేసి ఏం చెప్పడానికి ప్రజల్లోకి వెళ్తున్నారని ప్రశ్నించారు.

రికార్డులు సరిచేయలేదంటూ ... రైతు ఆత్మహత్యాయత్నం



వరంగల్, ప్రభన్యూస్ బ్యూరో :వారసత్వంగా తనకువస్తున్న భూములను భూ ప్రక్షాళనలో భాగంగా రికార్డుల్లో సరిచేయడంలేదంటూ ఆవేదన చెందిన ఓ రైతు ఆత్మ హత్యాయత్నానికి యత్నించారు. వరంగల్ రూరల్ జిల్లా, శాయంపేట మండల కేంద్రంలో సోమవారం ఈ సంఘటన చోటుచేసుకున్నది. కొత్తగట్టు సింగారం గ్రామానికి చెందిన కర్ర ఆదిరెడ్డి అనే రైతు తనకు వారసత్వంగా వచ్చిన భూమిని రికార్డుల్లో సరిచేయాలని ఆరు మాసాలుగా అధికారులు చుట్టు తిరుగుతున్నా... పట్టించుకోకపోవడంతో ఆత్మహత్య చేసుకోవడమే శరణ్యంగా భావించి సోమవారం శాయంపేట తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. అప్పటికే కార్యాలయానికి వచ్చిన రూరల్ ఆర్డీఓ మహేందర్‌జీ సమక్షంలో తన ఆవేదనను వెలుబుచ్చి పురుగుల మందును తాగేందుకు ప్రయత్నించగా, ఆర్డీఓ అడ్డుకున్నారు.

ప్రత్యేక హోదా సరే..తెలంగాణ సంగతేంటి?

- జైరాం రమేష్‌పై మంత్రి హరీష్‌రావు ఫైర్



సిద్దిపేట, ప్రభన్యూస్ : వెనుకబడ్డ రాష్ట్రాలను అభివృద్ధి పర్చాల్సిన జాతీయ పార్టీలు 60 యేండ్లుగా కాంగ్రెస్ పార్టీ ఏదో రకంగా తెలంగాణకు అన్యాయం చేస్తుంటే తలుపులు దగ్గర పెట్టి విభజన బిల్లు పెట్టారని మోడీ మాట్లాడటం తెలంగాణ పట్ల బీజేపీ, కాంగ్రెస్‌లు ఒకేలా వ్యవహరిస్తున్నాయని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు మండిపడ్డారు. సోమవారం తన నివాసంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎంపీ గుత్త సుఖేంధర్‌రెడ్డి, బీబీ పాటిల్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తొలి సంతకం ప్రత్యేక హోదా కల్పించే అంశంపై చేస్తామని కాంగ్రెస్ పార్టీ నాయకులు జయరాం రమేష్ మాట్లాడటం పట్ల తెలంగాణ పై మీ వైఖరి ఏమిటని ప్రశ్నించారు. తెలంగాణకు అన్ని రకాల అన్యాయం జరుగడం వల్లనే ప్రజలు ప్రత్యేక రాష్ట్రాన్ని కోరుకున్నారన్నారు. రెండు జాతీయ పార్టీలు తెలంగాణ ప్రజల ప్రయోజనాలకు విరుద్ధంగా పని చేస్తున్నాయని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కల్పిస్తే తమకు అభ్యంతరం లేదని వెనుకబడ్డ తమ తెలంగాణ పట్ల కాంగ్రెస్ నాయకుల వైఖరి ఏమిటో తేల్చాలన్నారు. తెలంగాణ రాష్ట్రం ప్రాజెక్టల విషయంలో తీవ్రంగా నష్టపో యింద న్నారు. పోలవరానికి జాతీయ హోదాను ఇచ్చిన కాంగ్రెస్ ప్రాణహిత-చేవెళ్లకు మొండి చేయి చూపిం దన్నారు. ప్రాణహిత - చేవెళ్లకు జాతీయ హోదాను ఇచ్చి ఉంటే తెలంగాణ ప్రభుత్వానికి ఈ రోజు అప్పులు చేసే దుస్థితి పట్టేది కాదన్నారు. ఏ మొఖం పెట్టుకొని తెలంగాణ కాంగ్రెస్ నాయకులు నేడు బస్సు యాత్ర చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ కాంగ్రెస్ నాయకులు జైరాం రమేష్ వ్యాఖ్యలపై స్పష్టత ఇచ్చిన తర్వాతనే బస్సు యాత్రను మొదలు పెట్టాలని డిమాం డ్ చేశారు. జైరాం రమేష్ వ్యాఖ్యలను సమర్ధిస్తారా లేక వ్యతిరేకిస్తారా స్పష్టం చేయాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు ప్రాణహిత - చేవెళ్ల పేరు చెపుతూ పది సంవత్సరాల నుంచి మహారాష్ట్ర నుంచి అనుమతి తేవ డంలో కాంగ్రెస్ నాయకులు తెలంగాణ అన్యాయం చేశారన్నారు. వెనుకబడ్డ తెలంగాణకు నిధులు, ప్రాజెక్టులు ఇవ్వకుండా అభి వృద్ధి చెందిన రాష్ట్రాలకు ప్రాధా న్యతను ఇస్తున్నారని మంత్రి మండిపడ్డారు. జాతీయ పార్టీలకు తెలం గాణలో ఓట్లు, సీట్లు కావాలి కాని అభివృద్ధి పట్ల మా త్రం ధ్యాస లేద న్నారు. చేవెళ్ల నుంచి బస్సు యాత్ర చేస్తున్న కాంగ్రెస్ నాయకులు చేవెళ్లకు చేసిందేంటో చెప్పాల న్నారు. చేవెళ్లకు ఒక్క డిగ్రీ కళాశాల కూడా లేకుండా తీవ్ర అన్యాయం చేసిందని తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత చేవెళ్ల ప్రాంతాన్ని ఎంతో అభివృద్ధి చేశామన్నారు.

22లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాములు

రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రతిమండలానికి మార్కెటింగ్ గోదాములు, సబ్‌యార్డులు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, 22లక్షల టన్నుల సామర్థ్యంతో గోదాములు నిర్మిస్తున్నామని రాష్ట్ర మార్కెటింగ్ శాఖా మంత్రి హరీష్‌రావు తెలిపారు. సోమవారం రైతుసమన్వయసమితుల అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన తర్వాత రూ.వేయికోట్లతో దేశంలో ఏ రాష్ట్రంలో జరగని విధంగా 18లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాముల నిర్మాణం పూర్తయిందన్నారు. ప్రస్తుతం 22లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాములు రాష్ట్రంలో ఉన్నాయన్నారు.

2018-19 బల్దియా వార్షిక బడ్జెట్

బల్దియాకు రూ. 6లక్షల కోట్లు!

- మూడు కార్పొరేషన్లకు రూ. 7,073.14 కోట్లు
- ఒక బడ్జెట్..నాలుగు పద్దులు
- పనుల్లో పారదర్శకత లక్ష్యం ● కౌన్సిల్ ఆమోదం

హైదరాబాద్, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ 2018-19 వార్షిక ఆర్థిక సంవత్సరం బడ్జెట్ రూ.6,076.86 కోట్లుగా బల్దియా సర్వసభ్య సమావేశం ఆమోదించింది. మూసీ రివర్ ఫ్రంట్ డిపార్ట్‌మెంట్ కార్పొరేషన్, హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, హౌసింగ్ కార్పొరేషన్‌కు కలిపి రూ.7,073.14 కోట్లకు ఆమోదించారు. బల్దియాతో పాటు మూడు కార్పొరేషన్లకు కలిపి రూ.13,150 కోట్లకు చేసిన అంచనాలను ఆమోదిస్తూ బల్దియా సర్వసభ్య సమావేశం తీర్మాణించింది.

ఈ మేరకు సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో మేయర్ డా.బొంతు రామ్మోహన్ అధ్యక్షతన 2018-19 బడ్జెట్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్లు, ఎక్స్‌అఫీషియో సభ్యులు 2018-19 వార్షిక బడ్జెట్‌ను ఆమోదించారు.

బడ్జెట్ మొత్తంలో రూ.3,325 కోట్లు(29 శాతం) రెవెన్యూ ఆదాయం.. క్యాపిటల్ రిసిప్ట్ బల్దియా బడ్జెట్ నుంచి రూ.3,401.86 కోట్లు(25.87శాతం), మూడు కార్పొరేషన్ల నిధుల ద్వారా క్యాపిటల్ వ్యయం రూ.7,077.14 కోట్లు(53.79 శాతం)గా పేర్కొన్నారు. మూసీ పరీవాహక ప్రాంత అభివృద్ధి కార్పొరేషన్, హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, హౌసింగ్ కార్పొరేషన్లకు బల్దియాకి గ్రాంట్‌గా అత్యధికంగా రూ.7,073.14 కోట్లు లభించనున్నాయి.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణంలో భాగంగా హౌసింగ్ కార్పొరేషన్‌కు రూ.6,317.64 కోట్లు, హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు రూ.377.75 కోట్లు, మూసీ నది సుందరీకరణకు రూ.377.75 కోట్లు కేటాయించారు. రెవెన్యూ రిసిప్ట్‌లలో రూ.1,725.20 కోట్లు(51.89 శాతం) పన్నుల ద్వారా లభించనున్నాయి. రూ.1,033.17(31.07శాతం) ఫీజులు, యూజర్ చార్జీల ద్వారా లభించనుంది. రెవెన్యూ వ్యయంలో అత్యధికంగా పరిపాలన సంబంధిత వ్యయం రూ.1,488.79కోట్లు(55.66శాతం), ఆపరేషన్ మెయింటెనెన్స్‌కు రూ.1,043.90కోట్లు(39.02శాతం)గా నిర్ణయించారు.

Andhraprabha business 2018
బిజినెస్

శాంతా బయోటెక్ కలరా వ్యాక్సిన్‌కు
డబ్ల్యుహెచ్ఓ ఆమోదం


హైదరాబాద్ : ప్రపంచంలోని అతి పెద్ద ఫార్మా కంపెనీ సనోఫీ గ్రూపు అనుబంధ సంస్థ శాంతాబయోటెక్స్, ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఓ) ఓరల్ కలరా వెక్సిన్ షాన్‌కోల్ ను ఆమోదం తెలిపిందని శాంతాబయోటెక్ సోమవారం నాడు ఒక ప్రకటనలో వెల్లడించింది. అయితే గతంలో ఈ వాక్సిన్‌ను రవాణా చేయాలంటే ఫ్లస్ రెండు నీ ఉంచి ఫ్లస్ 8 సెంటిగ్రేడ్ వద్ద నిల్వ ఉంచాల్సిన పరిస్థితి ఉండేది. ప్రస్తుతం పాత పద్ధతికి బదులు ఈ వాక్సిన్‌ను 14 రోజుల పాటు 40 డిగ్రీల సెంటిగ్రేడ్ లో నిల్వలు ఉంచి వినియోగించుకునేందుకు డబ్ల్యుహెచ్ఓ అనుమతి చిందని శాంతా బయోటెక్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ మహేశ్ బాల్‌ఘాట్ ఒక ప్రకటనలో తెలిపారు. మేనేజింగ్ డైరెక్టర్ ఎస్ రాజారాం మాట్లాడుతూ.. స్టోరేజీ లెబిలిటో మార్పులు చేర్పులు అనుమతించినందుకు ఇక నుంచి కలరా బారిన పడి ఎవరూ మృతి చెందడానికి వీలుండదని ఆశాభావ వ్యక్తం చేశారు. ఈ వెక్సిన్‌లు భారత్‌తో పాటు ప్రపంచంలోని పలు దేశాల్లో చాలా చాలా అవసరమని అన్నారు. 2011లో డబ్ల్యుహెచ్ఓనుంచి తమకు అనుమతి లభించింది. ఇప్పటివరకు షాన్‌కోల్ వెక్సిన్‌ను ప్రపంచంలోని 25 దేశాలకు 12 మిలియన్ డోస్‌లను ఎగుమతి చేశామని ఆయన చెప్పారు. ముఖ్యంగా దక్షిణ సుడాన్, మొజాంబిక్, రిపబ్లిక్ నేకాం గోలుస్‌నయని చెప్పారు.

SHANTHA BIOTECHNICS

నీరవ్ విదేశీ ఆస్తులపై ఈడీ దృష్టి

• ప్రత్యేక కోర్టు లెటర్స్ ఆఫ్ రెగొరెటరీ జారీ




నీరవ్ మోడీ

ముంబై : పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ)ని నిలువునా రూ.11,400కోట్లు ముంచిన వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ విదేశాల్లోని ఆస్తులను గుర్తించడానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సిద్ధమైంది. అదు కోసం విదేశాల్లో నీరవ్‌మోడీకి చెందిన ఆస్తులను గుర్తించడానికి ముంబైలోని ప్రత్యేక కోర్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు లెటర్స్ ఆఫ్ రొగేటరీ (ఎల్ఆర్)ను జారీ చేసింది. దీంతో నీరవ్‌మోడీకి చెందిన దేశాల్లోని ఆస్తులను గుర్తించడంతో పాటు వాటిని జప్తు చేసుకొనే అధికారం ఈడీకి లభిస్తుంది.ఇదిలా ఉండగా పీఎన్‌బీలో రూ.11,400 కోట్ల మోసం కేసు విచారణలో భాగంగా వజ్రాల వ్యాపారి నీరవ్‌మోడీకి చెందిన విదేశాల్లోని వ్యాపారాలపై దర్యాప్తు చేయడానికి అనుమతి ఇవ్వాలని ప్రత్యేక కోర్టును ఈడీ ఆశ్రయించింది.

దీనికి ఈడీ అనుమతికూడా మంజూరు చేసింది. ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ చట్టం (పీఎంఎల్ఏ)కింది లెటర్ ఆఫ్ రొగేట్ (ఎల్ఆర్)ను కోర్టు జారీ చేసింది. దీంతో నీరవ్‌కు చెందిన విదేశాల్లోని వ్యాపా రాలు హాంగ్‌కాంగ్, యూఎస్ఏ, యూకే, యూఏఈ, స్విట్జర్లాండ్, సింగపూర్‌లోని వ్యాపారాల నుంచి ఈడీ రికార్డులను స్వాధీనం చేసుకుంటారు వీటిని కోర్టులో సాక్ష్యంగా చూపిస్తారు. లెటర్స్ రొగేటరీ ఒక సావరిన్ దేశం మరో సావరిన్ దేశం విజ్ఞప్తి మేరకు మంజూరు చేస్తుంటాయి. ఈడీ తరఫున ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ హితేన్ వెనెగావ్‌కర్ వాదన విన్న తర్వాత జడ్జి ఎంఎస్ ఆజ్మీ ఈ ఆర్డర్ జారీ చేశారు. నీరవ్ మోడీకి డైమండ్ ఆర్ యుఎస్, సోలార్ ఎక్స్‌పోర్ట్స్, స్టెల్లార్ డైమండ్, ఫైర్‌స్టార్ డైమండ్ కంపెనీలున్నాయని ఈడీ కోర్టుకు తెలిపింది. ఆయన మరుతక వజ్రాలను దిగుమతి చేసుకొని వాటిని సాన పట్టి నగలకు డిజైన్ చేసే వ్యాపారం వివరించింది. నీరవ్‌మోడీ పేరుతో పాటు సొంతబ్రాండ్‌తో వ్యాపారాలు చేస్తున్నాడని తెలిపింది. ఆయన తన వ్యాపారాన్ని హంగ్‌కాంగ్, అమెరికా, బ్రిటన్, యూఏఈ, దక్షిణాఫ్రికా, సింగపూర్‌కు విస్తరించారని పేర్కొంది.

పంజాబ్ నేషనల్ బ్యాంకు నుంచి మోసపూరితంగా హైవాల్యూ ఎల్ఓయులు చేజిక్కించుకున్నారని వివరించింది. తర్వాతచూస్తే పీఎన్‌బీ మోడీకి ఎల్ఓయులు జారీ చేసినట్లు రికార్డులు లేవని తేలిం దని కోర్టు వివరించింది.బ్యాంకును మోడీ, చోక్సీలు కలిసి సుమారు రూ.6,498 కోట్లు మోసం చేశా రని.. ఈ డబ్బును మనీలాండరింగ్ చేశా రని కోర్టుకు సమాచా రం అం దించారు. ఇదిలా ఉండగా జన వరి 31న సీబీఐ నీరవ్‌మోడీకి వ్య తిరే కంగా ఎఫ్ఐఆర్ రిజిష్టర్ చేసింద ని, అటు తర్వాత వజ్రాల వ్యాపారి మె హుల్ చోక్సీపై కూ డా ఈడీ దర్యాప్తు మొదలుపెట్టిందని తెలిపింది.నీరవ్‌మోడీకి చెందిన ఫైర్‌స్టార్ డైమండ్ ప్రెసిడెంట్ (ఫైనాన్స్) విపుల్ అంబానీకి సీబీఐ అరెస్టు చేసింది. కవితా మానికర్ ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్ మోడీకి చెందిన మూడు కంపెనీలకు అథరైజ్డ్ సిగ్నేటరీ (అధీకృత సంతకం దారు), అర్జున్ పాటిల్, సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఫైర్‌స్టార్ గ్రూపు, రాజేశ్ జిందాల్ పీఎన్‌బీ బ్రాడీ హౌస్ బ్రాంచీ చీఫ్‌ను కూడా అరెస్టు చేశారు. పీఎన్‌బీకి చెందిన ఫారెక్స్ డిపార్ట్‌మెంట్ చీఫ్ మేనేజర్ బచ్చు తివారీ, స్కేల్ 2 మేనేజర్ యశ్వంత్‌జోషి, స్కేల్ -1 ఆఫీసర్ ప్రఫుల్‌సావంత్, గోకుల్‌నాథ్ శెట్టి (రిటైర్డ్ డిప్యూటీ మేనేజర్), మనోజ్ ఖారత్ సింగిల్ విండో ఆపరేటర్‌తో పాటు నీరవ్‌మోడీకి చెందిన కంపెనీల అథరైజ్డ్ సిగ్నెటరీ హేమంత్ భట్‌లు అరెస్టు అయిన వారిలో ఉన్నారు.

చోక్సీకంపెనీ విషయానికి వస్తే నక్షత్ర గ్రూపు, గీతాంజలి గ్రూపు సీఎఫ్ఓ కపిల్ ఖండేల్‌వాల్, గీతాంజలి గ్రూపు మేనేజర్ నితిన్ షాహిలున్నారు. ఇదిలా ఉండగా శెట్టి, ఖారత్‌లకలిసి మొత్తం 150 ఎల్ఓయులు రూ.6,498 కోట్లు విలువ చేసే నీరవ్ మోడీకి జారీ చేయగా మరో 150 మోస పూరిత ఎల్ఓయులు వాటి విలువ రూ.4886 కోట్లు గీతాంజలి గ్రూపు ఆఫ్ కంపెనీ జారీ చేసినట్లు ఎఫ్ఐఆర్‌లో నమోదు చేశారు. ఈ డబ్బు చోక్సీకి చెందిన గీతాంజలి జెమ్స్, నక్షత్ర బ్రాండ్స్, గిలికి బదలీ చేశారు.



మెహుల్ చోక్సీ

నీరవ్‌మోడీ వలలో చిక్కుకున్నాం
పంజాబ్‌నేషనల్ బ్యాంకు

ప్రభుత్వరంగానికి చెందిన అతి పెద్ద బ్యాంకులో రెండో దైన పంజాబ్ నేషనల్ బ్యాంకులో సుమారు 11,400 కోట్ల స్కాం బయటపడ్డతో దేశ ప్రజలంతా దిగ్భ్రాంతికి గురయ్యారు. ముంబైలోని ఒక బ్రాంచీలో ఈ కుంభకోణం జరిగింది. ఇప్పటికే ప్రభుత్వరంగానికి చెందిన బ్యాంకులు రూ.14,700 కోట్ల డాలర్లు లేదా సుమారు రూ.10 లక్షల కోట్ల మొండిబకాయిలతో సతమతమవుతున్నాయి. దీని ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థపై కనిపిస్తోంది. కాగా పీఎన్‌బీకి చెందిన ముంబై బ్రాంచీ బ్రాడీ హౌస్ బ్రాంచికి చెందిన ఇద్దరు జూనియర్ ఉద్యోగులు ఈ మోసానికి పాల్పడ్డారని పేర్కొంది. ఈ ఇద్దరు ఉద్యోగులు నీరవ్‌మోడీ, చోక్సీలతో కుమ్మక్కయి మోసపూరితంగా లెటర్ ఆఫ్ అండర్‌స్టాండింగ్ లేదా బ్యాంకు గ్యారంటీలు ఇచ్చారని. వారి నుంచి సెక్యూరిటీ లేదా మార్జిన్ మనీ తీసుకోకుండా ఉదారంగా ఎల్ఓయులు జారీ చేశారని, ఈ రెండు కంపె నీలకు బ్యాంకు ఎలాంటి క్రెడిట్ లేదా రుణం ఇచ్చే ప్రతిపాదన ఏదీ బ్యాంకు వద్ద లేదని స్పష్టం చేసింది. పీఎన్‌బీ జారీ చేసిన ఎల్ఓయులు తీసుకొని ఈ రెండు కంపెనీలు విదేశాల్లో భారతీయ బ్యాంకుల నుంచి మోసపూరితంగా రుణాలు తీసుకున్నాయని పీఎన్‌బీ పేర్కొంది. అయితే జనవరి 16వ తేదీన నిందితులకు చెందిన కంపెనీ ప్రతినిధులు ముంబై బ్రాంచికి వచ్చి దిగుమతి డాక్యుమెంట్లు చూపించి విదేశాలకు నగదు ఎగుమతి చేయడానికి రుణం కావాలని కోరారు. అయితే ఈ కంపెనీలతో బ్యాంకుకు ముం దస్తు రుణం ఇచ్చే ప్రతి పాదన ఏదీ లేదని బ్యాంకు అధికా రులు కంపెనీని ప్రతిని ధులకు తెలియజేశారు. అయినా ఎల్ఓయు జారీ చేయాలంటే దానికి తగ్గట్టు పూర్తి ఎల్ఓ యు విలు వ తగ్గట్టు చెల్లించాలని కోరారు. దీనికి కంపెనీ ప్రతినిధులు బ్యాంకు అధికారులతో వాగ్వాదానికి దిగారు. గతంలో ఇలాంటి సదుపాయం ఇచ్చారని ఇప్పుడు దుకు ఇవ్వడం లేదని వాదించారు. దీంతో బ్యాంకు అధికారులు గతంలో జరిగిన లావాదేవీలపై రికార్డులను చూస్తే ఎక్కడ లావాదేవీలు జరిగినట్లు అధికారులు దృష్టికి రాలేదు. అటు తర్వాత జూనియర్ ఉద్యోగులు స్విఫ్ట్ ఇంటర్నెట్ మేనేజింగ్ సిస్టమ్ ద్వారా ఎల్ఓయులను జారీ చేసినట్లు అధికారుల దృష్టికి వచ్చింది. ఈ తంతు గత కొన్ని సంవత్సరాల పాటు కొనసాగిందని విచారణలో తేలిందని పీఎన్‌బీ ఒక ప్రకటనలో పేర్కొంది.

9,500 ఎన్‌బీఎఫ్‌సీలతో
తస్మాత్ జాగ్రత్త


• కంపెనీల పేర్లను ప్రకటించిన ప్రభుత్వం

న్యూఢిల్లీ : దేశంలోని సుమారు 9,500 నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలతో జర భద్రం అని ప్రజలను ప్రభుత్వం హెచ్చరించింది. ఈ ఎన్‌బీఎఫ్‌సీ కంపెనీలు యాంటీ మనీలాండరింగ్‌బట్టలను పాటించడం లేదని రిస్కులో కూడుకున్నవని పేర్కొంది. ఆర్థికమంత్రిత్వశాఖ పరిధిలో పనిచేసే ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ యూనిట్ (ఎఫ్ఐయు) మొత్తం 9,491 హై రిస్కు ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్ జాబితాను విడుదల చేసింది. ఈ కంపెనీలు ఎలాంటి నేరాలకు పాల్పడుతోంది గమనించి ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలకు సమాచారం అందించింది. ఈ ఏడాది జనవరి చివరకు వారి ఇలాంటి కంపెనీల జాబితాను అప్‌డేట్ చేసింది. ఇలాగ ఉండగా ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ యాక్ట్ (పీఎంఎల్ఏ). ఎన్‌బీఎఫ్‌సీలు వీటితో పాటు కోఆపరేటివ్ బ్యాంకులు తమ ఆర్థిక లావాదేవీల గురించి ఎఫ్ఐయుకు సమాచారం అందించాల్సి ఉంటుంది. కాగా ఎన్‌బీఎఫ్‌సీలు అందించిన సమాచారాన్ని అధ్యయనం చేయడానికి ఒక అధికారిని ఎఫ్ఐయు నియమించింది. ఈ కంపెనీలుసుమారు రూ.10 లక్షలు అంతకంటే ఎక్కువ విలువ గల అనుమానిత లావాదేవీలను నిర్వహించినట్లు ఏజెన్సీలు గుర్తించినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ప్రభుత్వం నవంబర్ 2016లో పెద్దనోట్లను రద్దు చేసిన తర్వాత ఎఫ్ఐయు ఎన్‌బీ ఎఫ్‌సీల లావాదేవీలపై నిఘా పెట్టి ది. ముందుగా ఇలాంటి కంపెనీల పేర్లను ప్రకటించి ప్రజలను అప్రమత్తం చేయాలని నిర్ణయించినట్లు సీనియర్ అధికారులు తెలియజేశారు. కంపెనీ చట్టం కింది ఎన్‌బీఎఫ్‌సీ కంపెనీలో లోన్స్, అడ్వాన్స్‌లు, షేర్ల టేకోవర్, స్టాక్స్, బాండ్స్, డిబెంచర్, ప్రభుత్వం విడుదల చేసే సెక్యూరిటీల లావాదేవీలను నిర్వహించుకోవచ్చు.



వడ్డీరేట్లు పెరిగే అవకాశం

• యూబీఎస్ అంచనా



న్యూఢిల్లీ : రిటైల్ ద్రవ్యోల్బణం క్రమంగా పుంజుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయినా ఆర్‌బీఐ ఈ ఆర్థికసంవత్సరం వడ్డీరేట్లను యథాతథంగా కొనసాగించడానికి అవకాశాలున్నాయి. పరిస్థితులు చేయిలు దాటిపోతే ఆర్‌బీఐ వడ్డీరేట్లు పెంచడానికి మొగ్గుచూపవచ్చునని యూబీఎస్ తాజా నివేదికలో పేర్కొంది. ఫిబ్రవరి 7వ తేదీన జరిగిన ద్రవ్యపరపతి సమీక్షలో ద్రవ్యోల్బణం పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయని అంచనా వేసింది. అయినా వడ్డీరేట్లను ఆరు శాతానికి యధావిధిగా కొనసాగించడానికి నిర్ణయించింది. ఆర్‌బీఐ మినిట్స్ ప్రకారం చూస్తే ద్రవ్యోల్బణం రిస్కు కనిపిస్తోంది. ద్రవ్యలోటుతో పాటు రైతులకు కనీస మద్దతు ప్రకటించడం లాంటి అంశాలు ద్రవ్యోల్బణం పెరిగే అవకాశాలున్నాయని యూబీఎస్ పరిశోధన పత్రంలో వివరించింది. యూబీఎస్ అంచనా ప్రకారం రిటైల్ ద్రవ్యోల్బణం 5.1 శాతం నుంచి 5.6 శాతం మధ్యలో తచ్చాడవచ్చునని, సంవత్సరం ప్రాతిపదికన చూస్తే 2018-19లో సగటున 4.9 శాతానికి పరిమితం కావచ్చునని తెలిపింది. ఒక వేళ ద్రవ్యోల్బణం పెరిగితే మాత్రం వచ్చే 12 నెలల కాలంలో వడ్డీరేట్లు 50 బేసిస్ పాయింట్లు పెరిగే అవకాశాన్ని కొట్టిపారేయలేమని యూబీఎస్ స్పష్టం చేసింది. మోర్గాన్ స్టాన్లీ కూడా ఆర్‌బీఐ వడ్డీరేట్లు పెంచే అవకాశాలున్నాయని ఆదివారం నాడు ఒక నివేదికలో ప్రకటించిన విషయం తెలిసిందే.

వచ్చే ఏడాది మార్కెట్లోకి కియో కార్లు

• అనంతపూర్ ప్లాంట్ నుంచి..

న్యూఢిల్లీ : దక్షిణ కొరియాకు చెందిన కియా మోటార్స్ తన మొట్టమొదటి మోడల్‌ను వచ్చే ఏడాది జూన్ నాటికి దేశీయ మార్కెట్లో విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపూర్ ప్లాంట్‌నుంచి కొత్త మోడల్స్ కార్లను దేశీయ మార్కెట్లోకి విడుదల చేస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపూర్‌లో కియామోటార్స్‌కు 213.7 హెక్టార్ల భూమిని ప్రభుత్వం కంపెనీకి ఇచ్చింది. ఇక్కడ ఏడాదికి మూడు లక్షల కార్లను ఉత్పత్తి చేస్తుంది. కంపెనీ సుమారు రెండు బిలియన్‌డాలర్ల పెట్టుబడులు పెడుతుందని కంపెనీ ఎండీ, సీఈవో కూక్ హ్యున్ షిమ్ ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తిస్థాయి ఉత్పత్తి సామర్థ్యం ఏడాదికి మూడు లక్షలకార్లు కాగా నుమారు 3,000 మంది ఉపాధి లభిస్తుందని తెలిపింది. ఈ నెల ప్రారంభంలో ఢిల్లీలో జరిగిన ఆటోఎక్స్‌పో -2018లో కంపెనీ కొత్త రేంజ్ వాహనాలను ప్రదర్శించింది. వచ్చే ఏడాది ప్రత్యేకంగా కాంపాక్ట్ ఎలక్ట్రిక్ కార్లు 2019 నుంచి 2021 మధ్యలో మార్కెట్లోకి తెస్తామని ప్రకటించింది. దేశీయ మార్కెట్ కోసం ఎస్‌పీ కాన్సెప్ట్ ఎస్‌యూవీ డిజైన్‌తో కార్లను తయారు చేస్తున్నామని.. వచ్చే ఏడాది జూన్ నాటికి దేశీయ మార్కెట్లో అందుబాటులో ఉంచుతామన్నారు.



ప్రాధాన్యతా రంగాలకు

న్యూఢిల్లీ : కేంద్రప్రభుత్వం వచ్చే ఆర్థికసంవత్సరానికి రూ.11 లక్షల కోట్ల రుణం ప్రాధాన్యతా రంగాలకు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకుంది. 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేయాలని ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇక్కడ జరుగుతున్న నాబార్డ్ బోర్డు సమావేశంలో ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ మాట్లాడుతూ ఈ విషయం చెప్పారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి 2018-19 దేశంలోని వివిధ రంగాలకు ప్రభుత్వం రూ.11 లక్షల కోట్లు రుణాలను ఇవ్వాలని లక్ష్యనిర్ణయంతో ఉన్నారు. ఆర్థికమంత్రి జైట్లీ బడ్జెట్‌లో భాగస్వాములందరి సహాయ సహకారాలతో రైతుల ఆదాయం రెట్టింపు చేయడానికి కృషి చేస్తామని పిలుపునిచ్చారు. కాగా నాబార్డ్ ఒక ప్రకటనలో బ్యాంకింగ్ రంగం దీర్ఘకాలిక ప్రాతిపదికన వ్యవసాయరంగానికి పెద్దమొత్తంలో రుణాలు మంజూరు చేయాలని కోరింది.

గత కొన్ని సంవత్సరాల నుంచి బ్యాంకింగ్ రంగం వ్యవసాయరంగానికి పెద్దమొ త్తంలో రుణాలు మంజూరు చేసింది. రైతులకు రుణా లు వేగవంతంగా చేయడంతోపాటు పారదర్శకంగా రుణాలు ఇవ్వడంతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మెరుగు పడిందన్నారు. ఆర్థిక సేవల కార్యదర్శి రాజీవ్ కుమార్ మాట్లాడుతూ.. ఆర్థిక సేవలు అందుబాటులో ఉండాలని కొత్త టెక్నాలజీని అందుబాటులో తీసుకొచ్చామని.. దీంతో జీడీపీ వృద్ధిరేటు కూడా పెరుగుతుందన్నారు. బ్యాంకింగ్ దేశంలోని మారుమూల ప్రాంతాల ప్రజలకు కూడా రుణ సదుపాయం అందుబాటులో ఉంచాలన్నారు. ముఖ్యంగా ఈశాన్య ప్రాంతంతో పాటు తూర్పు, ముఖ్య భారత్‌కు చెందిన ప్రాంతాలకు ఎక్కువగా బ్యాంకులు రుణాలు ఇచ్చి ఆయా ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి పూనుకోవాలన్నారు. ఆర్థిక సేవల శాఖ ఇతర మంత్రిత్వశాఖలతో కలిసి పనిచేస్తున్నారు. నాబార్డ్ చైర్మన్ హర్షకుమార్ బన్వాలా మాట్లాడుతూ.. కాగా బడ్జెట్‌లో ప్రకటించిన విధంగా ప్రధానమంత్రి గ్రామీణ ఆవాస్ యోజనకింద రూ.9,000 కోట్లు మరో రూ.5,000 కోట్లు సూక్ష్మ నీటిపారుదల ప్రాజెక్టు నిధి కింద విడుదల చేసామన్నారు. ఈ నిధితో నీటిని ఆదా చేయవచ్చునని బన్వాలా అన్నారు.

రూ.11లక్షల కోట్ల రుణం

• 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు • దేశంలోని మారుమూల ప్రాంతాల వారికి రుణాలు • రుణాలన్నీ పారదర్శకమే • నాబార్డ్ సమావేశంలో జైట్లీ



ఓబీసీకి సింబయాలిక్ షుగర్స్

• రూ.97.85 కోట్ల టోపీ



న్యూఢిల్లీ : పీఎన్‌బీలో రూ. 11,400కోట్ల స్కాం మరచిపోక ముందే ఓరియంటల్ బ్యాంకు ఆఫ్ కామర్స్ (ఓబీసీ)లో రూ. 97.85 కోట్ల మోసం బయట పడింది. సింబయాలిక్ షుగర్స్ లిమిటెడ్ చైర్మన్ గుర్మీతసింగ్ మాన్, డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ గుర్పాల్‌సింగ్‌లతో పాటు మరికొందరు కలిసి ఓబీసీని సుమారు రూ.97.85 కోట్లు మోసపూరితంగా రుణం తీసుకున్నారని కేంద్రనేరపరిశోధన సంస్థ ఆదివారం నాడు వీరిపై కేసు రిజిష్టర్ చేసింది. కాగా గుర్పాల్‌సింగ్ పంజాబ్ ముఖ్యమంత్రి అమరిందర్‌సింగ్‌కు స్వయాన అల్లుడు. అంతకు ముందు పది బ్యాంకుల్లో రూ.390 కోట్ల మోసం గుర్తించారు. తాజా మోసంతో ఓబీసీ మోసం విలువ రూ.500 కోట్లకు చేరుతుంది. కాగా దేశంలోని అతి పెద్ద చక్కెర మిల్లులు సింబయాలిక్ చక్కెర మిల్లు. కాగా కంపెనీకి చెందిన చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జీ ఎస్‌సి రావు, సీఎఫ్ఓ సంజయ్ తప్రియ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గురుపాల్ కౌర్ మాన్‌లతో పాటు ఐదుగురు నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లను కూడా సీబీఐ ఎఫ్ఐఆర్‌లో పేర్లను నమోదు చేసింది.

మేడిన్ ఇండియా
మెర్సిడెజ్ బెంజ్ ఎస్ క్లాస్



ధర రూ.1.33 కోట్లు

న్యూఢిల్లీ : జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ కంపెనీ మెర్సిడెజ్ బెంజ్ సోమవారం నాడు మెర్సిడెజ్ బెంజ్ ఎస్ క్లాస్ మేకిన్ ఇండియా కొత్త వెర్షన్‌ను విడుదల చేసింది. ఎస్ 350 డీ డీజిల్, ఎస్ 450 పెట్రోల్ మోడల్‌ను కూడా విడుదల చేసింది. దీని ప్రారంభ ధర రూ.1.33 కోట్లు, కాగా మెర్సిడెజ్ బెంజ్ ఎస్ 350 డి ధర రూ.1.33 కోట్లు కాగా పెట్రోల్ వెర్షన్ ఎస్ 450 రూ.1.37 కోట్లని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. కొత్త ఎస్ క్లాస్ 350డి దేశంలో మొట్టమొదటి బీఎస్ -6 ప్రమాణాలతో రూపుదిద్దిన కారు. మేడిన్ ఇండియా, ఫర్ ఇండియా వాహనమని.. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో డీజిల్ ఇంజిన్ తయారు చేశామని బీఎస్ఈ -6 ఉద్గార ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తున్నామని తెలిపింది. ప్రభుత్వం 2020 నాటికి బీఎస్-6 ప్రమాణాలను తీసుకురావాలని లక్ష్యంగా పెడితే దానికంటే రెండేళ్ల ముందే మార్కెట్లో అందుబాటులోకి తెచ్చామని ప్రకటనలో వివరించింది. తాజా పరిణామంపై మెర్సిడెజ్ బెంజ్ ఇండియా, సీఈవో రోలాండ్ ఫోల్గర్ మేడిన్ ఇండియా ఫర్ ఇండియా బీఎస్ -6 ప్రమాణాలను మొట్టమొదటిసారి అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. పెరిగిపోతున్న వాతావరణ కాలుష్యానికి అడ్డుకట్ట వేయడానికి ప్రభుత్వం బీఎస్-6 ప్రమాణాలను తీసుకొచ్చింది. ఇతర కంపెనీలతో పోల్చుకుంటే మెర్సిడెజ్ ముందుగా మార్కెట్లో తమ ప్రొడక్టును తీసుకొచ్చిందన్నారు. మెర్సిడెజ్ ఎస్ క్లాస్ విషయానికి వస్తే ప్రపంచ వ్యాప్తంగా ఈ మోడల్ విజయవంతమైందని.. భారత్ మార్కెట్లో కూడా అద్భుతమైన విజయం సాధించిందని ఆయన వివరించారు. దేశీయ మార్కెట్లో ఈ విజయాన్ని మరింత పొడిగించుకునేందుకు కొత్త వెర్షన్ మోడల్స్‌ను తీసుకొచ్చామని ఫోల్గర్ చెప్పారు. భారత్ కస్టమర్లకు డీజిల్ 350, పెట్రోల్ ఎస్ 450 లాంటి అద్భుతమైన వాహనాలను అందుబాటులో ఉంచామని.. దీంతో దేశీయ మార్కెట్లో ఈ ఏడాది 2018లో కూడా తామే నెంబర్ వన్ స్థానంలో కొనసాగుతామన్న భరోసాను ఆయన వ్యక్తం చేశారు.

• సెన్సెక్స్ 300 పాయింట్ల వృద్ధి
జోష్..

ముంబై : స్టాక్ మార్కెట్లు సోమవారం నాడు 300 పాయింట్ల లాభంతో ముగిశాయి. గ్లోబల్ మార్కెట్ల నుంచి అనుకూలమైన సంకేతాలు వెలువడ్డంతో పాటు క్యూ3 జీడీపీ వృద్ధిరేటు 7 శాతానికి చేరుతుందని అంచనాతో మార్కెట్లు జోరందుకున్నాయి. సెన్సెక్స్ మూడు వారాల గరిష్టానికి 34,445.75 వద్ద, నిఫ్టీ 10,550 మార్కును దాటిపోయింది. మోర్గాన్‌స్టాన్లీ తాజా నివేదికలో డిసెంబర్ త్రైమాసికంలో జీడీపీ 7 శాతానికి చేరుతుందని ప్రకటించడంతో సెంటిమెంట్ బలపడింది. కాగా బుధవారం నాడు జీడీపీ గణాంకాలు వెలువడనున్నాయి. ఆసియా మార్కెట్లతో పాటు యూరోప్ మార్కెట్లు నిలకడగా ట్రేడ్ కావడం.. అంతకుముందు శుక్రవారం నాడు వాల్‌స్ట్రీట్‌లో కూడా కొనుగోళ్లు ఊపందుకోవడంతో సెంటిమెంట్ ప్రకారం దాని ప్రభావం దేశీయ మార్కెట్లపై కనిపించింది. ఇంట్రాడేలో సూచీ 34,483.39 పాయింట్ల నుంచి 34,445.75 పాయింట్ల మధ్య ఊగిసలాడి చివరకు 303.60 పాయింట్ల లాభంతో 34,225.72 వద్ద ముగిసింది. వివరాల ఫిబ్రవరి 5 నాటి స్థాయి వద్ద ముగిసింది. శుక్రవారం నాడు సెన్సెక్స్ 322.65 పాయింట్ల ర్యాలీ ఏర్పడింది. మదుపరులు ఇటీవలకాలంలో తగ్గముఖం పట్టిన బ్లూచిప్ షేర్లను కొనుగోలు చేయడంతో మార్కెట్ జోరందుకుంది. నిఫ్టీ 10,582.60 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 10,592.95 నుంచి 10,520.20 మధ్య ఊగిసలాడింది. మార్కెట్ నిపుణుల అంచనా ప్రకారం క్రమంగా మార్కెట్లు కోలుకుంటున్నాయని, గ్లోబల్ మార్కెట్ల అండ, క్యూ3 జీడీపీ గణాంకాలు, ఐఐపీ గణాంకాలు మెరుగ్గా ఉంటాయన్న అంచనాల మధ్య మార్కెట్లు జోరందుకోవడానికి కారణం. కాగా సోమవారం నాడు రియల్టీ, ఆటో, క్యాపిటల్ గూడ్స్, బ్యాంకింగ్, ఇన్‌ఫ్రా, మెటల్స్, పవర్, ఆయిల్ అండ్ గ్యాస్, పీఎస్‌యు, కన్స్యూమర్ డ్యూరబుల్స్ రంగానికి చెందిన షేర్లు 3.30 శాతం వరకు పెరిగాయి. ఐటి, టెక్, హెల్త్‌కేర్ రంగానికి చెందిన షేర్లు మాత్రం నష్టాలతో ముగిశాయి. దేశీయ సంస్థాగత మదుపరులు శుక్రవారం నాడు నికరంగా రూ.1514.03కోట్ల షేర్లు కొనుగోలు చేస్తే... విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు మాత్రం రూ.486.32 కోట్ల షేర్లను విక్రయించారు. బీఎస్ఈలో మారుతి సుజుకి ఏకంగా 3.41 శాతం పెరిగింది. టాటా మోటార్స్ 3.22 శాతం పెరిగింది. మిగిలిన లాభపడిన షేర్లు ఇలా ఉన్నాయి. ఇండస్ఇండ్ బ్యాంకు, ఎల్అండ్‌టీ, యాక్సిస్ బ్యాంక్, ఎంఅండ్ఎం, అదానీపోర్ట్స్, కోటక్ మహీంద్రా బ్యాంకు, ఐసీఐసీఐ బ్యాంకు, హెచ్ డీఎఫ్‌సీ బ్యాంకు, పవర్‌గ్రిడ్, హీరోమోటోకార్ప్, కోల్ ఇండియా, డాక్టర్ రెడ్డీస్, హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్ యుఎల్, బజాజ్ ఆటో, ఎస్ బ్యాంక్ కు, ఏషియన్ పెయింట్స్, రిల్, ఒఎన్‌జీసీ, టాటాస్టీల్, ఎన్‌టీపీసీ 2.94 శాతం వరకు లాభపడ్డాయి.

దీనికి వ్యతిరేకంగా సన్‌ఫార్మా, టీసీఎస్, ఇన్ఫోసిస్, ఐటీసీ, భారతి ఎయిర్‌టెల్, విప్రో, ఎస్‌బీఐ 2.46 శాతం వరకు నష్టపోయాయి. స్మాల్‌లో ఐరక్యుపోయింది పీఎన్‌బీ షేరు 1.32 శాతం క్షీణించింది. గీతాంజలి జెమ్స్ 4.84 శాతం క్షీణించి రూ.23.60కి పడిపోయింది. సింబాలిక్ షుగర్స్‌పై సీబీఐ కేసు రిజిష్టరు చేయడంతో దీని షేరు 15.73 శాతం క్షీణించింది. ఓబీసీ 10.02 శాతం నష్టపోయింది. ఆసియాతో పాటు యూరోప్ మార్కెట్లు లాభాలతో ముగిశాయి.



'బేటీ బచావో..బేటీ పడావో'లో హైదరాబాద్ భేష్

● 8న రాజస్థాన్‌లో అవార్డు ప్రదానం

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : భేటీ బచావో...భేటీ పడావో...పథకాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు హైదరాబాద్ జిల్లాకు కేంద్ర ప్రభుత్వం అవార్డు ప్రదానం చేయనుంది. మార్చి 8 న రాజస్తాన్‌లోని ఝున్ ఝునాలో జరి గే మూడో వార్షికోత్సవ కార్యక్రమంలో అవార్డు ప్రదానం చేస్తారు.ఈ మేరకు కేంద్రమహిళా, శిశు సంక్షేమ శాఖ సంయుక్త కార్యదర్శి అశోక్‌కుమార్ యాదవ్ సోమవారం హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ యోగితా రాణాకు లేఖ రాశారు. ఈ పథకాన్ని విజయవంతంగా అమలు చేసిన 10 జిల్లాల్లో హైదరాబాద్ కూడా ఒకటి కావడం సంతోషించదగ్గ విషయమని ఆయన లేఖలో ప్రశంసించారు. బాలికల విద్యలో విశేష కృషి చేసినందుకు గుర్తింపుగా ఈ అవార్డు పురస్కారం లభించింది.

ఎస్సీ, ఎస్టీ, బీసీలకు న్యాయం చేయాలి

● ఉన్నత విద్యామండలి చైర్మన్‌కు బీసీ సంఘం విజ్ఞప్తి



హైదరాబాద్,ఆంధ్రప్రభ: స్కాలర్ షిప్స్ కోసం గత 6 రోజులుగా ఆందోళన చేస్తున్న టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ విద్యార్థులకు న్యాయం చేయాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. స్కాలర్‌షిప్స్ కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు 6 రోజులుగా ఆందోళన చేస్తున్నారని, వారికి స్కాలర్‌షిప్ ఇప్పించేలా యాజమాన్యంపై ఒత్తిడి తీసుకొచ్చేలా చూడాలని ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య తుమ్మల పాపిరెడ్డికి తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు. సోమవారం చైర్మన్‌ను కలిసిన వారు ఇన్‌స్టిట్యూట్‌లో జరుగుతున్న ఆందోళన గురించి వివరించారు. చైర్మన్‌ను కలిసిన వారిలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి జాజుల లింగం గౌడ్, నాయకులు శ్యాం కురుమ, వెంకటేష్, కుమారస్వామి, భాస్కర్ తదితరులు ఉన్నారు.

మెడికల్ కౌన్సిల్ బిల్లును అడ్డుకుంటాం

● ఐఎంఏ జాతీయ అధ్యక్షుడు డా. రవి వాంఖేడ్కర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : నేషనల్ మెడికల్ కౌన్సిల్ బిల్లుకు వ్యతిరేకంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ భారత్ యాత్రను ప్రారంభించిందని అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ రవి వాంఖేడ్కర్ పేర్కొన్నారు. యాత్రలో భాగంగా సోమవారం రెండోరోజు ఆయన హైదరా బాద్‌లోని ఐఎంఏ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా స్థానంలో ఈ బిల్లును తీసుకురావడానికి చేస్తున్న ప్రయ త్నాలను సమష్టిగా అందరం కలిసి తిప్పికొట్టాలన్నారు. ఈ బిల్లు అప్రజాస్వామ్యమని, దీనివల్ల అవినీతి పెరిగి పోతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా ఈ బిల్లుపై నిరసనలు వెల్లువెత్తడంతో కేంద్రం ఈ బిల్లును పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి సిఫారసు చేసిందన్నారు. రానున్న పార్లమెంట్ సమావేశాల్లో ఎలాగైనా ఈ బిల్లును ప్రవేశపెట్టడానికి ప్రభుత్వం కుట్రలు పన్నుతోందన్నారు.

సిబ్బంది నైపుణ్యం పెంచుకోవాలి

● టీఎస్‌పీసీబీ మెంబర్ సెక్రటరీ సత్యనారాయణ రెడ్డి




హైదరాబాద్, ఆంధ్రప్రభ : టీఎస్‌పీసీబీలో పనిచేసే క్షేత్రస్థాయి సిబ్బంది తమ నైపుణ్యాలను పెంచుకోవడంతో పాటు అంకితభావంతో పనిచేయాలని టీఎస్‌పీసీబీ మెంబర్ సెక్రటరీ పి.సత్య నారాయణ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం సనత్‌నగర్ లోని టీఎస్‌పీసీబీ కార్యాలయంలో రాష్ట్రస్థాయి ఫీల్డ్ అసిస్టెంట్ల శిక్షణా కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పనిచేసే వారి పనితీరు వల్లే సంస్థకు పేరు వస్తుందన్నారు. సిబ్బంది బోర్డు నిర్ణయాలకు అనుకూలంగా పూర్తి పారదర్శకతతో పనిచేయాలని ఆయన సూచిం చారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు ఎప్పటికప్పుడు సాంకేతికపరమైన నైపుణ్యతను పెంపొందించుటకు వివిధ రకాల శాంపిళ్లను సేకరిం చడంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆరునెలలకోసారి ఈ శిక్షణా కార్యక్రమాలను సిబ్బందికి ఇప్పించడానికి బోర్డు కృషి చేస్తుందన్నారు.

28న టీటీడీపీ విస్తృతస్థాయి సమావేశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ తెదేపా విస్తృత స్థాయి సమావేశం ఈ నెల 28వ తేదీన నగరంలోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో జరుగుతుంది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రమణ నేతృత్వంలో జరిగే ఈ సమావేశానికి పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హాజ రవుతున్నారు. ఈ సందర్భంగా తెలంగాణలో పల్లెపల్లెకు తెలుగుదేశం కార్యక్రమాలు జరుగుతున్న తీరు, శిక్షణ శిబిరాల తీరుపై సమీక్షిస్తారు. రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, భవిష్యత్తుల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై రాష్ట్ర నాయకులతో చంద్రబాబు చర్చిస్తారు. అలాగే పార్టీ పటిష్టతకు తీసుకోవాల్సిన అంశాలపై నాయకులకు ఆయన దిశనిర్దేశం చేస్తారు. ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్రానికి చెందిన పొలిట్‌బ్యూరో సభ్యులు, కేంద్ర కమిటీ సభ్యులు, రాష్ట్ర అనుబంధ సంఘాల అధ్యక్షులు, జిల్లా పార్టీ అధ్యక్షులు, నియోజకవర్గాల ఇన్‌ఛార్జీలు, త్రిసభ్య కమిటీ, ఫైవ్‌మెన్ కమిటీ సభ్యులు తదితరులు హాజరుకానున్నారు.

యాదాద్రిలో ఘనంగా చక్రతీర్థోత్సవం



యాదగిరికొండ, ఫిబ్రవరి 26 (ప్రభ న్యూస్) : యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా 10వ రోజు సోమ వారం శ్రీ స్వామి వారికి మహా పూర్ణాహుతి గావించారు. అనంతరం బాలాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బాలగుండంలో శ్రీ స్వామి, అమ్మవారికి చక్రతీర్థం ఘనంగా నిర్వహించారు. పిదప విష్ణు పుష్కరిణీలో కల్యాణమూర్తులకు చక్రతీర్థ స్నానమాచరింపజేశారు. ఈ సందర్భంగా భక్తులు విష్ణుపుష్కరిణీలో పుణ్య స్నానాలు చేయడానికి పోటీపడ్డారు. రాత్రి శ్రీ స్వామి, అమ్మవారికి నేత్రపర్వంగా పుష్పయాగము, దేవతోద్వాసన, డోపు ఉత్సవ నిర్వహించారు. మహాపూర్ణాహుతిలో దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి సతీమణి విజయలక్ష్మీ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. యాజ్ఞికులు సముద్రాల శ్రీనివాసాచార్యులు, ప్రధానార్చకులు నల్లందీగల్ లక్ష్మీనర్సింహాచార్యులు, కారంపూడి నర్సింహాచార్యులు, అర్చక బృందం ఉత్సవాలను నిర్వహించారు.

మెరుగైన సేవలందించడంలో ఈఎస్‌ఐసీ ముందంజ



హైదరాబాద్ , ఆంధ్రప్రభ : ఈఎస్ఐసీ ఆస్పత్రి రోగులకు విశిష్ట సేవలను అందించిందని డాక్టర్ కె.కె.పాల్ పేర్కొన్నారు. ఈఎస్ఐసీ మెడికల్ కాలేజీ మరియు ఆస్పత్రి సనత్‌నగర్ 66 సంవత్సరాల వ్యవస్థాపక దినోత్సవాన్ని శనివారం రాత్రి ఘనంగా జరుపుకున్నారు. ఈ సం దర్భంగా డాక్టర్ పాల్ మాట్లాడుతూ రోగులకు ఈ ఆస్పత్రి సుస్థిరమైన వైద్య సేవలను అందించిందని ఆయన పేర్కొన్నారు. రోగు లకు వైద్యంపై అనేక అవగాహన శిబిరాలను నిర్వహించిందన్నారు. ఎన్నో లక్షల మంది కార్మికులకు మెరుగైన వైద్యం అం దించడంలో ఈ ఆస్పత్రి ముందుందన్నారు.

రహదారులకు భూసేకరణ వేగవంతం

● 4168 హెక్టార్ల సేకరణ లక్ష్యం



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : రాష్ట్రంలో చేపట్టనున్న రాష్ట్ర , జాతీయ రహదారులు నిర్మాణాలకు భూసేకరణ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. ఇప్పటికే ఉన్న రహదారులతో పాటు కొత్తగా మంజూరు చేసిన రాష్ట్ర, జాతీయ రహదారుల నిర్మాణాలకు 4168 హెక్టార్ల భూములను సేకరించాలని ఈ శాఖ నిర్ణయించింది. పలు కారణాలతో భూసేకరణ కార్యక్రమం జాప్యం జరగడంపై ఇటీవల జరిగిన ఉన్నతాధికారుల సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమం చేపట్టడంలో జాప్యం తగదని హెచ్చరించారు. అంతేగాక జిల్లా కలెక్టర్లతో ఏర్పాటు చేసిన వీడియోకాన్ఫరెన్స్‌లో భూసేకరణ కార్యక్రమం వేగవంతం చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రహదారుల నిర్మాణంతోనే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను క్షేత్ర స్థాయికి తీసుకువెళ్లవచ్చన్న ఉద్దేశ్యంతో నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ), నేషనల్ హైవేస్, స్టేట్ రోడ్స్‌లకు వందలాది ఎకరాలను సేకరిస్తోంది. రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా బదలాయిస్తోంది. మరి కొన్ని రహదారులు జాతీయ రహదారులుగా మార్చాలని కేంద్రాన్ని కోరింది. ప్రస్తుతం రాష్ట్రంలో 6,150 కిలోమీటర్ల పొడవు గల 25 జాతీయ రహదారులు ఉన్నాయి. వాటితో 1207 కిలోమీటర్ల నిడివి ఉన్న 11 రోడ్లను కూడా జాతీయ రహదారులుగా బదలాయించాలని ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. కేంద్రం సానుకూలంగా స్పందిస్తే రాష్ట్రంలో విస్తరించనున్న జాతీయ రహదారుల నిడివి 7,357 కిలోమీటర్లు చేరుకునే అవకాశం ఉంది. రాష్ట్రంలోని దాదాపు 50 శాసన సభ నియోజకవర్గాలను కలుపుతూ నేషనల్ హైవేస్ ఏర్పాటవుతాయి. కొన్ని రహదారులను కేంద్రం స్వయంగా నిర్వహిస్తుండగా, మరికొన్నింటిని పీపీపీ విధానంలో పబ్లిక్ , ప్రైవేట్ భాగస్వామ్యంతో నిర్వహిస్తున్నాయి. 11 రహదారులను జాతీయ రహదారులుగా మార్చడంతో పాటు అంతర్రాష్ట్ర అనుసంధానంలో భాగంగా రాష్ట్రా నికి రూ. 190.10 కోట్ల అంచనాతో చేపట్టే పథకాలకు నిధులు మంజూరు చేయాలని మంత్రి తుమ్మల కేంద్రం దృష్టికి తెచ్చారు. జాతీయ రహదారులు వేయడానికి సంబంధించి భూసేకరణ, అటవీ అనుమతులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఇటీవల జరిగిన సమీక్షా సమావేశంలో అధికారులను మంత్రి ఆదేశించారు. జిల్లాల వారిగా చూస్తే ఖమ్మం జిల్లాలో రహదారుల నిర్మాణం ఎక్కువగా సాగుతున్నందున పెద్ద సంఖ్యలో భూములను సేకరిస్తోంది. ఆ తర్వాత మహబూబ్‌నగర్, సంగారెడ్డి, సూర్యాపేట, వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో పెద్ద సంఖ్యలో భూసేకరణ జరుగుతోంది. అందులో నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా రహదారులకు 3324.491 హెక్టార్లు , జాతీయ రహదారులకు 265.780 హెక్టార్లు, స్టేట్ రోడ్స్‌కు 578.151 హెక్టార్లు మొత్తం 4168. 432 హెక్టార్ల భూములను సేకరిస్తోంది. అందులో అటవీ, ప్రభుత్వ, అసైన్డ్, ప్రైవేట్ భూములు ఉన్నాయి. భూసేకరణ వివరాలు జిల్లాల వారిగా ఇలా ఉన్నాయి. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 77.726 హెక్టార్లు, మంచిర్యాల జిల్లాలో 119.751 హెక్టార్లు , అదిలాబాద్ జిల్లాలో 16.050 హెక్టార్లు, నిర్మల్‌లో 62.633 హెక్టార్లు , కరీంనగర్‌లో 355.639 హెక్టార్లు , రాజన్న సిరిసిల్లలో 33.316 హెక్టార్లు , పెద్దపల్లి జిల్లాలో 5.312 హెక్టార్లు , జగిత్యాలలో 174.572 హెక్టార్లు , ఖమ్మంలో 918.320 హెక్టార్లు , భద్రాద్రి కొత్తగూడెంలో 78.544 హెక్టార్లు , మహబూబ్‌నగర్ జిల్లాలో 537.147 హెక్టార్లు , నాగర్‌కర్నూలులో 20.070 హెక్టార్లు , సూర్యాపేటలో 350. 874 హెక్టార్లు , యాదాద్రి భువనగిరిలో 182. 524 హెక్టార్లు ,నల్గొండలో104. 329 హెక్టార్లను ప్రభుత్వం సేకరిస్తోంది. అదే విధంగా కామారెడ్డిలో 21. 663 హెక్టార్లు , నిజామాబాద్‌లో 3.337 హెక్టార్లు ,రంగారెడ్డిలో 272.663 హెక్టార్లు , మేడ్చల్ - మల్కాజిగిరిలో 1.183 హెక్టార్లు , వికారాబాద్‌లో 53. 159 హెక్టార్లు , సంగారెడ్డిలో 322.619 హెక్టార్లు , సిద్దిపేటలో 55.219 హెక్టార్లు , మెదక్‌లో 108.420 హెక్టార్లు ,వరంగల్ అర్బన్‌లో 81.080 హెక్టార్లు , వరంగల్ రూరల్‌లో4. 330 హెక్టార్లు , జనగామలో 7.650 హెక్టార్లు మొత్తం 4168. 432 హెక్టార్లను సేకరిస్తోంది.

ప్రియుడే కాలయముడు

● పాతబస్తీలో దారుణం ● ప్రియురాలిని కిడ్నాప్ చేసి.. స్నేహితులతో అత్యాచారం చేయించాడు ● యువతి నగ్న దృశ్యాలను తల్లిదండ్రులకు వాట్సప్‌లో పంపి..రూ.లక్ష డిమాండ్ ● నిందితుడి ఆచూకీకి ప్రత్యేక బృందాలు

చాంద్రాయణగుట్ట, ప్రభన్యూస్: పాతబస్తీలో దారుణం చోటుచేసుకుంది. ప్రియుడే కాలయముడిగా మారాడు. ముందుగా ప్రియురాలిని కిడ్నాప్ చేసి, ఆపై రేప్ చేసి, అంతటితో ఆగకుండా స్నేహితులతో గ్యాంగ్ రేప్ చేయించి, ఆ వీడియోలను బాధిత యువతి తల్లిదండ్రులకు పంపించి, డబ్బులు ఇవ్వాలంటూ డిమాండ్ చేసిన, హృదయవిదారకరమైన ఘటన సోమవారం వెలుగుచూసింది. వివరాల్లోకి వెళితే పాతబస్తీ చాంద్రాయణగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని బండ్లగూడ ప్రాంతానికి చెందిన యువతిని అదే ప్రాంతానికి చెందిన ముస్తాఫా అనే యువకుడు ప్రేమించాడు. అయితే ఫిబ్రవరి 24న రాత్రి యువకుడు ప్రేమించిన అమ్మాయికి మాయమాటలు చెప్పి, తనతో తీసుకెళ్లిపోయాడు. అయితే అమ్మాయి రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో దిగులు చెందిన తల్లిదండ్రులు చంద్రాయణగుట్ట పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఇరువురిపై విచారణ మొదలుపెట్టారు. అయితే సోమవారం సాయంత్రం అమ్మాయి ఫోన్ నుంచి తల్లికి ఒక వాట్సప్ యాప్ వీడియో వచ్చింది.

అందులో తన కూతురు అర్ధనగ్నంగా కనిపించడంతో అమ్మాయి తల్లి షాకు గురైంది. అంతేకాదు రూ. లక్ష చెల్లించాలని బాధిత యువతితో నిందితులు వాట్సప్ వీడియోలో చెప్పించినట్లు తెలుస్తోంది. ఫిర్యాదు అందుకున్న చంద్రాయణగుట్ట పోలీసులు, అమ్మాయిని క్షేమంగా తీసుకవచ్చేందుకు నాలుగు బృందాలను గాలింపుకోసం తరలించారు.

టి-యాప్ పోలియో @180 సేవలు

(మొదటిపేజీ తరువాయి)

జాతీయ సదస్సులో సోమవారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సదస్సులో కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీశాఖ సహాయమంత్రి సిఆర్ చౌదరి, కేంద్ర ఐటిశాఖ కార్యదర్శి అజయ్ సహాని, ఆధార్ సీఈవో అజయ్ భూషణ్ పాండే తదితరులు కూడా పాల్గొన్నారు.ఈసందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, మన దేశంలో ప్రభుత్వ పాలన ఆ స్థాయికి ఎప్పుడు చేరుకుంటామని, ఆ దిశలో పాలన అందించేందుకు తమ ప్రభుత్వం ఆవిష్కరించే టి-యాప్ పోర్టుఫోలియో అందుబాటులోకి రానుందని అన్నారు. టెక్నాలజీ సామాన్యుల జీవితాలను స్పృశించకుంటే అది దానికి సార్థకత లేనట్టేనని ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు ప్రతిరోజూ అంటుండే వారన్నారు. మూడున్నరేళ్ళ క్రితం తమ ప్రయాణం ఆరంభమైందని, సామాన్యుడిని దృష్టిలో ఉంచుకుని టెక్నాలజీని అందుబాటులోకి తెస్తున్నామన్నారు. అయితే ఇప్పటికే ఎన్నో సేవలు ప్రజలకు అందిస్తున్నామని, ఇది రాత్రికిరాత్రే జరిగేది కాదని కేటీఆర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రవాణా శాఖలో ఆర్టీఏ మొబైల్ వ్యాలెట్‌ను ఆవిష్కరించిందని, దీనిద్వారా డ్రైవింగ్ లైసెన్స్, ఇన్స్యూరెన్స్, వాహనం రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌ను ఈ వ్యాలెట్ ద్వారా అందుబాటులోకి తెచ్చామని కేటీఆర్ చెప్పారు. ఈ వ్యాలెట్‌ను కేవలం మూడు నెలల్లోనే 13 లక్షల మంది డౌన్‌లోడ్ చేసుకున్నారని తెలిపారు. వినూత్న ప్రయోగాలతో టెక్నాలజీ ఆధారిత సేవలు అందించాలన్న ఆలోచన ఉంటే అది సాధ్యమవుతుందని మంత్రి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం టెక్నాలజీ ద్వారా పౌర సేవలు అందించడంపై దృష్టి సారించిందని, 4,500 మీసేవ కేంద్రాల ద్వారా రోజుకు 15 లక్షల లావాదేవీలు జరుగుతున్నాయని కేటీఆర్ చెప్పారు. స్మార్ట్ ఫోనులే పూర్తిస్థాయి సాధనంగా ప్రజలకు సేవలు అందించేందుకు ప్రయత్నిస్తున్నామని అన్నారు.టెక్నాలజీ ద్వారా అభివృద్ధి సాధించేందుకు క్షేత్రస్థాయిలో వినియోగించే కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుతం మిషన్ భగీరథ కార్యక్రమం ద్వారా మరో ఆరు నెలల్లో 10 మిలియన్ల ఇళ్ళకు తాగునీరు అందించనున్నామని చెప్పారు. వీటితో పాటు విద్యుత్ కేబుల్స్, ఎల్‌పిజి గ్యాస్ లైన్లు ప్రతిపాదించామని, అయితే ఈ రెండు సాధ్యం కావడం లేదని మంత్రి స్పష్టంచేశారు. టి-ఫైబర్ ద్వారా ఇంటింటికి ఇంటర్నెట్ కనెక్షన్ ఇవ్వనున్నామని, గ్రామ పంచాయతీలు, ప్రభుత్వ పాఠశాలలకు 15 ఎంబిపిఎస్ వేగంతో నెట్‌వర్క్ కల్పిస్తామని చెప్పారు. వీటిద్వారా ఈ-కామర్స్, ఈ-హెల్త్, ఈ-మార్కెటింగ్‌తో పాటు ప్రభుత్వ సేవలన్నీ గ్రామం నుంచే అందిపుచ్చుకోవచ్చునని కేటీఆర్ చెప్పారు. టి-శాట్ ద్వారా 3వేల డిజిటల్ స్కూల్స్‌ను ఏర్పాటు చేశామని, పోటీ పరీక్షలకు వెళ్ళేవారికి టి-శాట్ ద్వారా విజ్ఞానం, సమాచారం అందిస్తున్నట్లు చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ టెక్నాలజీని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేస్తున్నామని, పంటలకు చీడ సోకితే వాటిని ఫోటో తీసి ఆ శాఖ అధికారులకు ఇంటినుంచే పంపించి చీడ నివారణకు సలహాలు, సూచనలు పొందవచ్చునని కేటీఆర్ చెప్పారు.దేశంలోనే వినూత్నంగా టిఎస్-ఐపాస్ విధానాన్ని పారిశ్రామిక రంగంలో అమలు చేస్తున్నామని, దీనిద్వారా కేవలం 15 రోజుల్లోనే పరిశ్రమలకు అనుమతులు ఇస్తున్నామన్నారు.

మూడేళ్ళలోనే 6వేల పరిశ్రమలకు అనుమతి ఇచ్చి మూడు లక్షల మందికి ఉపాధి కల్పించేలా లక్షకోట్ల పెట్టుబడులు ఆకర్షించామని కేటీఆర్ గుర్తుచేశారు. అలాగే భవన నిర్మాణాలకు 73 మునిసిపాలిటీల్లో దరఖాస్తు చేసుకున్న నాటినుంచి 21 రోజుల్లోనే అనుమతులు ఇస్తున్నామని ఆయన చెప్పారు. పౌర సరఫరాలను ఆధార్‌తో అనుసంధానించి వందలకోట్ల ప్రజాధనాన్ని కాపాడగలిగామని మంత్రి చెప్పారు. టెక్నాలజీని సామాన్యుల ముంగిటకు తేవాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశలో అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని కేటీఆర్ చెప్పారు.

'పెట్టుబడులపై చంద్రబాబువి కాకిలెక్కలు'

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఏపీలో పెట్టుబడులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కాకిలెక్కలు చెప్పకుండా కేంద్రప్రభుత్వానికి చెందిన డిపార్ట్ మెంట్ ఆఫ్ ఇండస్ట్రియల్ పాలసీ ధ్రువీకరించిన లెక్కలు చెప్పాలని వైఎస్ఆర్‌కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి పార్థసారథి డిమాండ్ చేసారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్థసారథి మాట్లాడుతూ నాలుగేళలో రూ.15లక్షల కోట్లకు సంబంధిచిన ఎంఓయూలు కుదుర్చుకున్నట్టు చంద్రబాబు ఫోటోలకు ఫోజులు ఇచ్చారన్నారు. గతంలో 10.5లక్షల ఉద్యోగాలు వస్తాయన్న చంద్రబాబు ఇప్పుడు కొత్తగా 20 లక్షల ఉద్యోగాలు , రోజుకు రూ.50కోట్లు పెట్టుబడులు వస్తున్నాయని చెబుతున్నారన్నారు. ఇప్పటివరకూ ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో, ఎంత పెట్టుబడులు తెచ్చారో చెప్పాలన్నారు. రాజధాని నిర్మాణం కోసం చంద్రబాబు సేకరించిన 33వేల ఎకరాలు నిరుపయోగంగానే ఉన్నాయన్నారు. వాటి ల్లో రెండు మూడు వందల ఎకరాలు మాత్రమే తాత్కాలిక సచివాలయం , అసెం బ్లీకోసం ఉపయోగించారన్నారు. రైతు రాంప్రసాద్‌కు చెందిన భూమిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ వాటిని పాటించకుండా రైతుపై దౌర్జన్యం చేశారని పార్థసారథి పేర్కొన్నారు.

సమ్మె బాటలో 108 ఉద్యోగులు


హైదరాబాద్, ఆంధ్రప్రభ : సమస్యల పరిష్కారానికై 108 సిబ్బంది సమ్మె బాట పట్టనున్నారు. 2005 సంవత్సరంలో ప్రారంభమయినప్ప టి నుంచి ఇప్పటివరకు ఇందులో పనిచేస్తున్న వారు చాలిచాలనీ జీతంతోనే తమ సేవలను కొనసాగిస్తున్నారు.

దీం తోపాటు 12 గంటల పాటు విధులు నిర్వహించాల్సి రావడంతో పాటు పనికి తగ్గట్టుగా తమకు జీతాలు లేవని, తమ ఉద్యోగాలకు భద్రత లేదని వారు మొదటి నుంచి ప్రభుత్వానికి మొర పెట్టుకుం టున్నారు. అయినా ఈ విషయమై ప్రభుత్వం మొండి పట్టుదలతో వ్యవ హారిస్తోందని ఉద్యోగులు ఆరోపిసు ్తన్నారు. మార్చి2వ తేదీన ప్రభు త్వానికి నోటీసు ఇచ్చి మార్చి 15వ తేదీ నుంచి సమ్మె చేసే ఆలోచనలో ఉన్నట్టు యూనియన్ నాయకులు పేర్కొంటున్నారు.

కార్యకర్తలే తెదేపాకు ఊపిరి

● ఎన్‌టీఆర్ భవన్‌లో 6వ బ్యాచ్ శిక్షణ తరగతులు ప్రారంభం

● తెలంగాణ తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రమణ



హైదరాబాద్, ఆంధ్రప్రభ: సుశిక్షితులైన కార్యకర్తలే తెదేపాకు ఊపిరి అని పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు ఎల్. రమణ అన్నారు. కార్యకర్తల అండదండలు ఉన్నంత వరకు తెదేపాకు ఎలాంటి ఢోకా లేదన్నారు. తెలుగుదేశం పార్టీకి ఒడిదుడుకులను ఎదుర్కోవడంలోనూ, రాజకీయ ప్రత్యర్థుల కుట్రల నుంచి బయటపడడం కొత్తకాదన్నారు. తెదేపాను లేకుండా చేయాలని హేమాహేమీలు...రాజకీయ దురంధరులు ప్రయత్నించారని, కాని దెబ్బతిన్న ప్రతిసారి మరింత రెటింపు ఉత్సాహంతో పార్టీ అధికారంలోకి వచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఇదే పరిస్థితి వచ్చే ఎన్నికల్లోనూ పునరావృతం కానుందని, ప్రభుత్వ ఏర్పాటులో కీలక పాత్ర పోషిం చబోతున్నామన్నారు.సోమవారం ఎన్టీఆర్ ట్రస్ట్‌భవన్‌లో ఆరవ బ్యాచ్ శిక్షణ తరగతులను రమణ ప్రారంభించారు. ఎన్టీఆర్‌కు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అలాగే సినీ నటి శ్రీదేవి మృతిప ట్ల రెండు నిమిషాల మౌనం పాటించి సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా శిక్షణా తరగతులకు హాజరైన వారిని ఉద్దేశించి రమణ మాట్లాడుతూ....స్వార్థం కోసం కొందరు నేతలు తెదేపాను వీడినప్పటికీ కార్యకర్తలు మాత్రం చెక్కు చదరలేదన్నారు. పార్టీనీ అధికారంలోకి తీసుకరా వాలన్న లక్ష్యంగా పెట్టుకుని పని చేయాలని ఆయన సూచించారు. తెదేపా అధికారంలో ఉన్నాప్రతిపక్షంలో ఉన్నా నిత్యం ప్రజాసేవా చేస్తున్న ఏకైకన పార్టీ తెలుగుదేశమన్నారు. అలాంటి పార్టీలో కార్యకర్తలుగా మనం కొనసాగుతున్నందుకు ప్రతి ఒక్కరూ గర్వ పడాలన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో పార్టీ ఎదుర్కొంటున్న ఇబ్బందులన్నీ తాత్కాలికమేనని అన్నారు.

ఔరంగాబాద్ ఇజ్తెమాకు ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : ఔరంగాబాద్‌లో జరుగుతున్న ముస్లిం ఇజ్తెమాకు దక్షిణమధ్యరైల్వే (దమరై) ప్రత్యేక రైళ్లు నడుపుతోంది.ఔరంగాబాద్ - భోకార్ మధ్య జనసదరన్ ప్రత్యేక రైలు (07103) ఈ నెల 27 న 13.55 గంటలకు బయలుదేరి అదే రోజు 18.35 గంటలకు చేరుకుంటుంది. మార్గ మధ్యలో ఈ రైలు జాల్నా, పార్టూరు, మన్వత్ రోడ్ , పర్బానీ, పూర్ణా, నాందేడ్, ముద్కేడ్ స్టేషన్లలో ఆగుతుంది.

సర్పంచ్‌ల సమ్మేళనం వాయిదా

హైదరాబాద్, ఆంధ్రప్రభ : సర్పంచుల సమ్మేళనం వాయిదా పడింది. మంగళవారం వరంగల్ కేంద్రంగా జరగాల్సిన సర్పంచుల సమ్మేళనం కొన్ని అనివార్య కారణాలవల్ల వాయిదా వేసినట్టు అధికారులు వెల్లడించారు. అంతే కాకుండా రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు ములుగు నియోజకవర్గ పర్యటన కూడా వాయిదా పడింది. సర్పంచుల సమ్మేళనం తిరిగి ఎప్పుడు నిర్వహించేది త్వరలో నిర్ణయిస్తామని అధికారులు వెల్లడించారు.

టీఆర్‌టీ పరీక్షకు 68శాతం హాజరు

● నేడు ఎస్ఏఫిజిక్స్, భాషా పండితుల పరీక్ష



హైదరాబాద్,ఆంధ్రప్రభ: సోమవారం జరిగిన టిఆర్‌టి పరీక్షలకు 68.85 శాతం మంది హాజరయ్యారు. సోమవారం ఉదయం స్కూల్ అసిస్టెంట్(ఇంగ్లీష్) పరీ క్ష జరిగింది. 6808 మంది రఖాస్తు చేసుకోగా వారిలో 4557 మంది హాజరయ్యారు. 66.9 శాతం హాజరయ్యారని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యదర్శి ఏ వాణిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 10 కేంద్రాల్లో పరీక్ష జరిగింది. మధ్యాహ్నం స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్ మీడియం గణితం, సాంఘిక శాస్త్రం సబ్జెక్టులకు పరీక్ష జరిగింది. ఈ పరీక్షకు 4552 మంది దరఖాస్తు చేసుకోగా 3225 మంది హాజరయ్యారు. 70.8 శాతం హాజరయ్యారు. 5 కేంద్రాల్లో పరీక్ష జరిగింది. 2 స్పెషల్ స్క్వాడ్స్ టీమ్‌లు పరీక్షలను పర్యవేక్షించినట్టు తెలిపారు.

ఇంటర్ హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు

● ప్రిన్సిపల్ సైన్ లేకున్నా అనుమతి:బోర్డు కార్యదర్శి

హైదరాబాద్,ఆంధ్రప్రభ: రేపటి నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ వార్షిక పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లను విద్యార్థులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఇంటర్‌బోర్డు కార్యదర్శి అశోక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్లను అనుమతించాలని పరీక్షా కేంద్రాల్లోని చీఫ్ సూపరింటెండెంట్లకు ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాల లోకేషన్‌ను స్మార్ట్ ఫోన్లలో ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. హాల్ టికెట్లను టిఎస్‌బిఐఈ.సీజీజీ.జీవోవి.ఇన్, ఎగ్జామ్.బిఐఈ.తెలంగాణ.జీవోవి.ఇన్, ఎడిఎంఐ.టిఎస్‌బిఐఈ.సీజీజీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్ల నుంచి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.

క్రీడల్లో మిలిటరీ ఇంజినీర్లకు ప్రోత్సాహం

● మేజర్ జనరల్ రాజు కె సుబ్రమణి

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : మిలిటరీలోని ఇంజినీర్లకు క్రీడల,సాహసకృత్యాల్లో పోటీలు నిర్వహించడం హర్షించదగ్గ విషయమని బరోడా ఈఎంఇ పాఠశాల మేజర్ జనరల్ రాజు కె సుబ్రమణి అన్నారు. డీజీ ఈఎంఈ ఆధ్వర్యంలో ఎలక్ట్రానిక్స్ అండ్ మెకానికల్ ఇంజినీరింగ్ (ఈఎంఇ) సిబ్బందికి నిర్వహించిన క్రీడాపోటీల బహుమతి ప్రదానోత్సవంలో ఆయన పాల్గొన్నారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో సుబ్రమణి మాట్లాడుతూ, ఆర్మీకి చెందిన మిల్ఖాసింగ్ అథ్లెటిక్స్‌లో జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించి పేరు ప్రఖ్యాతులు తెచ్చారని తెలిపారు. అదే విధంగా బ్రిగేడియర్ ఆర్‌కే మంచండ ఏడుసార్లు జాతీయ స్క్వాష్ ఛాంపియన్ షిప్‌ను కైవసం చేసుకున్నారని, మౌంట్ ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన మేజర్ హెచ్‌పిఎస్ అహ్లువాలియా, దక్షిణ ధృవాన్ని సందర్శించిన జేకే బజాజ్ ఈఎంఇ కళాశాలకు చెందిన వారేనని తెలిపారు. ఈ సందర్భంగా వివిధ పోటీలలో గెలుపొందిన వారికి 16 బ్లేజర్లను ప్రదానం చేశారు.

మైక్రో-బ్రేవరీ నిబంధనల సవరణ

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : తెలంగాణ మైక్రో - బ్రేవరీ నిబంధనలు -2015 ను ప్రభుత్వం సవరించింది. ఈ మేరకు సోమవారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. రాష్ట్ర ప్రొబిహిషన్ అండ్ ఎక్సైజ్ చట్టంలోని మైక్రో - బ్రేవరీ నిబంధనల్లోని రూల్ 18 -ఎ ను సవరిస్తూ గవర్నర్ ఆమోదం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సోమేష్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి వెబ్‌సైట్ హ్యాక్

● చర్యలు తీసుకోవాలని డీజీపీకి వినతి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : భారతీయ జనతా పార్టీ శాసనసభా పక్ష నాయకుడు జి. కిషన్‌రెడ్డి వెబ్‌సైట్‌ను హ్యాకింగ్‌కు గురైంది. హ్యాకింగ్ జరిగిన ఆదారాలను బట్టిచూస్తే ఇది పాకిస్థాన్‌కు సంబంధించిన వ్యక్తులు లేదా దేశ వ్యతిరేక శక్తుల పని అనిగా భావిస్తున్నామని పార్టీ కార్యాలయం కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని కిషన్‌రెడ్డి రాష్ట్ర డీజీపీకు, ఐజీ ఇంటలీజెన్సీకు, హైదరాబాద్‌లోని డిసిపి సైబర్ క్రైమ్స్‌కు ఫిర్యాదు చేశారు. ఇటువంటి సైబర్‌అనేరాలకు పాల్పడుతున్న వారిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి కఠినంగా శిక్షించాల్సిందిగా ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

నిర్మల్ కొత్తచెరువులో భవనాలు నిర్మించొద్దు

● హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : నిర్మల్ జిల్లా కేంద్రంలోని కొత్త చెరువు శిఖం భూమిలో జిల్లా ఏకీకృత కార్యాలయ భవనాల సముదాయాన్ని నిర్మాణాన్ని నిలిపివేసేలా తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించాలని అభ్యర్థిస్తూ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది. ఈ ప్రజాహిత వ్యాజ్యాన్ని నిర్మల్ జిల్లా భాజపా ఉపాధ్యక్షుడు, న్యాయవాది కె.అంజుకుమార్ రెడ్డి దాఖలు చేశారు. పాలకపక్షానికి చెందిన స్థానిక నాయకులకు ఆర్థికంగా లబ్ధి చేకూర్చేందుకు ఈ చెరువు శిఖాన్ని ధ్వంసం చేసి జిల్లా ఏకీకృత కార్యాలయ సముదాయాన్ని నిర్మిస్తున్నారని పిటిషనర్ తెలిపారు. ఆ చెరువు సమీపంలో రాజకీయ నాయకులకు పెద్ద మొత్తంలో భూములు ఉన్నందువల్లనే చెరువులో కార్యాలయ సముదాయాన్ని నిర్మిస్తున్నారని తెలిపారు.

బీసీలకు రూ. 10వేల కోట్లు కేటాయించాలి

● జాతీయ బీసీ సంక్షేమ సంఘం డిమాండ్



హైదరాబాద్,ఆంధ్రప్రభ: 2018-19 ఆర్థిక సంవత్సరంలో వెనుకబడిన తరగతుల వారి అభివృద్ధికి రూ. 10వేల కోట్లను కేటాయించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. వచ్చే ఏడాది రూ. 20వేల కోట్లతో బీసీలకు ప్రత్యేకంగా సబ్‌ప్లాన్‌ను అమలు చేయాలని సంఘం జాతీయ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ కృష్ణ అధ్యక్షతన సోమవారం సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం బీసీ భవన్‌లో జరిగింది. సమావేశంలో కుంచాల ఏడుకొండలు, బీరయ్య యాదవ్, నీల వెంకటేష్, అనిల్ కుమార్, పోతరాజు శ్రీనివాస్, శ్రీధర్, మున్నూరు రాజు, కృష్ణ సి రాజేందర్, ఎస్ రామలింగం తదితరులు పాల్గొన్నారు.బీసీ కార్పొరేషన్‌కు ఏటా రూ. 2వేల కోట్లు కేటాయించాలని, ఎంబీసీ కార్పొరేషన్‌కు ప్రత్యేకంగా మరో రూ. 2వేల కోట్లను కేటాయించాలని ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. కులవృత్తులను కోల్పోయిన వారికి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు.



పెద్దల సభలో ఎన్'ఢీ'యే!

• రాజ్యసభలో మారనున్న సమీకరణలు • మెజారిటీ దిశగా ఎన్‌డీఏ పక్షాలు • తగ్గిపోనున్న కాంగ్రెస్, విపక్షాల బలం • ఉమ్మడి అభ్యర్థులను పెట్టేందుకు విపక్షాల తహతహ • మార్చి 5న నోటిఫికేషన్, 23న ఎన్నిక

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : రాజ్యసభలో సమీకరణలు మారనున్నాయి. వచ్చే నెలలో 59 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. వీటిలో మెజారిటీ స్థానాలను బీజేపీ కైవసం చేసుకునే అవకాశం కనిపిస్తోంది. దీంతో రాజ్యసభలో ప్రతిపక్షాల బలం ఆ మేరకు పడిపోనుంది. 2014 నుంచి వరుసగా అనేక రాష్ట్రాలను గెలుచుకున్న బీజేపీ ఆ బలాన్ని రాజ్యసభలో ప్రతిబింబించనుంది. కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్షానికి ప్రస్తుతం 123 మంది సభ్యుల బలముండగా, ఎన్నికల తర్వాత అది 115కి పరిమితం కానుంది. అలాగే బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ బలం వంద స్థానాలుండగా, అది 109కి పెరగనుంది. అధి కార, విపక్షాల మధ్యనున్న అంతరం చాలా తగ్గనుంది. ప్రస్తు తం రిటైరవుతున్న ఎంపీలు 30మంది ప్రతిపక్షాలకు చెందిన సభ్యులుకాగా, 24మంది బీజేపీకి చెందిన సభ్యులు. ప్రతి పక్షాలు అనేక స్థానాలు కోల్పోతుండగా, అధికార సభ్యులు తిరిగి తమ స్థానాలను నిలబెట్టుకుంటారు. రాజ్యసభకు ఎన్ని కల ద్వారా 233 మంది సభ్యులు వస్తుండగా, 12 మందిని ప్రభుత్వం నామినేట్ చేస్తుంది. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీకి స్వ యంగా 54 మంది ఉండగా, ప్రతిపక్షాలతో కలిపి 123 మంది ఉన్నారు. ఎన్‌డీఏలో 83 ఉండగా, బీజేపీకి స్వయంగా 58 మంది సభ్యులతో అతిపెద్ద పార్టీగా ఉంది. నలుగురు స్వతంత్ర ఎంపీలు కూడా బీజేపీకి మద్దతుగా ఉన్నారు. ఇటు ఏఐఏడీఎంకె చెందిన 13మంది ఎంపీలు ఎన్‌డిఎకు మద్దతిస్తూనే ఉన్నారు. దీంతో కలిపి ఎన్‌డిఎకు 100 మంది సభ్యులున్నారు. ప్రతిపక్ష పార్టీలకు రాజ్యసభలో మెజారిటీ ఉన్న కారణంగా గత కొంత కాలంగా ప్రభుత్వం ఇబ్బందులు ఎదుర్కొంటోంది. తమ ఆధిక్యంతో ప్రతిపక్షాలు అనేక బిల్లులను అడ్డుకుంటున్నాయి. ఇటీవల ట్రిపుల్ తలాక్ బిల్లు, బీసీ కమిషన్ బిల్లులను సెలెక్ట్ కమిటీకి తిప్పి పంపింది. ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రసంగాల సమయంలోనూ రాజ్యసభలో ప్రతిపక్షాల నుంచి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్థిక బిల్లులకు రాజ్యసభ ఆమోదం తప్పనిసరి కాకపోవడంతో ప్రభుత్వానికి ఊరట లభిస్తోంది. అయితే ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారుతోంది. ఎన్‌డీఏకు అనుకూల సంఖ్యాబలం చేకూరుతోంది. బీజేపీ మిత్రపక్షాలలో 100 మందికి గాను 24మంది రిటైరవుతుండడంతో 76 మంది మిగలనున్నారు. అయితే ఎన్నికల తర్వాత కొత్తగా 30మంది రానున్నారు. దాంతో బీజేపీ సహా మిత్రపక్షాల బలం 106కు చేరుతుంది. ముగ్గురు నామినేటెడ్ సభ్యులతో కలిపి 109కు పెరగనుంది. వీటితో పాటు టిఆర్ఎస్, ఐఎన్ఎల్‌డి, వైసిపిలు కొన్ని అంశాలను మినహాయించి బీజేపీని పెద్దగా వ్యతిరేకించడం లేదు. కాంగ్రెస్ దాని మిత్రపక్షాలు పార్టీ 30 మంది సభ్యులను కోల్పోతుండడంతో వాటి సంఖ్య 93కి పడిపోతుంది. అయితే 22 మంది సభ్యులను గెలుచుకునే అవకాశం ఉండడంతో 115 సభ్యుల బలం చేకూరే అవకాశముంది. అధికార, విపక్షాల మధ్య సంఖ్యాబలం తగ్గిపోవడంతో ప్రభుత్వం ప్రతిపక్షాల దయాదాక్షిణ్యాలపై ఆధారపడకుండా తన బలంతో బిల్లులను గట్టెకించేందుకు వీలుకలుగుతుంది. మెజారిటీ మార్క్ 123క ు కొంత తక్కువున్నప్పటికీ అంశాలవారీగా కలిసివచ్చే పార్టీల సహకారంతో ప్రభుత్వానికి ఇక నుంచి బిల్లులపై పెద్దగా అవరోధాలు ఏర్పడే అవకాశం లేదు. లోక్‌సభలో స్వయంగా మెజారిటీ సాధించిన బీజేపీకి, రాజ్యసభలో మెజారిటీ కోసం ఇంతకాలం ఆగాల్సివచ్చింది. ఆయా రాష్ట్రాలలో పార్టీ సాధించిన విజయాలతో రాజ్యసభలో పార్టీ గొంతును, దృక్పథాన్ని సమర్ధవంతంగా వినిపించే వీలు కలుగుతుందని బీజేపీ నాయకుడొకరు అన్నారు. అయితే మహారాష్ట్రలో శివసేన అసమ్మతి స్వరం బీజేపీకి ఎన్నికల్లో ఇబ్బందిగా పరిణమించే అవకాశం ఉంది. మరికొన్ని చోట్ల ప్రతిపక్షాలు ఉమ్మడి అభ్యర్థిని నిలబెట్టే అవకాశాలున్న నేపథ్యంలో బీజేపీ వ్యూహకర్తలు ఆచితూచి అడుగులేస్తున్నారు. గుజరాత్ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పుంజుకోవడంతో ఆ రాష్ట్రం నుంచి పార్టీకి అదనంగా రెండు సీట్లు రానున్నాయి. ఆ మేరకు గుజరాత్‌లో బీజేపీ సంఖ్యాబలం తగ్గుతుంది. ప్రతిపక్షంలో పార్టీల వారీగా కాంగ్రెస్ నుంచి 13మంది, సమాజ్‌వాదీ నుంచి ఆరుమంది, తృణమూల్ నుంచి ముగ్గురు, ఎన్సీపి, బీజేడీ నుంచి ఇద్దరు, సిపిఎం, బిఎస్పీ, జెఎంఎం నుంచి ఒక్కొక్కరు రిటైరవుతున్నారు.

అధికార పక్షంలో పార్టీల వారీగా చూస్తే, బీజేపీ నుంచి 17మంది, జేడియు నుంచి ముగ్గురు, శివసేన, టీడీపీ నుంచి ఇద్దరేసి చొప్పున రిటైరవుతున్నారు. ఎన్నికల్లో నూతనంగా యూపి నుంచి తొమ్మిదిమంది, మహారాష్ట్ర నుంచి ఆరు, మధ్యప్రదేశ్, బీహార్ నుంచి అయిదు చొప్పున, గుజరాత్, కర్ణాటక నుంచి నాలుగు చొప్పున, రాజస్థాన్, ఒడిశా, ఏపీ, తెలంగాణ నుంచి మూడు చొప్పున ఉత్తరాఖండ్, హిమాచల్, ఛత్తీస్‌గఢ్ నుంచి ఒక్కొక్కరు చొప్పున ఎన్నిక కానున్నారు. రాజ్యసభ ఎన్నికలకు మార్చి 5న నోటిఫికేషన్ విడుదలవుతుండడంతో పార్టీలు ఇప్పటికే అభ్యర్థుల ఎంపికలో తలమునకలై ఉన్నాయి. మార్చి 23న ఓటింగ్ ఉండడంతో ఆ సమయానికల్లా పార్టీలలో సమీకరణలు మారకుండా తమ ఎమ్మెల్యేలను కాపాడుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఎన్నికల్లో పూర్తిగా బిజెపికి పూర్తిగా అనుకూల ఫలితాలు రానున్నాయి. రాజ్యసభలోసంఖ్యాబలం పెంచుకోవడం ద్వారా ప్రతిపక్షాలను ప్రభుత్వం మరింత నియంత్రించే అవకాశం పెరగనుంది.

పోలీస్ స్టేషన్ పై
ఉగ్రవాదుల దాడి


శ్రీనగర్: జమ్మూ కాశ్మీర్లోని పుల్వామా జిల్లాలో పోలీస్ స్టేషన్‌పై ఉగ్రవాదులు గ్రెనేడ్ విసిరిన ఘటనలో ఒక టెర్రరిస్టు మరణించాడు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. హిజ్బుల్ ముజాహిద్దిన్‌కు చెందిన ఉగ్రవాది ముస్తాక్ అహ్మద్ చోపాన్ బుర్ఖా ధరించి పోలీస్ స్టేషన్‌నుంచి తప్పించుకునే ప్రయత్నం చేశాడన్నారు. అయితే తప్పించుకునే ప్రయత్నంలో జరిగిన దాడిలో గ్రెనేడ్ అతని సమీపంలో పడటంతో ముస్తాక్ మరణించాడన్నారు. ఈ ఘటనలో కానిస్టేబుల్ మెహ రాజ్ దిన్‌కు కూడా గాయాలయ్యాయన్నారు. సోమవారం మధ్యాహ్నం 12.30 ప్రాంతంలో ఘటన జరిగిందన్నారు. టెర్రరిస్టులు ఉగ్రవాది పోలీస్ స్టేషన్ తప్పించుకునే ప్రయత్నంలో ప్రధాన గేటు వద్దకు చేరుకోగానే పోలీసుల దృష్టి మళ్లించేలా బయటనుంచి గ్రెనేడ్ విసిరారన్నారు. పోలీసులు తేరుకుని అప్రమత్తం అయ్యేలోపులో చోపాన్ తప్పించుకునేలా కుట్ర పన్నారన్నారు. అయితే బయటనుంచి ఉగ్రవాదులు విసిరిన గ్రెనేడ్ ముస్తాక్ సమీపంలోనే పడటంతో పేలుడు ధాటికి చోపాన్ మరణించాడన్నారు. ఈ ఘటనపై క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సిఆర్‌పిసి) సెక్షన్ 176ప్రకారం మెజిస్టీరియల్ విచారణ ప్రారంభించామన్నారు. బారాముల్లా జిల్లాలోని సోపోర్ ప్రాంతంలో చోపాన్‌ను అరెస్టు చేశామన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) ఎస్‌పి వేద్ మాట్లాడుతూ ఉగ్రవాది ముస్తాక్ అహ్మద్ చోపాన్ గ్రెనేడ్ పేలుడులో మరణించాడన్నారు. గత 24గంటల్లో ఉగ్రవాదులు పోలీసులపై దాడిచేయటం ఇది మూడవసారి అన్నారు. ఉగ్రవాదులు చరార్ ఏ షరీఫ్ ఏరియా, సౌరా ఏరియాలో జరిపిన వేర్వేరు దాడుల్లో ఇద్దరు పోలీసులు మరణించారన్నారు.

నియంత్రణ రేఖ వెంట ఉగ్రవాదుల నిరీక్షణ

భారీ సంఖ్యలో టెర్రరిస్టులు నియంత్రణ రేఖ (లైన్ ఆఫ్ కంట్రోల్) వెంబడి పలు ప్రాంతాల నుంచి దేశంలోకి చొరబడేందుకు నిరీక్షిస్తున్నారని ఆర్మీ కమాండర్ ఒకరు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే అధికసంఖ్యలో భారత్‌లోకి చొరబడేందుకు తీవ్రవాదులు నిరీక్షిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మాకు లభించిందన్నారు. వారు అనువైన వాతావరణం కోసం ఎదురు చూస్తున్నారన్నారు. నియంత్రణ రేఖ వెంబడి మంచు తీవ్రత తక్కువగా ఉండటం వల్ల చొరబాట్లను భద్రతాదళాలు గుర్తిస్తాయని వాళ్లు సరైన సమయం కోసం నిరీక్షిస్తున్నారన్నారు. కాగా భారత రక్షణ దళాలు ఉగ్రవాదుల చొరబాట్లను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలతో సిద్ధంగా ఉందని శ్రీనగర్ బేస్డ్ షినార్ కార్ప్స్ కమాండింగ్ జనరల్ ఆఫీసర్, లెఫ్టినెంట్ జనరల్ ఏకే భట్ అన్నారు.

కాంగ్రెస్‌ది త్రీడీ పాలన

• ధోకా, దాదాగిరి, డైనాస్టీ పాలిటిక్స్ అంటూ అమిత్‌షా విమర్శలు • కర్నాటకలో అధికారమే లక్ష్యంగా ప్రచారం



కలబుర్గి: పీఎన్బీ కుంభకోణంను ప్రస్తావిస్తూ ప్రధాని మోదీపై విమర్శలు వర్షం కురిపిస్తున్న కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ విమర్శలను బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా తిప్పికొట్టారు. అక్రమాలు కుంభకోణాలకు వ్యతిరేకంగా ప్రధాని నరేంద్ర మోదీ సర్కారు తీసుకున్నంత వేగవంతమైన చర్యలు మరే ప్రభుత్వం ఇప్పటివరకూ తీసుకోలేదన్నారు. అదే విధంగా అమిత్ షా కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై కూడా విమర్శలు సంధించారు. త్రీ డీ అంటూ డీ అంటే ధోకా(చీటింగ్) డీ అంటే దాదాగిరీ(గూండాయిజం) డీ అంటే డైనాస్టిక్ పాలిటిక్స్ (వంశపారంపర్య రాజకీయాలు) కాంగ్రెస్ విధానాలు అన్నారు. పంజాబ్ ఇంటర్నేషనల్ బ్యాంక్ కుంభకోణం కేసులో సీబీఐ, ఎన్ఫోర్సు మెంటు అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఈ సందర్భంగా విలేఖరులు ప్రధానిపై పీఎన్బీ కోట్ల కుంభకోణం విషయం లో రాహుల్ చేస్తున్న విమర్శలు ప్రస్తావించగా అమిత్ షా విలేఖరు లతో మాట్లాడుతూ దేశంలో జరిగి న కుంభకోణాలకు వ్యతిరేకం గా మోదీ సర్కార్ తీసుకున్నంత సత్వర కఠి న చర్యలు ఇప్పటివ ర కూ గతంలో ఏ ప్రభుత్వమూ తీసుకోలేదన్నారు. ఇది లాఉం డగా కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఉత్తర కర్ణాటకలోని విజయపుర, బంగాల్‌కోట్ జిల్లాల్లో నిర్వహించిన ర్యాలీలో మాట్లా డుతూ ప్రధాని నరేం ద్రమోదీని టార్గెట్ చేస్తూ పలు విమర్శలు చేశారు. భార తదేశ వాచ్‌మెన్‌గా వర్ణిం చుకున్న ప్రధాని మోదీ వజ్రా ల వ్యాపారి నీరవ్ మోదీ, ఆయన అంకుల్ మెహుల్ చోక్సీ చేసిన కుంభకోణంపై ఎందుకు నోరుమెదపటం లేదని ప్రశ్నించారు. ఈ విష యంపై స్పందించిన భాజపా అధ్యక్షుడు అమిత్‌షా మాట్లాడుతూ ఈడీ అధికారులు ఈ కేసు విషయంలో ఇంతకుముందే చర్యలు తీసుకున్నారని మనీ లాండ రింగ్ కేసు నమో దు చేశారన్నారు. సీబీఐ కూడా వీరిపై కేసు నమోదు చేసిందన్నారు. ఈడీ అధికారులు దాడులు నిర్వహించి నీరవ్ ఆస్తులను, ఆభరణాలను, షేర్లను, బ్యాంక్ ఖాతాలను సీజ్ చేశారన్నారు. కాగా కర్ణాటకలో కాంగ్రెస్ నేతృత్వంలోని సిద్ధరామయ్య సర్కారు పాలనఅన్నిరకాలుగా విఫలమైందన్నారు. అవినీతి, అక్రమాలును అరికట్టడంలో విఫలమయ్యా రన్నారు. రానున్న ప్రభుత్వం బీజేపీదే అన్నారు.



లోక్‌పాల్ ఏర్పాటులో జాప్యంపై ప్రధాని వివరణ ఇవ్వాలి

రామదుర్గ: దేశం లో అవి నీతి పెచ్చు మీరుతుంటే ప్రధా ని నరేంద్ర మోదీ అక్ర మా ర్కులకు వంత పాడు తూ అవి నీతి కి వ్యతిరే కంగా లోక్‌పాల్ ఏర్పా టులో ఎందుకు జాప్యం చేస్తున్నారో తెలపా లని కాంగ్రె స్ అధ్యక్షుడు రాహు ల్ గాంధీ అన్నారు. కర్ణాటకలో ఎన్నికల ప్రచారంలో విస్తృ తంగా పర్యటిస్తున్న రాహు ల్ ప్రతీ ర్యాలీలో ప్రధాని మోదీనే టార్గెట్ చేస్తూ విమ ర్శల దాడి చేశారు. నరేం ద్రమోదీ ప్రధానిగా బాధ్య తలు చేపట్టి నాలుగు సంవత్సరాలు గడిచినా ఇప్ప టివరకు గుజరా త్‌లో నూ లోకాయుక్తను అమలు చేయలే దన్నారు. చివరికి ఢిల్లీ లోనూ లోకాయుక్త విష యం లో ఉదాసీన వైఖ రినే అవలంబిస్తున్నారన్నారు. భాజ పా అధ్యక్షు డు అ కుమారుడు జే షా యా భైవే లతో వ్యాపారం ప్రారంభించి మూడునెలలు కా లం లో 80 కోట్లుకు అ ధిపతిగా మారినా ప్రధాని నోరు మెదపటం లేదన్నారు.

వెంటాడిన పోలీసులు
ఆవుల స్మగ్లర్ మృతి

జైపూర్: రాజస్థాన్ ఆల్వార్ జిల్లాలో ఆవులను అక్రమ రవాణా చేస్తున్న ట్రక్కును పోలీసులు వెంబడించారు. ఆ ట్రక్కులో ఉన్న మహ్మద్ అనే వ్యక్తి కిందికిదూకి పారిపోవడానికి ప్రయత్నించాడు. ఆ దూకడంలో అతడు ట్రక్కు కిం ద పడి ప్రాణాలు కోల్పోయాడు. ఆ ట్రక్కు నుంచి 23 ఆవులను స్వాధీనం చేసుకున్నట్టు రేణి పోలీసు స్టేషన్ అధికారి చెప్పారు. స్వాధీనం చేసుకున్న ఆవుల్లో ఐదు ఆవులు మరణించాయి. ఆ ట్రక్కు ఎవరిదో, ఆ ఆవులను ఎక్కడికి రవాణా చేస్తున్నారో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ట్రక్కు కింద పడి మరణించిన మహ్మద్ మృతదేహాన్నిఅతడి కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు పోలీసు అధికారి చెప్పారు.

రైళ్ల బెర్తుల కేటాయింపులో
మహిళలకు ప్రాధాన్యత

రైళ్లలో మహిళా కోటా కింద నిర్దేశించిన బెర్తులు ఖాళీగా ఉంటే వాటిని వెయిటింగ్ లీస్ట్ లో ఉన్న మహిళలకే కేటాయించేందుకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాల ని రైల్వేశాఖ నిర్ణయించింది. వెయిటింగ్ లీస్ట్ లో కూడా మహిళలు, వృద్ధులు లేకపోతే..సీనియర్ సిటిజన్లకు కేటాయించాలని పేర్కొంది. మహిళల కోటాలో బెర్తులను బుక్ చేసుకోవడానికి రిజర్వేషన్ చార్ట్ ప్రిపేర్ అయ్యేవరకు అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఈ కోటా లో మిగిలిన ఖాళీ బెర్తులను వెయిటింగ్ లీస్ట్ లో ఉన్న స్త్రీ, పురుషులకు బేధం లేకుండా కేటాయిస్తున్నారు. అయితే ఈ నిబంధనలను మారుస్తూ రైల్వే శాఖ నిర్ణయం తీసుకుంది. ఇక నుంచి ఖాళీ బెర్తులను వెయిటింగ్ లీస్ట్ లోని మహిళలకు, ఆ తర్వాత ఇతర మహిళలకు, ఇంకా ఖాళీగా ఉంటే సీనియర్ సిటిజన్లకు కేటాయించాలని స్పష్టం చేసింది.

అమెరికాలో దుండగుల కాల్పుల్లో
ఐదుగురు మృతి... ఒకరికి గాయాలు

ప్యూర్టోరికో: డౌన్ టౌన్ ప్యూర్టోరికో ప్రాంతంలో ఒక బార్ వద్ద జరిగిన కాల్పుల్లో ఐదుగురు మృతిచెందగా ఒక వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటనపై ప్యూర్టోరికాన్ పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఆదివారం అర్ధ రాత్రి ప్రాంతంలో శాన్జ్యాన్ సౌత్ వెస్ట్ ప్రాంతంలోని కొమెరియో టౌన్‌లో ఈ కాలుపుల ఘటన జరిగిందన్నారు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం వాహనంలో దూసుకు వచ్చిన కొంతమంది వ్యక్తులు ఆ ప్రాంతంలోని గుమికూడిన ప్రజలపై విచక్షణ రహితంగా కాలుపులకు తెగబడ్డారన్నారు. దీంతో 20నుంచి 34 ఏళ్ల మధ్యలో ఉన్న ఐదుగురు వ్యక్తులు మరణించారన్నారు. ఈ ఘటనలో 17ఏళ్ల బాలుడు ఒకరు గాయపడ్డారన్నారు. ఈ సంవత్సరంలో ఇప్పటివరకు 130మంది హత్యకు గురయ్యారని పోలీసులు తెలిపారు.



భారత్‌మాతా కీ జై అనుకంటే
దేశంలో ఉండొద్దు


• యూపీ ఎమ్మెల్యే సురేంద్ర వివాదాస్పద వ్యాఖ్యలు

లక్నో: ఉత్తర్ ప్రదేశ్ బీజేపీ ఎమ్మె ల్యే సురేంద్ర సింగ్ మ రోసారి వివా దాలకు కేంద్ర బిం దువయ్యారు. భారత్ మాతాకీ జై అనని వారిని పాకి స్తానీయులుగా పిలు స్తానని వ్యాఖ్యానించారు. ఎవరైతే భారత్ మాతాకీ జై.. వందే మాతరం అని నినాదం చేసేందుకు అభ్యంతరం వ్యక్తం చేస్తారో వారికి ఈ దేశంలో నివసిం చే హక్కు లేదు. మాతృభూమికి తల్లిహో దానివ్వని వారి దేశభక్తిని శంకించాల్సిందే. భా రత్ మాతా కీ జై అని నినదించేందుకు ఎవరికైతే అభ్యంతరం ఉంటుందో వారిని రాజకీయాల్లోకి కూడా అనుమతించొద్దు..అని సంచలన వ్యాఖ్యలు చేశారు. 20 24 నాటికి భారత్ హిందూ రా జ్యం గా మార బోతోందని గతనెల వివా దాస్పద వ్యాఖ్ యలు చేసిన సురేంద్ర మరో సారి కీలక వ్యాఖ్యలు చేయడం సోషల్ మీడి యాలో వైరల్ గా మారింది. కాంగ్రెస్ అధి నేత రాహుల్ గాం ధీకి భారతీయ సంస్కృ తీ, సాంప్రదాయాలపై పూర్తిస్థాయి అవగాహన లేదని.. రా హుల్‌లో భారత్, ఇటలీ సంస్కృతులు మిళితమయ్యా యని కామెంట్ చేశారు.



కాశ్మీర్ పరీక్షల్లో
పాక్ అనుకూల ప్రశ్న

జమ్ము కాశ్మీర్ పరీక్షల్లో మరోసారి తప్పుదొర్లింది. జమ్ము సర్వీస్‌సెలక్షన్ బోర్డు నిర్వహించిన పరీక్షల్లో ఓ ప్రశ్నను పాకిస్తాన్ కు అనుకూలంగా ఇచ్చారు. పట్వారీ పరీక్షల్లో పాక్ ఆక్రమిత కాశ్మీర్ ను ఆజాద్ కాశ్మీర్‌గా ముద్రించారు. దీనిపై సోషల్ మీడియాలో పెద్ద దుమారం రేగుతోంది. బోర్డు అధికారుల నిర్వాకాన్ని తప్పుబడుతూ నెటిజన్లు తీవ్రస్థాయిలో మండి ఎడుతున్నారు. భూగోళ శాస్త్రానికి సం బంధిం చిన86 ప్రశ్నలో ఆజాద్ కాశ్మీర్, గిల్గిత్ బల్టిస్తాన్ లను లైన్ ఆఫ్ కంట్రోల్ ఏ వైపు నుంచి వేరు చేస్తుంది అని అడిగా రు. పాకి స్తాన్, కాశ్మీర్ ల మధ్య సరిహద్దు రేఖ ఎక్క డి నుంచి ఎక్కడి వరకు ఉంది అని ఇవ్వా ల్సిన ప్రశ్నను తప్పుగా ముద్రించారు. దీ నిపై స్పం దించిన బోర్డు నిర్వాహకులు తక్షణమే బాధ్యులపై తగిన చర్యలు తీ సుకుంటామని ప్రకటించారు.


with China in the north and east, and the l
separates it from the Pakistan-controlled
Azad Kashmir and Gilgit-Baltistan in the
A) North and northeast respectively
B) South and southeast respectively
C) East and northeast respectively

టోర్నడోల బీభత్సం..
ఐదుగురు మృతి

చార్లిస్టోన్: సెంట్రల్ అమెరికా ప్రకృతి విపత్తుల ధాటికికుదేలైంది. టోర్నడోలు సృష్టించిన బీభత్సానికి ఇళ్లన్నీ నేలమట్టం అయ్యాయి. ఉరుములు మెరుపుల దాడిలో వేర్వేరు ప్రాంతాల్లో ఐదుమంది ప్రాణాలు విడిచారు. మిచిగాన్‌లో 48ఏళ్ల వ్యక్తి మృతదేహం వరదనీటిలో కొట్టుకొచ్చిందని ప్రజారక్షణ అధికారి లెఫ్టినెంట్ డేవిడ్ థామస్ తెలిపారు. మృతుని వివరాలు ఇంకా తెలియలేదన్నారు. కలామాజూలో గత వారం భారీ వర్షాలు కురవటంతో మంచుకరిగి వరదలు ముంచెత్తాయి. వరదల ధాటికి ముగ్గురు మరణించగా వారిలో ఇద్దరి మృతదేహాలను నీటిలో మునిగిపోయిన వాహనాల నుంచి స్వాధీనం చేసుకున్నామని, మరో వ్యక్తి మృతదేహం మోర్గాన్‌ఫీల్డ్ వద్ద స్వాధీనం చేసుకున్నామన్నారు. అదేవిధంగా వేర్వేరు ప్రాంతాల్లో మరో ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయని అధికారులు తెలిపారు. గంటకు 120కిలీమీటర్ల వేగంతో వీచిన పెనుగాలులు పెను విధ్వంసాన్ని సృష్టించాయని అధికారులు తెలిపారు.



పోలింగ్‌కు సర్వం సిద్ధం

• మేఘాలయ, నాగాలాండ్‌లో అసెంబ్లీ ఎన్నికలు • మొత్తం 118 స్థానాలకు పోలింగ్ • సమస్యాత్మక ప్రాంతాల్లో గట్టి నిఘా • రెండు చోట్ల ఎన్నిక వాయిదా • మార్చి 3న ఫలితాలు



షిల్లాంగ్/కొహిమా: ఈ శాన్య రాష్ట్రాలు మేఘా లయ, నాగాలాండ్ లో నేడు అసెంబ్లీ ఎన్నికలు జరగను న్నాయి. రెండు రాష్ట్రాల్లో పోలింగ్‌కు ఎన్నికల కమిషన్ అన్ని ఏర్పాట్లు చేసింది. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం నాలుగు గం టల వరకు పోలింగ్ కొన సాగనుంది. కొన్ని జిల్లాల్లో మాత్రం సాయంత్రం మూ డు గంటల వరకు పోలింగ్‌కు డెడ్‌లైన్ పెట్టారు. వేసవి కాలం కావడంతో ఓటర్ల కో సం పోలింగ్ బూత్‌ల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నాగాలాండ్ 60 , మేఘా లయలో 60 అసెంబ్లీ స్థానాలుండగా.. ఇరు రాష్ట్రాల్లో ఒక్కో అభ్యర్థి మరణం కారణంగా 118 స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. మేఘాలయలో ఎన్సీపీ అభ్యర్థి హత్య నేపథ్యంలో విలియంనగర్ ఎన్నిక వాయి దాపడింది. రెండు రా ష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు మార్చి 3న విడుదల కానున్నాయి. ఈ శాన్య రాష్ట్రాల్లో అధికారమే లక్ష్యంగా బీజేపీ, వామపక్షా లు, కాంగ్రెస్ పార్టీలు పోటాపోటీగా ప్రచారం నిర్వహించాయి. అస్సాంలో ప్రభు త్వాన్ని ఏర్పాటుచేసిన బీజేపీ అదేఊపులో మణిపూర్, అరుణాచల్ ప్రదేశ్ లోని అధికారాన్ని హస్తగతం చేసుకుంది. నాగాలాండ్, మేఘాలయలోనూ అధికా రమే లక్ష్యంగా ప్రధానమంత్రి నరేంద్రమోడీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమితా షా ర్యాలీలు, రోడ్‌షోలతో హోరెత్తించారు. అయితే కాంగ్రెస్‌కు ఈ ఎన్నికలు ప్రత్యేకంకాబోతున్నాయన్నది విశ్లేషకుల మాట.

నాగాలాండ్ లో స్థానిక పార్టీ ఎన్డీపీపీతో పొత్తు పెట్టుకున్న బీజేపీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రచారం సాగించింది. ఈ ఎన్నికల్లో ఎన్డీపీపీకి ఏ కంగా 40 స్థానాలు కట్టబెట్టి..బీజేపీ 20 స్థానాల్లోనే తమ అభ్యర్థులను ప్రకటించడం గమనార్హం. మేఘాలయలో 370 మంది అభ్యర్థులు బరిలో ఉం డగా..వారిలో గతంలో కంటే అత్యధికం గా 32 మంది మహిళా అభ్యర్థులు పోటీ చేస్తున్నట్లు ఈసీ ప్రకటించింది. మొత్తం 18లక్షల 40వేల ఓటర్లున్న మేఘాల యలో 3వేల 83 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. ఈసారి 61 మోడల్ పోలింగ్ స్టేషన్లను



ఏర్పాటుచేసినట్లు చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఖారకోన్గర్ తెలిపారు. ఇక నాగా లాండ్‌లో మొత్తం 11 లక్షలు 91వేల 513 మంది ఓటర్లుండగా.. పోలింగ్ కోసం 2వేల 156 పోలింగ్ స్టేషన్లు ఏర్పాట్లు చేసినట్లు ఈసీ ప్రకటించింది. వీటిలో 117 మహిళా పోలింగ్ స్టేషన్ ఉండటం గమనార్హం. పోలింగ్ కోసం 15వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగుల సేవలు వినిపించుకుంటున్నారు. ఈశాన్య రాష్ట్రాల ఎన్నికల నేపథ్యంలో భద్రతను కట్టుదిట్టం చేశారు.

రూ. 38 లక్షలు సీజ్

మేఘాలయలో ఎన్నికలకు ఒకరోజు ముందు కూడా డబ్బుల పంపిణీ యదేచ్ఛగా సాగినట్లు తెలుస్తోంది. తూర్పు ఖాసీ కొండ జిల్లాలో సోదాల్లో పోలీసులు రూ. 38లక్షలు సీజ్ చేశారు. ఓ వ్యక్తి నుంచి స్వాధీనం చేసుకున్న పోలీసులు ఆ డబ్బును సంబంధిత అధికారులకు అందజేశారు. డబ్బు స్వాధీనం చేసుకున్న తర్వాత ఆ వ్యక్తిని విచారించారు. ఎన్నికల జరిగే తేదీ నాటికి మేఘాలయలో మొత్తం రూ.70 లక్షల రూపాయలు సీజ్ చేసినట్లు అధికారులు వెల్లడించారు.

అడ్మిట్ కార్డులను తొక్కి పట్టకూడదు

న్యూఢిల్లీ: కేంద్ర సెకండరీ విద్యా బోర్డు సిలబస్ అమలులో ఉన్న పాఠశాలల్లో నిర్వహించే ప్రీబోర్డు పరీక్షల్లో మార్కులు బాగా రాలేదని పదవ, పన్నెండవ తరగతి విద్యార్థుల ప్రవేశ పత్రాలను (అడ్మిట్ కార్డులను) తొక్కి పట్టకూడదని ఆ పాఠశాలలను సిబిఎస్ఇ హెచ్చరించింది. కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల అడ్మిట్ కార్డులనుతొక్కి పడుతున్నట్టు ఫిర్యాదులు వచ్చాయనీ, ఈ కార్డులను ఇవ్వడానికి కొన్ని పాఠశాలలు ఫీజులు వసూలు చేస్తున్నట్టు ఫిర్యాదులు వచ్చాయని సీబీఎస్ఈ పేర్కొంది. ప్రీ బోర్డు పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు హాజరు కాకుండా చేయడం కోసం ఆ పాఠశాలలు ఇలాంటి పద్ధతులను అనుసరిస్తున్నట్టు తెలియవచ్చిందనీ, ఇది మంచిపద్ధతి కాదని సీబీఎస్ఈ హెచ్చరించింది. అలాగే, అడ్మిట్ కార్డుల జారీ కోసం ఫీజు వసూలు చేస్తే చర్యలు తప్పవని ఆ సంస్థ హెచ్చరించింది.

గ్యారెంటీ ఉన్న సెక్యూరిటీలకు ఇబ్బందిలేదు

న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణం వల్ల గ్యారంటీ ఉన్న సెక్యూరిటీలకు ఎటువంటి ఇబ్బంది లేదని రేటింగ్ సంస్థ ఫిచ్ పేర్కొంది. పిఎన్‌బి ఇప్పటికీ గ్యారంటీ సెక్యూరిటీల లావాదేవీలకు అర్హమైనదేనని ఫిచ్ పేర్కొంది. అసెట్ బ్యాక్ సెక్యూరిటీలు బాండ్లరూపంలో కాని, నోట్ల రూపంలో కాని ఉండవచ్చని పేర్కొంది. క్రెడిట్ కార్డురిసీవబుల్స్, ఆటో రుణాలు, ఇళ్ళ కాంట్రాక్టులు, హోమ్ ఈక్విటీ లోన్స్ వంటి లావాదేవీలకు ఇబ్బంది లేదనీ, అయితే, ఆ బ్యాంకురేటింగ్ మాత్రం బిబిబికి దిగువకు పడిపోతుందని ఫిచ్ సంస్థ పేర్కొంది.



కరీంనగర్ రైతు సమన్వయ సమితి సదస్సులో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్

రైతుకు బీమా ధీమా

• ముఖాముఖీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి కేసీఆర్

కరీంనగర్, ప్రభన్యూస్ బ్యూరో : రైతు బీమా పథకాన్ని కరీంనగర్ వేదికగా జరిగిన రైతు సమన్వయ సమితి ప్రాంతీయ అవగాహన సదస్సులో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. హుస్నాబాద్‌కు చెందిన రైతు ప్రతాప్‌రెడ్డి రైతు బీమాను మండలం యూనిట్‌గా కాకుండా రైతు యూనిట్‌గా ప్రకటించాలని కోరగా ఆయన బీమా పథకం ఎలా అమలుచేయబోతున్నామో సీఎం ప్రకటించారు. రైతు సమన్వయ సమితి మండల బాధ్యులు అడిగినపలు ప్రశ్నలకు సీఎంతోపాటు రాష్ట్ర భారీనీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు, వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్‌లు సమాధానం చెప్పారు. సీఎం కేసీఆర్ ప్రశ్నల ఆధారంగా సీఎం కేసీఆర్ రైతు సమన్వయ సమితి బాధ్యులు సంధించిన ప్రశ్నలకు ఆయా శాఖల మంత్రులచే సమాధానం చెప్పించారు.

ప్రశ్న: రైతు బీమా పథకాన్ని ప్రతి ఒక్కరికి అందేలా చర్యలు తీసుకోవాలి, రైతును యూనిట్‌గా వర్తింపచేయాలి ?

-ప్రతాప్‌రెడ్డి, హుస్నాబాద్, సిద్దిపేట జిల్లా

సీఎం కేసీఆర్: రాష్ట్రప్రభుత్వం ఈ బీమా పథకాన్ని అమలు చేయడానికి 500 కోట్ల రూపాయలను కేటాయిస్తాం, 70లక్షల మందికి వర్తింపజేస్తాం. రైతు ప్రమాదానికి గురైనా, సహజ మరణానికి కూడా ఈ బీమా వర్తిస్తుంది. మండలాన్ని యూనిట్‌గా కాకుండా రైతును యూనిట్‌గా చేసి అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: పంటకు ఇచ్చే పెట్టుబడి మామిడి తోటలకు కూడ వర్తింపచేయాలి

- మల్లారెడ్డి - మంథని , పెద్దపల్లి జిల్లా

సీఎం కేసీఆర్: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రైతు పెట్టుబడి లో మామిడి రైతులను చేరుస్తాం. మామిడి తోటలతో పాటు అన్నిరకాల పండ్లతోటలకు వర్తింపజేస్తాం. 75 శాతం సబ్సిడీపై డ్రిప్ ఇరిగేషన్‌కు అందజేస్తాం.

ప్రశ్న: ఎస్సారెస్పీ ద్వారా చివరి భూములకూ నీరందించాలి

- డీ. రాజయ్య, పెద్దపల్లి

సీఎం కేసీఆర్: కాలువ చివరి భూముల వరకు ఎస్సారెస్పీ ద్వారా నీరు అందిస్తాం. రానున్న రోజుల్లో కాళేశ్వరం ప్రాజెక్టుల ద్వారా ప్రతి గుంట భూమికి నీరందించడమే కాకుండా రెండు పంటలు సమృద్ధిగా పండించే విధంగా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: గ్రామాల్లో కోతులు సంచరించడం వల్ల పంటలు దెబ్బతింటున్నాయి, నివారించండి ?

పి.రామస్వామి, జనగామ

సీఎం కేసీఆర్: అడవుల్లో ఉండే విలువైన పండ్ల చెట్లను నరికివేయడం వల్ల వాటికి ఆహారం దొరకక ఊరిలోకి వస్తున్నాయి. వాటి నివారణకు చర్యలు తీసు కోవ డమే కాకుండా హరితహారం ద్వారా అడవుల్లో పండ్ల మొక్క లను పెంచే విధంగా చర్యలు తీసుకుంటాం. హరిత హారం విషయం లో శ్రద్ధ చేస్తే ఇలాంటి సమస్యలు ఎదురు వుతాయి.

ప్రశ్న: రైతు పెట్టుబడి పథకాన్ని ఏజెన్సీ ప్రాంతాలకు వర్తింప చేయాలి ?

ఎం. రాజమల్లయ్య, మహాముత్తారం, జయశంకర్ భూపాలపల్లి జిల్లా

సీఎం కేసీఆర్: ఏజెన్సీ ప్రాంతాలను ఈ ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుంది. రైతు పెట్టుబడులను గిరిజన రైతులకు వర్తింపజేస్తాం. ఎట్టిపరిస్థితుల్లో అధైర్య పడవద్దు. ఈ ప్రభుత్వం అండగా ఉంటుంది.

ప్రశ్న: కౌలురైతులకు పెట్టుబడి ఇవ్వాలి ?

- శంకరయ్య, పెద్దపల్లి జిల్లా

సీఎం కేసీఆర్: ఎట్టి పరిస్థితుల్లోను కౌలు రైతు లకు పంట పెట్టు బడి ఇచ్చే ప్రసక్తిలేదు. నిరంతరం పంటలకోసం శ్రమిం చే రైతు లకు మాత్ర మే ఈ పథకాన్ని పూర్తి స్థాయిలో అందిస్తాం. కౌల్రు రైతు భూ యజమానితో కుదుర్చుకునే ఒప్పందం ఎంతకాలం ఉంటుందో తెలియని పరిస్థితి, యజమాని ఇష్టాను సారం పెట్టుబడి కౌలురైతుకు ఇస్తామంటే అభ్యంతరం ఉండదు.

ప్రశ్న: కడెం ప్రాజెక్టు ఎత్తు పెంచాలి

- మైలాపురం రాజయ్య, అదిలాబాద్

మంత్రి హరీష్‌రావు : కడెం ప్రాజెక్టు ఎత్తు పెంచడానికి కొన్ని సాంకేతిక సమస్యలు ఉన్నాయి. 800 కోట్ల రూపాయలతో దీని వద్ద కుట్టి ప్రాజెక్టు నిర్మిస్తున్నామని, దీంతో 7.63 టీఎంసీల నీరు అందుతుంది. దీనివల్ల ఈ ప్రాంతంలోని వ్యవసాయ రైతులకు సాగునీటికి ఎలాంటి ఇబ్బంది ఉండబోదు.

ప్రశ్న: గ్రామీణ ప్రాంతాలలో గోదాములు లేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయి?

- ఎం.రాజగోపాల్, వరంగల్ రూరల్

మంత్రి హరీష్‌రావు : గత ప్రభుత్వాలు 60 సంవత్సరాలలో 4లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాములు నిర్మిస్తే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏడాదిలోనే 1032 కోట్ల రూపాయలతో 18లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాములను నిర్మించాం. 356 మండలాలలో సైతం ఆ ప్రాంతాలకు సరిపడ సామర్థ్యంగల గోదా ములను ఏర్పాటు చేశాం, కొత్త మండలాలలో గోదా ములు నిర్మించేందుకు ప్రతిపాదనలు రూపొం దిస్తున్నాం.

ప్రశ్న: పాకాల వాగుపై రిజర్వాయర్ నిర్మించాలి ?

- చంద్రశేఖర్ , భూపాల్‌పల్లి

మంత్రి హరీష్‌రావు : పాకాల వాగుపై త్వరలోనే ప్రాజెక్టు నిర్మిస్తాం. దీని ద్వారా వందశాతం పంట పొలాలకు నీరందేలా చర్యలు తీసుకుంటాం. పాకాల ప్రాజెక్టు ద్వారా దేవాదుల నీటిని మళ్లించేందుకు చర్యలు తీసుకుంటాం. మెండికుంటను రిజర్వాయర్‌గా మారుస్తాం.

ప్రశ్న: సూక్ష్మసేద్యం పరికారలపై జీఎస్‌టీ ప్రభావం పడింది ?

- నారాయణ, ఇల్లంతకుంట, కరీంనగర్ జిల్లా

మంత్రి ఈటల రాజేందర్ : జీఎస్‌టీ వచ్చిన తరువాత కొన్ని కొన్నింటిపై 18 శాతం పన్ను ఉండేది, కేంద్రంపై ఒత్తిడి పెంచి 12శాతానికి తగ్గించాం. అవసరమైతే కేంద్ర ప్రభుత్వంపై మరింత ఒత్తిడి పెంచి ఎరువులు, సూక్ష్మసేద్యం పరికారలపై జీఎస్టీ భారాన్ని తగ్గించేలా చర్యలు తీసుకుంటాం.



జలవిధానం, రైతు సమస్యలపై
కేంద్రాన్ని నిలదీద్దాం

• ఈజీఎస్‌ను వ్యవసాయానికి అనుసంధానం చేయాలి
• నీటిపారుదలకు బడ్జెట్‌లో భారీ కేటాయింపులు
• రైతు సమన్వయ సమితి అవగాహన సదస్సులో సీఎం కేసీఆర్

కరీంనగర్, ప్రభన్యూస్ బ్యూరో : రైతుల స్థితిగతులను అర్థం చేసుకోవడంలో కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు విఫలం అయ్యాయని, వారి అసమర్థ విధానాల వల్లే రైతు ఆత్మహత్యలు పెరిగాయని ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు ధ్వజమెత్తారు. సోమవారం అంబేద్కర్ స్టేడియంలో జరిగిన తెలంగాణ రైతు సమన్వయ సమితి ప్రాంతీయ అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. నదులు, వర్షాధారం ద్వారా 70వేల టీఎంసీల నీటి లభ్యత ఉందని, ఇందులో 35 శాతం మాత్రమే సద్వినియోగం అవుతున్నదని తెలిపారు. ఇందుకు కారణం తెలివి తక్కువ కాంగ్రెస్, బీజేపీలు కారణం కాదా అంటూ ప్రశ్నించారు. దమ్ముంటే తన ప్రశ్నకు జవాబు చెప్పాలని నిలదీశారు. కర్నాటక ఎన్నికలు సమీపిస్తున్నం దునే, గోదావరి- కావేరి అనుసం ధానాన్ని కేంద్రం తెరమీదికి తెచ్చిందన్నారు. రైతు సమస్యలు, జలవిధానంపై అవసరమైతే తెలంగాణ రైతు సమన్వయ సమితి ద్వారా అందరిని సంఘటితం చేసి పోరాటం చేసేందుకు కూడ వెనుకాడేది లేదని తెలిపారు. తెలంగాణ వచ్చి నాలుగేళ్లు కావస్తున్నా గోదావరి వాటా తేలలేదని, కావేరి అనుసంధానం పేరిట కేంద్రం డ్రామా ఆడు తున్నదన్నారు. ఉపాధి హామి పథకాన్ని వ్యవసా యానికి అనుసంధానం చేయమని కేంద్రాన్ని ఎన్నిసార్లు కోరినా ఉపయోగం లేకుండా పోయిందన్నారు. అందుకే 17 జిల్లాల రాష్ట్రసమన్వయ సమితి ప్రాంతీయ సదస్సులో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో వ్యవసాయాన్ని అనుసంధానం చేయాలని తీర్మాణాన్ని ప్రవేశపెడుతున్నట్లు సీఎం వేదికపై ప్రకటించారు.

సదస్సుకు హాజరైన వేలాదిమంది సభ్యుల నినాదాల మధ్య తీర్మాణం ప్రవేశపెట్టగా ఏకగ్రీవంగా ఆమో దం తెలిపారు. ఏ రాష్ట్రంలో లేనివిధంగా సాగు నీటి ప్రాజెక్టులకు ఖర్చు పెడుతు న్నామని, ఈ బడ్జెట్‌లో కూడ భారీ



కేటాయింపులు ఉంటాయని, ఇందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని తెలిపారు. సమావేశంలో వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షత వహించగా రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్, నీటిపారుదలశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు, ఉప ముఖ్య మంత్రి కడియం శ్రీహరి, మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, ఇంద్రకరణ్‌రెడ్డి, జోగు రామన్న, ఎంపీ లు వినోద్‌కు కుమార్, కల్వకుంట్ల కవిత, రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతరావు, రైతు సమస్వయ సమితి చైర్మన్ నల్లగొండ ఎంపీ గుత్త సుఖేందర్ రెడ్డి, వివిధ జిల్లాల ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్పీ చైర్మన్లు పాల్గొన్నారు.

ముంబయ్.. ప్రభుత్వోద్యోగుల జాయ్!

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నతోద్యోగుల వార్షికాదాయం 2,17,165 అమెరికన్ డాలర్లుగా ఉన్నట్లు నమోదైంది. హెచ్‌ఎస్‌బీసీ బ్యాంక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ తాజాగా ఈ సర్వేను నిర్వహించింది. ప్రపంచ వ్యాప్తంగా 159దేశాలకు చెందిన ప్రధాన నగరాల్లోని అత్యున్నత ఉద్యోగుల ఆదాయాన్ని ఈ సంస్థ అధ్యయనం జరిపించింది. 27,587 మంది నుంచి వివరాలు సేకరించింది. షాంఘై, న్యూయార్క్, హాంకాంగ్, ప్యారీస్, లండన్‌లలోని ఉన్నతోద్యోగుల కంటే కూడా ముంబైలోని ఉన్నతాధికారులే అత్యధికంగా సంపాదిస్తున్నట్లు ఈ నివేదిక నిగ్గు తేల్చింది. అత్యధిక ఆదాయం లభిస్తున్న నగరాల్లో ముంబై మొదటి స్థానంలో ఉంటే శాన్‌ఫ్రాన్సిస్కో రెండో స్థానంలో నిల్చింది. జ్యూరిచ్, షాంఘై, జెనీవా, న్యూయార్క్, లాస్‌ఏంజెల్స్, జకార్తా, హాంకాంగ్, ప్యారీస్‌లు వరుసగా పదిస్థానాలు సాధించాయి. లండన్ 26, డబ్లింగ్ 37, బెర్లిన్ 42, ప్రేగ్ 46, స్థానాలతో సరిపెట్టుకుంటే బెర్మింగ్‌హామ్ 50వ స్థానంలో నిల్చింది. అత్యున్నత స్థాయి ఉద్యోగులకు అత్యధిక జీతాలు లభిస్తున్న నగరాల్లో ఆసియా నుంచి ముంబైతో పాటు షాంఘై, జకార్తా, హాంకాంగ్‌లు మాత్రమే తొలి పదిజాబితాలో చోటు దక్కించుకున్నాయి. లండన్, శాన్‌ఫ్రాన్సిస్కో, న్యూయార్క్, బెర్మింగ్‌హామ్ వంటి నగరాలతో పోలిస్తే ముంబైలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించడం కష్టమేనన్న భావం ఈ అధ్యయనంలో వెల్లడైంది. అమెరికా, ఇంగ్లండ్ వంటి ఆర్థికసాంకేతికకేంద్రాల్లో పని చేస్తున్న ఉద్యోగులకంటే కూడా ముంబై ఉద్యోగులు అధిక జీతాలు పొందగలుగుతున్నారు. యూరోప్‌లోనే ఐదు అతిపెద్ద సాంకేతిక నగరాల్లో ఒకటైన డబ్లింగ్‌లో ఉద్యోగులకంటే ముంబై ఉద్యోగులు దాదాపు రెండున్నర రెట్లు అధికంగా ఆదాయం పొందుతున్నారు. ఐర్లాండ్ కంటే 61శాతం అధికంగా ముంబై ఉద్యోగులు జీతాలు పొందుతున్నారు. క్రెడిట్ శుసీ గ్రూప్ ఎజి, యూబీఎస్ గ్రూప్ ఎజి వంటి అతిపెద్ద బ్యాంకింగ్ కేంద్రాలున్న స్విట్జర్లాండ్‌లోని జ్యూరిచ్ నగరంలోని ఉద్యోగులు, ప్రపంచంలోనే అతిపెద్ద వ్యాపార సంస్థ ట్రాఫిగురా గ్రూప్, మెర్క్యూరియా ఎనర్జీ గ్రూప్ ప్రధాన కేంద్రాలున్న జెనీవా నగరాల్లోని ఉద్యోగులు కూడా ముంబై ఉద్యోగుల జీతభత్యాలతో పోటీపడలేకపోతున్నారు. స్విట్జర్లాండ్‌లో ఆదాయం అధికంగానే ఉన్న అక్కడ జీవన వ్యయం అంతకుమించి పెరిగిపోయింది. ఆదాయపన్ను 77శాతం వరకు వసూలు చేస్తున్నారు. దీంతో జ్యూరిచ్‌లోని ఉద్యోగులు మరోచోటికి తరలిపోయేందుకు ప్రాధాన్యతనిస్తున్నారు. ఎటువంటి ఇబ్బందుల్లేకుండా ప్రభుత్వం నుంచి పెద్దగా ఒత్తిళ్ళు రాకుండానే పెద్దమొత్తాల్లో జీతాలు పొందుతూ హాయిగా జీవనం వెళ్ళదీస్తున్నవారు మాత్రం మన ముంబై ఉద్యోగులే. ఒకప్పుడు అతిపెద్ద మురికివాడలకు పేరుగాంచిన ముంబై ఇప్పుడు అత్యున్నత జీవన ప్రమాణాలు పొందుతున్న ఆదాయ వర్గాలకు నిలయంగా మారినట్లు ఈ అధ్యయనం తేటతెల్లం చేస్తోంది.

కృష్ణావతారంలో శ్రీవారు

తిరుమల, ప్రభ న్యూస్: తిరుమల శ్రీవారి తెప్పోత్సవాలలో భాగంగా రెండవ రోజైన సోమవారం శ్రీవారి పుష్కరిణిలో సంధ్యా సమయాన రుక్మిణి సమేతంగా శ్రీకృష్ణావతారంలో విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించిన తెప్పపై ఆనంద విహారం చేశారు. ప్రతి సంవత్సరం పాల్గుణమాసంలో శుద్ధ ఏకాదశి రోజున తెప్పోత్సవాలను ప్రారంభించి పౌర్ణమి వరకు టీటీడీ వైభవంగా నిర్వహిస్తున్నది. తెప్పోత్సవాలలో భాగంగా తొలిరోజు సీతాలక్ష్మణ ఆంజనేయ సమేతంగా శ్రీరామచంద్రమూర్తి అవతారంలో స్వామివారి పుష్కరిణిలో తెప్పపై అధిరోహించి మూడుసార్లు ప్రదక్షిణగా విహరిస్తూ భక్తులను కనువిందు చేశారు. ద్వాదశి రోజైన సోమవారం నాడు స్వామివారు శ్రీకృష్ణస్వామి అవతారంలో పురవీధులలో ప్రదక్షిణగా ఊరేగుతూ పుష్కరిణిలో తెప్పపై ఆశీనులై ముమ్మారు విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి శోభాయమాన రూపాన్ని తిలకించిన భక్తులు తన్మయంతో పులకించి పోయారు. మూడవ రోజైన త్రయోదశినాడు మంగళవారం భూ సమేతంగా మలయప్ప స్వామివారు తిరుచ్చినెక్కి సర్వాలంకార భూషితుడై పురవీధులలో ఊరేగుతూ తెప్పపై భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ తెప్పోత్సవాలలో టీటీడీ ఈఓ అనిల్ కుమార్‌సింఘాల్, తిరుమల జేఈఓ శ్రీనివాసరాజు, ఆలయ డిప్యూటీఈఓ హరీంద్రనాథ్, అర్చకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆస్ట్రేలియా, సింగపూర్‌లకు ధీటుగా
తెలంగాణలో సంపద పంపిణీ

(మొదటిపేజీ తరువాయి)

మారింది. ఇదే విధానాన్ని భారత్‌లో తొలిసారిగా తెలంగాణ ప్రభుత్వం ఆచరణలోకి తెచ్చింది. సింగపూర్‌లో సంపద అనూహ్యంగా పెరిగింది. ఇప్పటికే అక్కడ మౌలిక సదుపాయాల రంగం ఊడలేసింది. కొత్తగా ప్రభుత్వం ఈ రంగంలో పెట్టుబడులు పెట్టి సదుపాయాలు కల్పించాల్సిన అవసరం లేకుండా ప్రైవేటు రంగమే ఈ బాధ్యతను తలకెత్తుకుంది. దీంతో పెరిగిన సంపదను పరోక్షంగా లబ్ధిచేకూర్చే పథకాలకు వెచ్చించడం కాకుండా నేరుగా నగదు రూపంలోనే ప్రజలకు పంపిణీ చేయాలని ఆ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకనుగుణంగా ప్రతి వ్యక్తికి తన ఆదాయాన్ని బట్టి వంద నుంచి మూడొందల సింగపూర్ డాలర్ల పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఇలా పది బిలియన్ల సింగపూర్ డాలర్లను వచ్చే ఏడాది నేరుగా పౌరుల ఖాతాల్లోకి జమ చేయనుంది. 28వేల లోపు సింగపూర్ డాలర్ల ఆదాయం కలిగిన ప్రతి ఒక్కరికి 300, లక్షలోపు సింగపూర్ డాలర్ల ఆదాయం కలిగిన 200డాలర్లు ఆపైన ఆదాయమున్న వారికి వంద డాలర్ల చొప్పున పంపిణీకి సిద్ధమైంది. ఈ విధానం ద్వారా ప్రజల వల్ల పెరిగిన సంపదను తిరిగి ప్రజలకే అప్పగించే సరికొత్త పద్ధతి ఆవిష్కరణలోకొచ్చింది. తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం ఇప్పటికే ఈ పద్ధతిలో అనేక నూతన సంస్కరణలను తీసుకొచ్చింది. గతంలో దేశవ్యాప్తంగా ఎరువులు, పురుగుమందులకు ప్రభుత్వాలు సబ్సిడీ ఇచ్చాయి. తద్వారా ఉత్పాదక సంస్థలు మాత్రమే లబ్ధిపొందాయి. అలాగే ధాన్యం, బియ్యం అమ్మకాలపై రాయితీలిచ్చాయి. వీటివల్ల మిల్లర్లు లాభపడ్డారు. ఇలా కాకుండా నేరుగా రైతుల ఖాతాల్లోనే పెట్టుబడి మూలధనం పేరిట నగదు జమచేయాలని కేసీఆర్ నిర్ణయించారు. దీనివల్ల తెలంగాణలో పెరిగిన సంపద నేరుగా ప్రజలకు పంపిణీ అయ్యే అవకాశం కలిగింది. అలాగే రైతు కార్పొరేషన్ ఏర్పాటు చేసిన కేసీఆర్ ప్రభుత్వమే రైతుల పేరిట బీమా మొత్తాన్ని చెల్లించేలా పథకాన్ని ప్రకటించారు. సేద్యంతో పాటు చేపల చెరువులు, గొర్రెల పెంపకం చేపట్టే రైతులకు కూడా నేరుగా ఆర్థిక లబ్ధిని చేకూర్చాలని నిర్ణయించారు. ఈ విధానం గతంలోనే ఆస్ట్రేలియాలో అమలైంది. అమెరికాలోని కొన్నిరాష్ట్రాలు కూడా ఆహార, వినియోగ వస్తువులపై సబ్సిడీల్ని తొలగించి సదరు మొత్తాన్ని నేరుగా ప్రజల ఖాతాల్లో జమచేసే విధానాన్ని అందిపుచ్చుకున్నాయి. నార్వేలో దీర్ఘకాలంగా ఇది కొనసాగుతోంది. అక్కడ సబ్సిడీలు, రాయితీలు పక్కదారి పట్టకుండా అర్హతలు, ఆదాయ పరిమితులకు అనుగుణంగా ప్రతినెలా నిర్ణీత మొత్తంలో వ్యక్తుల ఖాతాల్లోకి ప్రభుత్వ సంపద జమౌతోంది. వాస్తవానికి కమ్యూనిస్ట్ దేశాల్లో ఇలా ప్రభుత్వ సంపద పంపిణీ చేయాలన్న లక్ష్యాలు ఉండేవి. రాన్రాను కమ్యూనిస్టుల పాలనలో పెట్టుబడిదారి వ్యవస్థ పెత్తనం పెరగడంతో అక్కడ ఈ ప్రయత్నం ముందుకు సాగలేదు. కానీ అంచెల వారీగా పెట్టుబడిదారి దేశాల్లోనే సంపద పంపిణీ విధానాలు మెరుగయ్యాయి. భారత్‌లో మాత్రం ఒక్క తెలంగాణలోనే ఇంతవరకు ఈ విధానం అమల్లోకొచ్చింది. ఈ దిశగా సంపద పంపిణీకి ముందుకొచ్చిన ముఖ్యమంత్రి ఒక్క కేసీఆరే. మిగిలిన రాష్ట్రాల్లో ఆహారం, విద్య, వైద్యం పేరిట ప్రభుత్వం సబ్సిడీలిస్తోంది. అయితే ఇవి నేరుగా లబ్ధిదార్లకు అందడంలేదు. కార్పొరేట్ల చేతుల్లో ఉన్న భారీ వ్యవస్థలే వీటిని దక్కించుకుంటున్నాయి. ఇందుకు భిన్నంగా ఆస్ట్రేలియా, సింగపూర్ తరహాలో ఆలోచించడంతో పాటు అమలుకు ముందుకొచ్చిన ఘనత కేసీఆర్‌కు మాత్రమే దక్కుతుంది. మిగిలిన రాష్ట్రాలు కూడా సంపద పంపిణీలో కేసీఆర్‌ను ఆదర్శంగా తీసుకోవాలని పరిశీలకులు సూచిస్తున్నారు.

ఉద్యమ స్ఫూర్తితో రైతు సంక్షేమం

• రైతు సమన్వయ సమితుల సభ్యులంతా ఉద్యమ నేతలే • కరీంనగర్ నుంచి ఏ కార్యం తల పెట్టినా కలిసొస్తుందన్న నమ్మకం నాకుంది • సమన్వయ సమితుల ఉత్తర తెలంగాణ ప్రాంతీయ సదస్సులో సీఎం కేసీఆర్



కరీంనగర్ / హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో రైతు సంక్షేమాన్ని ఉద్యమ స్ఫూర్తితో ముందుకు నడిపించాలన్న లక్ష్యంతోనే సమన్వయ సమితులను ఏర్పాటు చేశామని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు స్పష్టం చేశారు. తెలంగాణ సాధనకోసం చేసిన ఉద్యమాన్ని ఆదర్శంగా తీసుకుని ప్రభుత్వ పథకాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమితుల్లో నియమించిన ప్రతి ఒక్కరూ ఉద్యమ స్ఫూర్తిగలవారేనని తేల్చి చెప్పారు. సోమవారం కరీంనగర్‌లో జరిగిన సమన్వయ సమితుల ఉత్తర తెలంగాణ ప్రాంతీయ సదస్సులో సీఎం కేసీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఇక్కడి నుంచి ఏ కార్యం తలపెట్టినా అది సంపూర్ణ విజయం సాధిస్తుందన్న నమ్మకం తనకుందని ఆయన అన్నారు. వచ్చే ఏడాది నాటికి ఫలితాలు సాధించి తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్టను దేశానికి చాటిచెప్పాలని విజ్ఞప్తి చేశారు. సామాజిక భద్రతను కల్పిస్తూ ప్రతి రైతుకూ రూ.5లక్షల బీమా, పండ్ల తోటలకూ పెట్టుబడి సాయం అందిస్తామని సీఎం ప్రకటించారు. ఏ కోణంలో అవకాశమున్నా రైతుల సంక్షేమంలో ప్రభుత్వం నిబద్ధతతో ముందడుగు వేస్తోందని, కౌలు రైతులకు మాత్రం పెట్టుబడి మద్దతు పథకాన్ని వర్తింపజేయడం చట్టపరంగా సాధ్యం కాదని పేర్కొన్నారు.

రైతు సమన్వయ సమితుల సదస్సులో భోజన విరామం అనంతరం రైతులతో ఏర్పాటు చేసిన ముఖాముఖి కార్యక్రమంలో సీఎం కేసీఆర్ మాట్లాడుతూ, స్పష్టమైన భరోసాతో అన్నదాతల గుండెనిండా నమ్మకం నింపారు. రైతులు అనారోగ్యంపాలైనా, అలకాల మరణం చెందినా ఐదు లక్షల రూపాయల బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు ప్రకటించారు. బీమాకు చెందిన ప్రీమియం కూడ ప్రభుత్వమే చెల్లిస్తుందని, రాష్ట్రంలో 70 లక్షల మంది రైతులకు బీమా సదుపాయం అమలు చేస్తామని వెల్లడించారు. కరీంనగర్ తెలంగాణ ఉద్యమానికి అండగా నిలిచిందని, ఏది మొదలు పెట్టినా ఇక్కడి నుంచి మొదలు పెడితే విజయవంతం అవుతుందని నమ్మకమని, అందుకే రైతుల బీమా సదుపాయాన్ని ఇక్కడినుంచే ప్రకటిస్తున్నట్లు రైతు సమన్వయ సమితి సభ్యుల హర్షధ్వనుల మధ్య ప్రకటించారు. రైతులకు ప్రమాద బీమా చేయించడంలో రైతు సమస్వయ సమితి సభ్యులే కీలక భూమిక పోషించాల్సి ఉంటుందని అన్నారు. కౌలు రైతులకు పెట్టుబడి సహాయం అందించలేమని, రైతు, కౌలురైతుల మధ్య వ్యాపార ఒప్పదం ఉంటుందని, రైతుకు అందించే పెట్టుబడి సహాయం కౌలురైతు తాము చేసుకునే ఒప్పందంపై ఆధారపడి ఉంటుందని అన్నారు. పెట్టుబడి సహాయం ప్రకటించిన తరువాత 97శాతం మంది రైతులు తమ భూములను తామే సాగుచేసుకునేందుకు ముందుకు వచ్చారని తెలిపారు. ఎవరైన రైతు పెట్టుబడి సహాయం వదలుకుంటే రైతు సమితి నిధికి బదలాయిస్తామని తెలిపారు.

సీఎం ప్రకటనతో స్పందించిన రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్, టీఎస్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావులు తాము పెట్టుబడి సహాయాన్ని వదలుకుంటున్నట్లు ప్రకటించారు. రైతు భవన్‌ల నిర్మాణంనకు దాతలు స్థలాలు కేటాయించేందుకు ముందుకు రావాలని సీఎం చేసిన ప్రకటనకు రైతు సమన్వయ సమితి బాధ్యుల నుంచి మంచి స్పందన లభించింది. రాజన్న సిరిసిల్ల జిల్లా సమన్వయకర్త గడ్డం నర్సయ్యతోపాటు చాలా మంది ముందుకు వచ్చారు. రైతుల హర్షధ్వనుల మధ్య సీఎం మరో ప్రకటన కూడ చేశారు. మామిడి తోటలతోపాటు అన్ని రకాల పండ్ల తోటలు, పామాయిల్ పంటలకు, గిరిజన రైతులకు కూడ పెట్టుబడి సాయం అందిస్తామని సీఎం ప్రకటించారు.

రైతు సమన్వయ సమితిలకు దిశానిర్దేశనం చేస్తూ రైతులు ఐకమత్యంతో కల్తీ వితనాలు రాకుండా చర్యలు తీసుకోవాలని, పంటలకు కనీస మద్దతు రాబట్టే ప్రక్రియ ఈ యాసంగి నుంచే మొదలుకావాలన్నారు. రాష్ట్ర సమన్వయ సమితికి మద్దతు ధర కోసం 10వేల కోట్ల రూపాయల గ్యారెంటీ ఇస్తామని, ఏఎంసీలలో తేమ యంత్రాలు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించే బాధ్యత సమన్వయ సమితీలకే ఉంటుందని, కొందరు కాంగ్రెస్ వారు విమర్శిస్తున్నట్లు ఇది గ్రామపంచాయతీలను నిర్వీర్యం చేయడం కాదని, రైతు సమన్వయ సమితిలు రైతులు, వ్యవసాయం కోసం ఏర్పాటు చేసిందన్నారు. గతంలో గోదాలుములు సరిపడ ఉండేవికాదని, నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న గోదాములను నేడు 24 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచడం జరిగిందన్నారు. రైతు రాజు కావడం ఖాయమని భవిష్యత్తులో దేశంలో గొప్ప ధనిక రైతులు తెలంగాణ రాష్ట్రంలోనే ఉన్నారనే స్థితి రాబోతుందన్నారు. దీనికి కాను రైతు సమన్వయ సమితులతో పాటు అధికారులు చిత్తశుద్ధితో తమ బాధ్యతలను నిర్వర్తించాలన్నారు.

అన్ని రంగాలకు యూనియన్లు ఉన్నాయని కేవలం అన్నదాతకు మాత్రం ఎటువంటి సంఘం లేదని, రైతు సంఘటిత శక్తిని తెలియజేయడానికి రైతు సమన్వయ సమితిలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో భారీ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో భాగంగా కాళేశ్వరం, సీతారామ, దేవాదుల, నెట్టంపాడు ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. కాళేశ్వరం ద్వారా కరీంనర్ జిల్లాతో వరంగల్ జిల్లాలో 95 శాతం 365 రోజులు పంటలకు సాగునీటి సౌకర్యం కలుగుతుందన్నారు. దేవాదులల నీటిని వరంగల్ జిల్లాకు ఉపయోగిస్తామని, సీతారామ ప్రాజెక్టు ద్వారా ఖమ్మంలో పదిలక్షల ఎకరాలకు సాగునీరు అందనుందని తెలిపారు. గోదావరి నుంచి 900 టీఎంసీ నీటి వినియోగం లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. రిజిస్ట్రేషన్ విధానంలో కూడ మార్పులు చేయబోతున్నామని, భవిష్యత్తులో రిజిస్ట్రేషన్ విధానంలో కూడ మార్పులు చేయబోతున్నామని, రిజిస్ట్రేషన్ అధికారాలన్నీ తహశీల్దార్లకు కల్పిస్తున్నామని తెలిపారు.

దీంతోపాటు మ్యూటేషన్ అధికారం కూడ తహశీల్దార్లకే కల్పిస్తున్నామని, కేవలం గంట వ్యవధిలో రిజిస్ట్రేషన్ పూర్తయి ధరణి వెబ్‌సెట్‌లో ఉండే విధంగా విప్లవాత్మకమై ప్రక్రియ చేపడుతున్నామన్నారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రైతు సమన్వయ సమితిల ఏర్పాటు ద్వారా దేశంలో రైతు భవిష్యత్తును మార్చబోతున్నామని, దేశంలోనే రైతులు ఆత్మగౌరవంతో జీవించడానికి ముఖ్యమంత్రి విశేష కృషి చేస్తున్నారని అన్నారు. గతంలో గొప్పగా పాలించారని చెప్పిన రామరాజ్యం, కాకతీయుల రాజ్యంలో కూడ రైతుల నుంచి శిస్తు వసులు చేసేవారని, ముఖ్యమంత్రి కేసీఆర్ శిస్తు వసులు బదులు రెండు పంటలకు ఎనిమిదివేల రూపాయలు అందించడం చరిత్రలో స్థిరస్థాయిలో నిలుస్తుందన్నారు. రైతులను సంఘటితన పరిచి మండల జిల్లా, రాష్ట్రస్థాయిలో సమితులను ఏర్పాటు చేసి వారికి అవగాహన కల్పించేందుకు సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు.



దేశాభివృద్ధిలో శ్రామికులే కీలకం

• ప్రధాని శ్రమశక్తి అవార్డుల వేడుకలో ఉపరాష్ట్రపతి వెంయయ్యనాయుడు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత దేశ ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరిస్తున్నదని ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. మన ఆర్థిక వ్యవస్థ చక్రాలు నడుపుటకు గడియారంలాంటి లక్షలాది మంది కార్మికులు పని చేస్తున్నారని ఆయన ప్రశంసించారు. సోమవారం ఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో జరిగిన ప్రధానమంత్రి శ్రమ్ పురస్కారాల వేడుకలో కేంద్ర కార్మికశాఖా మంత్రి సంతోష్ గంగ్వార్‌తో కలిసి వెంకయ్య నాయుడు పాల్గొన్నారు. దేశంలో ప్రభుత్వ, ప్రైవేట్ కంపెనీలలో నైపుణ్యంతో, నిజాయితీగా పని చేసే కార్మికులకు, కార్మిక శక్తి కోసం వారి అభివృద్ధి కోసం పని చేసిన 3 వందల మంది కార్మికులకు వెంకయ్య నాయుడు అవార్డులు ప్రదానం చేశారు. తెలంగాణా నుంచి బీహెచ్‌ఈఎల్ సంస్థ కార్మికులు జి.గోవర్దన్ రెడ్డి, వెంకటేశ్వర్ రావు, రాజేంద్ర ప్రసాద్‌లను అవార్డులను వరించారు. పురస్కారాలు అందుకున్న వారిని ఉపరాష్ట్రపతి అభినందించారు. అవార్డుల వేడుకలో ఆయన మాట్లాడుతూ... ఇది నిజమైన రియల్ జీడీపీ పండుగ అంటే... 'గ్రేట్ డెడికేట్ పర్సన్స్', 'గ్రోత్ డ్రైవింగ్ పవర్' అని వ్యాఖ్యానించారు. మన శ్రామిక శక్తి ఉత్పాదకతను మెరుగు పరచడం ప్రధాన సవాలని వెంకయ్య అన్నారు. కార్మికులు గంటకు చేసే ఉత్పత్తి పెరిగితే, అవుట్ పుట్, ఆదాయం ఎక్కువగా వస్తుందని సూచించారు. దాని ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటుందని తెలిపారు. మన దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుం దంటే దానికి ప్రధాన కారణం శ్రమ శక్తి అని ఆయన అభిప్రాయపడ్డారు. కార్మిక శక్తి స్థాయిని మెరుగుపరిచి, నాణ్యమైన శిక్షణకు ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఉందని వెంకయ్య నాయుడు చెప్పారు.

ఆధార్ అనుసంధానంతో

3కోట్ల బోగస్ రేషన్ కార్డుల ఏరివేత

• రూ. 17వేల కోట్ల ప్రజాధనం ఆదా

• ఈ – గవర్నెన్స్ సదస్సులో కేంద్రమంత్రి సీఆర్ చౌదరి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : జాతీయ స్థాయిలో 23 కోట్ల రేషన్ కార్డులను ఆధార్‌తో అనుసంధానంచేసి 3 కోట్ల బోగస్ కార్డులను ఏరివేసి రూ.17వేల కోట్ల మేరకు ప్రజాధనాన్ని పొదుపు చేశామని కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ప్రజాపంపిణీ సహాయ మంత్రి సిఆర్ చౌదరి చెప్పారు. దేశంలో లక్షా 10వేల గ్రామ పంచాయతీలకు ఆప్టిక్ ఫైబర్ సదుపాయం కల్పించామని, దీంతో గ్రామాల్లో సుపరిపాలన అందించేందుకు ఒక సాధనంగా అభివృద్ధి చేశామని ఆయన చెప్పారు. ఈ-పరిపాలనను సమర్థంగా తీర్చిదిద్ది ప్రజల జీవితాలలో గుణాత్మకమైన మార్పులను తీసుకురావాలంటే ప్రజల ఆలోచన సరళిలో మార్పు రావలసిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఈ-పరిపాలన ద్వారా పారదర్శకతను తీసుకురావచ్చని, అవినీతిని నిర్మూలించవచ్చని, అంతేకాక సేవల అందజేతలో సమయాన్ని సైతం తగ్గించవచ్చని కేంద్రమంత్రి చెప్పారు. అలాగే ఆహార ధాన్యాలను అవసరమైన వారికి మాత్రమే అందజేయడం కూడా సాధ్యపడిందన్నారు. వ్యాపార నిర్వహణను సులభతరం చేయడంలో ఈ-పరిపాలన తోడ్పడగలదని, తద్వారా దేశంలోకి విదేశీ ప్రత్యక్షపెట్టుబడులను మరింత ఎక్కువగా ఆకర్షించేలా చూడాలన్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్దేశం నెరవేరగలదని మంత్రి అన్నారు. మంచి పథకాలను ఈ-పరిపాలన ద్వారా చక్కగా అమలు చేయవలసిన ఆవశ్యకత ఉందని చౌదరి పేర్కొన్నారు. అభివృద్ధి కోసం సాంకేతిక విజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని మంత్రి విజ్ఞప్తి చేస్తూ, ఈ సమావేశం సందర్భంగా మరిన్ని ఫలప్రదమైన చర్చలతో ముందుకు రావలసిందిగా ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు.

ఈ-పరిపాలనపై 21వ జాతీయ సమావేశం ప్రారంభ కార్యక్రమంలో ప్రసంగించిన ఇతర వక్తలలో పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం కార్యదర్శి కేవీ ఇయాపెన్, ఎలక్ట్రానిక్స్, ఐటి మంత్రిత్వశాఖ కార్యదర్శి అజయ్ ప్రకాశ్ సాహ్నీ, యుఐడిఏఐ ముఖ్య కార్యనిర్వహణ అధికారి, జెఎస్‌టిఎన్ ఛైర్మన్ అజయ్ భూషణ్ పాండే, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి ఉన్నారు. పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం అదనపు కార్యదర్శి వసుధ గుప్తా వందన సమర్పణ చేశారు.

రేషన్ బియ్యంపై మరింత నిఘా

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రేషన్ బియ్యంపై నిఘా మరింత కట్టుదిట్టం చేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రతి జిల్లాలోనూ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఈ నెల 28వ తేదీన సిద్దిపేట్‌లో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను మంత్రి హరీష్‌రావు ప్రారంభిస్తారు. మొత్తం 171 గోదాముల్లో 1700 సీసీ కెమేరాలను ఏర్పాటు చేసి హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేస్తారు. దీని వల్ల రేషన్ సరకులు తరలించే వాహనాల కదలికలతో పాటు గోదాముల్లో బియ్యం తరలింపుకు పర్యవేక్షించడానికి అవకాశముంటుందని పౌరసరఫరాల శాఖ కమిషనర్ సి.వి. ఆనంద్ సోమవారం విడుదల చేసినఒక ప్రకటనలో తెలిపారు.

పౌరసరఫరాల శాఖ సర్వీసు రూల్స్ అధ్యయనానికి అధికారుల కమిటీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్ర పౌర సరఫరాలశాఖ సర్వీస్ రూల్స్‌పై అధ్యయనం చేసి మార్పులు చేర్పులపై ప్రభుత్వానికి నివేదిక ఇచ్చేందుకు అధికారుల కమిటీని నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ మేరకు సోమవారం తెలంగాణ ఆహార పౌర సరఫరాలశాఖ ముఖ్య కార్యదర్శి సీవీ ఆనంద్ జీవో విడుదల చేశారు. ఈ కమిటీలో ఎక్స్ ఆఫీషియో కార్యదర్శి ఛైర్మన్‌గా పౌర సరఫరాల డిప్యూటి కమిషనర్ మెంబర్ కన్వీనర్‌గా, పరిపాలనా విభాగం అసిస్టెంట్ కంట్రోలర్, కన్సూమర్ డిస్ప్యూట్ కమిషన్ సహాయ రిజిస్ట్రార్‌లను సభ్యులుగా నియమించారు.

స్టార్టప్ కంపెనీలకు సంపూర్ణ సహకారం

భవిష్యత్‌లో మరిన్ని కంపెనీలకు ఏపీ ప్రోత్సాహం

విశాఖపట్నం, ప్రభ న్యూస్ బ్యూరో: ఏ రంగంలోనైనా రాణించాలంటే ప్రధానంగా వ్యక్తిగతమైన, వృత్తిపరమైన నైపుణ్యాలు అవసరమని వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. భాగస్వామ్య సదస్సు ఆఖరు రోజైన సోమవారం 9వ ప్లీనరీ సెషన్ నందు ది యూనివర్స్ ఆఫ్ స్టార్టప్స్ అనే అంశంపై చర్చా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి సంధానకర్తగా వ్యవహరించిన సిఐఐ స్టార్టప్ కౌన్సిల్ అండ్ కో ఫౌండర్ ఎస్.గోపాలకృష్ణన్ మాట్లాడుతూ రానున్న అయిదేళ్లలో ఎక్కువ స్టార్టప్ కంపెనీలు రానున్నాయని, వీటిలో అనేక ఉపాధి అవకాశాలు కలగడానికి అవకాశాలు వున్నాయని అన్నారు. గూగుల్, ఫేస్‌బుక్, అమెజాన్, ఆపిల్ తదితర సంస్థలతోపాటు భవిష్యత్‌లో రానున్న స్టార్టప్ కంపెనీలకు ఉత్సాహపూరితమైన వాతావరణాన్ని కల్పించాల్సి వుందన్నారు. పేనలిస్టులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువగా స్టార్టప్ రావడానికి, వచ్చిన స్టార్టప్ ఎకో సిస్టంను మెరుగుపరచడానికి చేపట్టవలసిన విశ్లేషించాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా ప్యానలిస్టులు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే వ్యవస్థాపకతపై కూడా శిక్షణ ఇవ్వాలని, అందుకోసం యూనివర్శిటీలు, కళాశాలలు, వృత్తి విద్యా సంస్థలు ఆ తరహా బోధనాంశాల ద్వారా యువతకు ఆసక్తిని కలగజేయాలన్నారు. స్టార్టప్ సంస్థలు విద్యా సంస్థలుగా ఎదిగిన నాడే అన్ని రకాల నైపుణ్యాలు పెంపొం దించినట్టవు తుందన్నారు. వ్యక్తిగత, వృత్తిపరమైన నైపుణ్యాలను మెంటర్‌షిప్ ఉపకరిస్తుం దని, దీని ద్వారానే మంచి ఎకో సిస్టం అభివృద్ధి చెందుతుందన్నారు. ఆంధ్ర ప్రదేశ్‌లో ఎంటర్ పెన్యూర్‌షిప్‌కు అవసరమైన అన్ని రకాలుగా మద్దతు ప్రభుత్వం నుంచి లభిస్తోందని, రాష్ట్రానికి ఈ విషయంలో అవసరమైన సహాయాన్ని చేయడానికి సిద్ధంగా వున్నామని కాలిఫోర్నియా ప్రతినిధి అంకుర్ జైన్ తెలిపారు.

కాంగ్రెస్ కేడర్‌లో జోష్

• ప్రజాచైతన్య బస్సు యాత్ర సక్సెస్

• సర్వమత ప్రార్థనలుచేసిన ఉత్తమ్

హైదరాబాద్,ఆంధ్రప్రభ : తెలంగాణ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన 'ప్రజా చైతన్య బస్సుయాత్ర' విజయవంతం కావడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనోత్తేజం కనిపించింది. కాంగ్రెస్ పార్టీకి సెంటిమెంట్‌గా భావించే చేవెళ్ల నుంచి సోమవారం బస్సు యాత్రకు టీ పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఈ యాత్ర ప్రారంభానికి పార్టీకి చెందిన నేతలందరూ హాజరుకావడంతో కేడర్‌లో కూడా ఉత్సాహం కనిపించింది. చేవెళ్ల సభ విజయవంతమైతే రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే సభలు విజయవంతమవుతాయనే నమ్మకంతో తొలి సమావేశానికి భారీ ఏర్పాట్లు చేశారు. మాజీ హోం శాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి, ఆమె తనయుడు కార్తీక్‌రెడ్డి

అంతా తామై నడిపించగా.. ఈ సభకు భారీగా జనర రావడంతో కాంగ్రెస్‌లో మరింత జోష్ పెరిగింది. మధ్యాహ్నం 1 గంటకు ప్రారంభం కావాల్సిన సభ మూడు గంటలు ఆలస్యంగా ప్రారంభమైనా నేతల ప్రసంగాల కోసం కూర్చున్నారు. ఈ సభలో రేవంత్‌రెడ్డి ప్రసంగం సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా మారింది. కాగా అప్పా జెంక్షన్ నుంచి చేవెళ్లసభా ప్రాంగణం వరకు దారి పోడవునా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.



కాగా దారిపొడవునా పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు.

సర్వమత ప్రార్థనల తరువాత బస్సుయాత్ర..

సర్వమత ప్రార్థనల తరువాత టీపీసీసీ చీఫ్ ఉత్తంకుమార్‌రెడ్డి బస్సుయాత్రకు శ్రీకారం చుట్టారు. ముందుగా నగరంలోని నాంపల్లి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గాలో చాదర్ సమర్పించారు. ఆ తరువాత ఆరే మైసమ్మ దేవాలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అక్కడినుంచి మొయినాబాద్ మెథటిస్ట్ చర్చిలో ప్రార్థనలు చేశారు. అక్కడినుంచి చేవెళ్లకు చేరుకుని బహిరంగ సభలో పాల్గొన్నారు. బహిరంగసభ తరువాత బస్సుయాత్ర ప్రారంభమైంది. నేతలు ప్రత్యేక బస్సులో వికారాబాద్‌లో జరిగే బహిరంగసభకు తరలివెళ్లారు. కాగా సాయంత్రం 4 గంటలకు వికారాబాద్‌లో బహిరంగ సభ జరగాల్సి ఉండగా దాదాపు మూడు గంటలు ఆలస్యంగా సభ ప్రారంభమైంది. అయినప్పటికి ప్రజలు ఓపికతో ఉండటం విశేషం. కాగా నాంపల్లి అసెంబ్లీ నియోజక వర్గానికి చెందిన టీడీపీ నేత ఫిరోజ్‌ఖాన్ ఉత్తమ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

కాగా కాంగ్రెస్ నేత రేవంత్‌రెడ్డి ప్రసంగం తర్వాత ప్రజలు ఇంటిబాట పట్టడంతో ఆ తర్వాత ప్రసంగించాల్సిన సీఎల్పీ నేత జానారెడ్డి, మాజీ మంత్రి డీకే అరుణతో పాటు చాల మంది నేతలు ప్రసగించలేకపోయారు. అంతకు ముందు మాట్లాడిన కాంగ్రెస్ సీనియర్ నేత వి. హనుమంతరావు సొంత పార్టీ నేతలపైన సుతిమెత్తంగా విమర్శలు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఎవరు ముఖ్యమంత్రి అయినా పర్వాలేదు.. ముందుగానే మేమే సీఎంలమని అనుకోవడం సరికాద న్నారు. కాంగ్రెస్ పార్టీకి చేవెళ్ల ప్రాంతం ఒక్కటే సెంటిమెంట్ కాదని, గతంలో వరంగల్‌లో నిర్వహించిన బీసీ గర్జన సభ పార్టీకి పెద్ద ఊతమిచ్చిందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీసీలకు కూడా సీట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నేడు తాండూరు, సంగారెడ్డిలో సభలు..

బస్సుయాత్రలో భాగంగా మంగళవారం మధ్యాహ్నం తాండూరులో బహిరంగసభ నిర్వహించనున్నారు. మొదటిరోజు చేవెళ్ల, వికారాబాద్ ప్రాంతాల్లో బహిరంగసభలు విజయవంతం కావడంతో నేతల్లో జోష్ నెలకొంది. వికారాబాద్‌లో సభ ముగిసిన తరువాత నేతలు అనంతగిరిలో బస చేశారు. మంగళవారం మధ్యాహ్నం వరకు తాండూరుకు చేరుకుంటారు. బహిరంగసభ తరువాత ఉమ్మడి మెదక్ జిల్లాకు బయలుదేరతారు. తాండూరు సభకు నియోజకవర్గ ఇన్‌చార్జ్ రమేష్ ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి ప్రాతినిథ్యం వహిస్తున్న తాండూరులో కాంగ్రెస్ బహిరంగసభ జరుగుతున్నందునాఎలాగైనా విజయవంతం చేయాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. అందులో భాగంగానే పోటాపోటీగాఏర్పాట్లు చేస్తున్నారు.



తెలంగాణలో రెండు వర్గాల మధ్యే పోటీ

• రామచంద్ర కుంతియా

హైదరాబాద్,ఆంధ్రప్రభ : తెలంగాణలో రెండే వర్గాలు ఉన్నాయని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ రామచంద్ర కుంతియా అన్నారు. ఒక్కటి టీఆర్ఎస్ అనుకూల వర్గం, మరొకటి టీఆర్ఎస్ వ్యతిరేక వర్గం ఉందని ఆయన తెలిపారు. టీ పీసీసీ ప్రజా చైతన్య యాత్రలో భాగంగా కుంతియా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో అరచాక పాలనకు అంతం పలికేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన హెచ్చరించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంలో ప్రజలకు ఎలాంటి లాభం జరగలేదని, కేసీఆర్ కుటుంబమే భాగుపడిందన్నారు. చివరకు వాస్తు పేరుతో సచివాలయానికి రాకుండా ఉన్న సీఎం దేశంలో ఒక్క కేసీఆర్ ఉన్నారని ఆయన ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీలోకి ఎవరొచ్చినా స్వాగ తించాలన్నారు. సీనియర్లకు ఎవరికి కూడా అన్యాయం జరగదని ఆయన తెలి పారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ రెండు తెలుగు రాష్ట్రాల్లో నష్టపోయిందన్నారు. ఈ ఎన్నికల్లో మాత్రం తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చి సోనియాగాంధీకి బహుమతి ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు.

తెరాస అంతానికి సైనికుల్లా పనిచేయాలి

టీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ చేపట్టి ప్రజా చైతన్య యాత్ర సందర్భంగా చేవెళ్లలో ఏర్పాటు చేసిన సభలో టీడీపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన రేవంత్‌రెడ్డి టీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేస్తూనే సొంత పార్టీ నేతలపైన ఘాటైన వ్యాఖ్యలు చేశారు. టీఆర్ఎస్ ప్రభుత్వం కాల్చుక తింటోందని, ప్రతి కాంగ్రెస్ కార్యకర్త సైనికుడిగా పని చేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. 'టీఆర్ఎస్ ప్రభుత్వంపై యుద్ధం ప్రకటించాలి. ఎదుటోడు కుస్తీ పడితే మనం కూచిపుడి నాట్యం చేస్తే సరిపోదు. గ్రౌండ్‌లో కబడ్డి ఆడటానికి టీఆర్ఎస్ సిద్ధంగా ఉన్నప్పుడు మనం క్యారం బోర్డు ఆడితే ఎలా..?' అంటూ రేవంత్ చురకలు అంటించారు.

కాంగ్రెస్‌దే అధికారం

(మొదటిపేజీ తరువాయి)

ఇచ్చారో చెప్పాలన్నారు. బీసీలను కులాల వారిగా విడగొడుతున్నారని ఆయన విమర్శించారు. బీసీలకు జానాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు.

సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే : భట్టి, జానారెడ్డి

టీఆర్ఎస్ ప్రభుత్వంలో సామాజిక న్యాయం కొరవడిందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టివిక్రమార్క, సీఎల్పీ నేత జానారరెడ్డి అన్నారు. అన్ని వర్గాల ప్రజలు బాగుపడాలనే ఉద్దేశ్యంతోనే కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇచ్చిందని, కేసీఆర్ కుటుంబం కోసం కాదని వారు పేర్కొన్నారు. రాష్ట్ర విభజన చట్టంలో పొందుపర్చిన హక్కులను సాధించడంలో టీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని వారు దుయ్యబట్టారు. కాంగ్రెస్ జైత్రయాత్ర చేవెళ్ల నుంచి ప్రారంభం అవుతోందని మాజీ హోం మంత్రి సబితాఇంద్రారెడ్డి అన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లయినా ఐటీఐఆర్‌ను ఎందుకు పూర్తి చేయడం లేదని టీపీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య ప్రశ్నించారు. కాంగ్రెస్ లోఫర్ పార్టీ అయితే.. కేసీఆర్ కూడా లోఫరే అవుతారని మండలిలో విపక్ష నేత షబ్బీర్ అలీ అన్నారు. కాంగ్రెస్‌పై విమర్శలు చేసే ముందు మంత్రి కేటీఆర్ జాగ్రత్తగా ఉండాలని ఆయన హెచ్చరించారు. తెలంగాణ అంబాసిడర్‌గా సినీ హీరోయిన్ సమంతను నియమించిన సీఎం కేసీఆర్ తెలంగాణ ఆడపడుచులను అవమానించారని ఆయన విమర్శించారు. దోచుకున్న డబ్బును దాచుకోవడానికే జీఎస్టీ, నోట్ల రద్దు విషయంలో కేంద్ర ప్రభుత్వానికి సీఎం కేసీఆర్ మద్దతిచ్చారని మాజీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వ మంత్రి వర్గంలో మహిళలకు చోటివ్వని దౌర్భాగ్యుడు అని ఆయన మండిపడ్డారు.

ప్రజా చైతన్య యాత్రలో హామీల వర్షం ..

ప్రజా చైతన్య యాత్రలో భాగంగా టీ పీసీసీ అధ్యక్షుడు హామీల వర్షం కురిపించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అమలు చేసే పథకాలను ప్రజలకకు వివరించారు. రైతులకు రెండు లక్షల వరకు రుణమాఫీ, అన్ని వర్గాల విద్యార్థులకు పూర్తిగా ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతు ఉత్పత్తి చేసే పంటకు మద్దతు ధర, రాష్ట్రంలోని 6 లక్షల మహిళా డ్వాక్రా సంఘాలకు గాను ఒక్కో సంఘంకు రూ. 10 లక్షల వడ్డీలేని రుణాలు, అభయహస్తం పథకం పునరుద్దరణ, ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగులకు రూ. 3 వేల భృతి, పంటల బీమా కల్పించడమే కాకుండా ప్రిమియం మొత్తం ప్రభుత్వమే చెల్లించడం, ప్రతి కుటుంబంలోని అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్‌ను అందిస్తామని ఉత్తమ్ తెలిపారు.

ప్రజా విశ్వాసమే శ్వాసగా..

నారా పొలిటిక్స్ @ 40 ఏళ్లు

• నూతన ఆవిష్కరణలు • నిరంతర శ్రమే విజయానికి మెట్లు

• పాలనాదక్షుడిగా జాతీయ గుర్తింపు • నదుల సంధానంకు ఆద్యుడు

• ప్రపంచ స్థాయిలో పెట్టుబడుల ఆకర్షణ • సుదీర్ఘ కాలం సీఎంగా గుర్తింపు • చంద్రబాబు నాలుగు పదుల ప్రస్థానం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : నవ్యాంధ్ర రథసారధి, ముఖ్యమంత్రి, తెదేపా జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ప్రజా ప్రస్థానం నేటితో 40 ఏళ్ళు పూర్తి చేసుకుంది. సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చి జాతీయ రాజకీయాల్లో తనకంటూ ఓ ప్రత్యేక స్థానం సంపాదించుకుని అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న నేతగా ఎదిగారు. టెక్నాలజీని వినియోగించి సుపరిపాలనతో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్ర రాజకీయాల్లో తిరుగులేని నాయకుడిగా నిలిచారు. నిత్య విద్యార్థిగా నూతన ఆవిష్కరణలతో హైటెక్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు 67 ఏళ్ళ వయసులో కూడా యువకులతో పోటీపడే విధంగా నిత్య కృషీవలుడిగా పేరుగాంచారు. సాంకేతికతను అందిపుచ్చుకుంటూ ఓవైపు పరిపాలన సాగిస్తూ, మరోవైపు రాజకీయ వ్యూహకర్తగా జాతీయ స్థాయిలో చక్రం తిప్పుతున్నారు. విద్యార్థి దశలోనే నాయకుడి లక్షణాలు పుణికిపుచ్చుకున్న చంద్రబాబు యూనివర్సిటీ విద్య పూర్తికాగానే రాజకీయాల్లోకి అడుగువేసి అంచెలంచెలుగా ఎదిగి ప్రధాని పదవి పొందే అవకాశాలకు దగ్గరైనప్పటికీ ఆయన రాష్ట్ర అభివృద్ధికే అంకితం కావడం గమనార్హం.

1995 సెప్టెంబర్‌లో తొలిసారిగా ముఖ్య మంత్రి బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు సంస్కరణల అమలుకు ఆద్యుడిగా పేరుగాంచారు. అదే తరుణంలో అందుబాటులోకి వచ్చిన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి)ని ఒక అభివృద్ధి సాధనంగా వినియోగించి పరిపాలనను గాడిన పెట్టారు. ప్రపంచ ఐటి దిగ్గజాలను హైదరాబాద్‌కు రప్పించి బెంగళూరు, చెన్నై, ఢిల్లీలకు ధీటుగా ఐటి రంగాన్ని విస్తరింప జేయ గలిగారు. అమెరికా నుంచే 130 ఐటి కంపెనీలను రప్పించి సైబరాబాద్‌ను తీర్చి దిద్దిన ఘనత చంద్ర బాబుకే దక్కింది. దేశ ఐటి ఎగు మతుల్లో హైదరా బాద్‌ను నాలు గో స్థానంలో నిలపడంతో పాటు నాలుగు లక్షల మంది ఐటి నిపుణు లకు ఉద్యోగాలు కల్పించేందుకు చంద్రబాబు ఎనలేని కృషి చేశారు. ఐటిరంగంలో పెట్టుబడులు రాబట్టడంతో పాటు ప్రభుత్వ సేవలను ఆన్‌లైన్‌కు అనుసంధానం చేసి సుపరిపాలన అందించేందుకు ఆయన ప్రాధాన్యత ఇచ్చారు. రాష్ట్రం విడిపోయే నాటికి హైదరాబాద్ అనేక రంగాల్లో ముఖ్యంగా ఐటి రంగాన్ని ప్రపంచ పటంలో నిలిపగలిగారు.

ప్రభుత్వ పరిపాలనను నూతన ఒరవడితో సాగించేందుకు ప్రజల వద్దకు పాలన తెచ్చి అధికార యంత్రాంగాన్ని పల్లెలకు పంపించి నూతన అధ్యయనానికి శ్రీకారం చుట్టారు. అలాగే వినూత్న రీతిలో జన్మభూమి కార్యక్రమాన్ని చేపట్టి పల్లెసీమల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారు. విదేశాల్లో, ఉన్నత స్థాయిల్లో స్థిరపడిన వారు తమ గ్రామానికి సేవ చేయాలని చంద్రబాబు ఇచ్చిన పిలుపునకు అనేకమంది స్పందించి జన్మభూమి కార్య క్రమాన్ని విజయవంతం చేయడంలో భాగస్వాములయ్యారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తొమ్మిదేళ్ళపాటు ముఖ్య మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించి రికార్డు సృష్టిం చారు.

రాష్ట్ర విభజన అనంతరం నూతన ఆంధ్ర ప్రదేశ్‌కు తొలి ముఖ్య మంత్రిగా చంద్రబాబు బాధ్య తలు స్వీకరించి మరో రికార్డు సృష్టించారు. నూతన రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపేందుకు వినూత్న విధానాలతో ముందుకు సాగుతున్నారు. రాష్ట్ర రాజధానికి ఎలాంటి వివాదాలు తలెత్తకుండా రైతునుంచి 33వేల ఎకరాలు సమీకరించి దేశంలోనే నూతన ఒరవడిని సృష్టించారు. రాష్ట్ర రాజధాని 'అమరావతి'ని నిర్మించేందుకు ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించి పెట్టుబడులు రాబట్టేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఇప్పుడిప్పుడు సత్ఫలితాలు ఇస్తున్నాయి.






పెట్టుబడులు రాబట్టేందుకు సిఐఐతో కలిసి మూడుసార్లు నిర్వహించిన భాగస్వామ్య సదస్సు ద్వారా దాదాపు 17 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంవోయులు కుదుర్చుకుని పారిశ్రామిక వేత్తలనే ఆశ్చర్యపరిచారు.


ఆంధ్రప్రదేశ్‌ను సస్యశ్యామలం చేసే కార్యక్రమంలో భాగంగా పెండింగ్ ప్రాజెక్టులను శరవేగంగా పూర్తిచేసే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా దేశంలోనే మొదటిసారిగా గోదావరి - కృష్ణా నదులను అనుసంధానం చేయడం లో విజయం సాధించి ప్రశంసలు పొం దారు. దీని కొనసాగింపుగా కృష్ణా నుంచి పెన్నా నదికి నీళ్ళు మళ్ళించి మరో నదీ అనుసంధానికి ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

ప్రభుత్వ శాఖలను ఆన్‌లైన్‌లో అనుసం ధానించి సుపరిపాలన అందించేందుకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారు. ముఖ్యమంత్రి డ్యాష్‌బోర్డును ఏర్పాటు చేసి ప్రతి ప్రభుత్వ నిర్ణయాలు, వాటి అమలు తీరుతెన్నులను పర్యవేక్షిస్తూ అవినీతిని నివారించే కార్యక్రమాలను చంద్రబాబు పర్యవేక్షిస్తున్నారు. రాష్ట్రంలో వ్యవసాయ, పారిశ్రామిక రంగాలకు ప్రాధాన్యత ఇస్తూ రెండంకెల



అభివృద్ధిని సాధించడంపై ఆయన కేంద్రీకరిం చారు. ఒకవైపు రాజకీయాలు, మరోవైపు టెక్నాలజీని వినియోగిం చుకుంటూ పరిపాలన సాగిస్తున్న చంద్రబాబు దూరదృష్టి గల ముఖ్యమంత్రి పేరుగడించి, పెట్టుబడులు రాబట్టడంలో విదేశీ సంస్థల దృష్టిని ఆకర్షించగలిగారు.

ఇదిలా ఉండగా, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడిగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కార్యకర్తలకు ప్రియతమ నేతగా పార్టీని నడిపించడంలో వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. రాష్ట్రానికే తాను పరిమితమవుతానని చెబుతూనే జాతీయ రాజకీయాల్లో కూడా చంద్రబాబు ప్రత్యేకతను చాటుకుంటూ అవసరమైనపుడు చక్రం తిప్పుతూ తన ప్రతిభను కనబరుస్తున్నారు. విశేష రాజకీయ అనుభవం, పరిపాలనదక్షుడిగా పేరుగాంచిన చంద్రబాబు అలుపెరగని యోధుడిగా, ఇప్పటికీ రోజుకు 18 గంటలు నిత్య శ్రామికుడిగా, ప్రజల కోసం అహర్నిశలు కృషిచేస్తూ ప్రజాదరణ చూరగొంటున్నారు. దూరదృష్టి, నిరంతర శ్రమ, చిత్తశుద్ధి, అంకితభావం, వ్యూహాత్మక అడుగులే చంద్రబాబును ఉన్నత శిఖరాల్లో నిలిపి విజయానికి మెట్లుగా నిలిచాయి.





మితాహారి.... శాకాహారి



తల్లి రాజేశ్వరి ప్రోత్సాహం శ్రీదేవి నటిగా మారడానికి కారణం. రాజేశ్వరి కొన్ని సినిమాల్లో నటించింది. సక్సెస్ కాలేకపోయింది. తన కుమార్తెను అగ్రనటిగా తీర్చిదిద్దాలని నిర్ణయించుకుంది. అందుకే బాలనటిగా శ్రీదేవిని ప్రోత్సహించింది. తల్లి ప్రోత్సాహానికి ప్రతిభ తోడు కావడంతో బాల్యంలోనే అద్భుతమైన ప్రతిభను చాటింది శ్రీదేవి. చిన్నతనంలోనే బహుభాషా నటిగా పేరు తెచ్చుకుంది.

శ్రీదేవి తన గ్లామర్ కాపాడుకునేందుకు అత్యంత ప్రాధాన్యత నిచ్చేది. చిన్నతనంలోనే కొందరు చెప్పిన ఆహార సూత్రాలను పాటించింది. ఆమె మితహారి, పైగా శాఖాహార భోజనమే చేస్తుందని అంటారు. శ్రీదేవి సన్నిహితులు సైతం ఇదే మాట చెప్పేవారు.

ఇక శ్రీదేవి మితభాషి. ఎక్కువగా మాట్లాడదు. సెట్లో కూడా తన సీన్ పేపర్ చదువుకుంటూ ఉండేదట. సహ నటులు వస్తే గౌరవంగా నమస్కరించేదని కలిసి నటించి నటులు చెబుతుంటారు.

గ్లామర్ విషయంలో చాలా నిక్కచ్చిగా ఉండేది. అందుకే ఎప్పుడు చూసినా శ్రీదేవి ఒకేలా కనిపిస్తుందని అంటారు.

కాస్ట్యూమ్స్ విషయంలో ఆమెది ప్రత్యేకమైన శైలి. వాటిని కొన్ని సార్లు సొంతంగా డిజైన్ చేసుకునేది. లేదా తనే సెలక్ట్ చేసుకునేది.

ఇలాంటి అనేక జాగ్రత్తలు తీసునేది కాబట్టి ఆమె కెరీర్ ఉజ్వలంగా సాగింది.

తల్లి తెలుగు, తండ్రి తమిళుడు. అయినప్పటికీ నేను తెలుగు అమ్మాయిని అంటూ గర్వంగా చెప్పేది. బాలీవుడ్‌లో బిజీగా ఉన్నప్పటికీ తెలుగు సినిమాలను వదులుకోలేదు. తనకు ఉన్నతమైన కెరీర్‌ను అందించిన టాలీవుడ్ అంటే ఆమెకు ప్రేమాభిమానం ఎక్కువ.

శ్రీదేవి బాలీవుడ్‌లో నిలదొక్కుకోవడానికి తెలుగు సినిమాలు, తెలుగు దర్శకులే కారణం. పదహారేళ్ళ వయసు చిత్రాన్ని హిందీలో సోలా సాల్వాన్ పేరుతో రీమేక్ చేశారు. అందులో శ్రీదేవి నటించింది. ఈ చిత్ర ఫలితం తేలిపోయింది. ఆ తర్వాత వసంతకోకిల చిత్రాన్ని సద్మా పేరుతో రీమేక్ చేయగా అది కూడా ఆశించిన స్థాయి ఫలితాన్ని తేలేకపోయింది. శ్రీదేవి బాలీవుడ్ ప్రవేశం నిరుత్సాహపరిచింది. సరిగ్గా ఇదే సమయంలో తెలుగులో సూపర్‌హిట్ అయిన ఊరికి మొనగాడు చిత్రాన్ని హిందీలో హిమ్మత్‌వాలా (1983) పేరుతో రీమేక్ చేశారు. దీనికి కె.రాఘవేంద్రరావు దర్శకుడు. హిమ్మత్‌వాలా సూపర్‌హిట్ అయింది. పాటలు పాపులర్ అయ్యాయి. దాంతో బాలీవుడ్‌లో శ్రీదేవి పేరు మార్మోగింది. మక్సద్, జస్టిస్ చౌదరి, తోఫా, మవాలి వంటి రీమేక్ చిత్రాల్లో శ్రీదేవి నటించింది. ఈ చిత్రాలు వరుసగా విజయం సాధించి ఆమె స్థాయిని పెంచేశాయి.

అప్పటి వరకు జితేంద్ర, ధర్మేంద్ర వంటి హీరోలతో నటిస్తూ వస్తున్న శ్రీదేవి ఆ తర్వాత అమితాబ్ బచ్చన్, అనీల్‌కపూర్, మిధున్ చక్రవర్తి, వినోద్ ఖన్నా, రిషీకపూర్ వంటి హీరోలతో సైతం నటించింది. బాలీవుడ్‌లో శ్రీదేవికి పోటీగా మాధురి దీక్షిత్‌ను పేర్కొనేవారు. ఇద్దరి మధ్య వృత్తిపరమైన పోటీ నెలకొంది. క్రమంగా శ్రీదేవి మొదటి స్థానానికి చేరుకుంది. లేడీ సూపర్‌స్టార్ హోదా దక్కించుకుంది. ఈ స్థానం పొందిన తొలి హీరోయిన్ శ్రీదేవి కావడం విశేషం. హిందీలో మొత్తం 77 చిత్రాల్లో నటించింది.

హిందీ, తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో నటించిన శ్రీదేవి మంచి డిమాండ్ ఉన్నపుడే క్రమంగా తప్పుకుంది. బోనీకపూర్‌తో వివాహమయ్యాక, ఇద్దరు ఆడపిల్లలను జన్మనిచ్చింది. వారి కోసం కెరీర్‌కు దూరమైంది. మధ్యలో బోనికపూర్‌తో కలిసి కొన్ని చిత్రాలు నిర్మించింది.

తమిళంలో నాన్ అడవైల ఇల్లై చిత్రం తర్వాత మళ్లీ నటించలేదు. సుమారు 30 ఏళ్ళ తర్వాత పులి సినిమాలో నటించింది.

తెలుగు సినిమాల విషయానికి వస్తే ఎస్.పి.పరశురామ్ (1994) ఆమె నటించిన చివరి చిత్రం. ఇందులో చిరంజీవి కథానాయకుడిగా నటించారు.

హిందీలో మాత్రం 1997 వరకు వరుసగా సినిమాల్లో నటించింది. ఆ తర్వాత ఇరవై ఏళ్ళలో కేవలం ఆరు సినిమాలు మాత్రమే చేసింది. ఇంగ్లీష్ వింగ్లీష్ తర్వాత మామ్ అనే సినిమాలో నటించింది. ఇదే శ్రీదేవి చివరి చిత్రం.













భారతీయ చిత్రరంగానికి తీరని లోటు

డా.టి. సుబ్బరామిరెడ్డి

శ్రీదేవి హఠాన్మరణం తనను తీవ్రంగా కలచివేసిందని, దాదాపు నాలుగు దశాబ్దాలుగా మా కుటుంబానికి ఎంతో ఆత్మీయురాలు అని పార్లమెంట్ సభ్యుడు, కళాబంధు డా.టి. సుబ్బరామిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీదేవి మరణం భారతీయ చలన చిత్రరంగానికి తీరని లోటు. ఆమె నటించిన ఎన్నో తెలుగు చిత్రాలు, బాలీవుడ్‌లో చాందిని, లమ్హే సినిమాలు శ్రీదేవి నటజీవితానికి వన్నె తెచ్చాయి. ఆమె కీర్తిని దశ, దిశలా వ్యాపించజేశాయి అని అన్నారు. ఇటీవలే మామ్‌గా ప్రేక్షకుల ముందుకువచ్చి అలరించిన శ్రీదేవి హఠాత్తుగా మరణించడం అభిమానులు జీర్ణించుకోపోతున్నారు. సన్నివేశాల్లో రిహార్సల్స్ చేసుకోకుండా నటించే ప్రతిభ ఆమెది. తన నట జీవితంలో 250కి పైగా చిత్రాల్లో నటించి, కోట్లాది మంది అభిమానులను సంపాదించుకుంది. శ్రీదేవి లేదనే వార్త తనని తీవ్రంగా కలిచివేస్తోందని టి.సుబ్బరామిరెడ్డి అన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబసభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను అని అన్నారు.

నాకు సినిమా బ్యాక్ గ్రౌండ్ లేదు... జాన్వీకి నేనున్నా..



◆ హార్డ్‌వర్క్ చేయండి...ఫలితం ఆశించండి ◆ పోటీకి ఎప్పుడూ భయపడొద్దు ◆ నా పిల్లలకు ఎప్పుడూ ఇదే చెబుతా ◆ కమర్షియల్ సినిమాల గురించి ఎప్పుడూ ఆలోచించలేదు ◆ శ్రీదేవి ఈజ్ సింపుల్ ◆ జనం మదిలో ఉండాలన్నదే నా అభిమతం ◆ ఇంటర్వ్యూల్లో ఇదే శ్రీదేవి అంతరంగం

న్యూఢిల్లీ: లెజెండరీ యాక్టర్ శ్రీదేవి భౌతికంగా మన కళ్లముందు లేకపోయినా తన సినిమాలు, నట నా కౌశలంతో జనం మదిలో చెరగని ముద్ర వేసు కుంది. అయితే సాదా, సీదాగా కనిపించే శ్రీదేవి.. అనుక్షణం తన కూతుర్ల భవిష్యత్ గురించేపరితపించేది. తన చివరి సినిమా మామ్ విడుదలైన సందర్భంగా ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆసక్తికరమైన అంశాలను..అంతర్గత మనోభావా లను బయటపెట్టింది. ఇంటర్వ్యూలో తన సిని మా.. కుటుంబం గురించి ప్రస్తావిస్తూ.. నేను 300 చిత్రాల్లో నటించినప్పటికీ ప్రతి సినిమా కథ విన్నాకే ఓకే చెప్పా ..ఏ సినిమాలోనైనా నేను పోషించే పాత్ర పైనా పిల్లలు, కుటుంబ సభ్యులు ఎలా స్పంది స్తారోనని ఆలోచించేదాన్ని. శ్రీదేవి లెజెండరీ గురిం చి మరచిపోండి..శ్రీదేవి ఏం చేసిందో చూడండి.. నేను కమర్షియల్ సినిమాల గురించి ఆలోచించను. నా విధానం చాలా సింపుల్ గా ఉంటుంది. ఎప్పుడు ప్రజల గుండెల్లో ఉండాలన్నదే నా అభిమతం. అని చెప్పుకొచ్చింది. శ్రీదేవి ఎప్పుడూ తన కూతుళ్ల భవి ష్యత్ గురించే ఆలోచించేది.అయితే ఇప్పుడిప్పుడే బాలీవుడ్ సినిమాల్లోపెద్ద కూతరు జాన్వి అడు గుపెడుతున్న తరుణంలో శ్రీదేవి ఈ లోకంలో లేకపోవడం ఇటు అభిమానలను అటు కుటుంబ సభ్యులను శోకసంద్రంలోకి నెట్టేసింది. తన కూతుళ్ల గురించి ఇంటర్వ్యూలో ప్రస్తావిస్తూ.. మీరు ఏ తల్లి నైనా ఇష్టపడండి... వాళ్లు ఈ ప్రొఫెషన్‌కు చెందిన వారైనా కాకపోయినా.. వారు చేస్తున్నది మంచి అని పిస్తే చాలు. వారి కోసం హార్డ్ వర్క్ చేయండి.. తీసుకుంటున్న డబ్బుకు తగినట్లు పనిచేయండి..అని చెబుతానని వెల్లడించింది.

జాన్వి కోసం హ్యాపీగా ఒప్పుకున్నా...

అంతకు ముందు డీఎన్ఏకు ఇచ్చిన ఇంటర్వ్యూలో బాలీవుడ్‌లో తెరగేట్రంచేసిన జాన్వి నిరంతరం ఇతరులతో పోటీ పడుతూ ముందు సాగడంపై మీరేమంటారు అని అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ.. పోటీకి భయపడి మేమెప్పుడూ పారిపోం. జాన్వి పోటీని తట్టుకుని నిలదొక్కు కుంటుంది. బాలీవుడ్ లోకి రావాలని జాన్వీ అనుకు న్నప్పుడు, అన్ని రకాల విషయాలను తెలియజేశా. వాటన్నింటినీ ఆమె సిద్ధమైంది. నేను కూడా తనను బాలీవుడ్‌కు తగ్గట్లుగా తయారుచేసేందుకు ప్రయత్నిస్తున్నా. కొన్నికొన్ని సమయాల్లో వీటన్నింటిని చూస్తే భయం వేస్తుంది. ఎన్నో రకాల ఆలోచనలు వస్తాయి..జాన్విని ఎందుకు ఈ ఫీల్డ్ లోకి తీసు కొస్తున్నా...కానీ ఆ తర్వాత జాన్వీ లక్ష్యం గురించి ఆలోచించి తన ఆనందమే కదా కావాల్సింది అని నాకు నేనే సర్దిచెప్పుకున్నా. నన్ను మా అమ్మ ఎలా ప్రోత్సహించిందో.. జాన్విని కూడా అలాగే ప్రోత్సహిస్తున్నా. మాకు పూర్వం సినిమా బ్యాక్‌గ్రౌండ్ లేకపోయినా జాన్వి నా వల్ల తెరంగేట్రం చేస్తోంది. నా కోసం పోరాటం చేస్తోంది కాబట్టి నేను హ్యాపీ. అని శ్రీదేవి తన అంతరంగాన్ని బయటపెట్టింది.

మనకి తెలియని మరో కోణం

సినీ ప్రపంచాన్ని తీవ్ర శోకసంద్రంలో ముంచుతూ దివికేగిన అతిలోక సుందరి... మొన్నటి వరకు శ్రీదేవి ఓ గొప్పనటిగా మాత్రమే మనందరికి తెలుసు. దాదాపు మూడు తరాల అభిమానులకు తనవైపుకు తిప్పుకున్న శ్రీదేవిలో మనకి తెలియని మరో టాలెంట్ ఉంది. పెయింటింగ్ అంటే శ్రీదేవికి చాలా ఇష్టమట. గత ఐదేళ్ళుగా ఎవరికి తెలియకుండా పెయింటింగ్స్ వేస్తుందట. సినీ కెరీర్ వల్ల ఆ టాలెంట్‌ను శ్రీదేవి ఎప్పుడూ బయపెట్టలేదు. తీరిక దొరికినప్పుడల్లా శ్రీదేవి పెయింటింగ్‌లు వేసి నచ్చిన వాళ్ళకి బహుమతిగా ఇస్తారట.ఇటీవల తన మరిది కూతురు సోనమ్ కపూర్‌కి అద్భుతమైన పెయింటింగ్ వేసి ఇచ్చిందట.మరోవైపు సల్మాన్ ఖాన్, డిజైనర్ మనీష్ మల్హోత్రా వంటి సెలబ్రిటీలకు కూడా తన పెయింటింగ్స్ బహుమతులుగా ఇచ్చినట్టు తెలుస్తోంది. శ్రీదేవికి తన ఇద్దరు కుమార్తెలు అంటే ప్రాణం..అందుకేనేమో ఆమె పెయింటింగ్స్‌లో జాన్వి, ఖుషీలవి కూడా ఉన్నాయట. అదేవిదంగా మైకేల్ జాక్సన్‌ను ఎంతో ఇష్టపడే శ్రీదేవి ఆయన పెయింటింగ్‌ను గీశారు. కాగా, శ్రీదేవి పెయింటిగ్స్‌తో ఓ అంతర్జాతీయ ఎగ్జిబిషన్ సంస్థ ఛారిటీ నిమిత్తం దుబాయ్‌లో ఓ షో ఏర్పాటు చేసేందుకు ప్లాన్ చేసిందని కూడా వార్తలు వెలువడ్డాయి.

శ్రీదేవికి గళమిచ్చింది

తమిళ సినిమా ద్వారా తొలిసారిగా వెండితెరకు పరిచయమై మలయాళం, కన్నడ, తెలుగు, హిందీ భాషల్లో కొన్ని వందల చిత్రాల్లో హీరోయిన్‌గా ఓ వెలుగువెలిగినశ్రీదేవికి బాలీవుడ్‌లోకి మాత్రం 1979లో ఎంట్రీ ఇచ్చారు. 'సోల్వాసావన్' చిత్రం ద్వారా బాలీవుడ్‌కు పరిచయం అయినా రాణించలేకపోయింది.సోల్వా సావన్ చిత్రంలో శ్రీదేవీకి ప్రముఖ హిందీ నటి, డబ్బింగ్ ఆర్టిస్ట్ బేబీ నాజ్ డబ్బింగ్ చెప్పారు. 1979 నుంచి 1989 వరకు హిందీలో శ్రీదేవీ నటించిన చిత్రాలకు బీబీ నాజ్యే ఎక్కువగా డబ్బింగ్ చెప్పారు. 'ఆఖరీ రాస్తా'లో సినీ నటి రేఖ డబ్బింగ్ చెప్పారు.

మూడున్నర గంటల పాటు బోనీని విచారించిన పోలీసులు

శ్రీదేవి భర్త బోనీకపూర్‌ను దుబాయ్ పోలీసులు దాదాపు మూడున్నర గంటల పాటు విచారించారు. బోనీతో పాటు మరో ముగ్గురిని కూడా పోలీసులు విచారించారు. బోనీ విచారణ మొత్తాన్ని పోలీసులు రికార్డ్ చేశారు. నలుగురు పోలీసు అధికారులు వేర్వేరు కోణాలలో బోనీని ప్రశ్నించి వాంగ్మూలాన్ని రికార్డు చేశారు. నీళ్ళతో నిండి ఉన్న టబ్‌లో శ్రీదేవి పడిపోయిందని, దాంతో తాను తనకు పరిచయం ఉన్న ముగ్గురికి ఫోన్ చేసి పిలిచానని, తర్వాత నలుగురం కలిసి శ్రీదేవిని ఆస్పత్రికి తరలించామని బోనీకపూర్ చెప్పినట్లు సమాచారం. బోనీతో పాటు శ్రీదేవిని ఆస్పత్రికి తీసుకు వెళ్ళిన నలుగురితో సహా రషీద్ ఆస్పత్రికి చెందిన ఇద్దరు డాక్టర్లు, ఐదుగురు అటెండెంట్ల వాంగ్మూలాన్ని కూడా రికార్డు చేశారు.









సినిమా పరిశ్రమకు తీరని లోటు: మంత్రి తలసాని

హైదరాబాద్, ఆంధ్రప్రభ: శ్రీదేవి మృతి సినీ ఇండస్ట్రీకే కాకుండా ఆమె అభిమానులకు తీరని లోటని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. హైదరాబాద్‌లో త్వరలో సినిమా పరిశ్రమ ప్రముఖల సమక్షంలో సంతాప సభ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. బాలనటిగా సినీరంగం ప్రవేశం చేసి...అలనాటి అగ్రనటులతో పాటు అనేక మంది నటులతో నటించారన్నారు. తన నటనతో అభిమానులను మెప్పించిన మహానటి శ్రీదేవి అని అన్నారు.

ధృవతార మృతి పట్ల లక్ష్మణ్ విస్మయం

సినీ రంగంలో ధృవతారలా ఓ వెలుగు వెలిగిన గొప్ప నటి శ్రీదేవి మృతి పట్ల భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కె. లక్ష్మణ్ తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆమె అకాల మరణం భారతదేశ సినీ పరిశ్రమకు తీరని లోటు అని వ్యాఖ్యానించారు. చక్కటి అభినయంతో దేశంలో కొట్లాది మంది హృదయాలను చొరగొన్నదని, తెలుగు ప్రేక్షకుల గుండెల్లో చెరగని ముద్ర వేశారని అన్నారు. దశాబ్దాల పాటు తెలుగు, హిందీ, తమిళం వంటి బహుబాషా చిత్రాల్లో తన నటనతో అలరించిన ఆమె....మిగితా నేటితరం నటులకు స్ఫూర్తి ప్రధాతగా నిలిచారని లక్ష్మణ్ పేర్కొన్నారు. ఆమె కుటుంబ సభ్యులకు ఈ సందర్భంగా ఆయన తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

సిరిమల్లే నేల రాలింది

పదహారేళ్ళ వయస్సులోనే తన నటనా ప్రతిభా పాటవాలను ప్రదర్శించి....సినీ జగత్తుల్లో సుస్థిర స్థానం దక్కించుకున్న నటి శ్రీదేవి అకాలమరణం చెందడం పట్ల సీనియర్ జర్నలిస్టు గౌతంబాబు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

క్రీడాప్రభ

కింగ్స్ పంజాబ్ కెప్టెన్ అశ్విన్



న్యూఢిల్లీ : చెన్నై చిన్నోడు, ఆఫ్‌స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ కెప్టెన్ అయ్యాడు. ఐపీఎల్‌లో కింగ్స్ ఎలెవన్ పంజాబ్ జట్టుకు అతను సారథిగా వ్యవహరించబోతున్నాడు. కింగ్స్‌పంజాబ్ మెంటార్ వీరేంద్రసెహ్వాగ్ కెప్టెన్ పేరును ప్రకటించారు. చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు ఎనిమిదేళ్లు సేవలు అందించాడు. చెన్నై రెండు పర్యాయాలు ఐపీఎల్ టైటిల్ గెలిచినప్పుడు, విజేత బృందంలో అశ్విన్ సభ్యుడిగా ఉన్నాడు. కిందటిసారి పుణె సూపర్ జెయింట్స్ తరఫున ఆడాడు. ఇటీవల జరిగిన వేలంలో 7.6కోట్ల ధర లభించింది. యువరాజ్ సింగ్, క్రిస్‌గేల్, ఫించ్ వంటి స్టార్ ప్లేయర్లున్న జట్టుకు అతను నాయకత్వ బాధ్యతలు చేపట్టనున్నాడు. 'ప్రతిభావంతులైన ఆటగాళ్లున్న జట్టుకు నాయకత్వం వహించడాన్ని గౌరవంగా భావిస్తున్నాను. నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా బాధ్యతగా వ్యవహరిస్తాను. అత్యుత్తమ ఆటతీరు కనబరిచేందుకు మా బృందాన్ని సమాయత్తం చేయగలనన్న విశ్వాసం ఉంది. కెప్టెన్సీతో నాపై ఒత్తిడి ఉండబోదు. గతంలోనూ ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో తమిళనాడుకు కెప్టెన్‌గా వ్యవహరించాను' అని అశ్విన్ వ్యాఖ్యానించాడు. ఇంతకు ముందు ఈ జట్టుకు మ్యాక్స్‌వెల్ కెప్టెన్‌గా వ్యవహరించాడు. అయితే, ఈసారి వేలంలో అతడిని ఢిల్లీ దక్కించుకోవడంతో, పంజాబ్‌కు కొత్త కెప్టెన్ ఎంపిక అనివార్యమైంది. తీవ్ర తర్జనభర్జనల తర్వాత చివరకు మేనేజ్‌మెంట్ అశ్విన్‌వైపు మొగ్గుచూపింది. కాగా, ఈ జట్టులో అత్యంత ఖరీదైన ఆటగాడిగా కేఎల్ రాహుల్ ఉన్నాడు. 11కోట్లకు పంజాబ్ అతడిని కొనుగోలుచేసింది.

ఏషియన్ గేమ్స్ నా టార్గెట్ :దీప



న్యూఢిల్లీ: ఏప్రిల్‌లో జరగనున్న కామన్‌వెల్త్ గేమ్స్‌కు దూరమవుతున్నట్లు భారత జిమ్నాస్టిస్ట్ దీపా కర్మాకర్ తెలిపింది. మోకాలి శస్త్ర చికిత్స నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నానని, మైదానంలోకి దిగేందుకు మరికొంత సమయం పడుతుందని చెప్పారు. శిక్షణ శిబిరానికి వెళ్తున్నాను. శస్త్రచికిత్స నుంచి వేగంగా కోలుకుంటున్నాను. ప్రస్తుతానికి నా లక్ష్యం ఏసియన్ గేమ్స్‌లో పాల్గొనడమే. ఇంతకు మించి ప్రత్యేక లక్ష్యాలేమీ లేవు అని పేర్కొంది. ఇదిలావుండగా, సహ జిమ్నాస్టిక్ క్రీడాకారిణి అరుణారెడ్డి ఫామ్‌పై కర్మాకర్ ధీమా వ్యక్తం చేసింది. గోల్డ్‌కోస్ట్ కామన్‌వెల్త్ గేమ్స్‌లో ఆమె తప్పకుండా స్వర్ణం గెలుస్తుందని చెప్పింది. 2011నుంచి మేమిద్దరం శిక్షణ పొందాం. 2014-17 వరకు రూమ్‌మేట్స్‌గా ఉన్నాం అని పాతజ్ఞపకాలను నెమరువేసుకుంది. ప్రపంచకప్ జిమ్నాస్టిక్స్‌లో కాంస్యపతకం సాధించిన అరుణారెడ్డి, మెడల్ గెలిచిన తొలి భారత మహిళా అథ్లెట్‌గా నిలిచిన విషయం తెలిసిందే.

కామన్వెల్త్‌లో 'షూటింగ్'కు ఢోకాలేదు

COMMONWEALTH GAMES FEDERATION CGF

న్యూఢిల్లీ : 2022 కామన్వెల్త్ గేమ్స్ నుంచి షూటింగ్ పోటీలను తొలగించడం లేదని ఫెడరేషన్ సీఈవో గ్రేవెంబర్గ్ స్పష్టం చేశారు. ఆప్షనల్ కేటగిరీలో షూటింగ్ పోటీలు కొనసాగిస్తామని చెప్పారు. నిర్వాహకుల విజ్ఞప్తి మేరకు రోస్టర్‌ను తొలగిస్తున్నట్లు వస్తున్న కథనాలను ఆయన తోసిపుచ్చారు. 'ప్రస్తుతానికి ఎలాంటి అనూహ్య పరిణామాలు లేవు. రోస్టర్ పద్ధతిలో ఆప్షనల్ గేమ్‌ను ప్రవేశపెట్టే సౌకర్యం ఆతిథ్య దేశానికి ఉంటుంది. షూటింగ్ పోటీలకు ఆప్షనల్ హోదాను కొనసాగిస్తూ 2015 సీజీఎఫ్ సాధారణ సమావేశం తీర్మానించింది అని గ్రేవెంబర్గ్ గుర్తుచేశారు. ఒకవేళ ఏదైనా కారణంచేత షూటింగ్‌ను తొలగిస్తే అందరికంటే ఎక్కువగా నష్టపోయేది భారతే. ఎందుకంటే, ఈ విభాగంలో భారత్ పటిష్టంగా ఉంది. వీలైనన్ని ఎక్కువ పతకాలు సాధిస్తున్నది కూడా. ఇప్పటివరకు 118 పతకాలు సాధించగా, ఇందులో 56 స్వర్ణాలు ఉన్నాయి.



ప్రపంచకప్‌కు ప్లాన్-ఎ సిద్ధం

సఫారీ పర్యటనతో లెక్క కుదిరింది | **ఐదుగురు బౌలర్ల ఎంపికలో చిక్కుల్లేవ్** | **బ్యాటింగ్‌లో నాలుగైదు స్థానాలే తేలాలి**

న్యూఢిల్లీ : 2019 ప్రపంచకప్ ప్రణాళికలో భాగంగా టీమిండియాకు ప్లాన్-ఎ సిద్ధమైంది. వన్డే సిరీస్‌లో ఇద్దరు మణికట్టు స్పిన్నర్లు (కుల్దీప్, యుజ్వేంద్ర) 33 వికెట్లు పడగొట్టారు. పిచ్ ఎలాంటిదైనా, మ్యాచ్‌ను గెలిచే సత్తా తమకు ఉందని చాటిచెప్పారు. ఐదుగురు బౌలర్లలో భువనేశ్వర్, బుమ్రా పేస్ బాధ్యతల్లో పాసయ్యారు. ఆల్‌రౌండర్ పాత్రకు హార్దిక్ పాండ్యా న్యాయం చేశాడు. ప్రపంచకప్‌లో ధోనీకి ఏ స్థానం లభిస్తుందో తెలీదు కానీ, రోహిత్, ధావన్, కోహ్లీ మొదటి వరుసను భర్తీ చేయడం ఖాయమని తేలింది. ఇక నాలుగైదు స్థానాలకు పోటీ నెలకొంది. ఈ రెండు స్థానాలకు ఐదుగురు పరిశీలనలో ఉన్నారు. అజింక్య రహానే, మనీశ్ పాండే, కేదార్ జాదవ్, శ్రేయస్ అయ్యర్, సురేశ్ రైనా పేర్లు సెలక్టర్ల దృష్టిలో ఉన్నాయి.

కెప్టెన్‌గా.. బ్యాట్స్‌మన్‌గా విరాట్ కోహ్లీ సక్సెక్ కావడం టీమిండియాకు చెప్పుకోదగ్గ సానుకూలాంశం. సారథి రెట్టించిన ఉత్సాహంతో ఉనప్పుడే, తన బృందంలో ఆత్మవిశ్వాసం నింపడం సాధ్యమవుతుంది. ద.ఆఫ్రికా పర్యటన ద్వారా కోహ్లీ దీనిని మరోసారి రుజువు చేశాడు. అసాధారణ బ్యాటింగ్‌తో ఒకపక్క రికార్డులను కొల్లగొడుతున్న విరాట్, మరొకవైపు బ్యాటింగ్ విన్యాసాలను ప్రస్తుతించే విశేషణాలన్నిటినీ ఆపాదించుకున్నాడు. ఇక వన్డే జట్టుకు సరిపోతాడా? లేదా? అన్న మీమాంసను సఫారీ పర్యటనతో బుమ్రా పటాపంచలు చేశాడు. సెలక్టర్లకు తానొక కీలక బౌలర్‌నన్న విశ్వాసం కల్పించడంలో సక్సెస్ అయ్యాడు. జట్టులో అతని స్థానంపై ఇప్పుడు ఎలాంటి గజిబిజి లేదనే భావించాలి. 2019లో ఇంగ్లండ్ ఆతిథ్యమిచ్చే ప్రపంచకప్ జట్టుకు తానొక ప్రధాన బౌలర్‌నని సెలక్టర్లు గుర్తించేలా చేసుకోగలిగాడు. ఉపఖండం వెలుపల.. అంచనాలను మించి టీమిండియా రాణించడం బహుశా ఇదే తొలిసారి. ఒకటీ అరా మ్యాచ్‌లు నెగ్గడానికే పరిమితమయ్యే జట్టు వ్యూహాలు, ఈసారి భిన్నంగా సాగాయి. గెలుపు కోసం పోరాడిన తీరు అద్భుతం. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ ఇలా మూడు విభాగాల్లో జట్టు దుర్భేధ్యంగా రూపొందింది. బౌండరీలైన్ వద్ద బుమ్రా, పాండ్యా, భువీ వంటి ఆటగాళ్ల ఫీల్డింగ్ టీమిండియా అత్యున్నత ప్రమాణాలకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. మొత్తంగా సఫారీ పర్యటనలో మూడు ఫార్మాట్లకు రెండు ఫార్మాట్లను గెలిచి, అభిమానుల మనసు దోచింది కోహ్లీసేన.



టెస్టుల్లో టీమిండియా పేస్ బౌలింగ్ దుమ్మురేపింది. ప్రత్యర్థి బ్యాట్స్‌మన్ దూకుడుకు కళ్లెం వేయడంలో ప్రణాళికలు పక్కాగా అమలు చేయగలిగారు. మహ్మద్ షమి (15 వికెట్లు-3 మ్యాచ్‌లు), బుమ్రా (14 వికెట్లు- 3 మ్యాచ్‌లు) , భువనేశ్వర్ కుమార్ (10 వికెట్లు - 2 మ్యాచ్‌లు), ఇషాంత్ శర్మ (8 వికెట్లు - 2 మ్యాచ్‌లు)

బుమ్రా రాటుదేలాడు...

మొత్తంగా మూడు టెస్టుల్లో 60 వికెట్లకు గాను 47 వికెట్లు పేస్ బౌలర్లకే దక్కాయి. ఎక్కడైనా, ఏజట్టునైనా ఎదుర్కొనే సత్తా టీమిండియా ఫాస్ట్ బౌలింగ్‌కు ఉందని ఈ పర్యటన రుజువు చేసింది. సెంచూరియన్‌లో టెస్టు మ్యాచ్ ఓటమి కోహ్లీ, రవిశాస్త్రిలపై విమర్శలకు తావిచ్చింది. అయితే, టెస్టు సిరీస్‌లో సంతోషించదగిన విషయం ఏమంటే, బుమ్రా పూర్తి స్థాయిలో రాణించడమే.

ఈ విజయాల్లో కీలకపాత్ర పోషించిన కోహ్లీ, ప్రశంసలకు అన్ని విధాలా అర్హుడే. టెస్టు సిరీస్ ను కోల్పోయినప్పటికీ, వెంటనే పుంజుకుని 5-1తో వన్డే సిరీస్‌ను సొంతం చేసుకోవడం అసాధారణమే. అదే ఊపుతో టీ20 సిరీస్‌ను 2-1తో కైవసం చేసుకుంది. తద్వారా టెస్టు ఫార్మాట్‌లోనూ ప్రత్యర్థికి సవాల్ విసరగలమని చాటిచెప్పింది.

ప్రమాదకర భాగస్వామ్యాలను విడ కొట్టడంలో కెప్టెన్ నమ్మకాన్ని బుమ్రా అన్నివేళలా నిలబెట్టాడు. 40-50 టెస్టుల ఆడిన అనుభవజ్ఞుడి మాదిరిగా హైక్లాస్ బౌలర్‌గా కనిపించాడు.

బ్యాటింగ్ లైనప్‌కూ సారథి కోహ్లీ..

న్యూఢిల్లీ : ఇక కెప్టెన్ కోహ్లీ బ్యాటింగ్ ఈ సిరీస్‌కే హైలెట్. సహచర బ్యాట్స్‌మన్ కంటే ఎక్కువ పరుగులే చేశాడు. ఏబీ డివిలియర్స్ కంటే 75 పరుగులు ఎక్కువ చేసి, అత్యధిక పరుగులతో అగ్రస్థానంలో నిలిచాడు. టెస్టు ఫార్మాట్‌లోనూ అదే దూకుడు కొనసాగించాడు. అజింక్య రహానే టెంపర్‌మెంట్ కంటే, రోహిత్‌శర్మ ప్రతిభపై ఎక్కువ నమ్మకం ఉంచాడు. మొదటి రెండు టెస్టుల్లో రోహిత్ విఫలం కావడంతో విమర్శల దాడిని ఎదుర్కొన్నాడు. అటు వన్డేల్లోనూ రోహిత్ అంతంతమాత్రంగా రాణించాడు. కోహ్లీ మాత్రం ఆరు వన్డేల్లో మూడు శతకాలు బాదేశాడు. టెస్టు సిరీస్ ఓటమితో ఎదురైన విమర్శల జడివాన వన్డే టీ20 విజయాలతో పూర్తిగా వెలిసినట్లు అయింది. అంతేకాదు 2019 ప్రపంచకప్ సన్నాహ ప్రణాళికలో భాగంగా టీమిండియా ప్లాన్-ఎ సిద్ధం చేసుకున్నట్లు అయింది.

ఫిట్‌నెస్ ఒక్కటే లక్ష్యం.. యువ షట్లర్ సమీర్ వర్మ

న్యూఢిల్లీ: అంతర్జాతీయ కెరీర్ ప్రారంభించిన కొద్ది కాలంలో ఎక్కువ భాగం గాయాలతో ఇబ్బంది పడిన యువ షట్లర్ సమీర్ వర్మ. తాజాగా స్విస్ ఓపెన్ సూపర్ 300 టోర్నీ నెగ్గి, ఈ సీజన్‌లో తొలి టైటిల్ సాధించి మళ్లీ ట్రాక్‌లోకి వచ్చాడు. ఆదివారం నాటి మ్యాచ్‌లో మాజీ ప్రపంచ నంబర్ 2, జర్మన్ షట్లర్ జాన్ జొర్గెన్‌సేన్‌ను ఫైనల్‌లో మట్టికరిపించి సమీర్ విజేతగా నిలిచాడు. ప్రస్తుతానికి నాకంటూ ప్రత్యేకలక్ష్యాలేవీ లేవు. ఫిట్‌నెస్‌గా ఉంటే చాలని కోరుకుంటున్నాను. ఇప్పటికిదే నా లక్ష్యం. మిగతా విషయాల గురించి ఆలోచించడం లేదు. త్వరలోనే నూరు శాతం ఆటతీరు ప్రదర్శిస్తాను. తద్వారా ర్యాంకును మెరుగు పరుచుకుంటాను. ఫిట్‌నెస్ గురించి కోచ్‌లు, ఫిజియోలతో మాట్లాడుతున్నాను. మితిమీరిన ట్రైనింగ్ వల్లే ఇబ్బంది పడ్డాను. మున్ముందు దీనిని అధిగమిస్తానని సమీర్ వెల్లడించాడు. గతేడాది సయ్యద్ మోడీ ఇంటర్నేషనల్ గ్రాండ్ పిక్స్ గోల్డ్ ఈవెంట్ నెగ్గిన సమీర్, ఆ తర్వాత ఇండియా సూపర్ సిరీస్‌లో క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాడు. అనుకోకుండా భుజం నొప్పికి గురయ్యాడు. దాంతో గతేడాది జూన్‌లో ఇండోనేషియా, ఆస్ట్రేలియా సూపర్ సిరీస్‌లకు దూరమయ్యాడు. తిరిగి కోలుకున్న తర్వాత, అనూహ్యంగా ప్రపంచ చాంపియన్‌షిప్‌కు ప్రవేశం సంపాదించాడు. కానీ ప్రారంభదశలోనే వెనుదిరిగాడు. ఒక దశలో టాప్ 20 ర్యాంకుకు చేరినా, నిలబెట్టుకోలేక పోయాడు. కామన్వెల్త్ బృందంలో చోటు దక్కించుకోలేక పోయిన సమీర్, ఏసియన్ గేమ్స్‌మీద దృష్టిసారించాడు.

133వ ర్యాంకులో రాంకుమార్

న్యూఢిల్లీ: టెన్నిస్ ప్లేయర్ రాంకుమార్ రామనాథన్ కెరీర్ బెస్ట్ ర్యాంకు సాధించాడు. ఏడు స్థానాలు మెరుగై 133వ ర్యాంకులో నిలిచాడు. మరోవైపు యుకి భాంబ్రి నాలుగు స్థానాలు దిగజారి 105వ ర్యాంకు చేరాడు. ఏటీపీ డేర్లీ బీచ్ ఓపెన్‌కు అర్హత సాధించడం ద్వారా 12 పాయింట్లు పొందిన రాంకుమార్, తొలిరౌండ్ లోనే నిష్క్రమించాడు. కాగా, ఆదివారం నాటి దుబాయ్ డూటీ చాంపియన్‌షిప్ క్వాలిఫైయింగ్ ఈవెంట్‌లో భాంబ్రీ చతికిలబడ్డాడు. మరో ఆటగాడు సుమిత్ నాగల్ దుబాయ్ టోర్నీకి అర్హత సాధించడంలో విఫలమయ్యాడు. నాలుగు ర్యాంకులు దిగజారి 220 స్థానానికి పరిమితమయ్యాడు. ఏటీపీ సింగిల్స్ పట్టికలో భారత బెస్ట్ ఆటగాడిగా ప్రజ్నేష్ గున్నేశ్వరన్ నిలిచాడు. ఏకంగా 10 స్థానాలు ఎగబాకి 232 ర్యాంకు సాధించాడు. డబుల్స్ విభాగంలో రోహన్ బొపన్న 20వ ర్యాంకుతో ఇండియా టాప్ ప్లేయర్‌గా కొనసాగుతున్నాడు. తర్వాతి స్థానాల్లో దివిజ్ శరణ్ (54), లియాండర్ పేస్ (52) ర్యాంకుల్లో ఉన్నారు. మహిళల ర్యాంకింగ్స్‌లో అంకితరైనా (250), కర్మన్ కౌర్ (281) నిలకడగా రాణిస్తున్నారు. డబుల్స్ విభాగంలో సానియా మీర్జా 13వ ర్యాంకులో నిలిచింది.



ఒలింపిక్ స్టార్స్ ఆన్ డ్యూటీ...



పొయాంగ్‌చాంగ్ : శీతాకాల ఒలింపిక్స్‌లో పతకాల వేట ముగిసింది. ఈవెంట్‌లో పాల్గొన్న మహిళలు, పురుష అథ్లెట్లంతా తిరిగి తమతమ బతుకు పోరాటంలో నిమగ్నమయ్యారు. దాదాపు 3000 మంది అథ్లెట్లు రొటీన్ జీవన విధానంలో ఒదిగిపోయారు. అమెరికా స్కైస్టార్ లిండ్సే వొన్, డొమినిక్ మేర్కీ వంటి స్టార్లు రోజువారీ విధుల్లో చేరిపోయారు. ప్రతీసారి ఒలింపిక్స్‌లో నర్సులు, కారు మెకానిక్‌లు, జవాన్లు, వాచీ తయారీదారులు, ఫైర్‌ఫైటర్స్ విజేతలుగా నిలుస్తుంటారు. కానీ చాలా మంది పేదరికం కారణంగా వ్యవప్రయాసలకోర్చి ఒలింక్స్‌కు వస్తుంటారు.

☛ 27 ఏళ్ల డొమినిక్ మేర్కీ స్విడ్జర్లాండ్ తరఫున ఈవెంట్‌లో పాల్గొన్నాడు. శుక్రవారం నాటి పోటీల్లో స్విస్ జట్టు కెనడాపై గెలిచి కాంస్య పతకం సాధించింది. ద.కొరియా ఒలింపిక్స్‌లో పాల్గొన్న క్రీడాకారుల్లో గడియారాలు తయారుచేసే ఏకైక వ్యక్తి మేర్కీయే. వాచ్ తయారీ కోర్సును నాలుగేళ్లు చదివాడు. ఆ తర్వాత అమెరికాలోని ఆర్కన్సాస్‌లో సొంతంగా వ్యాపారం ప్రారంభించాడు. అమెరికా యువతిని వివాహం చేసుకున్నాడు. 'నేను ఎలాంటి వాచీలనైనా బాగు చేస్తాను. తాత ముత్తాతల కాలం నాటి వాచీలనైనా పరుగు పెట్టిస్తా' అని చెప్పాడు. ఒలింపిక్స్‌లో పతకం సాధించిన తర్వాత ఇప్పుడు తనకు ప్రత్యేక గుర్తింపు వచ్చిందని చెబుతున్నాడు.

☛ పాదరసంలా దూసుకుపోయే స్కేటర్ బిగ్నీవ్ బ్రోడ్‌కా. 2014లో సోచీలో జరిగిన 1500 మీటర్ల స్కేటింగ్‌లో స్వర్ణ పతకం సాధించాడు. నా ప్రొఫెషన్ వల్లే ఒలింపిక్స్‌లో ఒత్తిడిని అధిగమించగలిగాను అంటున్నాడు బ్రోడ్‌కా. వృత్తిరీత్యా అగ్నిమాపకదళ ఉద్యోగి అయిన ఇతనికి స్కిన్‌టైట్ స్కేటింగ్ సూట్ భిన్న వేషధారణే. విధి నిర్వహణకు వెళ్లినప్పుడు వీధుల్లో ప్రజలు గుర్తించి, ఆప్యాయంగా పలకరిస్తే ఆ అనుభవం ఎంతో హాయిగా ఉంటుంది అంటున్నాడు. ద.కొరియా ఒలింపిక్స్ 1500 మీటర్ల ఈవెంట్‌లో ఇతను 12వ స్థానంలో నిలిచాడు. ఫైర్‌ఫైటర్ ఉద్యోగం నన్ను మానసికంగా శక్తివంతుడిని చేసింది. ఎలాంటి పరిస్థితిలోనైనా ఒత్తిడిని జయించే పాఠాలు నేర్పింది అని చెప్పుకొచ్చాడు బ్రాడ్‌కా.

☛ నార్వేకి చెందిన కర్లింగ్ అథ్లెట్ క్రిస్టిన్ స్కాస్‌లీన్ మంగళవారం విధుల్లో చేరేందుకు సిద్ధమైంది. నౌకాయాన సంస్థలో ఆపరేషన్స్ అనలిస్టుగా ఈమె ఉద్యోగం చేస్తోంది. మిక్స్‌డ్ టీం ఈవెంట్‌లో ఈమె రష్యన్ కర్లర్ మాగ్నస్‌తో కలిసి కాంస్య పతకం గెలుచుకుంది. 'నేను ద.కొరియా వెళ్లేందుకు ఫస్ట్‌క్లాస్ విమానం టికెట్ పొందాను. తిరిగి మంగళవారం వస్తాను' అని బాస్‌కు మెసేజ్ ఇచ్చి పొయాంగ్‌చాంగ్ వచ్చానని స్కాస్‌లీన్ తెలిపింది.



అందుకే... ద్రవిడ్ అంటే ఇష్టం: కేటీఆర్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : భారత యువ క్రికెట్ జట్టు చీఫ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ అంటే తనకు ఎంతో ఇష్టమని మంత్రి కేటీఆర్ అన్నారు. ఒక క్రికెటర్‌గానే కాదు...వ్యక్తిగా కూడా ద్రవిడ్ తనకు అత్యంత ఇష్టమని పేర్కొన్నారు. అందుకు కారణం ఇటీవల ముగిసిన అండర్-19 వరల్డ్‌కప్‌లో భారత జట్టును విజేతగా నిలిపేందుకు తోడ్పడిన శిక్షణ సిబ్బందికి సమాన ప్రోత్సాహకాన్ని ఇవ్వాలంటూ రాహుల్ ద్రవిడ్ కోరడమేనని అన్నారు. ఇందుకు బీసీసీఐ అంగీకరిస్తూ శిక్షణ సిబ్బందికి సమాన ప్రోత్సాహకాన్ని ఇవ్వనున్నట్లు ప్రకటించింది. దీనిపై ఒక దినపత్రికలో వచ్చిన వార్తపై కేటీఆర్ స్పందిస్తూ....ఒక క్రికెటర్‌గానే కాదు...వ్యక్తిగా కూడా ద్రవిడ్ తనకు అత్యంత ఇష్టమని ట్వీట్ చేశారు.

ప్రపంచకప్ గెలవగానే బోర్డు...ఆటగాళ్ళకు రూ.30 లక్షలు, హెడ్‌కోచ్ ద్రవిడ్‌కు రూ.50 లక్షలు, సహాయ సిబ్బందికి రూ. 20 లక్షల చొప్పున ప్రోత్సహకాలన్ని బీసీసీఐ ప్రకటించింది. దీనిపై ద్రవిడ్ అసంతృప్తి వెలిబుచ్చాడు. జట్టు కోసం తన సిబ్బంది అంతా సమిష్టిగా శ్రమించారని, ఈ ఫలితంలో పేరొచ్చినా... ప్రోత్సాహకం వచ్చినా... సమానంగా దక్కాల్సిందేనని డిమాండ్ చేశారు. దిగ్గజ ఆటగాడి మాటకు విలువచ్చిన బీసీసీఐ ఏడాదికి పైగా యువ జట్టుకు సేవలిందించిన కోచింగ్ సిబ్బందికి సమాన నజరానాలు ఇచ్చేందుకు ముందుకొచ్చింది.

అగ్రజట్లను ఢీకొనే సత్తావుంది

న్యూఢిల్లీ: ప్రపంచ మేటి హాకీ జట్లను ఓడించగల సామర్థ్యం ప్రస్తుత జట్టుకు ఉందని భారత హాకీ ఏస్ మిడ్ ఫీల్డర్ మన్‌ప్రీత్ సింగ్ ధీమా వ్యక్తం చేశాడు. రానున్న కామన్వెల్త్ క్రీడల్లో స్వర్ణం కాకున్నా, కచ్చితంగా పతకం సాధించి తీరతామని చెప్పాడు. కామన్వెల్త్ హాకీలో బలమైన జట్లు బరిలోకి దిగుతాయి. ప్రపంచస్థాయి జట్లు పతకం కోసం సర్వశక్తులు ఒడ్డుతాయి. 2014 గ్లాస్కో పోటీల్లో రజతం గెలిచిన నాటి నుంచి మా జట్టు ఎంతో మెరుగైంది. అయినా ఏ జట్టునూ మేం తక్కువ అంచనా వేయడం లేదు. ఆస్ట్రేలియా, గ్రేట్ బ్రిటన్, పాకిస్తాన్, ద.ఆఫ్రికా వంటి మేటిజట్లు టైటిల్ వేటలో ఉంటాయి. కిందటిసారి ఆస్ట్రేలియా చేతిలో ఓడి, రజత పతకానికే పరిమితం అయ్యాము. ఈసారి మరింత పట్టుదలతో ఆడతాం. కచ్చితంగా మెడల్ సాధిస్తామని మన్‌ప్రీత్ చెప్పాడు. నేను ప్రతీమ్యాచ్, ప్రతీటోర్నీ ఆడాలని అనుకుంటాను. ప్రతీ ఆటగాడు ఇదే కోరుకుంటాడు. అంతిమ నిర్ణయం మాత్రం కోచ్‌దే. ఈయేడాది జట్టుకు చాలా కీలకం. కామన్వెల్త్, ఆసియన్ గేమ్స్‌తో పాటు, ప్రపంచకప్ టోర్నీకి వెళ్లాల్సి ఉంది. జట్టులో చోటుకోసం ఆటగాళ్ల మధ్య గట్టి పోటీ ఉంది. ఒకరకంగా ఇండియన్ హాకీకి ఇది మంచి పరిణామమే. చివరి నిముషాల్లో గోల్స్ సాధించలేక పోతున్నామన్న విమర్శలను సింగ్ కొట్టిపారేశాడు. మైదానంలో ఎప్పుడు ఏమైనా జరగొచ్చు. అయినా ఈ మధ్య కాలంలో మేం ఆఖర్లోనూ గోల్స్ సాధిస్తున్నామని పేర్కొన్నాడు. కాగా, ఈసారి ఆస్ట్రేలియాను ఓడించడంపైనే దృష్టిసారిస్తామని డిఫెండర్ రూపేందర్ వెల్లడించాడు. డిఫెన్సివ్ కోణంలో ఉంటూనే, అదనుచూసి ఎటాకింగ్ చేస్తామని, ఇన్నర్ సర్కిల్‌లో మా ప్రదర్శన బలహీనంగా ఉంటోందని, దీనిని సరిదిద్దుకుంటామని చెప్పాడు. తుది 18 మంది ఆటగాళ్ల ఎంపిక కోసం చూస్తున్నామని తెలిపాడు. రొటేషన్ పద్ధతిలో మరింత మంది ఆటగాళ్లను పరీక్షిస్తున్నామని అన్నాడు. వచ్చేనెల జరగనున్న కొరియన్ టూర్ కీలకమైందని చెప్పుకొచ్చాడు. 1998 కౌలాలంపూర్ ఎడిషన్‌లో హాకీని ప్రవేశపెట్టిన నాటి నుంచి పురుషుల విభాగంలో ప్రతీసారి ఆస్ట్రేలియాకే బంగారు పతకం లభిస్తోంది.

మన్‌ప్రీత్ సింగ్



Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.

ఆంధ్రప్రభ
Lively Interaction For Ever
లైఫ్ I
lifepage2012@gmail.com
మంగళవారం
27 ఫిబ్రవరి 2018

మైక్రో బ్లాగింగ్ ప్లాట్‌ఫాం... టంబ్లర్!



టెక్ టైమ్

టంబ్లర్ ఖాతా తెరవడం ఈజీ

టంబ్లర్‌లో ఖాతా తెరవడం చిటికెలో పని. మన ఈ-మెయిల్ అకౌంట్‌ను ఉపయోగించి టంబ్లర్ ఖాతా ఓపెన్ చేసుకోవచ్చు. యూజర్ ఐడీ మరియు బ్లాగ్ పేరు ఒకటే ఉండాలన్న నిబంధన లేదు. టంబ్లర్‌లో ఖాతా తెరవగానే డాష్‌బోర్డ్ దర్శనమిస్తుంది. ఇది హోమ్ పేజి అన్నమాట. టంబ్లర్‌కు ట్విట్టర్, ఫేస్‌బుక్, పింట్రెస్ట్ మరియు ఇన్‌స్టాగ్రాం వంటి ఇతర సుప్రసిద్ధ సోషల్ నెట్వర్క్‌లకు మధ్య చాలా సారూప్యత ఉంది. దీనిని ఫేస్‌బుక్ మరియు ఇతర సోషల్ మీడియా వెబ్‌సైట్లకు ప్రత్యామ్నాయంగా భావిస్తారు. స్వీయ వ్యక్తీకరణ, సృజనాత్మకత కోసం రూపొందించిన ఒక సూక్ష్మ బ్లాగింగు వేదిక టంబ్లర్. దీనిలో యూజర్లు అనేక అంశాలపై బ్లాగ్ చేస్తున్నారు.

డాష్ బోర్డులో వందల టాపిక్స్

టంబ్లర్ డాష్ బోర్డులో వందల టాపిక్స్‌కు సంబంధించిన పేజీలు ప్రత్యక్షమవుతాయి. విద్య, టెక్నాలజీ,రాజకీయాలు, వార్తలు, ఆహార, పర్యాటక, ఆధ్యాత్మిక, ప్రేరణాత్మక, పుస్తకాలు, సినిమాలు, మ్యూజిక్, ఫ్యాషన్ ఇలా వందల అంశాలకు సంబంధించిన పేజీలు ఉంటాయి. అందులో కనీసం ఐదు అంశాలను సెలక్ట్ చేసి క్లిక్‌చెయడం ద్వారా ఇతర యూజర్లను ఫాలో కావచ్చు. మెయిన్ టాపిక్‌లో సబ్ కేటగిరీలు కూడా ఉంటాయి. మనకు నచ్చిన విషయాలను ఎంచుకోవడం ద్వారా మన హోం స్క్రీన్‌ని నిర్మించుకోవాలి. మన హోం స్క్రీన్ లేదా డాష్‌బోర్డ్ విషయంలో కొంచెం శ్రద్ధ తీసుకోవాలి. ఇతర సభ్యులను ఆకర్శించే విధంగా..శ్రద్ధగా, జాగ్రత్తగా, చాలా ఓపికతో హోంస్క్రీన్ లేదా డాష్ బోర్డును నిర్మించుకోవాలి. డాష్‌బోర్డ్ థీమ్‌ను కూడా ఆకర్షణీయంగా ఉండేలా మలుచుకోవచ్చు. ఫేస్ బుక్ మాదిరిగానే మనం ఫాలో అయ్యే అకౌంట్స్ కు సంబంధించిన ఫీడ్ మన హోం స్క్రీన్ మీద కనిపిస్తుంది.

సామాజిక మాధ్యమాలలోకెల్లా ప్రత్యేకమైంది.... ద్విపాత్రాభినయం చేసేది టంబ్లర్! ఒక వైపు వర్డ్‌ప్రెస్ లేదా బ్లాగర్‌లాగా మైక్రో బ్లాగింగ్ ప్లాట్ ఫాం లాంటిది టంబ్లర్. మరోవైపు ఇతర సోషల్ నెట్వర్క్‌ల మాదిరిగానే అద్భుతమైన చిత్రాలు, ఆసక్తికరమైన వీడియో క్లిప్పులు లేదా ఇతర వెబ్ సైట్లకు లింకులతో అందరినీ ఆకట్టుకుంటుంది. 2007లో అరంగేట్రం చేసిన టంబ్లర్‌లో యూజర్లు అధికంగా కుర్రకారే. టంబ్లర్‌లో వారిదే జోరు....వారిదే హోరు అనడం అతిశయోక్తి కాదు. యాహూ 2013లో 1.1 బిలియన్ డాలర్లకు టంబ్లర్‌ను కొనుగోలు చేసింది.

ప్రముఖమైన 10 సోషల్ మీడియా సైట్లలో టంబ్లర్ ఒకటి. 15-25 సంవత్సరాల మధ్య వయస్సు వాళ్లు ఎక్కువగా టంబ్లర్‌లో గడుపుతున్నారు.టంబ్లర్‌ని సెర్చ్ ఇంజన్‌గా ఉపయోగిస్తారు. బ్లాగింగ్‌లో చురుగ్గా పాల్గొంటారు. ఇందులో కొద్దిగొప్పో అశ్లీల కంటెంట్ కూడా లేకపోలేదు. మొబైల్ ఆఫ్‌లో ఉంచినా కూడా మనం పెట్టిన పోస్టులు అప్రమేయంగా పబ్లిక్‌లో పోస్టు అవుతాయి.అంటే టంబ్లర్‌లో ప్రైవసీ మనచేతుల్లో లేదు. కాక పోతే మిగతా మాధ్యమాల మాదిరిగా కాకుండా ఇందులో యూజర్లు తమ అసలు పేర్లను వెల్లడించరు. నిక్ నేమ్‌లతో వ్యవహరించ బడుతారు. అందుకే ఇందులో మనకు తెలిసిన వారిని గుర్తించడం కష్టం. ఇందులో పోస్టులన్నీ మనం సూచించిన గ్రూపు, ఫ్రెండ్స్ కే పరిమిత కాకుండా మొత్తం పబ్లిక్ అవుతాయి. అందుచేత మనం ఇందులో ఎవరినీ బ్లాక్ చేయలేము. ఇక డాష్ బోర్డులో కనబడే టంబ్లర్ టూల్ బార్ చాలా సింపుల్‌గా యూజర్ ఫ్రెండ్లీగా ఉంటుంది. టంబ్లర్‌కు పింట్రెస్ట్ కు పోలికలు ఎక్కువగా ఉంటాయి. ఇందులో వాడే పదాల విషయానికి వస్తే......

ఎక్స్‌పోర్: కంపాస్ చిహ్నం మీద క్లిక్ చేస్తే ట్రెడింగ్ పోస్టులు, ఫోటోలు, లింకులు, చాట్లు, వీడియోలు అని ఒక సబ్ మెనూ వస్తుంది. వాటిలోకెళ్లి ట్రెడింగ్, ఫేవరేట్, లైక్డ్ మోస్ట్ ..వంటివి తిలకించవచ్చు.

రికమండెడ్: మనం ఖాతా తెరిచినప్పుడు పంచుకున్న అభిరుచులు..ఫాలో అయిన విషయాలకు సంబంధించి మనకోసం విషయాలన్నీ ఒక చోట పేర్చేదే రికమండెడ్.

సెర్చ్ బార్: మనకు కావాల్సిన లింక్, ఫోటో, బ్లాగ్ ఏదైనా విషయం సెర్చ్ బార్‌లో టైప్ చేసి పొందమ్చు.

పోస్టింగ్: మనం పోస్ట్ చేసేటప్పుడు టూల్ బార్‌లో వివిధ చిహ్నాలపై క్లిక్ చేయడం ద్వారా ఆడియో, వీడియో, ఫోటో,కోట్,లింక్,టెక్స్ట్ లాంటివాటికి వాటిని మన పోస్టుకు జోడించవచ్చు.

హ్యాష్ టాగ్: టంబ్లర్‌లో హ్యాష్‌టాగ్‌తో చాలా ముఖ్యమైన ఉపయోగమున్నది. మీ పేజిలో పోస్టుకు అనుగుణంగా, సరైన హ్యాష్‌టాగ్‌ను ఉపయోగించడం ద్వారా మిగతా టంబ్లర్ యూజర్లను ఆకట్టుకోవచ్చు. ఇతర యూజర్లు వెతుకుతున్న అంశాలలో మీ హ్యాష్ టాగ్ ఒకటయితే ,వాళ్లు మీ డ్యాష్ బోర్డులోకి వచ్చి, మీ కంటెంట్ లేదా పోస్టును పంచుకోవడమో లేదా లైక్ కొట్టడమో చేస్తారు. కాబట్టి ట్విట్టర్ మరియు పింట్రెస్ట్ లాగా కాకుండా టంబ్లర్‌లో విస్తృత పరిధిలో హ్యాష్‌టాగ్‌లను వినియోగించాలి, హ్యాష్‌టాగ్ మధ్యలో స్పేస్ ఉండకూడదు. కానీ రెండు హ్యాష్‌టాగ్‌ల మధ్య ఒక కామా పెట్టి వాటిని విడగొట్టాలి.

డాష్ బోర్డ్: ఒక యూజర్ ఫాలో అవుతున్న అన్ని అకౌంట్ల, బ్లాగుల పోస్టులను చూపిస్తుంది. యూజర్ డాష్ బోర్డునుంచే పోస్టులు పెట్టాలి. మరియు కామెంట్, లైక్ లేదా రీబ్లాగ్ చేయవచ్చు.

ఫాలోవర్స్: సాధారణంగా టంబ్లర్‌లో ఇస్తినమ్మ వాయినం, పుచ్చుకుంటినమ్మ వాయినం అన్న చందాన ఫాలో అయితే వెనువెంటనే అకౌంట్ లేదా యూజర్ మనల్ని ఫాలో అవుతారు. మనం ఎంతమందిని ఫాలో అయితే అంతే మంది మనల్ని ఫాలోఅవుతారన్న మాట.

రీ బ్లాగ్: ఇతరుల బ్లాగులు, పోస్టులను మన డాష్‌బోర్డు లేదా హోం పేజిలో మన నెట్వర్క్‌తో పంచుకోవడం.



ఇగ్నోర్ దిస్ యూజర్

ఎడ్ ఆప్షన్‌లో ఎవరి పోస్టులు మనం చూడకూడదు అనుకున్నామో.. వారిని ఇగ్నోర్ చేయవచ్చు. కాని వారు మన పోస్టులను నిశ్చింతగా చూడగలరు.

ట్రోల్స్: ట్రోల్స్ విషయంలో టంబ్లర్, ట్విట్టర్‌కి చెల్లి అవుతుంది. అసలు పేర్లు లేకుండా వ్యవహరించడం వలను అదుపూ ఆజ్ఞా ఉండదు. ఇతరులపై పరుషపదజాలంతో, తిట్లపురాణంతో కొ ందరు యూజర్లు పోస్టులు పెడుతుం టారు.అటువంటి వాటిపైనే ఇగ్నోర్ బటన్ ప్రయోగించాలి. టంబ్లర్‌లో యాక్టివ్‌గా ఉంటూ..మిగతా యూజర్లు, ఫాలోవర్ల పోస్టులను నచ్చుకుంటూ..అడపాదడపా చిన్న చిన్న సందేశాలు బ్లాగులో రాయడం, ఆడియో, లింకులను పెట్టడం ద్వారా.. డాష్ బోర్డును నిండుగా,రద్దీగా ఉంచుకోవచ్చు.

షేర్ బటన్: మీ టంబ్లర్ పోస్టులను ఫేస్ బుక్‌లో, ట్విట్టర్‌లో పంచుకోవచ్చు. ఈ-మెయిల్ కూడా చేయ మచ్చు.

పాస్ వర్డ్ ప్రొటెక్టెడ్ బ్లాగ్...

టంబ్లర్‌లో పోస్టులన్నీ పబ్లిక్‌కు కనిపిస్తాయి. అలా కాకుండా నా బ్లాగ్ ఎవరికి కనిపించకూడదు అనుకుంటే...పాస్‌వర్డ్ పెట్టుకోవాలి. మనకు తెలిసిన వాళ్లకు మాత్రమే బ్లాగ్ లింక్ మరియు పాస్‌వర్డ్ పంచుకోవాలి.

ప్రైవేట్ మెసేజ్ ...

సహ యూజర్లకు మెసేజ్‌లు పెట్టి ముచ్చటించుకోవచ్చు.

ఫాలోవర్స్ ఆన్సర్....

మనం ఏదైనా పోస్టు పెట్టి చివర్లో క్వశ్చన్ మార్క్ (?) తో ముగిస్తే.... మన ఫాలోవర్స్ లేదా యూజర్లు సమాధానం చెప్పడానికి పోస్టు పక్కన ఒక బాక్స్ ప్రత్యక్షమవుతుంది. ఇక డాష్‌బోర్డులోని ప్రతి పోస్టు యొక్క లింక్‌పై మౌస్ పెట్టి ..పోస్టు చేసిన టైం, తేదీని తెలుసుకోవచ్చు.



మెగా ఎడిటర్...

ఒక సారి ఎక్కువ పోస్టులను త్వరగా సవరించడానికి మెగా ఎడిటర్ ఉపయోగ పడుతుంది. అలాగే ఒకే సారి అనేక పోస్టులను తొలగించవచ్చు. సవరించ వచ్చు మరియు ట్యాగ్‌లను జోడించవచ్చు.

షార్ట్ కట్ కీ...

డాష్‌బోర్డును మరింత త్వరగా బ్రౌజ్ చేయడానికి కొన్ని కీ లు సహాయ పడతాయి. ముందుకు వెళ్లడానికి "J" కీని.. వెనకకు వెళ్లడానికి "K" కీని క్లిక్ చేయాలి. "L" కీని క్లిక్ చేయడం ద్వారా లైక్ చేయవచ్చు. సాధారణంగా రీబ్లాగ్ చేయడానికి డాష్ బోర్డు దాటి బయటకు రావాలి. అలా కాకుండా డాష్ బోర్డులో ఉండే..."Alt" కీ , మరియు రీబ్లాగ్ బటన్ క్లిక్ చేయవచ్చు. అలాగే పోస్ట్‌ను ట్యాగ్ చేయాలంటే.."Ctrl" కీ , రీబ్లాగ్ బటన్ క్లిక్ చేయాలి. వ్యక్తిగత గణాంకాలు, మీకు ఒకటి కంటే ఎక్కువ టంబ్లర్ ఖాతాలు ఉంటే... సందేశాలు లేదా ఫాలోవర్స్ ..వ్యక్తిగత గణాంకాలు వీక్షించడానికి ఆల్ట్ కీని క్లిక్ చేయాలి.

స్పై బటన్: మీ స్నేహితులుగాని, పరిచితులుగాని టంబ్లర్‌లో వేటిని ఎక్కువగా ఇష్టపడుతున్నారో వాళ్ల యూజర్ నేమ్ ఉపయోగించి తెలుసుకోవచ్చు.. tp://www.tumblr.com/liked/by/user-name ఈ యూఎల్ఆర్ ఉపయోగించి!త



-సునీల్ ధవళ
మాజీ వైస్ ప్రెసిడెంట్
నేషనల్ జియోగ్రాఫిక్ అండ్ ఫ్యాక్స్

మార్కెట్లోకి కవాసాకి కొత్త మోడల్ బైక్



ఇండియా కవాసాకి మెటార్ కొత్త మోటర్ సైకిల్‌ను భారతీయ మార్కెట్లోకి విడుదల చేసింది. ఆటో ఎక్స్‌పో -2018 వేదికగా కొత్త మోటర్ సైకిల్‌ను మార్కెట్లోకి ప్రవేశ పెట్టాలని భావించిన యాజమాన్యం...అనివార్య కారణాల వలన ఎలాంటి హంగూ ఆర్భాటం లేకుండా.. కొత్తమోడల్ Kawasaki Z900RS ని లాంచ్ చేసింది. బైక్ ఎక్స్ షోరూం ధర కేవలం 15.30 లక్షల రూపాయలు మాత్రమే. ఊహించిన దానికంటే ధర ఎక్కువే అయినా..కవాసాకి కొత్తమోడల్ బైక్ తన ప్రత్యేకతను చాటుకుంటుందని కవాసాకి మోటర్ యాజమాన్యం ప్రకటించింది. కొత్త బైక్ Z900RSను పాత బైక్ Z900 కి అనుబంధంగా తీసుకువచ్చారు. 1970 నాటి మోటర్ సైకిళ్ల స్టైల్‌ను కలిగిన కవాసాకి కొత్తమోడల్ బైక్.. యూత్‌ను ఆకట్టుకునే విధంగా రూపుదిద్దుకుంది.

సౌండ్ వన్ కొత్త బ్లూటూత్ స్పీకర్



హాంకాంగ్‌కు చెందిన సౌండ్ వన్... కొత్త బ్లూటూత్ స్పీకర్‌ను మార్కెట్లోకి విడుదల చేసింది. ఇండియన్ మార్కెట్లోకి విడుదల చేసిన బీస్ట్ (BEAST) .. వైర్‌లెస్ స్పీకర్ ధర 2,490 రూపాయలు. ప్రస్తుతం ఇది ఈ-కామర్స్ ప్లాట్ ఫామ్‌లలో అందుబాటులో ఉంది. స్పీకర్ అత్యుత్తమమైన సౌండ్ క్వాలిటీని కలిగి ఉంటుందని కంపెనీ స్పష్టం చేసింది. ఇతర వాటితో పోల్చినప్పుడు దీని సౌండ్ విభిన్నంగా ఉంటుందని కంపెనీ యాజమాన్యం ప్రకటించింది. స్పీకర్‌లో రెండు సౌండ్ డ్రైవర్స్, పాసివ్ బాస్ రేడియేటర్ అమర్చారు. ఇంటిలో,పడక గదిలో, బాత్‌రూంలో,వంటగదిలో,కారులో ఉపయోగించుకోవడానికి అనుకూలంగా ఉంటుంది. పార్టీలలో, ఇంటర్‌నెట్ రేడియో సేవల్లో వినియోగించుకోవచ్చు. ఇది IPX5 వాటర్ రెసిస్టెంట్‌ను కలిగి ఉంటుంది. అంటే స్ప్లాష్ ప్రూఫ్, రెయిన్ ప్రూఫ్, డస్ట్‌ప్రూఫ్, సౌండ్ ప్రూఫ్ కలిగి ఉందన్నమాట. చూడముచ్చటగా ఉండే బీస్ట్ బ్లూటూత్ స్పీకర్ .. ఐదు అంగుళాల పొడవు, 170 మిల్లీమీటర్ల మందం ఉంటుంది. 1600mAh సామర్థ్యం కల్గిన దీని బ్యాటరీని ఒక్కసారి ఫుల్ చార్జ్ చేస్తే 8 గంటలు పనిచేస్తుంది. బీస్ట్ బ్లూటూత్ వైర్‌లెస్ స్పీకర్....ఐఫోన్, ఐప్యాడ్,ఐపాడ్, మ్యాక్, అన్నిరకాలైన స్మార్ట్ ఫోన్స్, ల్యాప్‌టాప్స్, టాబ్లెట్స్, కంప్యూటర్స్, క్రోమోబుక్స్‌కు అనుకూలంగా ఉంటుంది.

ఆధునిక హౌస్‌వైఫు...ఆత్మహత్యల వైపు!

★ ఉద్యోగం చేయని గృహిణుల ఆత్మ హత్యలు పెరుగుతున్నాయి
★ మారుతున్న మహిళని అర్థం చేసుకునే పరిస్థితులు లోపించడమే కారణం

ఉద్యోగాలు చేయని ఆడవాళ్లని...కొంతమంది భర్తలు చాలా హీనంగా చూస్తుంటారు. ఏం పనిచేస్తున్నావ్...పిల్లలు, నేను ఇంట్లోంచి బయటకు వెళ్లిన దగ్గర్నుంచి...టివీ, ఫోను, నిద్ర...ఇవేగా నువ్వుచేసేది...అంటుంటారు. ఆడవాళ్లు తాము చేస్తున్న పనులను ఏకరువు పెట్టబోయినా వారు వినిపించుకోరు. అంతేకాదు...చాలామంది భర్తలు హౌస్‌వైఫులుగా ఉన్న భార్యల మనసుకి, మాటకు విలువ ఇవ్వరు. ఇంట్లో ఉండే స్త్రీలకు ఎలాంటి కష్టం ఉండదని వాళ్లు హాయిగా ఉంటున్నారనేది భర్తల అభిప్రాయమైతే...భారతదేశపు నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో లెక్కలు మాత్రం... 2014లో 20వేలమంది హౌస్‌వైఫ్‌లుగా ఉన్న ఆడవాళ్లు ఆత్మ హత్యలకు పాల్పడ్డారని చెబుతున్నాయి. అంతేకాక చిన్నకుటుంబాలు, చదువుకున్న మహిళలు ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో ఆత్మ హత్యలు మరింత ఎక్కువగా ఉన్నాయని కూడా కొన్ని అధ్యయనాల్లో తేలింది. ఇది భారతదేశపు మొత్తం ఆత్మ హత్యల రేటు కంటే ఎక్కువ. రైతుల ఆత్మ హత్యలకంటే నాలుగురెట్లు ఎక్కువ. మరి ఈ ఆత్మహత్యల సంఖ్య చూశాక కూడా...ఇంట్లో ఉన్న ఆడవాళ్లు హాయిగా ఉంటున్నారు..వాళ్లకేం ఒత్తిడి ఉంటుంది? అనే ప్రశ్న అడిగితే...రెండు సమాధానాలు చెప్పాలి. ఒకటి... వాళ్లు సంపాదించాల్సిన అవసరం లేనంత మాత్రాన వారికి ఇంకేమీ బాధలు ఉండవని, సుఖంగా ఉన్నారని భావించకూడదని. అలాగే భార్యకు తినడానికి తిండి, కట్టుకోవడానికి బట్టలిస్తే..చాలదని కాస్త ఆమె ఆత్మ గౌరవాన్ని కూడా పట్టించుకోవాలని-

భారత్‌లో హౌస్‌వైఫుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. 2014లోనే కాదు...దాదాపు 1997నుండి సంవత్సరానికి 20వేలకు కంటే ఎక్కువగానే హౌస్‌వైఫ్‌లు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. 2009లో అయితే ఈ సంఖ్య 25,092గా ఉంది. ఇంటిపనికి మనదేశంలో విలువ అనేది ఉండదు. నిజానికి ఒక ఇల్లు ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా నడవాలన్నా...ఇంట్లో ఉన్నవారంతా ఆనందంగా ఆరోగ్యంగా ఉండాలన్నా...అదంతా ఆ ఇంట్లోని మహిళ చేసే పనిని బట్టే ఉంటుంది. ఇంట్లో వారికి కావలసినవన్నీ సమకూర్చడం పిల్లల పెద్దల సంరక్షణ, సమయంతో సంబంధం లేకుండా ఎప్పుడూ పనిచేయాల్సి రావటం...లాంటివన్నీ మహిళల పనుల్లో భాగాలు. దీనికి తోడు...భర్త, అత్తమామలు ఆమెని అర్థం చేసుకోకపోవటం, మనస్పర్థలు...వీటన్నింటి కారణంగా హౌస్‌వైఫ్‌ల మరణాలు పెరుగుతున్నాయి. ఏటా ప్రతి లక్షమందికి 11మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. 2011లో అయితే లక్షమందికి ఆత్మహత్య రేటు 20గా ఉంది. మహారాష్ట్ర, తమిళనాడు, పాండిచ్చేరి, మధ్యప్రదేశ్, కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, గోవా, పశ్చిమబెంగాల్, గుజరాత్‌ల్లో హౌస్‌వైఫ్‌ల ఆత్మహత్యలు ఎక్కువగా ఉండగా పంజాబ్, ఉత్తరప్రదేశ్, బీహార్‌ల్లో ఈ సంఖ్య కాస్త తక్కువగా ఉంది.




ఆ వయసులోనే ఆత్మహత్యలెక్కువ...

అడిలైడ్ యూనివర్శిటీలో పాలిటిక్స్ ప్రొఫెసర్‌గా ఉన్న పీటర్ మేయర్...భారతదేశంలో ఆత్మహత్యలు పెరగటంపై సుదీర్ఘకాలంగా అధ్యయనాలు చేస్తున్నారు. భారత్‌లో హౌస్‌వైఫ్‌లు అత్యధికంగా ఎందుకు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు...ఎందుకు ఈ విషయాన్ని మీడియా అంతగా పట్టించుకోవటం లేదనే ఆశ్చర్యాన్ని ఆయన వ్యక్తం చేస్తున్నారు. మరొక ఆశ్చర్యమేమిటంటే అమెరికా, ఆస్ట్రేలియాల్లో పెళ్లయిన వారిలో ఆత్మహత్యలు తక్కువగా ఉంటే భారత్‌లో పరిస్థితి ఇందుకు వ్యతిరేకంగా ఉంది. ఉదాహరణకు 2001లో ఆత్మహత్యలు చేసుకున్నవారిలో 70శాతం మంది వివాహితులే ఉన్నారు. 15ఆపైన వయసున్న మహిళల్లో ఆత్మహత్యలు... అభివృద్ధి చెందిన దేశాల్లో కంటే మనదేశంలో రెండున్నరరెట్లు ఎక్కువగా ఉన్నాయి. పెళ్లయిన మొదటి రెండవ దశాబ్దాల్లో హౌస్‌వైఫుల ఆత్మహత్యలు ఎక్కువగా ఉన్నట్టుగా పీటర్ మేయర్ తన పుస్తకం 'సూసైడ్ అండ్ సొసైటీ ఇన్ ఇండియా' లో పేర్కొన్నారు. అంటే 30 నుండి 45 ఏళ్ల మధ్య వయసులో ఈ ఆత్మహత్యలు ఎక్కువగా జరుగుతున్నాయి.

ఎంత సాధికారతతో...అన్ని సూసైడ్లు

హౌస్‌వైఫుల ఆత్మహత్యల్లో మరొక విచిత్రమైన విషయాన్ని మేయర్ కనుగొన్నారు. ఎక్కువ చదువు, మీడియాపై అవగాహన కలిగిఉండటం, చిన్నకుటుంబాలు...ఏవైతే...మహిళా సాధికారతకు చిహ్నాలుగా భావిస్తున్నామో...వాటికి చేరువలో ఉన్న స్త్రీలే అధికంగా ఆత్మహత్యలకు పాల్పడుతుండగా, సాంప్రదాయ రాష్ట్రాలుగా పేరుపడ్డ ప్రాంతాల్లో ఈ ఆత్మహత్యలు తక్కువగా ఉన్నాయి. ఇంకా చెప్పాలంటే పెద్దకుటుంబాలున్న రాష్ట్రాల్లో... చిన్నకుటుంబాలు ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో కంటే ఆత్మహత్యలు తక్కువగా ఉన్నాయి. పైగా కట్నానికి సంబంధించిన మరణాలను హత్యలుగా పరిగణించడం వలన అవి లేకుండానే...ఈ ఆత్మహత్యలను లెక్కవేశారు. అమ్మాయిలఆలోచనల్లో స్వతంత్రత పెరుగుతోంది. చదువుకోని అత్తలు, తమ ఆధిపత్యం నెగ్గితీరాలనే ఆడపడుచులతో ఆధునిక మహిళలు టెన్షన్లు ఎదుర్కొంటున్నారని మేయర్ అభిప్రాయపడుతున్నారు. కోడలిగా వచ్చావు కదా...కుటుంబానికి బానిసవి అంటే నేటి అమ్మాయిలు ఒప్పుకోవటం లేదు. అలాగే అత్తమామలు వద్దని... వేరుకాపురమే కావాలని పట్టుబట్టటం కూడా అమ్మాయిలను ప్రశాంతతకు దూరం చేస్తోంది. ఆడామగా అసమానత్వం, భర్త తాము కోరుకున్నట్టుగా ఉండకపోవటం, తల్లిదండ్రులు తమ మాట పట్టించుకోకపోవటం...ఇలాంటివెన్నో వారిని డిప్రెషన్ బారినపడేస్తున్నాయి. ఆత్మహత్యల వైపు పురికొల్పుతున్నాయి.




✍ వి.దుర్గాంబ

చింతన

శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు

బలవంతపు భోజనాలు



ఈ మధ్యాహ్నం అరుణగిరికి ఈశాన్యమందున మఠం నుంచి భక్తులు వచ్చి నమస్కరించారు. భగవాన్ చూచి 'కోవిలూరు మఠంలో ఉన్న స్వామి గతించారని తంతి వచ్చిందే? నటేశ స్వామి వెళ్ళారా? అన్నారు. 'వెళ్ళారు రెండు రోజులయింది. ఖాయిలాగా ఉన్నాంని ముందే తెలిసింది' అన్నారు వారు. నటేశ స్వామి అంటే ఎవరు? అన్నారొకరు. 'ఇప్పుడు ఈశాన్య మఠాధిపతిగా ఉన్నవారే కోవిలూరు మఠంలో గతించారన్నానే, వారు లోగడ ఇక్కడి ఈశాన్య మఠంలో ఉన్న వారే. కోవిలూరులో అప్పటి మఠాధిపతి గతించినప్పుడు వారిని తీసుకని వెళ్లి ఆ పీఠాధిపత్యం ఇచ్చారు. ఈ వైపు వేదాంత మఠాల్లో అదే ముఖ్యమైనది. వీరికి పాండిత్యం తక్కువైనా మంచి సాధువగుట వల్ల వీరే కావాలన్నారు. ఇరువదేండ్లు అయిందనుకుంటా'నన్నారు భగవాన్. 'భగవానుని బండి ఎక్కించింది వీరేనా?' అన్నా నేను. 'కాదు వీరికన్న ముందున్న వారు. వారు వీరివలె కాదు చాలా గంభీరమైన వ్యక్తి' అన్నారు భగవాన్. 'బండి ఎక్కిందెపుడు' అన్నారొకరు. 'విరూపాక్ష గుహలో ఉండగానే అక్కడకు వచ్చిన నాలుగైదేండ్లకు. అదొక చిత్ర కథ. ఒకనాడు నేను, పళనిస్వామి గిరి ప్రదక్షిణం చేసి కోవెల వద్దకు వచ్చే సరికి రాత్రి ఎనిమిది గంటలయింది. అలసటగా ఉండటం వల్ల కంబత్తిల్ సుబ్రహ్మణ్యేశ్వరాలయంలో పడుకున్నాను. పళని అన్నం తెస్తానని సత్రానికి వెళ్ళాడు. వారు గుళ్ళోకి వెడుతున్నారట. వారిచుట్టూ శిష్యులుంటారు గదా? వారిలో ఒకరు బ్రాహ్మణ స్వామి ఇక్కడున్నారని చెప్పారట. ఇంకేం తిరిగి వెళుతూ పది మందితో వచ్చి చుట్టూ నిలిచారు. లేవంటే స్వామి పోమంటారు. నేను మౌన స్వామినాయె మరి. రానని సంజ్ఞ చేశాను. వారా విననది. ఎత్తండిరా ఎత్తండి అన్నారు. సరే ఇక తప్పదని లేచాను. బయటకు వస్తే బండి సిద్ధంగా ఉంది. ఎక్కండి స్వామీ అన్నారు. నేనెక్కను నడిచే వస్తాను. మీరెక్కి వెళ్ళండని సంజ్ఞ చేస్తే వింటారా. ఊ చూస్తారేం రా, స్వామిని ఎత్తి బండిలో కూర్చోబెట్టండి అన్నారు అంతా. పది మంది ఉన్నారాయె. మన వైపు మాట్లాడేవారెవరూ లేరు. సరే ఎత్తి బండిలో కూర్చోబెట్టారు. పలక్కుండా మఠానికి వెళ్లాను. పెద్ద విస్తరి వేసి వడ్డించి ఇక్కడే ఉండిపొండి స్వామి! అంటూ ఉపచారం చేశారు. పళని స్వామి కోవెలకు వచ్చి, చూచి విషయం విచారించి, తెలుసుకుని మఠానికి వచ్చారు. వారు వచ్చిన వెనుక ఎట్లాగోతప్పించుకుని వెళ్లిపోయాను. ఈ వూరు వచ్చిన వెనుక అదే బండి ఎక్కటం. ఆ వెనుక ఒకటి రెండు సార్లు కొత్త వారెవరో వస్తే నన్ను రమ్మని బండి పంపారు. ఇప్పుడు సందిస్తే వదలరనీ, ఈ ఉపద్రవమంతా మనకెందుకనీ రానని చెప్పి బండి తిప్పి పంపాను. అంతటితో బండి పంపడం మానారు. అదొకటేనా వారి ఉపద్రవం. పిలిచినపుడు వెళ్లకున్నా, ప్రదక్షిణం వెళ్లి వస్తూనో వరెప్పుడైనా మఠానికి వెడుతుండే వాణ్ని. వెడితే అక్కడే కూర్చోబెట్టి లోపలకు వెళ్లి వంట వారితో గుసగుసలాడి వచ్చేవారు. భోజన సమయంలో అరిటియాకు పెద్దవి వేయించి తాము నా పక్కనే కూచుని వేయండిరా వేయండని ఎన్నో పదార్థాలు వడ్డించేవారు. మిగతా దినాలలో వారు పంక్తికి వచ్చేవారు కాదు. ఇందుకు గాను నా పక్కనే కూచుండేవారు.

(తరువాయి భాగం రేపటి సంచికలో)

- సూరి నాగమ్మ

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/

దినఫలాలు

మేష రాశి: ఆర్థిక లావాదేవీలు అనుకూలం. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. విద్యా ప్రయత్నాలు అనుకూలం. మంచి కార్యాలతో పేరు ప్రఖ్యాతులు లభిస్తాయి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది.

వృషభ రాశి: ఆర్థిక ప్రయత్నాలు ఊరట కలిగిస్తాయి. స్థిరాస్తి విషయాలు ఉపకరిస్తాయి. విద్యా విషయాల్లో ప్రాధాన్యత లభిస్తుంది. ఆరోగ్య అనుకూలత తగ్గుతుంది. ఆరోగ్యంలో అశ్రద్ధ పనికి రాదు. ఆర్థిక విస్మయ పరిస్థితులుంటాయి.

మిథున రాశి: సాహస నిర్ణయాలతో ఊరట కలుగుతుంది. కోర్టు వ్యవహారాల్లో ఉపశమనం ఉంటుంది. ఆర్థిక వ్యవహారాలలో అనుకూలత ప్రారంభం. ఆరోగ్య పత్రికూలత తగ్గుతుంది. పనులలో వేగం పెరుగుతుంది.

కర్కాటక రాశి: శ్రమ అధికమవుతుంది. పిల్లల విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆరోగ్య ప్రతికూలత ఉంటుంది. అనవసర ఆందోళనలు పెరుగుతాయి. ఆదాయ మార్గాలు అన్వేషించగలుగుతారు.

సింహ రాశి: గృహ కార్యాలు కార్యక్రమాలు అనుకూలం. ఆర్థిక క్రమశిక్షణ తప్పనిసరి. పెట్టుబడుల ప్రతిబంధకాలు ప్రబలమవుతాయి. ఆరోగ్యం అనుకూలత పెరుగుతుంది. ఆదాయంలో అయోమయాలు అధిగమించగలుగుతారు.

కన్య రాశి: తెలివైన నిర్ణయాల ద్వారా విజయాలు సాధిస్తారు. ఇంట్లో ఆహ్లాదకర పరిస్థితులుంటాయి. వ్యాపార విజయాలు కొనసాగుతాయి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. స్థిరాస్తి విషయాల్లో చికాకులు పరిష్కరింప బడతాయి.

తుల రాశి: విదేశీ లావాదేవీలు, సంభాషణలు కలసి వస్తాయి. కోర్టు వ్యవహారాలు లాభిస్తాయి. ఖర్చులు అధికమవుతాయి. మెరుగైన పరిస్థితులు ఆరోగ్యరీత్యా ఆనందాన్ని కలిగిస్తాయి.

వృశ్చిక రాశి: ఆరోగ్య పరిస్థితులు మేలును కలిగిస్తాయి. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. వ్యాపారపరంగా అసహన పరిస్థితులుంటాయి. ఆదాయం పర్వాలేదు.

ధనూ రాశి: ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. నూతన స్నేహాల ద్వారా లబ్ధి పొందుతారు. వ్యాపార ప్రతిబంధకాలు ఎదుర్కోగలుగుతారు. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. ఆదాయంలో మెరుగైన అవకాశాలు దగ్గరవుతాయి.

మకర రాశి: సంభాషణల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. కోర్టు వ్యవహారాల్లో ఊరట కలుగుతుంది. ప్రయాణాల్లో జాగ్రత్తలు తప్పనిసరి. ఆరోగ్య ప్రతికూలత ఆకస్మికం.

కుంభ రాశి: నూతనోత్సాహం పెరుగుతుంది. విద్యా ప్రయత్నాలు లాభిస్తాయి. శుభవార్తలు వింటారు. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. ఆదాయంలో ప్రోత్సాహక పరిస్థితులుం టాయి.

మీన రాశి: రుణ ప్రయత్నాలు లాభిస్తాయి. కోర్టు వ్యవహారాల్లో ఉపశమనం ఉంటుంది. ఆరోగ్యరీత్యా శ్రద్ధ వహించాలి. ముఖ్యమైన పనుల విషయంలో ఏకాగ్రత తప్పనిసరి.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com

మూడడుగుల్లోనే అంతా...



బ్రహ్మాండమంతా నిండిపోయిన పరమాత్మ పొట్టివాడిగా అమ్మ కడుపులో ఇమిడిపోవడం ఆశ్చర్యకరం. అదితి, కశ్యపుని నిరంతర తపోఫలమైన తమ పుత్రునికి వడుగు చేయ నిశ్చయించిన సమయంలో బిక్షా పాత్రనిచ్చింది

సాక్షాత్ శ్రీ మన్నారాయణుడు బలి చక్రవర్తిని అణచటానికి వామనావతారంలో మూడడుగుల నేలను దానంగా గ్రహించటానికి యజ్ఞవాటికకు వచ్చిన విషయం అందరికీ తెలిసిందే . ఆ సందర్భంగా వారికి మధ్య జరిగిన సంవాదం అద్భుతం. అ ఘట్టాన్ని పోతనామాత్యులు అద్భుతంగా వర్ణించారు. ఆ ఘట్టాన్ని బలి అనితర సాధ్య వితరణ శీలతకు, విష్ణువు అనంత తత్వానికి, శుక్రుని శిష్య వాత్సల్య హృదయానికి చిహ్నంగా చెబుతారు. ఆ ఘట్టం వర్ణన ఇది.

సహస్ర శీర్షా పురుషః! సహస్రాక్షః సహస్ర పాత్!
సభూమిం విశ్వతో వృత్వా! అత్యతిష్ఠద్ధ శాంగులమ్!

బ్రహ్మాండమంతా నిండిపోయిన పరమాత్మ పొట్టివాడిగా అమ్మ కడుపులో ఇమిడిపోవడం ఆశ్చర్యకరం. అదితి, కశ్యపుని నిరంతర తపోఫలమైన తమ పుత్రునికి వడుగు చేయ నిశ్చయించిన సమయంలో బిక్షా పాత్రనిచ్చింది

యక్షేశుడు వామనునకు నక్షయ మనుచున్
సాక్షాత్కరించి పెట్టెను
భిక్షునకు భవాని పూర్ణభిక్ష నరేంద్రా!

సాక్షాత్తు కుబేరుడు భిక్షాపాత్ర ఇచ్చాడు. అమ్మ మొదటి భిక్ష వేసింది. ఆ అమ్మ అదితి కాదు జగన్మాత ఆదిశక్తి. బృహస్పతి, సూర్యభగవానుడు, చంద్రుడు, బ్రహ్మ, సరస్వతీదేవి అందరూ వచ్చారు. ఒకరు కమండలం, ఇంకొకరు ముంజె మొలత్రాడు, ఒకరు యజ్ఞోపవీతం, తావళం ఇచ్చారు. సూర్యుడు గాయత్రీ మంత్రోపదేశం చేశాడు. బ్రహ్మచారి అయిన పిమ్మట భూరి సంభావనలిచ్చే ప్రభువెవరని అక్కడి బ్రాహ్మణులనడగగా బలి చక్రవర్తి నర్మదానదీ తీరంలో యజ్ఞం చేస్తూ భూరి దానాలు చేస్తున్నాడని చెప్పగా అక్కడికి బయలు దేరాడు వటువు. ఆ బయలుదేరిన విధం ఎలా ఉందంటే

సర్వ ప్రపంచ గురు భర
నిర్వాహకుడగుట జేసి నెఱి జనుదేరన్
ఖర్వుని వ్రేగు సహింపక
నుర్వీ స్థలి గ్రుంగె వ్రొగె నురగేంద్రుడున్

ఆయన అడుగు తీసి అడుగు వేస్తుంటే సమస్త భువన భాండాలు బొజ్జలో దాగి ఉన్నవాడి భారాన్ని మోయలేక భూమి కృంగుతోందని అంటాడు పోతన. ఆ సమయంలో ఆదిశేషుడు తన పడగలపై ఆయనను మోసాడు ఆ బాధను తాను పొందాడు.

ఉపనయనానంతరం గురువు దగ్గరకు వెళ్ళి విద్యనభ్యసించవలసిన వాడు వేదాలు, శాస్త్రాలు నేర్చుకోవలసినవాడు తిన్నగా ఇటు వచ్చాడేమిటి..? అని అక్కడి బ్రాహ్మణులు ఆశ్చర్య పోతున్నారు. వారితో వటువు మాట్లాడుతున్న విధానాన్ని చెబుతూ..

కొందఱితో జర్చించును
గొందఱితో జటలు సెప్పు గోష్ఠింజేయున్
గొందఱితో దర్కించును
గొందఱితో ముచ్చటాడు
గొందఱినవ్వున్

మీ గురువెవరు..? మీరు ఏ మంత్రానికి చెబుతున్నారు..? మంత్ర వ్యాఖ్యానమేమిటి..? ఫలానా యాగంలో ఇలా సమన్వయం చేయవచ్చు కదా అని చర్చిస్తున్న ఆ బాలుణ్ణి చూసి అందరూ తెల్లబోతున్నారు. వీడు అన్ని నేర్చుకుని పుట్టాడా అని అనుకుంటూ.

"శంభుడో హరియో పయోజ భవుడో.. రహస్యంబుగన్"

ఈ రోజు ఉపనయనమైన వాడు ఇన్ని మాటలు మాట్లాడ గలడా..? పరమశివుడో, విష్ణువో, కుబేరుడో, అగ్నియో, సూర్యుడో అయి ఉంటాడు అని అనుకుంటున్నారు. వటువు తిన్నగా బలి దగ్గరకు వెళ్ళాడు. బలి భార్య వింధ్యావళితో కలిసి అగ్ని హోత్రం చేస్తున్నాడు. అప్పుడు వటువు బలిని

"స్వస్తి జగత్రయీ భువన శాసనకర్తకు.. దానవలోక భర్తకున్"

స్వస్తి అంటూ మొదలు పెట్టాడు. స్వస్తి అంటే మంగళప్రదం అని అర్థం. ఇక్కడ వేరే అర్థం ఏమిటి అంటే పూర్తి అని. అనగా ఈ రోజు నుండి బలి చేసే అన్ని కార్యాలకు స్వస్తి(పూర్తి) అని అంతర్లీనంగా ధ్వని బలి యొక్క పాలనకు, శాసనాలకు, యాగాలకు, ధానధర్మాలకు, ముఖ్యంగా ఆయన జన్మకు స్వస్తి అని మంగళం అగుగాక అంటూనే అతని జన్మ పూర్తవబోతుంది అని చెప్పడం అద్భుతం.

యజ్ఞభృత్ యజ్ఞకృత్ యజ్ఞేయజ్ఞభుక్.. మన్నమన్నాద ఏవచ..!

యజ్ఞస్వరూపం అయిన మహావిష్ణువే వామనుడు. కావున ఆయన రాకను తెలియజేస్తూ అగ్ని వలయాకారంలో ఒకసారిగా అగ్నిగుండంపైన తిరుగాడటం గమనించిన బలి వచ్చినవాడు మహాత్ముడని గుర్తించాడు.

వడుగా ఎవ్వరి వాడ.?..... గళ్యాణ మిక్కాలమున్

ఎవరు నీవు.? ఎక్కడి నుండి వచ్చావు..? నీవు రావటం వల్ల యజ్ఞం పునీతమైంది అంటూ అడిగి నీకు భిక్షగా ఏమి కావాలని అని అడిగాడు.

ఒంటివాడ నాకు నొకటి రెండడుగుల
మేర యిమ్ము సొమ్ము మేర యెల్ల
గోర్కిదీర బ్రహ్మ కూకటి ముట్టెద
దాన కుతుక సాంద్ర! దానవేంద్ర

ఒకటి రెండు అడుగుల నేల అన్నాడు. ఒంటి వాడను నాకు ఏమీ అక్కర లేదు. నువ్వు ఏమి ఇచ్చినా అది బ్రహ్మాండమే నాకు అన్నాడు.. వామనుడు

ఇది నాకు నెలవని యేరీతి బలుకుదు..? ..
నేరుపులున్నియు నేననేర్తు

ఇక్కడ ఉంటాను అని చెప్పడం కష్టం. బ్రహ్మచారిని కాబట్టి గురువు ఆజ్ఞను పాటిస్తూ ఆయనను సేవిస్తూ ఎక్కడైనా ఉండవచ్చు కదా..! అని పలికెను. ఇక గురు సేవలో ఉండగా నాకు ధనం, కనకం మొదలైన భౌతిక వస్తువులతో పని ఏముంది.? మూడడుగుల నేల చాలు అని కోరెను. అది విని వింధ్యావళి భర్తతో మోహన రూపంతో ముద్దులొలుకుచున్న ఈ బుజ్జి బాలుడు మూడడుగుల నేల అడుగుతున్నాడేంటి. అమాయకుడని అంటుంది. అప్పుడు బలి వటువా నీవు నా శక్తిని గుర్తించడం లేదు అంటూ

వర చేలంబులో మాడలో ఫలములో.. ధాత్రీ సురేంద్రోత్తమా

పట్టు బట్టలా, గోవుల మందలా? వజ్రవైడూర్యాలా.. నీకు ఏమీ కావాలన్నా ఇచ్చేస్తాను అనగా వటుడు

వ్యాప్తిం బొందక వగవక
ప్రాప్తంబగు లేశమైన బదివేలనుచుం
దృప్తిం జెందని మనుజుడు
సప్తద్వీపములనయిన జక్కంబడునే..?

దొరికిన దానితో తృప్తిపడాలి. ఆశకు అంతు ఏమున్నది..? సప్తద్వీపములతో కూడిన సమస్త భూ మండలం లభించినా సంతృప్తి పడని మానవుని గూర్చి పలికాడు. అంతరంగంలో తృప్తి అనేది ఉంటేనే మానవుడు నిత్య సంతుష్టుడై ఉంటాడు. కావున నాకు మూడడుగుల నేల మాత్రం చాలు 'అది ఇచ్చాను అను' అన్నాడు.

భార్య వింధ్యావళిని పిలిచి ముచ్చటగా ఉన్నాడు మూడడుగుల నేల మాత్రమే అడుగుతున్నాడు. ఆ మూడడుగులే దానం చేస్తానని



రమ్మా! మాణవకోత్తమ!
లెమ్మా!
నీవాంఛితంబులే
దనకిత్తం
దెమ్మా! యడుగుల
నిటురా
నిమ్మా!
కడుగంగవలయు నేటికి
దడయున్

భార్య వింధ్యావళి నీరు పోయుచుండగా బంగారు పళ్ళెంలో వటుడి కాళ్ళు కడుగుతుండగా


విప్రాయ ప్రకట
వ్రతాయ..... బొందగన్

అంటూ దానం చెయ్యటానికి సిద్ధపడుతుండగా రాక్షస గురువు శుక్రాచార్యుడు పరిగెత్తుకుని వచ్చి ఎంత పని చేస్తున్నారు..? వచ్చినవాడు వటువు కాదు సాక్షాత్తు శ్రీమన్నారాయణుడు నిన్ను మోసగించటానికి వచ్చాడు. ఒక అడుగుతో భూమిని, రెండో అడుగుతో ఆకాశాన్ని, మూడో అడుగు నీతల మీద పెట్టి పాతాళానికి తొక్కేస్తాడు. రాజ్యం ఇంద్రునికి ఇచ్చేస్తాడు. దానం ఇవ్వనని చెప్పు అని పలికాడు.

(తరువాయి భాగం రేపటి సంచికలో)

-అట్లూరి వెంకటరమణ

దేవతామూర్తి సంపత్కారి




మంత్రాధిష్ఠాన దేవత పేరు సంపత్కారి. లలితాదేవి తన అంకుశం నుంచి సంపత్కారిని సృష్టించింది. త్రిపుర సుందరీ దేవి గజ సైన్యానికి సంపత్కారీ దేవి నాయకురాలు అని లలితోపాఖ్యానంలో ఉంది.

దేవతామూర్తులు ఎందరో ఉన్నారు. కొందరి గురించి అందరికీ బాగా తెలుసు. కొందరి గురించి అంతగా జన సామాన్యంలో ప్రచారం లేదు. అమ్మవారు మహిషాసురాది అసురులను దునుమాడే సమయంలో ఆమెకు ఎన్నో రకాల దేవీ శక్తులు సహాయం చేశాయని చెబుతారు. వాటిలో కొందరు దేవతామూర్తులను లలితా పరాభట్టారికే స్వయంగా సృష్టించింది. అటువంటి దేవతల్లో సంపత్కారి ఒకరు. లలితా సహస్రనామ పారాయణ చేసేవారందరికీ 'సంపత్కరీ సమారూఢా సింధూర వ్రజ సేవిత' అనేది తెలిసే ఉంటుంది. సంపత్కారి అనేది ఒక దేవత, ఈమె గురించి స్వతంత్ర తంత్రంలో ఉంది. నిజానికి ఒక దేవత అంటే మంత్ర విద్య. ఈ మంత్ర విద్యలో మూడు వర్ణాలున్నాయి. మంత్రాధిష్ఠాన దేవత పేరు సంపత్కారి. లలితాదేవి తన అంకుశం నుంచి సంపత్కరిని సృష్టించింది. త్రిపుర సుందరీ దేవి గజ సైన్యానికి సంపత్కరీ దేవి నాయకురాలు అని లలితోపాఖ్యానంలో ఉంది. ఆ సంపత్కరీ దేవి కోలాహలం అనే ఏనుగునెక్కి దాని వెనుక కోట్లాది గజసైన్యంతో యుద్ధానికి వచ్చింది. ఏనుగుల్లో మూడు రకాలున్నాయి అవి భద్ర గజాలు, మంద్ర గజాలు, మృగ గజాలు. ఈ మూడు రకాల గజాలూ ఆ సైన్యంలో ఉన్నాయి. సంపత్కరి ఇంత గజ సైన్యంతో లలితా దేవిని సేవిస్తోంది. మరో రకంగా చూస్తే సంపద్వికారమైన చిత్త వృత్తికి కూడా సంపత్కరి అని పేరు. ఇది కాక ఈ నామానికి విపులమైన, వేదాంతపరమైన వ్యాఖ్యానం కూడా ఉంది. సుఖ సంపత్కరమైన చిత్త వృత్తికి సంపత్కరి అని పేరు. ఈ చిత్త వృత్తిని శబ్ద స్పర్శాది విషయ సముదాయం సేవిస్తూ ఉంటుంది. ఇదే సింధూర వ్రజం. ఇది కాక శ్రీచక్రంలో త్రికోణాగ్రంలో ఉన్న కామేశ్వరీ దేవికే సంపత్కరి అన్న రహస్య సంజ్ఞ కూడా ఉంది. ఋగ్వేదీయమైన సౌభాగ్య లక్ష్మి ఉపనిషత్తులో చెప్పబడిన శ్రీసౌభాగ్య లక్ష్మి కామకళాఏకాక్షర మహామంత్రానికి సంపత్కరీ మహా మంత్రం అనే సంకేతం కూడా ఉంది. శ్రీవిద్యలో అవిడ అధిష్ఠించిన గజమే మంత్ర వర్ణ స్వరూపం.

తాడిగడప శ్యామలరావు

భగవద్గీత



యోగాభ్యాసంతో అంత్య కాలంలో భగవంతునిపై దృష్టి

అధ్యాయం 8
శ్లోకం 10

ప్రయాణకాలే మనసాచలేన
భక్త్యా యుక్తో యోగబలేన చైవ।
భ్రువోర్మధ్యే ప్రాణమావేశ్య సమ్యక్
స తం పరం పురుషముపైతి దివ్యమ్

తాత్పర్యం

మరణసమయంలో ప్రాణవాయువును భృకుటిపై నిలిపి, యోగశక్తిచే చలించని మనస్సుతో సంపూర్ణ భక్తి భావంతో భగవానుని స్మరించేవాడు తప్పక ఆ పరమపురుషుని పొందగలడు.

భాష్యం

మృత్యు సమయంలో మనస్సును భక్తితో పరమ పురుషునిపై లగ్నము చేయాలని ఇక్కడ తెలియజేయటమైనది. షట్చక్ర యోగము చేసేవారు భృకుటిపై ప్రాణవాయువును నిలపాలని సూచించబడినది. అయితే రాబోవు 14వ శ్లోకములో తెలిపినట్లు శుద్ధ భక్తులు భక్తి యోగం ద్వారా కృష్ణుని కృపచే మృత్యు సమయంలో ఆయనను స్మరించగలరని, వారు ఇటువంటి యోగా పద్ధతిని పాటించనవసరము లేదని అర్థమగుచున్నది. అయితే 'యోగ-బలము' ఎవరికైనా, షట్చక్ర యోగికైనా, భక్తి యోగికైనా ఆవశ్యకమే. జీవితాంతము ఏ యోగమునూ పాటించకుండా హఠాత్తుగా చివరి నిమషములో దివ్య స్థితిని పొంది ఎవరూ భగవంతుణ్ని స్మరించలేరు. మృత్యు సమయంలో మనస్సు ఎంతో కలత చెంది చింతతో ఉంటుంది.

....పరమపూజ్యశ్రీ శ్రీమత్ ఎ సి భక్తి వేదాంత స్వామి ప్రభుపాదుల వారి 'భగవద్గీత యథాతథం' నుంచి ఇస్కాన్ హైదరాబాద్ వారి సౌజన్యంతో .....

అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘు సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యథాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.

సంతానప్రాప్తికి మంత్రము



ధర్మం-మర్మం

ఓం ధాత్రే నమః

మంత్ర జప విధానము :

ప్రాతఃకాలమునే లేచి స్నానాదులు ముగించుకుని పరిశుద్ధమైన వస్త్రములు ధరించి నుదుటున తిలకమును దిద్దుకుని పూజామందిరంలో దీపారాధన చేసి తమ నిత్య కృత్యములైన సంధ్యావందనాది కార్యక్రమములను ముగించుకుని నిశ్చలమైన పరిశుద్ధమైన మనస్సుతో తమ శక్తికి అనుగుణంగా మంత్రమును జపించవలెను.



- డా॥ కందాడై రామానుజాచార్య

ప్లాస్టిక్ సర్జరీలు ప్రమాదకరమని వస్తున్న వార్తలను ప్రముఖ కాస్మోటిక్ సర్జన్ డాక్టర్ రాజేష్ వాసు అంటున్నారు. మెజారిటీ సర్జరీలు సురక్షితమే కానీ శిక్షణ పొందని డాక్టర్లు ఇటువంటి సర్జరీలు చేయడం వల్ల అనేక దుష్పరిణామాలు తలెత్తుతున్నాయని ఆయన అన్నారు. "శ్రీదేవి కిగతంలో చేయించుకున్న కాస్మోటిక్ సర్జరీకి చనిపోవడానికి ఎటువంటి సంబంధం లేదు. కాస్మోటిక్ వైద్యం వికటించి చనిపోయినట్టు సోషల్ మీడియాలో వస్తున్న వార్తలతో నేను ఏకీభవించడం లేదు.ఫోరెన్సిక్ రిపోర్టు కూడా టబ్ లో పడిపోయి చనిపోయింది " అని ఉంది ఆయన అన్నారు. ఆంధ్రప్రభ 'కులాస'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ ఈ సర్జరీల్లో ఉన్న పలు అనుమానాలను నివృత్తి చేశారు. ఏ సర్జరీ చేసినా జాగ్రత్త చర్యలు పాటించాలి. ఎయిర్ క్రాష్ అయింది కదా అని విమానాలను ఎక్కకుండా ఉండగలమా? ఇదీ అంతే అంటారాయన.

కాస్మోటిక్ సర్జరీ సురక్షితమేనా?

నూతన సాంకేతిక పరిజ్ఞానం ఫలితంగా ఎన్నో ఆధునిక చికిత్సలు అందుబాటులోకి వచ్చాయి. అతివలతోపాటు పురుషుల అందాన్ని పెంచుకునేందుకు సరికొత్త ప్లాస్టిక్, కాస్మోటిక్ సర్జరీల బాటపడుతున్నారు. గతంలో క్యాన్సర్, ఈఎన్‌టి తదితర చికిత్సలకు వినియోగించిన లేజర్ చికిత్స నేడు కాస్మోటిక్ సర్జరీలకు సైతం వినియోగిస్తున్నారు. అందానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న కాలమిది. అందుకే ఎంత ఖర్చుకైనా వెనకాడకుండా ఆధునిక పద్దతుల్లో ప్లాస్టిక్, కాస్మోటిక్ చికిత్సలు చేయించుకునేందు కు యువతరం ప్రాధాన్యతనిస్తున్నారు. పుట్టకతో వచ్చిన మచ్చలు, గాయపడి నప్పుడు ఏర్పడే మచ్చలు, మొటిమలతో వచ్చే మచ్చలు, అవాంఛిత రోమాలను తొలగించుకోవడానికి లేజర్ థెరపీని ఎంచుకుంటున్నారు.

కాస్మోటిక్ సర్జరీలు రోజురోజుకి ఎక్కువవుతున్నాయి. యుకేలో ప్రతి సంవత్సరం లక్ష కాస్మోటిక్ సర్జరీలు జరుగుతున్నాయి. చాలామంది ప్లాస్టిక్ సర్జరీ చేయించుకోవడానికి భయపడుతుంటారు. శిక్షణపొందిన డాక్టర్ల చేత సర్జరీలు చేయించుకుంటే ఎటువంటి ప్రమాదం లేదు.


సర్జరీముందు


సర్జరీతరువాత

హెమటోమా : హెమటోమా చికిత్స వల్ల రక్తం ఎక్కువగా స్రావమవుతుంది. కాబట్టి ఈ సర్జరీ చేసే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి. స్థనాలు పెద్దగా కనిపించడానికి ఈ చికిత్స చేస్తారు.

నెర్వ్ డామేజ్ : అనేక సర్జరీ ప్రక్రియల్లో నెర్వ్ డామేజ్ (నరాలు దెబ్బతినడం) వంటివి జరుగుతాయి. ఈ సర్జరీ కూడా అనుభవజ్ఞులైన వైద్యుల చేత చేయించుకోవాలి.

ఇన్‌ఫెక్షన్ : ప్లాస్టిక్ లేదా కాస్మోటిక్ సర్జరీలు చేయించుకునే ముందు కొన్ని జాగ్రత్తలు తీసుకోని పక్షంలో ఇన్‌ఫెక్షన్ వస్తుంది. ఇది చర్మానికి సంబంధించి ఎక్కువగా ఉంటుంది. రెండు నుంచి నాలుగు శాతం వరకు ఇన్‌ఫెక్షన్ వచ్చే అవకాశాలున్నాయి.

డీప్ వీన్ థ్రోంబోసిస్, పల్మోనరీ ఎంబోలిజమ్ డీప్ వీన్ థ్రోంబోసిస్, పల్మోనరీ ఎంబోలిజమ్ ఎక్కువగా వస్తుంది. ఈ వ్యాధి వల్ల రక్తం గడ్డ కట్టుకుపోతుంది. ముఖ్యంగా కాళ్లలో ఈ వ్యాధి వచ్చే అవకాశాలున్నాయి. ఎప్పుడైతే ఈ గడ్డలు విరిగిపోయి ఒక్కోసారి ఊపిరితిత్తుల్లోకి కూడా వెళతాయి. పల్మోనరీ ఎంబోలిజమ్ విషయంలో కూడా జాగ్రత్తలు పాటించాలి.



స్కేరింగ్: ప్లాస్టిక్ సర్జరీల్లో ఒక్కోసారి స్కేరింగ్ (మచ్చలు) కనబడతాయి. ఇవి ఎరుపు వర్ణంలో ఉంటాయి.

అసంతృప్తి : చాలామటుకు ప్లాస్టిక్ సర్జరీలు జరిగినప్పుడు సంతృప్తి మాత్రం మిగులుతుంది. ఈ సంతృప్తి కోసమే వాళ్లు ఇటువంటి సర్జరీల పట్ల మొగ్గు చూపుతారు. ఒక్కోసారి వైఫల్యం చెందితే మాత్రం మానసికంగా కృంగిపోతుంటారు. అంతేకానీ మెజారిటీ సర్జరీలు విజయవంతం అవుతాయి. ఇది పూర్తిగా సురక్షితమని చెప్పొచ్చు.

లైపోసక్షన్ : లైపో సక్షన్ చికిత్స అందించే ముందు జాగ్రత్తలు పాటించాలి. లేనిపక్షంలో అంతర్గత అవయవాలు దెబ్బతినే ప్రమాదముంది.

అనేస్థీషియా: ప్లాస్టిక్ లేదా కాస్మోటిక్ సర్జరీ చేసే ముందు రోగి స్పృహలో రాకుండా ఉండటానికి మాత్రం అనేస్థీషియా ఇస్తారు. రోగికి బాధ తెలియకుండా ఉండటానికి ఈ చికిత్స చేస్తారు.

సెరోమా : సర్జరీలు జరిగిన తర్వాత రక్తం పేరుకుపోయి వాపు కలుగుతుంది. రక్తం అంతా ఒకే చోట పేరుకుపోయినట్టుగా అనిపిస్తుంది. కొన్ని జాగ్రత్త చర్యలు తీసుకుంటే ఈ సమస్యను కూడా అధిగమించొచ్చు.

రక్తస్రావం : అనేక సర్జరీల్లో రక్త స్రావం కలుగుతుంది. రక్త స్రావం ఎందుకు కలుగుతుంది దానికి గల కారణాలను అన్వేషించాలి. రక్తపోటు ఉన్నవారికి యాస్ప్రిన్ వంటి మందులు వాడేవారికి రక్త స్రావం ప్రారంభమైతే సాధారణంగా ఆగదు. కాబట్టి రోగి వైద్య చరిత్ర తెలుసుకుని సర్జరీలు చేయాలి.

శ్రీదేవి మరణం వెనక అసలు కారణాలు తెలియాల్సి ఉంది. అయినప్పటికీ మీడియాలో కాస్మోటిక్ సర్జరీ వల్ల చనిపోయినట్టు వార్తలు గుప్పుమంటున్నాయి. ఇది పూర్తిగా వాస్తవం కాదు. కార్డియాక్ అరెస్ట్ రావడానికి కాస్మోటిక్ సర్జరీ కారణమంటూ కొందరు దుష్ప్రచారం చేస్తున్నారు. ప్రతీ సర్జరీకి సైడ్ ఎఫెక్ట్ ఉంటుంది. ఒక్క కాస్మోటిక్ సర్జరీ అనడం సరికాదు.

డాక్టర్ రాజేష్ వాసు
కన్సల్టెంట్ కాస్మోటిక్ సర్జన్
కాంటినెంటల్ హాస్పిటల్స్



ప్లాస్టిక్ సర్జరీతో అందం ద్విగుణీకృతం

శస్త్ర చికిత్సకు పితామహుడు సుశృత 300కి పైగా ప్రక్రియలను కనుగొన్నాడు. క్రీస్తు పూర్వం 6లోనే ప్లాస్టిక్ సర్జరీ ద్వారా పునర్‌నిర్మాణ శస్త్ర చికిత్సలు చేశారు. ఆధునాతన ప్లాస్టిక్ సర్జరీ మాత్రం సర్ హరోల్డ్ డెల్ఫ్ గిల్లీస్ ద్వారా వృద్ధి చెందింది. ఈయన న్యూజిలాండ్‌కు చెందిన వ్యక్తి. అనేక సాంకేతికతను అభివృద్ధి చేశారు. అయితే తెలుగు రాష్ట్రాల్లో ప్రాఖ్యాతిగాంచిన ప్రభుత్వ ఆసుపత్రి అయిన ఉస్మానియాలో ఆధునాతన ప్లాస్టిక్ సర్జరీ అందుబాటులో ఉంది అంటున్నారు ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ నాగప్రసాద్. ఆంధ్రప్రభకు ఇచ్చిన ఇష్టాగోష్టిలో ఆయన మాట్లాడారు. ఆ వివరాలు తెలుసుకుందాం.

కులాసా

కాస్మోటిక్ సర్జరీ అంటే ఏమిటి?

కాస్మోటిక్ సర్జరీ వల్ల మీ అందం ద్విగుణీకృతం అవుతుంది. మీ లుక్ మార్చుకోవడానికి అనేక కారణాలున్నాయి.మంటల్లో శరీరం కాలినగాయాలకు గురయినప్పుడు లేదా ఇతర గాయాలు తగిలినప్పుడు, పుట్టుకతో వైఫల్యాలు వాటిల్లినప్పుడు, ఇతర కారణాలతో మీ శరీర ఆకృతిని మార్చాలనుకున్నప్పుడు కాస్మోటిక్ సర్జరీ చేసుకోవడం అనివార్యమౌతుంది.



కాస్మోటిక్ సర్జరీ రకాలు, ప్రక్రియల గూర్చి వివరించండి?

గాయాలకు గురైన ప్రాంతంలో శరీరంలోని ఇతర భాగం నుంచి కొంత చర్మాన్ని తెచ్చి సర్దుబాటు చేయడాన్నే రికన్‌స్ట్రక్టివ్ సర్జరీ అంటారు. పుట్టుకతో వచ్చిన వైకల్యం కావొచ్చు మీ ఉద్యోగరీత్యా, జీవితంలో జరిగే ఒడిదుడుకుల కారణంగా సమస్యలు వాటిల్లవచ్చు. మీ సంబంధాలు మరింత దృఢంగా ఉండటానికి, ఆత్మవిశ్వాసంతో అడుగులు ముందు వేయడానికి అందం కీలక పాత్ర పోషిస్తుంది. ఈ నేపథ్యంలో కాస్మోటిక్ సర్జరీలో అనేక రకాలు వచ్చాయి. కాస్మోటిక్ సర్జరీ ఇప్పుడు సామాన్యులకు కూడా అందుబాటులో ఉంటుంది. ప్రమాదాలు జరిగినప్పుడు మీ శరీరంలోని అనేక అవయవాలు దెబ్బతింటూ ఉంటాయి. ఇలా దెబ్బతినడం వల్ల అందవిహీనా నికిలోనవుతారు. కొన్నిసార్లు మీ ఆకృతి సంతోషాన్ని దూరం చేస్తుంది. ఉదాహరణకు పొడవైన ముక్కు, చిన్నపరిమాణంలో ఉండే రొమ్ములు, ముడతలు, నడుము చుట్టూ కొవ్వు పేరుకుపోవడం వంటి కారణాల వల్ల కాస్మోటిక్ సర్జరీ చేసుకోవాల్సి వస్తుంది. ఈ సమస్యలు మనలో చాలామందిలో ఉండవచ్చు కానీ అందరినీ బాధించవు. కొందరిలో మాత్రం ఆత్మవిశ్వాసం దెబ్బతింటుంది. వారి జీవితం అంధాకారం కాకమునుపే కాస్మోటిక్ సర్జరీ ద్వారా వెలుగులు ప్రసాదించవచ్చు.

నాన్‌సర్జికల్ కాస్మోటిక్ ప్రొసీజర్స్ అంటే ఏమిటి?

ఫిల్లర్ ఇంజెక్షన్స్ అందుబాటులోకి వచ్చాయి. సాఫ్ట్ టిష్యూ ఫిల్లర్స్ కూడా ఉన్నాయి. బొటాక్స్ ఇంజెక్షన్స్, లేజర్ కిరణాలతో వెంట్రుకలను తొలగించడం, పళ్లను ధగధగా మెరిసే విధంగా చేయడం వంటి ప్రక్రియలున్నాయి.

రిస్క్ ఎంతవరకు ఉంది?

నిర్ణయాలు తీసుకునే ముందు బాగా ఆలోచించి తీసుకోవాలి. శస్త్రచికిత్సలు ఎప్పటికైనా రిస్క్‌తో కూడుకున్నవి. మీ ఆరోగ్యం, శస్త్రచికిత్స ప్రక్రియను బట్టీ రిస్క్ ఉంటుంది. ఇన్‌ఫెక్షన్ వల్ల మరణం కూడా సంభవించవచ్చు. తీవ్రమైన సమస్యలు మాత్రం అరుదనే చెప్పొచ్చు. కానీ అప్పుడప్పుడు సంభవిస్తూనే ఉంటాయి. మీరు అనుకున్న ప్రతిఫలం వస్తుందన్న గ్యారంటీ లేదు. ఒకటికి మంచి శస్త్రచికిత్సా ప్రక్రియలు అవసరమవుతుంటాయి. మీరు అనుకున్నట్టు జరిగే వరకు శస్త్రచికిత్సలు చేయాల్సి వస్తుంది. శస్త్రచికిత్సలు చేసే ముందు సంబంధిత డాక్టరును సంప్రదించాలి. దీనివల్ల రిస్క్ శాతం ఎంతవరకు ఉందో తెలుసుకోవచ్చు.

కాస్మోటిక్ శస్త్ర చికిత్సలు ఖరీదుతో కూడుకున్నవా?

అవును నిజం. కాస్మోటిక్ శస్త్రచికిత్సలు చాలా ఖరీదుతో కూడుకున్నవే. కొన్ని ఇన్సూరెన్స్ కంపెనీలు ఈ ఖర్చును భరిస్తుంటాయి. ప్రస్తుతం ఉస్మానియా హాస్పిటల్‌లో అత్యంత ఖరీదైన కాస్మోటిక్ సర్జరీలు ఉచితంగానే చేస్తున్నారు. పేదలకు ఈ విషయం తెలియక అనేక ప్రయివేటు హాస్పిటల్స్‌లో చేరి అప్పుల పాలవుతున్నారు. ఇళ్లు, పొలాలు అమ్ముకుంటున్నారు.

కాస్మోటిక్ సర్జరీ చేసుకున్నప్పుడు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

కాస్మోటిక్ సర్జరీ చేసుకున్నప్పుడు ఆరోగ్యకర ఆహారం తీసుకోవాలి. వ్యాయామం చేయాలి. సూర్యరశ్మి ఎక్కువ తగలకుండా జాగ్రత్తపడాలి. ముఖం, చేతుల వెనకభాగం, ఛాతి, మెడ భాగంలో సూర్యరశ్మి ఎక్కువతాకనీయకూడదు. ఒత్తిడిని అధిగమించాలి. స్మోకింగ్ చేయకూడదు. మందులు, ఆల్కాహాల్ తీసుకోకూడదు.

డాక్టర్ ఎన్ నాగప్రసాద్
ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతి
ఉస్మానియా హాస్పిటల్



అరుదైన వ్యాధుల మూలంపై దృష్టి

కొన్ని అరుదైన వ్యాధులు మానవాళిని పట్టిపీడిస్తుంటాయి. వీటి వల్ల మనిషి అతలాకుతలం అవుతాడు. ఆరోగ్యం క్షీణించడమే కాకుండా ఆర్థికంగా కూడా దెబ్బతినే పరిస్థితి ఉత్పన్నమవుతుంది. వీటి మీద సరైన అవగాహన లేకపోవడం వల్ల చాలామంది తీవ్ర నిరాశా నిస్పృహలకు లోనవుతుంటారు. వ్యాధులు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటే వల్ల అరుదైన వ్యాధులను కూడా నివారించవచ్చు. ప్రతీ రెండువేల మందిలో ఒకరికి అరుదైన వ్యాధి వస్తుందని గణాంకాలు తెలియజేస్తున్నాయి. దాదాపు 7వేల అరుదైన వ్యాధులు ఉన్నాయి. జన్యుపర కారణాల వల్ల ఇవి వస్తుంటాయి.వ్యాధులు సంక్రమించడంలో జన్యువుల ప్రభావం అధికంగా ఉంటుంది. ఇప్పటిదాకా గుర్తించిన ఏడు వేల అరుదైన వ్యాధుల్లో 80శాతం జన్యువుల పరంగానే సంక్రమిస్తున్నాయి. వ్యాధుల వ్యాప్తిలో జన్యువుల ప్రభావాలను అధ్యయనం చేయాల్సి ఉంది. అరుదైన వ్యాధుల్లో థలేస్మియా, హీమోఫీలియా, అరుదైన గుండె జబ్బులు, డెంగ్యూ వంటి వ్యాధులు చేరాయి.



ఈ నెల 28న అరుదైన వ్యాధుల దినోత్సవం

చాలా సంవత్సరాల క్రితం భారతదేశంలో ఆయుర్వేద వైద్య శాస్త్రం ఆవిర్భవించింది. గత కొన్ని సంవత్సరాలుగా ఈ వైద్యం ప్రపంచమంతా విస్తరించింది. ఈ వైద్యంలో వ్యాధులను కలుగజేసే మూలంపై దృష్టిసారిస్తారు. ఈ వైద్యంలో వ్యాధులను తగ్గించుటానికి గాను, ఆహార ప్రణాళికలో మార్పులను చేసి, ఔషధాల కలయిక, వ్యాయామాలు, మందుల సహాయంతో శరీర అంతర్భాగాలను శుభ్రపరిచి, వ్యాధి తీవ్రతలను తగ్గించి వేస్తారు. ఆయుర్వేద వైద్యం సహజంగా వివిధ రకాల వ్యాధులకు ప్రత్యామ్నాయ చికిత్సగా వాడుతున్నారు.

ఆయుర్వేద వైద్యం యొక్క విధులు

ఆయుర్వేద వైద్యం సాధారణ ఆరోగ్యం గురించి, శారీరక నిర్మాణం గురించి నిర్దిష్ట అంచనా కలిగి ఉంటుంది. సాధారణంగా నాణ్యత గల ఆరోగ్యాన్ని 'నేచర్'తో సూచిస్తారు. ఈ ప్రకృతి మూడు శక్తులతో నిర్మితమై ఉంటుంది. అవి వాత, పిత్త, కఫా. ఆయుర్వేదంలో వాడే మందులు, ఈ దోషాలను సమస్థితిలోకి తీసుకువచ్చి శరీర సామర్థ్యాన్ని మెరుగుపర్చి వ్యాధుల నుండి ఉపశమనం కలిగిస్తాయి.

ప్రయోజనాలు

సాధారణంగా ఆయుర్వేద వైద్యంలో వాడే మందులు, సహజ ఔషధాలు వీటి వలన శరీరంలో ఎలాంటి దుష్ప్రభావాలు కలుగవు. ఈ ఔషధాలు వ్యాధి గ్రస్తుడిని మానసికంగా శారీరకంగా మెరుగుపర్చి వ్యాధి నుండి ఉపశమనం కలిగిస్తాయి.

ఆయుర్వేద వైద్యం యొక్క ముఖ్య ఉద్దేశ్యం శరీర సామర్థ్యాన్ని మెరుగుపరిచి, వ్యాధి కారకాలకు వ్యతిరేకంగా శరీరాన్ని పనిచేసేలా తయారు చేయడం.

ఆయుర్వేద వైద్యంలో వాడే మందులు హాని కలగచేయకుండా ఎలాంటి విష స్వభావాన్ని కలిగి ఉండకుండా ఉంటాయి.

ఆయుర్వేద మందులను శారీరక రుగ్మతలకు మానసిక వ్యాధులను తగ్గించుటకు గాను విరివిగా వాడుతుంటారు. ఆర్థరైటిస్, స్థూలకాయం, అధిక రక్తపోటు, గుండె వ్యాధులు, నాడీ రుగ్మత, జలుబు, పెద్ద ప్రేగు సమస్యలకు, మలబద్దకం, చర్మ సమస్యలను తగ్గించుటకు, అలర్జీలు, ఉబ్బసం, ఆందోళన, క్రానిక్ ఫెటిగో సిండ్రోమ్(తీవ్ర అలసటను నివారించుటకు), నిరాశ, మధుమేహం, ఫ్లూ, రోగనిరోధక సమస్యలను తగ్గించుటకు గాను ఆయుర్వేద మందులను వాడతారు. వీటికి మాత్రమే కాకుండా చాలా రకాల తీవ్రమైన వ్యాధుల నివారణకు ఈ వైద్యాన్ని వాడతారు.

ఆయుర్వేద మందులను, ఆయుర్వేద నిపుణుల సలహా ప్రకారమే తీసుకోవాలి. వీరు ఇచ్చే మందులు ఒత్తిడి జీవక్రియ సమస్యలను తగ్గిస్తాయి.

ఆయుర్వేద వైద్యాన్ని లేదా ఏ ఇతర సాంప్రదాయ చికిత్సలకు వాడటానికి మందు మీ వైద్యుడి సలహాలను తీసుకోవడం మరవకండి. మీరు అనుసరించే ఆయుర్వేద వైద్యాన్ని ఒక ప్రణాళిక పద్దతి ప్రకారమే అనుసరించేలా తయారు చేసుకోండి.

డాక్టర్ జి. క్రాంతి కుమార్
కేరళ ఆయుర్వేద పంచకర్మ సెంటర్
హైదరాబాద్
సెల్ : 9494675168





ఆరోగ్యానికి అష్టసూత్రాలు

తెల్లారి లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు ఉరుకులు పరుగులతోనే గడిచిపోతుంది. దీనితో కొంతమంది ఆరోగ్యాన్ని అస్సలు పట్టించుకోరు. అనారోగ్య సమస్యలు ఏర్పడటంతో వైద్యుల దగ్గరకు పరిగెడుతుంటారు. కొన్ని ఆరోగ్య నియమాలు, కొన్ని చిట్కాలు పాటిస్తే అనారోగ్య సమస్యలు దరిచేరవు.

- విరేచనాలు. కడుపులో మంట. తలనొప్పి.. నోటి పూత.. కంటి చూపుకు మునగాకు ఔషధంగా పనిచేస్తుంది.
- మునగాకును ఉపయోగించడం ద్వారా రక్తంతో పాటు కిడ్నీలను శుద్ధి అవుతుంది.
- క్యారట్ జ్యూస్ ప్రతిరోజు తాగితే స్పెర్మ్ కౌంట్ పెరుగుతుంది. చర్మం నిగనిగలాడుతుంది.
- వేసవిలోముల్లంగా తీసుకోవాలి. శరీరానికి చలవ చేయడమే కాకుండా హీహైడేషన్ నుండి కాపాడుతుంది. ముల్లంగిలో విటమిన్ ఎ, సి, ఇ యాంటీ యాక్సిడెంట్ వంటి న్యూట్రిషన్స్ ఉంటాయి.
- మధు మేహ వ్యాధి గ్రస్తులు ఉదయం పదికరివేపాకులను నమిలి తింటే ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుంది.
- దానిమ్మ పండులో యాంటీ యాక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. బ్రెస్ట్ క్యాన్సర్ రాకుండా నివారిస్తుంది. గుండెకు మేలు చేస్తుంది.
- అల్లం తింటే ఎక్కిళ్లు తగ్గుతాయి.
- అజీర్తి వలన వచ్చే కడుపు నొప్పికి నిమ్మ రసంలో అల్లం కలిపి తాగితే నొప్పి తగ్గుతుంది. అసిడిటీ వల్లైతే లెమన్ టీ తాగడం ఉత్తమం.



ఆరోగ్యకర ఉప్పు

ఉప్పు ప్రతిరోజు ప్రతి మనిషి ఐదుగ్రాముల వరకు తీసుకుంటున్నట్లు వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ తెలియజేసింది. దాదాపు ఆరులక్షల మంది మనదేశంలో చనిపోతున్నట్టు గణాంకాలు తెలియజేస్తున్నాయి. గుండెపోటు రావడానికి ఉప్పు ప్రధాన కారణం అని తేలింది. అన్నేసి చూడు నన్నేసి చూడు అని ఉప్పు అంటోంది. రుచికోసం ఎక్కువగా ఉప్పును వినియోగిస్తున్నారు. మరణాల సంఖ్య పెరగడానికి గల కారణాల్లో ఉప్పు ఐదో స్థానంలో నిలిచింది. ఎలాంటి ఖనిజ లవణాలు లేకుండానే ఉప్పు మార్కెట్‌లో వస్తుంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని భారతదేశంలో మొట్టమొదటిసారిగా '' ప్యూరో'' అనే ఆరోగ్యకర ఉప్పు ఇప్పుడు మార్కెట్లో వచ్చింది. పౌష్టికాహారలోపాన్ని అధిగమించడానికి ఈ ఉప్పు వినియోగించవచ్చు అని పరిశోధకులు చెబుతున్నారు.



రూపం సమ్మోహనం... అభినయం సంభ్రమం...

పరుగు పందెంలో సెకనులో పదోవంతు తేడా చాలు బంగారు పతకం చేజారడానికి. ఈ ప్రతిభ చిత్ర రంగానికీ వర్తిస్తుంది. ఆడి పాడగల, పాత్రోచితంగా నటించగల, హద్దులు దాటి అందంగా కనిపించగల నాయికలు ఎందరో ఉన్నా...శ్రీదేవి ఎందుకు అగ్ర తారగా వెలిగిందంటే కారణం అన్నింటిలో ఇంకాస్త పైచేయి సాధించగల అసాధారణ లక్షణమే. ఈ ప్రతిభకు పట్టుదల, అంకితభావం, శ్రమ, నటన పట్ల అవ్యాజమైన ప్రేమ తోడై శ్రీదేవిని అందరినీ మించి అందలం ఎక్కించాయి.

తెరపై శ్రీదేవి సమ్మోహన శక్తి గొప్పది. ప్రేక్షకులు క్షణం రెప్పవేయకుండా తనను చూసేలా నటించగల మాయ ఆమె ప్రత్యేకత. ఓ నటికి మించిన ఆకర్షణ ఏదో ఆమెలో ఉండేది. అందంగా ఆడిపాడినా....అసభ్యత గోచరించని దివ్యత్వం ఏదో దాగుండేది. పాత్రలో ఎంత తీవ్రత ఉన్నా ఆమె మెప్పించగలదు అనేంత నమ్మకం కలిగేది. అన్ని హావభావాలు పలికించగల నాయికలు...ఏదో ఒక తరహాలో తమ ఉత్తమ ప్రదర్శన చూపించగలుగుతారు. కొందరు అందంలో, మరికొందరు హాస్యంలో, ఇంకొందరు భావోద్వేగ సందర్భాల్లో....ఈ అన్ని సందర్భాల్లో ప్రేక్షకులను అబ్బురపరచగల నాయిక ఆమె. వసంత కోకిల, ఆకలి రాజ్యం లాంటి చిత్రాల్లో పరిపక్వత గల నాయికగా కనిపించే శ్రీదేవి...వేటగాడు, సర్దార్ పాపారాయుడు, జస్టిస్ చౌదరి లాంటి చిత్రాల్లో అమాయకపు అమ్మాయిగా మారిపోయింది. తను దర్శకుల నటిని అని ఆమె చెప్పుకుందంటే ప్రత్యక్షంగా కనిపించే సినిమాలు మన ముందే ఉన్నాయి. బాలచందర్, బాలు మహేంద్రన్ సినిమాల్లో ఉండే శ్రీదేవికి....దాసరి, రాఘవేంద్రరావు సినిమాల్లోని శ్రీదేవికి పోలికే ఉండదు. అయినా ఆమె నటనను ప్రతి చిత్రంలో, ప్రతి పాత్రలో ఇష్టపడతాం. అది కేవలం శ్రీదేవి అభినయంలో మాత్రమే చూడగల విశిష్టత.



వచ్చేస్తారు. సినిమాల్లో ఎవరినో చూసి అనుకరిస్తారు. అనే దృక్పథాన్ని పూర్తిగా మార్చేసింది శ్రీదేవి. నటిగా వృత్తిలో ఆమె చూపిన అంకితభావం, క్రమశిక్షణ... హీరోయిన్ అంటే ఇలా ఉండాలి అనుకునేలా చేసింది. తను చెప్పకనే ఆచరణ ద్వారా మిగతా నాయికలకు మార్గదర్శనం చేసింది.

నటనలో సమయస్ఫూర్తి ఉండాలంటారు. ఈ టైమింగ్‌ను ఆది నుంచీ అలవర్చుకుంది శ్రీదేవి. ఎదుటి నటుల హావభావాలు, సంభాషణలకు అనువుగా, తగినట్లు స్పందించేది. ఈ విషయాన్ని అడిగితే స్వాతిశయానికి పోకుండా....ఈ టైమింగ్ పట్టుకోవడానికి నాకు పదిహేనేళ్లు పట్టిందంటారామె.

నటన పట్ల శ్రీదేవికి ప్రేమ నాలుగో ఏటనే కలిగింది. తునైవన్ అనే తమిళ చిత్రంలో బాల నటిగా మురుగన్ పాత్రలో నటించింది శ్రీదేవి. ఏదైనా విని కంఠతా పట్టడం మాత్రమే ఆమెకు తెలుసు. ఈ శక్తితోనే సరిగా ఊహ తెలియని వయసులో దర్శకులు చెప్పింది చేసి చూపించింది. అప్పుడే ఐదు పేజీల



సంభాషణలు విని చెప్పి చిత్ర బృందాన్ని ఆశ్చర్యపరిచింది శ్రీదేవి. ఈ విషయాన్ని గుర్తు చేసుకుంటూ....నన్ను పెద్ద సింహాసనం మీద కూర్చోబెట్టారు. మోహానికి రంగు వేశారు. వింతైన దుస్తులు, ఆభరణాలతో అలంకరించారు. ఇదంతా నాకు కొత్త అనుభూతిని ఇచ్చింది. ఈ అనుభూతే నటనపై అనంతమైన ప్రేమను కలిగించింది. బాల్యంలో మనసులో పడిన ఏ ముద్రా జీవితాంతం తొలిగిపోదు. చిన్నారిగా నా మనసులో నటన పట్ల కలిగిన ఆసక్తి నాతో పాటే పెరుగుతూ వచ్చింది....అని ఓ సందర్భంలో గుర్తు చేసుకుంది శ్రీదేవి.

చిన్నప్పుడు ఆమెను బేబీ శ్రీదేవిగా ముద్దుగా పిలుచుకునేవారు. బాల నటిగా శ్రీదేవి చిచ్చరపిడుగు అని ఒకటీ రెండు చిత్రాలతోనే పరిశ్రమ అంతా తెలిసిపోయింది. ఆమె ఏక సంథాగ్రాహ శక్తి, చురుకుదనం, నటనలో ఉత్సాహం చూసినవాళ్లందరినీ అబ్బురపరిచేవి. బాలికగా బాలుడి పాత్రల్లో నటించి మెప్పించింది శ్రీదేవి. యశోదా కృష్ణ, పూంబట, తునైవాన్ లాంటి చిత్రాల్లో దేవుళ్ల పాత్రలు ధరించింది. వయసుతో పాటే నటిగా ఎదిగిన శ్రీదేవి. వయసుకు మించిన పాత్రలు చేసింది. మూండ్రు ముడిచు చిత్రంలో నటించే సమయానికి శ్రీదేవి వయసు పదమూడేళ్లు. ఆ చిత్రంలో ఆమె కమల్ హాసన్‌కు మారుతల్లి పాత్రను పోషించింది. ఆ పాత్రలో ఉండాల్సిన పరిపూర్ణత హావభావాల్లో కనబరిచింది. పదహారేళ్ల వయసు

శ్రీదేవి సార్వజనీయ నాయిక. నటిగా ఆమెకు సరిహద్దుల బేధాలు లేవు. తమిళం, తెలుగు, కన్నడ, మలయాళం, హిందీ...ఇలా ఏ భాషలో సినిమా చేసినా...అక్కడి ప్రేక్షకులు ఆమె తమ సొంత నాయికే అనుకున్నారు. ఎవరికి వాళ్లకు స్థానికంగా అంత దగ్గరైంది శ్రీదేవి. ఇంతలా ఓ నాయికను అంగీకరించడం చాలా అరుదుగా జరుగుతుంటుంది. భాష తెలియకుండా నటించడం చీకట్లో నడిచినట్లే. అయినా పరిసరాలను అంచనా వేయగల మేధో సామర్థ్యం, నిశిత దృష్టి ఆమెకుంది. ఒక్క పదం హిందీ తెలియకుండా బాలీవుడ్‌లో అగ్రతారగా వెలగడం వెనుక నటిగా ఆమె ప్రతిభ, అంకితభావం ఊహించవచ్చు. ఆమె చెల్లెలు హిందీ సంభాషణలను తమిళంలో



అప్పటిదాకా సాధారణంగా ఎవరితో ఎక్కువగా మాట్లాడకుండా షూటింగ్‌లో ఓ దగ్గర కూర్చునే శ్రీదేవి....కెమెరా ముందుకు రాగానే ఉత్సాహంగా సాగే సెలయేరులా పరవళ్లు తొక్కేది. ఏడ్వడమో, నవ్వడమో, శృంగారమో, నృత్యాలో..... కావాల్సింది ఏదైనాఆ క్షణం ఆమె ఆమె కాదు అచ్చంగా ఆ పాత్రే.

చేసేప్పటికి ఆమెకు పదమూడేళ్లే. ప్రౌఢ వయస్సులో ప్రతిస్పందనలు ఆమె మోములో పలికేవి. ఈ సినిమా హిందీతో సహా దక్షిణాది భాషల్లో నిర్మితమైంది. తెలుగులో మాతృక చెడిపోకుండా మార్పులు చేశారు. ఆ మార్పులను మాతృకలో, పునర్నిమాన చిత్రాల్లో తగినట్లుగా అనుసరించింది శ్రీదేవి.

సూపర్‌స్టార్‌ల సరసన నటిస్తూ వాళ్లకు సమఉజ్జీగా నిలవడం శ్రీదేవికి సాధ్యమైంది. ఆమె చేసిన ద్విపాత్రాభినయాలే ఇందుకు సాక్ష్యం. ఖుదా గవా, చాల్‌బాజ్, లమ్హే ఆమె ద్విపాత్రాభినయాలను చూపించిన చిత్రాలు. లమ్హేలో తల్లిగా, కూతురిగా రెండు పాత్రల్లో నటించింది. కాలంతో పాటు కనుమరుగయ్యే నాయికలను చూస్తుంటాం. కానీ కాలంతో పాటు ఎదుగుతూ వచ్చిన నాయిక శ్రీదేవి. అప్పటికే రెండు తరాల కథానాయకులతో (ఎన్టీఆర్, ఏఎన్నార్, కృష్ణ, శోభన్ బాబు, కృష్ణంరాజు) నటించిన ఆమె...జగదేక వీరుడు అతిలోక సుందరి



నన్ను పెద్ద సింహాసనం మీద కూర్చోబెట్టారు. మోహానికి రంగు వేశారు. వింతైన దుస్తులు, ఆభరణాలతో అలంకరించారు. ఇదంతా నాకు కొత్త అనుభూతిని ఇచ్చింది. ఈ అనుభూతే నటనపై అనంతమైన ప్రేమను కలిగించింది. బాల్యంలో మనసులో పడిన ఏ ముద్రా జీవితాంతం తొలిగిపోదు. చిన్నారిగా నా మనసులో నటన పట్ల కలిగిన ఆసక్తి నాతో పాటే పెరుగుతూ వచ్చింది..

చెబుతుంటే విని సన్నివేశ గాఢత ఏమాత్రం తగ్గకుండా పాత్రకు న్యాయం చేసేది శ్రీదేవి.

కెమెరా ముందు ఆమె ఒరవడి ఓ మెరుపే. అప్పటిదాకా సాధారణంగా ఎవరితో ఎక్కువగా మాట్లాడకుండా షూటింగ్‌లో ఓ దగ్గర కూర్చునే శ్రీదేవి....కెమెరా ముందుకు రాగానే ఉత్సాహంగా సాగే సెలయేరులా పరవళ్లు తొక్కేది. ఏడ్వడమో, నవ్వడమో, శృంగారమో, నృత్యాలో.....కావాల్సింది ఏదైనా ఆ క్షణం ఆమె ఆమె కాదు అచ్చంగా ఆ పాత్రే. నాయికలు అంటే సరదాగా కాలక్షేపానికి

సమయానికి మరింత ఆకర్షణ తెచ్చుకుంది. చిరంజీవి కున్న జనాకర్షణ, ఆయన తీసుకున్న పారితోషికాన్ని శ్రీదేవి అందుకుంది. తెలుగులో ఎస్పీ పరశురామ్ ఆమె నటించిన చివరి చిత్రం.